ఆంధ్రజ్యోతి

ప్రచురణ

www.navyaweekly.com

నవ్య

వీక్లి

29-6-2016

₹:20

MOHAN PUBLICATIONS

Mohanpublication.com

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆయుర్వేద, మంత్రశాస్త్ర, స్మార్త గ్రంథములకు

మోహన్ పబ్లికేషన్స్

కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదురుగా, రాజమహేంద్రవరం – 533101.

grantha nidhi

THE TREASURE OF PAGES

FIRSTEVER TELUGU FREE E-BOOKS DOWNLOADING WEB PORTAL

mohan publications

www.granthanidhi.com

Granthanidhi.blogspot.in

అందరినీ ఇష్టపడ్డా

-శ్రియ శరన్

ఎంతో 'ఇష్టం'గా శ్రియ శరన్ సినిమాల్లోకి వచ్చి దాదాపు పదిహేను సంవత్సరాలైంది. ఇన్ని సంవత్సరాలలో ఎప్పుడూ తడబడకుండా సినిమాలు చేస్తూనే ఉంది. మూడు పదుల వయస్సు దాటినా వన్నె తరగని లావణ్యంతో అభిమానులనూ ప్రేక్షకులనూ అలరిస్తూనే ఉంది. గతంలో లాగా వరుస పెట్టి సినిమాలు చేయకపోయినా హిందీ, తెలుగు, తమిళం సినిమాల్లో ఒక్కొక్క సినిమా చొప్పున చేస్తూ వెండి తెర మీద మెరుపులు మెరిపిస్తూనే ఉంది. తాజాగా బాలకృష్ణ నూరవ సినిమాలో హీరోయిన్‌గా చేస్తున్న శ్రియ శరన్‌తో...

'గౌతమీ పుత్ర శాతకర్ణి'లో చేస్తున్నట్టున్నారు?

అవును. అది నా అదృష్టం అనుకుంటున్నాను. నా కాస్ట్యూమ్ రెడీ అయిపోతోంది. అన్నీ సిద్ధం కాగానే షూటింగ్ మొదలవుతుంది. రాణి పాత్ర చేస్తున్నాను. బాలకృష్ణగారితో గతంలో చేశాను. ఆయనతో ఇది నా రెండవ సినిమా!

బాలీవుడ్‌లో చేస్తున్న 'తడ్కా' ఎంత వరకూ వచ్చింది?

ప్రకాష్‌రాజ్ దర్శకత్వం చేస్తున్నారు. దర్శకుడిగా ఆయనకి ఉన్న పేరు గురించి తెలుసు. ఇప్పుడు ప్రత్యక్షంగా మరిన్ని విషయాలు తెలుసుకున్నాను. నానాపటేకర్ వంటి సీనియర్ నటులు ఇందులో నటిస్తున్నారు. చెప్పాలంటే చాలా స్వీట్ స్టోరీ. ఇప్పటి వరకూ చేసిన సినిమాలన్నింటికన్నా ఈ సినిమా కథ నాకు బాగా నచ్చింది. అలాగని గతంలో చేసిన సినిమాలు నచ్చలేదు అని కాదు కానీ, ఈ సినిమా ఎప్పటికీ గుర్తుండిపోతుందని చెప్పడమే నా ఉద్దేశం.

సినిమా రంగానికి వచ్చి ఇన్ని సంవత్సరాలైంది. ఇక్కడ ఎవరినైనా ఇష్టపడ్డారా?

నిజం చెప్పాలంటే నాతో పాటు చేసిన హీరోలందరినీ ఇష్టపడ్డా. కాని ఎవరినీ పెళ్ళి చేసుకోవాలని అనిపించలేదు. కానీ నేను ఫలానా వ్యక్తితో డేటింగ్ చేస్తున్నానంటూ చాలా సార్లు పుకార్లు పుట్టించారు. వాటిని నాతో పాటు ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. మొన్నటికి మొన్న అండమాన్ వెళ్ళినప్పుడు కూడా లవర్‌తో కలిసి డేటింగ్‌కి వెళ్ళానని అన్నారు. అక్కడికి నేను ఒక్కదాన్నే వెళ్ళాను. అదీ మా పేరెంట్స్‌కి చెప్పి మరీ వెళ్ళాను.

పెళ్ళి గురించి ఆలోచిస్తున్నారా?

ఆ విషయాన్ని మా పేరెంట్స్‌కి వదిలేశాను. నాకు తగిన వ్యక్తిని వారే సెలక్ట్ చేస్తారు. నా దృష్టిలో ఎవరూ లేరు. నేను ఎవరినీ ప్రేమించలేదు.

అందరికన్నా ఎక్కువగా ప్రేమించేది...ఇష్టపడేది?

ఇంకెవరు? మా అమ్మనే! తను నాకోసం చాలా కష్టపడింది. కష్టపడుతోంది కూడా! నా విజయం వెనుక తనే ఉంది. ఇప్పుడు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే తనే కారణం. అంధులతో 'స్పా' ఏర్పాటు చేసింది నేనే అయినా దాని నిర్వహణ అంతా తనే చూసుకుంటుంది. ఓ పక్క స్పా పనులు చూస్తూనే నాకు సంబంధించిన ఏ చిన్న విషయాన్ని కూడా మరిచిపోదు. నా విషయంలో అంత కేరింగ్‌గా ఉంటుంది.

గతంలో లాగా ఎక్కువ సినిమాలు చేయకపోవడానికి కారణం?

గ్లామర్ పాత్రలు, కాలేజీ అమ్మాయి పాత్రలు, చెట్లూ, పుట్టలు చుట్టూ తిరిగే పాత్రలు, కేవలం డ్యాన్సులకు మాత్రమే పరిమితమైన పాత్రలు ఇలా చాలా రకాల సినిమాలు చేశాను. ఇప్పుడు కూడా అలాంటి సినిమాలు చేయవలసిన అవసరం లేదు. నాకు తగ్గవి వచ్చినప్పుడు చేస్తున్నాను. కొందరు దర్శకులు కథలను నన్ను దృష్టిలో పెట్టుకునే రాస్తున్నారు కూడా!

ఉన్నట్టుండి 'దృశ్యం'లో తల్లి పాత్ర ఎందుకు చేయవలసి వచ్చింది?

తల్లి పాత్ర చేయడం అప్పుడే అవసరమా? అని చాలా మంది అన్నారు. కానీ నాకు కథ నచ్చింది. అందుకే ఎవరి మాటలు పట్టించుకోకుండా ఆ సినిమా చేశాను. నేనూహించినట్టు ఆ సినిమాకు మంచి పేరే వచ్చింది. నా కెరీర్‌లో బిగ్గెస్ట్ ఫిల్మ్‌గా నిలిచింది.

తెలుగులో కొత్తగా ఏమైనా ఒప్పుకున్నారా?

'గౌతమీ పుత్ర శాతకర్ణి' ఒప్పుకున్న తరువాత చాలా కథలు విన్నాను కానీ, ఏవీ నచ్చలేదు. నా ఇమేజ్‌కి తగిన కథలు రావడం లేదు. ఈ విషయంలో తమిళం, హిందీ భాషలలో మంచి కథలే వస్తున్నాయి.

-భరత్ కుమార్

సరదాగా

దొందూ దొందే

స్కూలు నుంచి లేటుగా వచ్చిన అన్వేష్‌ని "ఎందుకు లేటయి"ందని అడిగాడు తండ్రి. "మా టీచర్ నిద్రపోతున్నారు. అందుకే లేటయింది" సమాధానమిచ్చాడు అన్వేష్. తండ్రికి ఏమీ అర్థంకాక "మీ టీచర్ నిద్రపోతే నీకెందుకు లేటయింది?" కోపంగా అడిగాడు. "మరి...మరి...ఆయన నిద్ర లేచాకే కదా నన్ను నిద్రలేపింది! అంటూ లోపలికి వెళ్ళాడు.

ఒక ప్రశ్న?

మహానగరంలో అదొక అందమైన కాలనీ. కాలనీ వాసులందరూ ఒకే మాట, ఒకే బాట అన్నట్టుంటారు. కాలనీలో ఏ సమస్య వచ్చినా అందరూ కలిసి చర్చిస్తారు. సమస్య పరిష్కరించుకుంటారు. వీకెండ్ వచ్చిందంటే కాలనీ కుటుంబాలన్నీ కలిసి ఏదో ఒకటి ప్లాన్ చేస్తారు. ఆ వీకెండ్ కూడా అలాగే చేశారు. కాలనీవాసులందరూ కలిసి ఊరి బయట మామిడితోటలో పిక్నిక్ ఏర్పాటు చేసుకున్నారు. చిన్నా, పెద్దా అందరూ 150 మంది దాకా ఉంటారు. వెళ్ళిరావడానికి ఒక ప్రైవేట్ బస్సు మాట్లాడుకున్నారు. ఎంజాయ్ చేస్తూ అంత్యాక్షరీ ఆడుకుంటూ మామిడి తోట చేరుకున్నారు. ఆడవాళ్ళు అంతా శుభ్రం చేసి వంటావార్పూ కార్యక్రమాల్లో పడ్డారు. మగవాళ్ళు, పిల్లలు ఎవరి కాలక్షేపాల్లో వాళ్ళు సరదాగా నవ్వుతూ తుళ్ళుతూ ఆడుతున్నారు, పాడుతున్నారు. వన భోజనాలు అయ్యాయి. కాసేపు రిలాక్సయ్యాక ఇంకా ఏం చేద్దాం అని చర్చించి, అందరం కలిసి ఓ గేమ్ ఆడదాం అని డిసైడ్ అయ్యారు. ఎవరెవరు గేమ్ ఆడతారో అందర్నీ ఒక పక్కకు రమ్మన్నారు. మొత్తం 123 మంది గేమ్ ఆడడానికి ముందుకొచ్చారు. ఆట ఆడించేవాళ్ళు నాలుగు బాక్సులు తెచ్చి పరిచిన చాప మీద పెట్టారు. తెచ్చిన నాలుగు బాక్సుల్లో ఒకదాంట్లో యాపిల్, ఇంకోదాంట్లో నారింజ, మరోదాంట్లో అరటికాయ, నాలుగో దాంట్లో పియర్స్ ఉన్నాయి. అయితే ఏ బాక్సులో ఏ పండు ఉందో ఎవరికీ తెలియదు. ఆట ఆడేవారు ఏ బాక్సులో ఏ పండు ఉందో ఊహించి చెప్పాలి. అలాగే చెప్పారు 123 మంది. బాక్సులు తెరిచారు. 123 మందిలో 43 మంది ఏ ఒక్క బాక్సునూ కరెక్ట్‌గా ఊహించలేదు. 39 మంది ఒక బాక్సులోని పండును మాత్రమే గెస్ చేయగలిగారు. 31 మంది రెండు బాక్సులను గెస్ చేశారు. అయితే ప్రశ్న ఏమిటంటే, ఎంతమంది మూడు పండ్లు ఉన్న బాక్సులను కరెక్ట్‌గా ఊహించారు? ఎంతమంది అన్నింటినీ కరెక్ట్‌గా చెప్పారు? ఆలోచించండి.

సమాధానం

మూడు బాక్సుల్లో ఉన్న పళ్ళను కరెక్ట్‌గా చెప్పడం జరిగే పని కాదు. ఎందుకంటే మూడింటినీ కరెక్ట్‌గా గెస్ చేస్తే ఆటోమేటిగ్గా నాలుగోది కూడా కరెక్ట్ అయినట్టే కదా! ఇక నాలుగింటినీ గెస్ చేసినవారు పదిమంది ఉన్నారు. ఎలాగంటే...

123-43-39-31= 10 ఇలాగా! లెక్క సరిపోయిందేమో చూసుకోండి.

Jayadev

అడపా దడపా నవ్వబ్బా





8

డేంజర్ యమడేంజర్

ప్రకృతి మనల్ని ఎప్పుడూ ఆశ్చర్యపరుస్తూనే ఉంటుంది. కొన్ని ప్రాంతాలు ఆహ్లాదం కలిగిస్తే, ఇంకొన్ని జానపద కథల్లోని చిత్ర విచిత్ర ప్రదేశాల్ని గుర్తుతెస్తాయి. కానీ మరికొన్ని ప్రాంతాలు మాత్రం ఆసక్తితో పాటు ప్రాణహానినీ, థ్రిల్ కోసం వెళితే చిక్కుల్నీ తెచ్చిపెడతాయి!

54

ముదిమిలోనూ మజిల్స్ పెంచాల్సిందే

వ్యాయామం కేవలం యువకులకు సంబంధించిన విషయం అనడం ఇప్పుడు అవుట్‌డేటెడ్ టాపిక్. వృద్ధులు కూడా వ్యాయామం చెయ్యొచ్చు. చెయ్యాలి. చేస్తేనే హ్యాపీస్!

72

ఇంటర్వ్యూ

ముక్కు సూటిగా నిర్మొహమాటంగా మాట్లాడే విలక్షణమైన హాస్య నటుడు కృష్ణ భగవాన్ ఇంటర్వ్యూ....

సీరియల్స్

మదరిండియా	16
హవేలి (కొత్త సీరియల్ ప్రారంభం)	26
సమంత@లవ్	44
నిండు నూరేళ్లు	58

కథలు

మీల్స్‌టికెట్	10
వెంకటమ్మ కల	22
పరాయి శ్రీమతి	38
తోడొకరుండిన అదే స్వర్గము	50
నోబెల్ కథలు	64

ఫీచర్స్

తిండితో తంటా-14, సురభి-27
సినీ నారాయణీయం-28, ఆరోగ్యమే మహాభాగ్యం-35
విజయ విలాసం-36, మను వెడ్స్ తను-49
మనమీదేనట్రోయ్-53
క్రైమ్-56, పుస్తక సమీక్ష-63
రామాయణం-66, సౌభాగ్యచక్రం-68
నవ్యసినిమా-69, ప్రేమ కథలు చాలా ఉన్నాయి-70
ఇవన్నీ నిజాలే!, పదగారడి-74

ముఖచిత్రం: రాశిఖన్నా
ఫొటో: గోపీకృష్ణ

రచనలు, కథలు పంపవలసిన చిరునామా

నవ్య వీక్లీ, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్, హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33. **email: navyaweekly@andhrajyothy.com**

రాధ వర్సెస్ గోపి పెళ్ళికి ముందు...

గోపి: ఆ మాట కోసమే...ఎదురు చూస్తున్నా!
రాధ: నన్ను వదలి వెళ్ళిపోతావా?
గోపి: ఛఛ! ఆ ఆలోచనే లేదు.
రాధ: నన్ను ప్రేమిస్తున్నావు కదా?
గోపి: ఇరవై నాలుగ్గంటలూ అదే ధ్యాస!
రాధ: నన్నెప్పుడూ మోసం చెయ్యవు కదా?
గోపి: చచ్చినా! చచ్చినా చెయ్యను.
రాధ: నన్ను కిస్ చేస్తావా?
గోపి: అ అవకాశాన్ని ఎందుకు వదులుకుంటాను.
రాధ: నన్ను కొడతావా?
గోపి: పిచ్చిపిచ్చి ఆలోచనలు పెట్టుకోకు!
రాధ: నేను నిన్ను నమ్మొచ్చా?
గోపి: ఎస్
రాధ: గోపీ
పెళ్ళి తర్వాత...
(కింద నుంచి పైకి చదవండి)

కవలలు

అప్పారావుకి ఇద్దరు కవల పిల్లలు పుట్టారు. వాళ్ళకి ఇలా పేర్లు పెట్టాడు.
తార-సితార
మళ్ళీ కవలలు పుట్టారు. వాళ్ళకి ఇలా పేర్లు పెట్టాడు.
పీటర్-రిపీటర్
మళ్ళీ కవలలు పుట్టారు. వాళ్ళకి ఇలా పేర్లు పెట్టాడు.
మ్యాక్స్-క్లైమాక్స్
మళ్ళీ కవలలు పుట్టారు. దాంతో చాలనుకుని వాళ్ళకి ఇలా పేర్లు పెట్టాడు.
స్టాప్-ఫుల్‌స్టాప్.

సికింద్రాబాద్

సికింద్రాబాద్‌కి వెళ్ళాల్సి ఉంది. ఆటోని కేకేశాడు సుబ్బారావు.
సుబ్బారావు: సికింద్రాబాద్‌కి వెళ్ళాలి. ఎంత తీసుకుంటావు?
ఆటోవాలా: రెండువందల ఏభై
సుబ్బారావు: ఏభై ఇస్తాను, తీసుకెళ్తావా?
ఆటోవాలా: ఏభై రూపాయలకి ఈ భూప్రపంచంలో ఎవడూ ఎవణ్ణీ ఆటోలో సికింద్రాబాద్ తీసుకెళ్ళడు. తీసుకెళ్తే, నా చెప్పుతో నేను కొట్టుకుంటాను.
సుబ్బారావు: అయితే వెళ్ళి వెనక్కి కూర్చో! నేను తీసుకెళ్తాను.

-వైనతేయ

w m w w

నవ్య

సంపుటి: 13 సంచిక: 17

29-6-2016

మేనేజింగ్ డైరెక్టర్
వేమూరి రాధాకృష్ణ

ఎడిటర్
ఎ.ఎస్.జగన్నాథశర్మ

మొదటి పేజీ

బ్లేడ్‌లక్ష్మి

ఆయన పేరు లక్ష్మిట, చిత్రంగా లేదూ! మగాడికి ఆడ పేరేమిటో! పేరే కాదు ఆయన పనులు కూడా చిత్రంగా ఉన్నాయి. ఎక్కణ్ణుంచి వచ్చాడో! ఏ ఊరో తెలియదు. బాబాగుడిలో ఉంటున్నాడు. తొలిరోజుల్లో గుడి బైట పడుకునే వాడు. ఇప్పుడు గుడిలో పడుకుంటున్నాడు. ప్రసాదం పెడితే తింటాడు. ప్రసాదం కూడా పెద్దగా అక్కర్లేదాయనికి. పొద్దున, రాత్రి రెండేసి రొట్టెలు పెడితే చాలు! మహాప్రసాదం అంటూ కళ్ళకద్దుకుంటాడు. ఎక్కువ పెట్టారనుకోండి! గుడి బయట కుక్కలకు వాటిని పెడుతూ కనిపిస్తాడు. వీధి కుక్కలకు ఆయనంటే ప్రాణం. ఆయన ఏది చెబితే అవి చేస్తాయి. కొట్టుకోవద్దంటే కొట్టుకోవవి. కూర్చోండి అంటే కూర్చుంటాయి. పడుకోండి అంటే పడుకుంటాయి. పది పన్నెండు కుక్కలెప్పుడూ ఆయనచుట్టూ ఉంటాయి. ఈ మధ్య ఏమైందో ఏమో! నాలుగైదు కుక్కలు చనిపోయాయి. అవి చనిపోయిన దగ్గర నుంచే ఆయన చేస్తున్న పని అందరికీ చర్చనీయాంశం అయింది.

ఎలా సంపాదించాడో ఎక్కడ సంపాదించాడో లక్ష్మి వందలాది చిన్నపాటి, ఒకేసైజు ప్లాస్టిక్ డబ్బాలు సంపాదించాడు. వాటన్నిటినీ ఇంటింటికీ తిరిగి ఇచ్చాడు. ఇచ్చి ఏంవన్నాడంటే...సార్! ప్రతిరోజూ మీరు గెడ్డం గీసుకుంటారు కదా! అలా గెడ్డం గీసుకున్న బ్లేడ్‌ని పారేయకుండా దానిని ఈ డబ్బాలో వేసి ఉంచండి! నెలయ్యేసరికి వచ్చి కలెక్ట్ చేసుకుంటానన్నాడు. పాత బ్లేడ్లు ఏం చేసుకుంటాడు? జాగ్రత్త చెయ్యమంటూ డబ్బాలెందుకు? మొదట్లో ఎవరికీ ఏదీ అంతుచిక్కలేదు. తర్వాత నెలనెలా మొదటివారంలో వచ్చి, పెద్ద సంచీల్లో బ్లేడ్లన్నీ పట్టుకుపోతుంటే...అందరికీ చాలా అనుమానాలు కలిగాయి. ఇవన్నీ రీసైక్లింగ్‌కి

ఇస్తున్నట్టున్నాడు. లేకపోతే ఇంత శ్రమ దేనికి పడతాడు? ముసలాడికి బాగానే కిడుతున్నట్టుంది అనుకున్నారంతా. అనుకున్నట్టుగానే లక్ష్మి దగ్గర డబ్బులాడడం గమనించారు. కుక్కలను డాక్టర్‌కి చూపిస్తున్నాడాయన. డబ్బు పెట్టి వాటికి ఇంజక్షన్స్ చేయిస్తున్నాడు. అలాగే ఆ మధ్య కబేలాకు తరలించే పశువుల్ని తీసుకున్నాడు. అంటే వాటిని కొనుగోలు చేశాడు. చేసి వాటికి ఓ పెద్ద షెడ్డు నిర్మించాడు. పోషిస్తున్నాడు. పాత బ్లేడ్లు బాగానే కలిసొచ్చాయి లక్ష్మికి అని ఆయన్ని 'బ్లేడ్‌లక్ష్మి' అని పిలవసాగారు. బ్లేడ్‌లక్ష్మిని కలిసేందుకు కార్లలో పెద్దపెద్దవాళ్ళు రావడం, ఆయనతో మాట్లాడడం, కట్టలకి కట్టలు డబ్బులివ్వడం చూసి కన్నుకుట్టింది కొందరికి.

ఆ కొందరూ బ్లేడ్‌లక్ష్మిని ఓ కంట కనిపెడుతూ వచ్చారు. బ్లేడ్లు తీసుకుని నెలా నెలా లక్ష్మి ఊరవతలకు వెళ్తున్నాడని తెలుసుకున్నారు. ఓ రోజు ఆయన్ని వెంబడించారు. రెండు సంచుల్నిండా బ్లేడ్లు ఉంచుకుని, ఊరుకి దూరంగా లక్ష్మి నడచి వెళ్తోంటే వెన్నంటారాయన్ని. చెట్టూ చేమా లేదక్కడ. ఎడారిలా ఉంది. అంతా ఉత్త ఇసుక. ఆ ఇసుకలో దగ్గరగా ఉన్న కర్రందుకుని గొయ్యి తవ్వాడు లక్ష్మి. పెద్ద గొయ్యే తవ్వాడు. తవ్వి, అందులో తెచ్చిన బ్లేడ్ల సంచులు రెంటినీ పూడ్చి పెట్టాడు. వెనుతిరిగి, ఎదురుగా నిలిచిన వ్యక్తుల్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఏంట్లక్ష్మీ ఇదంతా? గొయ్యి తీసి బ్లేడ్లెందుకు పాతిపెట్టావు? అని అడిగితే అప్పుడు అసలు విషయం చెప్పాడిలా లక్ష్మి.

మనం ఉపయోగించిన బ్లేడ్ డస్ట్‌బిన్‌లో పడేస్తాం. దానిని మిగతా చెత్తతో పాటు తీసుకొచ్చి పనివాళ్ళు వీధిలో పడేస్తారు. ఆ చెత్తను తినేందుకు కుక్కలూ పశువులూ ప్రయత్నించి, బ్లేడ్ నోట్లో గుచ్చుకుని పడరాని పాట్లు పడుతున్నాయి. నోరులేని జీవాలు కదా! చెప్పలేక చచ్చిపోతున్నాయి.! ఇటీవల నాలుగైదు కుక్కలు అలాగే చనిపోయాయి. అప్రయత్నంగా జరుగుతున్న ఈ మారణకాండను ఆపాలనిపించింది. ఇంటింటికీ తిరిగి, డబ్బాలు అందజేశాను. ఎందుకు ఈ డబ్బాలని అడిగిన పెద్దలకు వివరంగా చెబితే, ఆదరించి వారంతా మూగజీవాలను రక్షించేందుకు చందాలిస్తూ వస్తున్నారు. ఆ డబ్బునే అటు పశువుల షెడ్డుకీ, ఇటు ఇంజక్షన్స్‌కూ అన్నిటికీ ఖర్చు చేస్తున్నాను అన్నాడు లక్ష్మి. అంతవరకూ లక్ష్మిని తప్పుగా, తక్కువగా ఆలోచించినందుకు ఆయన్ని వెన్నంటి వచ్చిన వ్యక్తులు సిగ్గుపడ్డారు. క్షమించమన్నట్టుగా చేతులు జోడించి నమస్కరించారు. తర్వాత లక్ష్మితో చేతులు కలిపి, ముందుకు నడిచారు.

నవ్య

అపురూపమైన 11వ ముద్రణ

వెన్నముద్దలు

జనార్దన మహర్షి



కవి అంటే...

కష్టాల్ని వివరించేవాడు

కలని విశదీకరించేవాడు

కలతని విసర్జించేవాడు

కన్నీటిని విస్మరించనివాడు

జనార్దన మహర్షి నిజమైన కవి

ఇది చక్కటి చిక్కటి కవిత్వం

చక్కెర, ఉప్పు ఉండే ప్రతి ఇంట

ఈ 'వెన్నముద్దలు' కూడా ఉండాలి

ప్రతులకు :

క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్

9848065658, 9848506964, 8885446222.

& ప్రధాన పుస్తక కేంద్రాలు

మెయిల్ బాక్స్

కాశీయాత్రలో మావీ అవే అనుభవాలు

నవ్య వీక్లీలో అన్ని శీర్షికలూ బాగా ఆకట్టుకున్నాయి. కంతుగాడి కాశీయాత్ర మరీ బాగుంది. మేం వెళ్ళినప్పుడు మాకు కూడా అవే అనుభవాలు కలిగాయి. కాశీ యాత్ర గురించి కళ్ళకు కట్టినట్టు రాయడం చాలా బాగుంది. రెండు వారాల పాటు వేసిన శారద ఇంటర్వ్యూలో ఆమె చెప్పిన విషయాలు బాగున్నాయి. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలు మరీ బాగున్నాయి. ఈ తరం వారికి అవన్నీ అంతగా తెలియవు. సినీ నారాయణీయం చాలా బాగుంది. ఏదో ఒకటి తప్ప ఆయనలో అన్నీ మంచి గుణాలే.

-చెన్నా ప్రగడ నరసింహారావు, హైదరాబాద్

భయం నుండి బైటపడేశారు

ఈ వారం విజయవిలాసం మమ్మల్ని భయం నుండి బైటపడేసింది. భయం నుండి బైట పడటానికి అవసరమైన పరిష్కారాలు తెలుసుకున్నాం. భయం నుండి బైట పడేందుకు మంచి సూచనలు చేశారు. మార్నింగ్ కాఫీ రుచి చూపిస్తూ, మంచి సందేశాన్నిచ్చే కథతో కడుపుబ్బా నవ్వించే కథలతో నిత్య నూతనంగా వీక్లీని అందిస్తున్నారు.

-ఎస్.శ్రీనివాసరావు, మిర్యాలగూడ. నల్లగొండ జిల్లా

కాఫీ జర్కులకు ఫ్లాటయ్యాం

మార్నింగ్ కాఫీలో ఒక్కొక్క జర్క్‌కీ ఫ్లాటయ్యాం. మొదటిపేజీలోకి అడుగుపెట్టి చూస్తే ఆ అన్వేషణ మేటర్ చదివి ఆనందించాం. చివరిగా ఫుట్ వర్డ్ వర్త్ ఫుల్‌గా ఉంది.

కంతుగాడి కాశీ యాత్ర ప్రతివారం ఫాలో అవుతున్నాం. ఊర్వశి శారద గతాన్ని ఎంతో విపులంగా వివరించి శభాష్ అనిపించుకున్నారు. సీరియల్స్, ఫీచర్స్, కథలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి.

-యు.చిట్టిబాబు, న్యూ పాల్వంచ. ఖమ్మంజిల్లా

వైవిధ్యమైన కథలు

కథల ఎంపికలో వైవిధ్యం చాలా బాగుంది. వీధి బాలల్లో మార్పు కోసం తపించిన 'పరివర్తన' కథ అద్భుతం. సురభి వింతలు, కాఫీ టేస్టులూ, సరదాలు, సంబరాలకు తోడు అదనంగా అందించిన శృంగార కిటుకులూ ఆకర్షించాయి. వివిధ దేశాల్లో కొన్ని ఆటలు విచిత్రంగా తోచాయి. తాబేళ్ళు, బాతులు, బొద్దింకల పరుగు పందాలు, వింతగా ఉన్నాయి. టీనేజర్స్ నగ్నంగా సైకిల్ పోటీల్లో పాల్గొనడం..... మన సంస్కృతితో పోలిస్తే టూ మచ్. వృద్ధాప్యంలో మతిమరుపు వ్యాధికి కారణాలు, జబ్బు నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లు గ్రహించదగినవి. సినిమాల్లో కామెడీ సీన్‌ను షేక్ చేయడమే కాదు, రాతల్లో కూడా వికట కవిని తలపించాడు ఎమ్మెస్. నటి శారద నాటకాల్లోనూ మేటి అని ఏనాడో నిరూపించారు. రక్త కన్నీరు నాటకంలో ఇందిర పాత్రలో ప్రేక్షకుల్ని కన్నీరు పెట్టించిన శారద నటనను మరువలేం.

-తాళాబత్తుల సత్యనారాయణమూర్తి,
విశాఖపట్నం-11

వీక్లీ బాగు బాగు

కలలు నిజం కావాలంటే పట్టుదల, కష్టించి పనిచేసే తత్వం అవసరం అంటూ మొదటి పేజీలో చెప్పిన కథ బాగు బాగు. స్నేహంలోని ఆరు లక్షణాలను హితోపదేశం చేసి ఇదేరా స్నేహం అంటూ వివరించిన విజయవిలాసం బాగు బాగు. స్నేహం అనగానే జ్ఞాపకం వచ్చే బాపు, రమణలకు హేట్సాఫ్ చెప్పడం బాగు బాగు. నోబెల్ కథ అంతు తెలియని సస్పెన్స్ కథలా అలరించింది. బ్రూస్‌లీ, బ్రహ్మోత్సవం సెట్లకు షారూక్‌ఖాన్ రావడం వల్లనే అవి ఫ్లాప్ అయ్యాయనుకోవడం తగదు. మన బంగారం మంచిదైతే ఇతరులను నిందించనేల?

-ఆర్.శాంతిచంద్రిక, సామర్లకోట

ఆకట్టుకున్న కాఫీ, మొదటిపేజీ

ముచ్చటైన మూడు మార్నింగ్ కాఫీ చెణుకులతో పట్టుదల, కష్టించే తత్వం బోధపరిచిన మొదటిపేజీ రెండూ మమ్మల్ని ఆకట్టుకున్నాయి. పక్షుల సంరక్షణకు మనందరం ఏమేం చేస్తే వాటికి మేలు జరుగుతుందో అవగతం చేసుకున్నాం. సమకాలీన అంశాలతో అర్జున్ గారి కార్టూన్లు చక్కగా నవ్వింపజేశాయి. పరివర్తన కథాకర్త విరించి గారికి అభినందనలు. చెర్రీ జ్యూస్ బి.పి బాధితులకు ఎంతో మంచిదని ఆరోగ్యమే మహాభాగ్యంలో చదివాం. అదేదో సినిమాలో కోటా శ్రీనివాస్ పిసినారితనం గుర్తొచ్చింది సరసి కార్టూన్ చూశాక. ఇప్పుడొస్తున్న చిత్రాలు యువతకు పనికిరావంటున్న శారదగారి ఇంటర్వ్యూతో ఏకీభవిస్తున్నాం. సురభి శీర్షిక కొంగొత్త అంశాలతో ఆకర్షిస్తోంది.

-నేమాన సుభాష్‌చంద్రబోస్, విశాఖపట్నం

మార్నింగ్ కాఫీ అదుర్స్

మార్నింగ్ కాఫీ కథలు అదుర్స్. కానీ ఆలస్యంగా వెళ్తే అప్పటికే ఎవరో వజ్రాలు చేజిక్కించుకుంటారు కదా! సురభి ముఖచిత్రం బాగుంది. హిడింబ దేవాలయం ఆశ్చర్యపరిచింది. రణదీప్ హుడాతో లిప్‌లాక్ సడన్‌గా జరిగింది, షాకయ్యాను షూటింగ్ కాన్సిల్ చేసి వెళ్ళిపోయానంటూ కాజల్ కహానీ చెప్పినా తర్వాత నిజం ఒప్పుకుని సమర్థించుకుంది. తనది అంధురాలి పాత్రట. అంధులకోసం స్పర్శజ్ఞానమే ముఖ్యం. అందువల్ల ముద్దు సమర్థనీయమే అంది. ఆ మాత్రానికి అబద్ధం ఎందుకు?

-కె.హితేష్, రమణయ్యపేట.
తూ.గో.జిల్లా

ప్రైమ్ హాస్పిటల్స్
హైదరాబాద్, 040-4959 4959

డా॥ జి. సతీష్ రెడ్డి
MS. M.Ch. (Ortho) (UK)
Orthopedics & Joint Replacement Specialist
ప్రైమ్ హాస్పిటల్స్, హైదరాబాద్
ఫోన్. 91777 00141

యుక్త వయస్సులో బాధించే బోన్ ట్యూమర్లు

అందుబాటులోకి అత్యాధునిక చికిత్స ప్రక్రియలు

మన శరీరానికి ఒక ఆకృతిని ఇచ్చేవి ఎముకలు. ఎముకల సముదాయంతో అస్థిపంజరం మనకో రూపాన్ని ఇస్తుంది. ఎముకలు కూడా శరీరంలో భాగమే కాబట్టి అన్ని అవయవాల్లాగానే వాటికీ క్యాన్సర్ వస్తుంది. ఏ అవయవంలోని కణాలైనా అదుపు తప్పి హానికరమైన రీతిలో పెరగడమే క్యాన్సర్. శరీరంలో ఏ భాగంలో కణతులు మొదలైతే, దానిని ఆ అవయవ కణతులుగా చెబుతారు. అదేవిధంగా ఎముకలకు కణతులు ఏర్పడితే దానిని బోన్ ట్యూమర్ అంటారు. ఎముక మృధుకణజాలంలో కణితి ఏర్పడితే దానిని మృధుకణజాల కణితి అని అంటారు. బోన్ ట్యూమర్లలో చాలా రకాలు ఉంటాయి. బోన్ ట్యూమర్లు యుక్తవయస్సు వారిని వేధిస్తూ ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ ట్యూమర్లను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించడం చాలా అవసరం. లేదంటే అది ముదిరి కొన్ని సార్లు ప్రాణాంతకంగా మారే ప్రమాదం కూడా ఉంటుంది. ప్రస్తుతం బోన్ ట్యూమర్లకు మెరుగైన చికిత్సా ప్రక్రియలు అందుబాటులోకి వచ్చాయి.

వివిధ రకాల కణతులు

కణవిభజనపై అదుపు తప్పి అసాధారణంగా కణాలు పెరగడాన్ని కణితి (ట్యూమర్) అంటారు. ప్రధానంగా రెండు రకాల కణతులు ఉంటాయి. ఒకటి బినైన్ ట్యూమర్స్ రెండవది మాలిగ్నెంట్ ట్యూమర్స్. బినైన్ ట్యూమర్లు హానికరం కానివి. ఇవి క్యాన్సర్ ట్యూమర్లు కావు. ఇవి ఏర్పడిన చోటనే ఉంటాయి. ఇతర భాగాలకు వ్యాపించవు. మాలిగ్నెంట్ ట్యూమర్ మాత్రం చాలా ప్రమాదకరమైనవి. వీటినే క్యాన్సర్ కణతులు అంటారు. ఈ కణతులు అవి పుట్టిన భాగాన్నే కాకుండా శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించి అక్కడి కణాలకు కూడా హాని చేస్తాయి. శరీరం లోపలిభాగంలోని అస్థిపంజరంలో కాలి ఎముక, పక్కటెముక, చేయి ఎముక వంటి భాగాలకు కణితి ఏర్పడటం ప్రారంభమైతే దానిని బోన్ ట్యూమర్ అంటారు. శరీరంలోని కండరాలు, రక్తనాళాలు, కొవ్వు వంటి భాగాలకు కణితి ఏర్పడడం మొదలైతే దానిని మృధుకణజాల కణతులు అంటాం. బోన్ ట్యూమర్స్, మృధుకణజాల కణుతులలో బినైన్ ట్యూమరైనా, మాలిగ్నెంట్ ట్యూమర్ అయినా క్యాన్సర్లుగా మారితే, వాటిని సర్కోమా అని అంటారు.

బినైన్ బోన్ ట్యూమర్లు

బినైన్ బోన్ ట్యూమర్లు మన శరీరంలోని ఆస్థిపంజరంలో సాధారణంగా పెరిగే రకం కణతులు. ఈ కణతులు క్యాన్సర్ కణతులు కావు. ఈ కణతులు నొప్పిని కలిగించవు, వీటికి శస్త్రచికిత్స అవసరమూ ఉండదు. యుక్త వయసులో నొప్పి వస్తున్నట్లు అనిపిస్తే వెంటనే నిపుణులైన ఆర్తోపెడిక్ సర్జన్‌ను సంప్రదించాలి. బినైన్ ట్యూమర్ల విషయంలో అవి పెరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని కొన్నిసార్లు క్షుణ్ణంగా పరిశీలించవలసి ఉంటుంది. ఏడాదికి ఒకసారి లేదా రెండు సార్లు వైద్యుల వద్దకు తీసుకెళ్లి పరీక్షించుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ బినైన్ ట్యూమర్ పెరుగుతూ ఉంటే దాని వల్ల ఇతర సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. అది ఎముకను బలహీనంగా మార్చుతుంది, దాని వల్ల ఎముక సులువుగా విరిగే అవకాశం ఉంటుంది. కణతులు నరాలపై ఒత్తిడి పెంచుతాయి, దాంతో నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భాలలో శస్త్రచికిత్స అవసరమవుతుంది.

మాలిగ్నెంట్ బోన్ ట్యూమర్స్

మాలిగ్నెంట్ బోన్ ట్యూమర్ ఎముక లోపలి భాగంలో ప్రారంబమై శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తుంది. ఇది యుక్త వయస్సువారిలో తరచుగా కనిపిస్తుంటుంది. ఇది రక్తం ద్వారా ఊపిరితిత్తులకు వ్యాపిస్తుంది. ఆస్టియో సర్కోమా, ఈవింగ్‌సర్కోమా అనే బోన్ క్యాన్సర్ యుక్త వయస్సు వారిలోనే ఎక్కువగా కనిపిస్తుంది. మాలిగ్నెంట్ బోన్ ట్యూమర్ వల్ల అవయవాలు దెబ్బతిని ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంటుంది.

మృధుకణజాల కణతులు

ఎముక మృధుకణజాల కణుతులలో శరీరంలో మృధు కణజాలమయిన కండరాలు, కొవ్వు, మరియు చర్మాల సముదాయానికి ఏర్పడే కణతులు. ఇవి బినైన్ ట్యూమర్లు కావచ్చు లేదా మాలిగ్నెంట్ ట్యూమర్లు కావచ్చు. బినైన్ సాఫ్ట్ టిష్యూ ట్యూమర్లలో చాలా రకాలు ఉన్నాయి.

లక్షణాలు

బోన్ ట్యూమర్, సాఫ్ట్ టిష్యూ ట్యూమర్ లక్షణాలను తెలుసుకోవడం కొంత కష్టమైన పనే. యుక్త వయస్సు వారిలో భౌతికంగా ఏమైన మార్పులు గమనించినా, ఎక్కువగా నొప్పి వస్తున్నట్లు అనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలి. బోన్ ట్యూమర్లలో ప్రధానంగా కనిపించే లక్షణం నొప్పి. మాలిగ్నెంట్ బోన్ ట్యూమర్ ప్రాథమిక దశలో గుర్తించడం చాలా అవసరం ఎందుకంటే ప్రాథమిక దశలోనే చికిత్స ప్రారంభిస్తే మెరుగైన ఫలితాలు పొందగలుగుతారు. ఎముక మృధుకణజాల కణుతులలో నొప్పిలేని గడ్డ కనిపిస్తుంటుంది. ఈ తరహా క్యాన్సర్లలో నొప్పి ఉండదు. యుక్త వయసు పిల్లల్లో ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి సరైన చికిత్స చేయించుకోవాలి.

నిర్థారణ పరీక్షలు

రోగి పరిస్థితిని బట్టి వివిధ పరీక్షలు నిర్వహించి వైద్యులు వ్యాధిని నిర్థారిస్తారు. బినైన్ ట్యూమర్లలో ఎక్కువగా ఎముక ఎక్స్‌రే ద్వారా నిర్థారిస్తారు. ఎక్స్‌రేలో కణితికి సంబంధించిన వివరాలు సరిగ్గా గుర్తించలేకపోతే ఎంఆర్ఐ (మ్యాగ్నెటిక్ రిసోనెన్స్ ఇమేజింగ్) స్కాన్‌ద్వారా కణితిని గుర్తిస్తారు. ఒకవేళ యుక్త వయసు పిల్లల్లో మాలిగ్నెంట్ ట్యూమర్ ఉందని వైద్యులు అనుమానిస్తే బోన్ స్కాన్, ఊపిరితిత్తులకు సీటీ (కంప్యూటెడ్ టోమోగ్రఫీ) స్కాన్ ద్వారా కణితి ఊపిరితిత్తులకు వ్యాపించిందా లేదా అని వైద్యులు నిర్థారించుకుంటారు. దాంతో పాటు పెట్ (పాసిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ) స్కాన్ ద్వారా కణితి ఎలా పెరుగుతుంది అనే విషయాన్ని కచ్చితంగా తెలుసుకోగలుగుతారు. ఈ పరీక్షలలో కణితి క్యాన్సర్‌గా మారే అవకాశం ఉన్నట్లు అనిపిస్తే ట్యూమర్ బయాప్సీ నిర్వహించాలని వైద్యులు సూచిస్తారు. వైద్యులు కణితి నుంచి చిన్న భాగాన్ని తీసి మైక్రోస్కోప్ క్యాన్సర్ లక్షణాలను పరీక్షిస్తారు.

బినైన్ బోన్ ట్యూమర్స్‌కు చికిత్స

బినైన్ బోన్ ట్యూమర్లకు ఏడాదిలో ఒకసారి వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం. ఈ తరహాట్యూమర్లు కొన్నిసార్లు వాటంతట అవే తగ్గిపోతాయి. బినైన్‌ట్యూమర్లు ఉన్న వారిలో ఎముకలు నయం కావడానికి కొన్ని సార్లు నాలుగు నుంచి ఆరు వారాల పాటు బ్రేస్, స్ప్లింట్, బూట్‌లను ధరించవలసి వస్తుంది. ఒకవేళ రోగికి శస్త్రచికిత్స నిర్వహించవలసి వస్తే రేడియో ఫ్రీక్వెన్సీ ఆపరేషన్ లేదా సిస్ట్ ఇంజక్షన్ వంటి అధునాతన ప్రక్రియల ద్వారా ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం లేకుండానే చికిత్స అందిస్తారు.

మాలిగ్నెంట్ బోన్ ట్యూమర్లకు చికిత్సా ప్రక్రియలు

మాలిగ్నెంట్ బోన్ ట్యూమర్స్ కలిగిన పిల్లలకు శస్త్ర చికిత్స అవసరమవుతుంది. కణితి పరిమాణం, కణితి ఎక్కడ ఏర్పడింది, ఇతర భాగాలకు క్యాన్సర్ కణాలు వ్యాపించాయా..? తదితర అంశాలను పరిశీలించి శస్త్ర చికిత్స అవసరమా..? కాదా..? అనే విషయాన్ని వైద్యులు నిర్థారిస్తారు. ఎక్కువ సార్లు వైద్యులు కణితి ఏర్పడిన భాగంలోని ఎముకను శస్త్రచికిత్స ద్వారా తొలగిస్తారు.

లింబ్ స్పేరింగ్ సర్జరీ

లింబ్ స్పేరింగ్ సర్జరీని లింబ్ సాల్వేజ్ సర్జరీ అని కూడా అంటారు. ఈ ప్రక్రియలో ఆరోగ్యకరమైన భాగాన్ని కాపాడుకుంటూ కణితిని తొలగించి, దాని పరిసర ప్రాంతాలలోని నరాలను, కండరాలను అలాగే ఉంచుతారు. ఇలా తొలగించిన తర్వత కోల్పోయిన భాగాన్ని పునర్నిర్మిస్తారు. కోల్పోయిన ఎముక స్థానంలో లోహంతో చేసిన అలాంటి కృత్రిమ ఆకృత్రిని అమర్చుతారు. 12 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు యుక్త వయస్సు పిల్లల కంటే ఎదుగుదల ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వీరికి మరొక అదనపు ఆపరేషన్ అవసరమవుతుంది. ఈ ఆపరేషన్ ద్వారా వారి వయస్సు పెరుగుతున్న కొద్దీ ఎదిగే విధంగా చేస్తారు. లింబ్ స్పేరింగ్ సర్జరీ అనేది చాలా సంక్లిష్టమైన సర్జరీ, వైద్యులు పిల్లవాడి ఆరోగ్య పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత లింబ్ స్పేరింగ్ చేయాలా..? వద్దా..? అని నిర్థారిస్తారు.

మృధుకణజాల కణతులకు చికిత్స ప్రక్రియలు

ఒకవేళ పిల్లవాడికి బినైన్ సాఫ్ట్ టిష్యూ ట్యూమర్ పెరుగుతూ నొప్పిని కలిగిస్తుంటే దానిని తొలగించవలసి ఉంటుంది. నొప్పి లేని కణతులు ఉంటే వాటిలో ఏర్పడే మార్పులను వైద్యులు పరిశీలిస్తూ ఉంటారు. ఒకవేళ పిల్లవాడికి మాలిగ్నెంట్ సాఫ్ట్ టిష్యూ ట్యూమర్ ఉంటే దానిని కచ్చితమైన చికిత్స అవసరమవుతుంది.

మృధుకణజాల కణతులకు శస్త్రచికత్స

ఎముకల మృధుకణజాలానికి క్యాన్సర్ వస్తే శస్త్ర చికిత్స నిర్వహించవలసి వస్తుంది. వైద్యులు సాధ్యమైనంతవరకు కణితిని మాత్రమే తొలగిస్తారు. కొన్ని సార్లు క్యాన్సర్ కణితితో పాటు కండరాన్ని కూడా తొలగించవలసి వస్తుంది. కానీ కండరాన్ని తొలగించడం వల్ల పిల్లవాడి బలానికి సంబంధించిన అంశంలో అంతగా నష్టం ఏమీ ఉండదు.

కొన్ని ప్రాంతాలు చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. మరికొన్ని ప్రాంతాలు ఆహ్లాదం కలిగిస్తాయి. ఇంకొన్ని ప్రాంతాలు చూస్తే జానపద కథల్లోని విచిత్ర ప్రదేశాలు గుర్తుకొస్తాయి. కానీ ఇంకా కొన్ని ప్రాంతాలుంటాయి అవి ఆసక్తితో పాటు ప్రాణహాని కూడా కలిగిస్తాయి. థ్రిల్ కోసం వెళితే చిక్కులు తప్పవు కూడా! మరి ప్రపంచంలో ఆసక్తి కలిగించే అలాంటి డేంజరస్ ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. ఒక ప్రాంతం విషయ వాయువులతో నిండిపోయి ఉంటే, మరికొన్ని ప్రాంతాలు భగ భగ మండే అగ్ని ద్వీపాల్లా వెలిగిపోతూ ఉంటాయి. ఇక ఆ రహదారుల్లో నడవాలన్నా, వాహనం నడపాలన్నా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సిందే. నరకానికి ద్వారాల్లాగా ఉంటాయి అవి. పోనీ చెట్టును పుట్టను పలకరిద్దామంటేనో? అక్కడ చెట్లను ముట్టుకున్నా, కనీసం వాసన చూసినాగానీ పరలోక ప్రయాణం గ్యారెంటీ...! ఇంతకీ ఏంటా ప్రదేశాలు అనుకుంటున్నారా అయితే చదవండి!

డేంజర్ యమడేంజర్

శిఖరం అంటే ఎత్తయిన కొండ ప్రదేశమేమో, అదంతా విషంతో నిండి ఉంటుందేమో అనుకునేరు. కానే కాదు. నీటిపై తేలియాడే తెట్టు రూపంలో ఉండే కంటికి కనిపించని విష పదార్థాలవి. ఆ వ్యర్థాలన్నీ కలిసి ఏర్పడిన శిఖరం అది. మహాసముద్రాల్లోకెల్లా అతి పెద్దదైన పసిఫిక్ సముద్రానికి మాయని మచ్చవలే ఉంది ఈ శిఖరం. ఇది అత్యంత ప్రమాదకరమైన, విషపూరిత ప్రదేశం. మహా సముద్రం ఉత్తర ప్రాంతంలో 135 నుంచి 155 డిగ్రీల కోణంలో పశ్చిమాన కనిపించే కాలుష్యమే. గ్రేట్ పసిఫిక్ గార్బేజ్ పాచ్. విస్తీర్ణంలో యూఎస్‌లోని టెక్సాస్ కంటే పెద్దగా ఉంటుందని అంచనా. ఉత్తర పసిఫిక్ గైర్ నుంచి కొట్టుకొచ్చే ప్లాస్టిక్, రసాయనాల బురద ఇలా తెట్టులా పేరుకుని ఒక విషపూరిత శిఖరంలా తయారైపోయింది.

భగ భగ మండే ద్వీపాలు

నిప్పులమీద నడిస్తే తెలుస్తుంది బొబ్బలెక్కిన గాయాల బాధ. అలాగే ఇజూ ద్వీపాల్లో అడుగుపెట్టడం అంటే నిప్పులగుండంపై కాలు పెట్టడమే. ఎందుకంటే ఇవన్నీ భగభగమండే ద్వీపాలు కనుక. జపాన్‌లోని హోన్షుకు సమీపంలో దక్షిణం నుంచి తూర్పుకు విస్తరించి ఉన్న ఇజూ ద్వీపకల్పంలోని భాగమే ఇజూ ద్వీపాలు. ఇజూ ద్వీపాల్లో రెండు పట్టణాలు, ఆరు గ్రామాలు ఉన్నాయి. పాలనాపరంగా ఇవి టోక్యో నగరం కిందకి వస్తాయి. ఈ ఇజూ ద్వీపాల్లో అతి పెద్దది ఇజూ ఓషిమా. అగ్నిపర్వత ప్రాంతమైన ఈ ద్వీపంలో పర్యావరణమంతా ప్రాణాంతకమైన సల్ఫర్ వాయువు కమ్ముకుని ఉంటుంది. ఎప్పటికైనా ప్రమాదమేనని గుర్తించి ఇక్కడి ప్రజల్ని 1953 లోనే ప్రభుత్వం వేరేచోటకి తరలించి పునరావాసం కల్పించింది. 2000 వరకూ ఒక్క మానవ ప్రాణి కూడా ఈ ద్వీపం మీద కాలు మోపలేదు. 2005 నుంచీ ప్రజలు మళ్లీ ద్వీపానికి తిరిగి రావడం ప్రారంభించారు. గ్యాస్ మాస్క్ లేకుండా ఇక్కడ ఏ ఒక్కరూ కనిపించరు. ఎందుకంటే ఏ క్షణంలో సల్ఫర్ వాయువు స్థాయి పెరిగిపోతుందో, తగ్గుతుందో ఎవరికీ తెలియదు మరి.



అగ్ని బిలం

నిప్పులు ఉన్నాయని చూస్తూ కూడా ఎవరూ నిప్పుల గుండంలో దిగి ఆడుకోవాలని అనుకోరు. మరి అగ్నికీలలు ఉవ్వెత్తున లేస్తోన్న బిలంలోకి విహార

యాత్రలకి వెళ్తే ఇక అంతే సంగతులు. తుర్క్‌మెనిస్తాన్‌లోని డెర్వాజ్‌లో అడుగు పెట్టడమంటే, తెలిసి తెలిసి నిప్పుల కొలిమిలో తొక్కుడుబిళ్లాట ఆడినట్టే. 1971లో డెర్వేజ్ ప్రాంతంలో భూగర్భ శాస్త్రవేత్తలు తవ్వకాలు జరుపుతుండగా ఒక్కసారిగా గ్యాస్ మంటలు పైకిలేచాయట. తవ్వకాల కోసం భూగర్భంలో ఏర్పాటు చేసిన డ్రిల్లింగ్ యంత్రం ఉన్నపాటుగా కుప్పకూలిందట. చూస్తుండగానే కళ్లముందు అగ్ని బిలం ఏర్పడింది. వంద మీటర్ల వ్యాసార్థానికి విస్తరించింది. స్థానికులు ఈ అగ్ని బిలానికి నరకానికి ముఖద్వారం అని పేరు పెట్టుకుని ముద్దుగా పిలుచుకుంటున్నారు. అలా అప్పుడేర్పడిన బిలం నుంచీ ఇప్పటికీ మంటలు ఎగజిమ్ముతూనే ఉన్నాయి. విషపూరితమైన గ్యాస్‌ను వదిలేయడానికి శాస్త్రవేత్తలు ఆ మంటను ఇంకా మండిస్తూనే ఉన్నారు. కొద్దిరోజుల్లోనే మంటల తీవ్రత తగ్గే అవకాశం ఉన్నా ఇది ఎన్నటికీ అలా మండుతూనే ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

ప్రాణం తీసే చెట్టు

పచ్చని చెట్లు చూస్తుంటే ప్రాణం లేచొచ్చినట్లు అనిపిస్తుంది. మనసుకు ఎంతో ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. అందుకే రకరాల గార్డెన్లు అంటే చాలామంది ఇష్టపడుతుంటారు. కానీ అక్కడ ఉన్న గార్డెన్లో ప్రకృతి ఎంతో ఆహ్లాదకరంగా బాగుంది కదా అని భావించి ఆకుల్ని లేదా గడ్డిపోచల్ని వాసన చూడడమో లేక తెంపి నోట్లో వేసుకోవడమో చేస్తే ప్రాణాలు పోవడం ఖాయం. ఎందుకంటే ఆ గార్డెన్ అంతా పచ్చగా కనిపిస్తుంది కానీ ఆ పచ్చదనంలో ప్రాణాలు తీసే విషం ఉంది. ఐదువందల సంవత్సరాల క్రితం ఇటలీలోని పాదువా గార్డెన్‌లో విషపూరితమైన ఔషధ మొక్కలు పెంచేవారట. ప్రపంచంలో ఇదే మొట్టమొదటి బొటానికల్ గార్డెన్. దీన్ని స్ఫూర్తిగా తీసుకునే ఆల్నివిక్ గార్డెన్‌లో ఆకుపచ్చని విషాన్ని పెంచిపోషిస్తున్నారు. కెన్నాబీస్, కోకాలాంటి అత్యంత విషపూరితమైన మొక్కలు కూడా ఇక్కడ ఉన్నాయి. వాటన్నింటికీ ప్రత్యేకమైన ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేసి పెంచుతున్నారు.. చిత్రవిచిత్రమైన వృక్షజాతులు, అననుకూల వాతావరణంలో సైతం రాక్షసంగా పెరిగిపోయే జాతుల్ని ఇక్కడ చూడొచ్చంటున్నారు నిర్వాహకులు.

మొసళ్ళ రాజ్యం

చూస్తూ చూస్తూ ఎవరైనా సింహం నోట్లో తలపెడతారా! ఆ మొసళ్ళ ద్వీపంలో అడుగుపెట్టడం కూడా నేరుగా మొసలి నోట్లోకి పాదం మోపడమే. బర్మాలోని రామ్‌రీ ద్వీపాన్నే మొసళ్ళ ద్వీపం అంటారు. అవును మరి అక్కడున్న ఉప్పునీటి మొసళ్ల ఇరవై నాలుగు గంటలూ ఎవరొస్తారా అని నోరు తెరుచుకుని కాచుక్కూర్చుంటాయి. ప్రపంచంలోనే అత్యంత ప్రమాద కరమైన ఉప్పునీటి మొసళ్ళు ఇక్కడ వెయ్యి వరకూ ఉన్నాయి. అంతేకాదు మలేరియాను వృద్ధిచేసే దోమలు, కాటు వేస్తే కాటికి పోయేంతటి విషపూరితమైన తేళ్లకు ఈ చిత్తడి నేలలు పురిటిగడ్డ . ఈ ద్వీపం ఎంత ప్రమాదమో చెప్పుకోవడానికి ఇక్కడ జరిగిన చిన్న కథ చాలు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో కొంతమంది జపాన్ సైనికులు ఈ ద్వీపంలోకి అడుగుపెట్టాల్సి వచ్చింది. ఉన్నన్నాళ్ళూ ప్రత్యక్షంగా కాళరాత్రుల్ని చవిచూసిన సైనికుల అనుభవాలు వింటే పై ప్రాణాలు పైనే పోతాయి. మొసళ్ళు దాడి చేసి దొరికిన వారిని దొరికినట్టు నంజేసుకోవడం, మిగిలిన చిన్నా చితకా శరీర అవయవాలు మిగిలిపోతే తెల్లారకముందే అక్కడ వాలిపోయి వాటిని తన్నుకుపోయే ప్రమాదకరమైన రాబందులూ.... ఇదీ ఆ జపాన్ సైనికుల అనుభవాలు. విషయం ఏంటంటే, వెయ్యిమంది ఆ ద్వీపంలోకి అడుగుపెడితే చివరకు బయటపడింది కేవలం 20 మందేనట.

- సంతోషి దహగాం

యమపురికి రహదారి!

వంకర టింకరగా ఉన్న రహదారుల్లో ప్రయాణం థ్రిల్లుగా ఉన్నా ఆ రోడ్డు మీద ప్రయాణించేవారికి మాత్రం భయంతో చెమటలు పోయడం ఖాయం. ఎందుకంటే ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన, పెద్ద మృత్యుమార్గమిది. బొలీవియా యుంగస్ రీజియన్‌లోని లాపాజ్‌కు ఈశాన్య దిశగా 56 కిలోమీటర్ల దూరంలోఉన్న ఘాట్ రోడ్డే యుంగాస్. 61 కిలోమీటర్లు నిడివిగల ఈ రహదారిపై సంభవించే ప్రమాదాల వల్ల ఏటా కనీసం 300 మంది కచ్చితంగా చనిపోతున్నారు. 1930 లో పారాగ్వాయన్ ఖైదీలు నిర్వహించిన చాకో యుద్ధ సమయంలో ఈ రోడ్డు నిర్మాణం జరిగింది. ఉత్తర బొలీవియాలోని అమెజాన్ వర్షాధార అడవులకు అనుసంధానం చేసి ఉండే ఈ రహదారిలోని కొన్ని చిన్న చిన్న దారులు కూడా అత్యంత ప్రమాదకరమైనవేనని చెప్తారు. అత్యంత ఎత్తయిన కొండ ప్రాంతంలో నిర్మాణమైన ఈ రోడ్డుకు రెండోవైపు ఎలాంటి రెయిలింగ్సూ ఉండవు. అంతేకాదు విపరీతమైన మంచు కురుస్తూ ఉంటుంది. ఇరుకైన రోడ్డు కారణంగా ప్రమాదాలకు లెక్కే లేదు. ఘాట్‌రోడ్డు నుంచి పొరబాటున లోయలోకి జారితే వెతికి పట్టుకోవడానికి కనీసం నాలుగైదు రోజులు పడుతుందంటారు స్థానికులు. అంతేకాదు రోడ్డంతా ఎప్పుడూ చిత్తడిగా ఉంటుంది. కొండరాళ్లు జారిపడుతూ ఉంటాయి. ఏ రూపంలో ఏ సమయంలో ఏ మార్గంలో ప్రమాదం ముంచుకొస్తుందో చెప్పడం ఎవ్వరి తరం కాదన్నది ఆ ప్రాంత వాసుల బలమైన నమ్మకం. అందుకే ఈ రోడ్డు మీద అడుగు పెట్టడమంటే మృత్యువును కౌగిలించుకోవడమే.

నిప్పుల ద్వీపం అజర్‌బైజాన్

ఎక్కడైనా అగ్నిపర్వతం బద్ధలైతే నిప్పులు కక్కే లావా బయటకొస్తుంది. కానీ 2001లో కాస్పియన్ సముద్ర తీరం అజేరీ అడుగు భాగాన అగ్నిపర్వతం బద్ధలైతే బురద బయటకొచ్చింది. అలా బయటికొచ్చిన బురదతో ఒక ద్వీపం ఏర్పడిందట. విచిత్రంగా ఉంది కదూ! అదృష్టవశాత్తూ మానవ నివాసాలు లేవు కనుక ఎలాంటి ప్రమాదాలు సంభవించలేదట. వీటిని ప్రపంచంలోనే విచిత్ర గుణం కలిగిన అగ్నిపర్వతాలుగా చెబుతున్నారు పరిశోధకులు. సముద్ర తీరం అడుగున కొన్ని వందల అగ్ని పర్వతాలు బద్ధలవడం వల్ల ఇసుకతో కూడిన బురద బయటకి తన్నుకొస్తుంది. ప్రతి ఇరవై యేళ్ళకోసారి ఇక్కడ ఇలాంటి అగ్ని పర్వతాలు బద్ధలవుతూనే ఉండటాన్ని స్థానికులు గమనించారు. తీరానికి అడుగుభాగాన ఉన్న అగ్నిపర్వతం పెద్ద ఒత్తిడితో బద్ధలైన ప్రతిసారీ ఆకాశంలోకి అగ్ని కీలలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. ఆ మంటలు పదిహేను కిలోమీటర్ల దూరానికి కూడా కన్పిస్తున్నట్టు చెప్తున్నారు. ఒకసారి అగ్నిపర్వతం బద్ధలైతే కొన్ని వేల టన్నుల బురద బయటికొచ్చి సమీప ప్రాంతాలను ముంచేస్తుంది. అలా బయటికొచ్చి గడ్డకట్టిన బురదతోనే సముద్రంలో ద్వీపం ఏర్పడింది.



మీల్స్ టికెట్

ప్రభాకర్ జైని

పెంబర్తి దాటి కారు జనగామ సమీపిస్తుండగానే, నాలో ఎన్నో ఆలోచనలు ముసురు కుంటాయి. సాధారణంగా ఇప్పుడు కూడా అంతే.

నా బాల్యమంతా జనగామలోనే గడిచింది. ప్రతీ ఎండాకాలం సెలవులూ అక్కడే. అమ్మమ్మ, తాతయ్యల ముద్దుల మనుమణ్ణి నేను.

వరంగల్ నుండి జనగామకు యాభై మైళ్ళ దూరమే అయినా, ప్రతీ పండుగకు, ప్రతీ సెలవులకు వెళ్లాలని ఉన్నా, వీలయ్యేది కాదు.

ఇప్పుడు నా నివాసం హైదరాబాద్.

ఎన్నోసార్లు వరంగల్ వెళ్తూ ఉంటాను.

కానీ, జనగామలో ఆగను. ఆగాలనిపించదు కూడా.

కానీ, కారు బస్టాండ్ చౌరస్తా దాటుతుంటే, చూపు తప్పక ఎడమ వైపు తిరుగుతుంది. దూరంగా, కుచించుకుపోయిన నెహ్రూ పార్కు కనిపిస్తుంది.

మా చిన్నప్పుడు, జనగామ ఊరికి నెహ్రూపార్కు సరిహద్దు. అది దాటి వెళితే ఆరోజు పిల్లలకి తన్నులు తప్పేవి కావు. ఇప్పుడు ఊరంతా ఇటు పక్కే.

జనగామ ఊరు ఎలాగైతే నెహ్రూపార్క్ దాటి పెరిగి పోయిందో, నేను కూడా జనగామే కాదు వరంగల్ దాటి దేశమంతా తిరిగి, హైదరాబాదులో స్థిరపడ్డాను.

కారు జనగామలోకి ప్రవేశించేసరికి చూపు నెహ్రూపార్కు వైపు సారించింది.

నా చిన్నప్పుడు నెహ్రూపార్కు పక్కనే ఒక రైస్ మిల్లు ఉండేది. దాని యజమాని, మా తాతయ్య మంచి మిత్రులు. మా తాతయ్యతో కలిసి అక్కడికి వెళ్ళినప్పుడల్లా, నన్ను ఏడిపించడానికి, ఆయన మా తాతయ్యను వంచి వీపు మీద గుద్దుతుండేవాడు. నేను ఏడ్చేవాణ్ణి.

వాళ్ళు నవ్వేవారు. అలా గుద్దుతున్నప్పుడు ఒక సారి నాకు బాగా కోపం వచ్చి, మా తాతయ్య స్నేహితుణ్ణి నాకు అందినచోటల్లా - కాలుమీద, చేతుల మీద గట్టిగా కొరికాను. ఆయన లబోదిబోమన్నాడు.

నేను గట్టిగా ఏడ్చి అక్కణ్ణుంచి పరిగెత్తు కొచ్చాను.

నా వెనుక తాతయ్య కూడా నవ్వుకుంటూ బయటకొచ్చి నెహ్రూపార్కు దగ్గర నిలబడి ఏడుస్తున్న నన్ను ఎత్తుకున్నాడు. ఆ కోపంలో, నేను మా తాతయ్యను కూడా రెండు గుద్దులు గుద్దాను.

ఇప్పుడు తాతయ్య లేడు, అమ్మమ్మ లేదు, అమ్మేలేదు. అమ్మ కన్నా చాలాముందే నాన్న మమ్మల్ని వదిలి వెళ్లారు.

ఇప్పుడు నేనెరిగిన నెహ్రూపార్క్ కూడా లేదు.

ఆ జ్ఞాపకాలు మాత్రం పదిలంగా నా మనో మంజూషలో నిలిచిపోయాయి.

కారు ఆగింది.

"సార్! కాఫీ తాగుతారా?"

ముందు సీట్లో ఉన్న నా అసిస్టెంట్ నవీన్ అడిగాడు.

నేను తల అడ్డంగా ఊపాను. వాళ్ళు దిగారు.

జనగామలో తామరతంపలా మాకు చుట్టాలు చాలామందే ఉండేవాళ్ళు. నేను ఎంత ఎదిగినా నా పేరేదైనా, వాళ్ళందరికీ, ఇప్పటికీ నేను 'నర్సింహణ్ణే', 'అంతక్క మనవడినే' (అనంత లక్ష్మి మా అమ్మమ్మ పేరు. నర్సింహారావు నా ముద్దు పేరు).

ఈ రోజు ఎందుకో జనగామ, జనగామలో నా జీవితం, చుట్టాలు పదే పదే గుర్తుకొస్తున్నారు.

జనగామలో మాకు బోలెడంత మంది చుట్టాలున్నారు. వాళ్ళల్లో కోటీశ్వరులున్నారు. కూటికి గతిలేని వారున్నారు. అయినా, ప్రేమలకు, ఆప్యాయతలకు లోటేమీ ఉండేది కాదు. భేషజాలుండేవి కావు. అందరూ అందరినీ ఆప్యాయంగా పలకరించే వారు.

కానీ, ఇప్పుడు వాళ్ళంతా కాల గర్భంలో కలిసి పోయారు.

నా మనసంతా చేదుగుళిక తిన్న నోరులా అయింది.

జీవితం, ఎన్నో మలుపులు తిరిగి, ఎక్కడి నుంచో బయలు దేరి, ఎక్కడికో చేరుకుంది. ఇంకెన్ని మలుపులుంటాయో కూడా తెలియదు.

డ్రైవర్, అసిస్టెంట్ ఎక్కారు. కారు కదిలింది.

ఇప్పుడు కూడా ఇంటర్నేషనల్ షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్‌కు ప్రభుత్వం నన్ను ఫెస్టివల్ డైరెక్టర్‌గా నియమిస్తుందని నేనెప్పుడూ ఊహించలేదు.

ఆ పని మీదే వరంగల్ వెళ్తున్నాం.

రేపు సాయంత్రం, అంగరంగ వైభవంగా యూనివర్సిటీ ఆడిటోరియంలో మంత్రి గారి చేతుల మీదుగా ప్రారంభం కానుంది.

వరంగల్లులో నాకో ఇల్లుంది. నేను అక్కడే ఉంటాననడంతో నవీన్‌కు, డ్రైవర్‌కు "హరిత"లో అకామడేషన్ ఇచ్చారు.

నన్ను, మా ఇంట్లో దింపి వాళ్ళు వెళ్లారు.

నాకు మా ఇల్లంటే చాలా ఇష్టం. సెలవులు జనగామలో గడిపినా, నా బాల్యమంతా వరంగల్లులోని, ఆ ఇంట్లోనే గడిచింది. ఇల్లు పెద్ద గొప్పగా ఉండకపోయినా, ఆ ఇంట్లోని ప్రతీ అణువు, నేను లోపలికి అడుగుపెట్టగానే నన్ను ఆప్యాయంగా పలకరిస్తున్నట్టనిపిస్తుంది. నా కష్టాలు, సుఖాలు అన్నీచూసింది ఆ ఇల్లు. నేను పుట్టడం, నాకు పెళ్లి కావడం, నా సంతానం పుట్టడం, నాన్న, అమ్మ చనిపోవడం - అన్నీ ఆ ఇంట్లోనే జరిగాయి.

ఓ గంట పాటు ఇల్లంతా చూసుకున్నాను.

ఆకలేస్తున్నట్లనిపించి బయటకు నడిచాను.

వరంగల్ వదిలేసి ఇరవై, ముప్పై ఏళ్లయినా నన్ను చాలా మంది గుర్తు పడతారు. ఆప్యాయంగా పలక



నవ్యవీక్లి- నాటా సంయుక్త నిర్వహణలో బహుమతి పొందిన కథ

రిస్తారు.

నేను ఎప్పుడొచ్చినా తప్పక భోజనం చేసే శంకర్‌విలాస్ హోటల్‌కు వెళ్లాను. అది ఇంటికి దగ్గరే, నడిచి వెళ్ళొచ్చు.

దాని ఓనర్ తిరుమల్ నాకు మంచి మిత్రుడు. నన్ను చూసి కౌంటర్ మీద నుంచి లేచి ఆప్యాయంగా పలకరించి నన్ను స్వాగతించాడు.

హైదరాబాద్‌లో దొరకనిది ఈ ఆప్యాయతే.

నేను ఒక టేబుల్ ముందు కూర్చోబోతుంటే, పక్కనే ఉన్న మరో టేబుల్ ముందు ఒక తెలిసిన ముఖం కన్పించింది. 'ఎవరా?' అని ఒక్క క్షణం ఆలోచించాను.

కొంచెం పరికించి చూస్తే తెలిసిపోయింది.

ఆయన, 'మా గురుమూర్తి మామయ్య!'

బక్కచిక్కి గడ్డంపెరిగి, నుదుట విభూతి రేఖలతో, తల వంచుకుని గబగబా భోంచేస్తున్నాడు.

"గురుమూర్తి మామయ్య ఇక్కడ భోంచేయడమేంటి?" అని ఆలోచిస్తూ ఉండిపోయాను.

ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ కులాసాగా, ఖరీదైన తెల్లటి బట్టలతో, చిద్విలాసంగా కన్పించే గురుమూర్తి మామయ్య...

ఇక్కడ ఇలా మురికిగా ఉన్న బట్టల్లో చిక్కిపోయి, గడ్డం పెరిగిపోయి, ఆబగా అన్నం తింటూ ఉండడం చూసేసరికి నాకు మతిపోయింది.

●●●

మా నాన్న వరంగల్ మున్సిపాలిటీలో చిరుద్యోగి. మధ్య తరగతి కుటుంబానికి చెందిన మేము, మా ఆర్థిక పరిస్థితి వల్ల, మా బంధువుల ఇంట్లో ఏ ఫంక్షన్‌కు వెళ్లినా కొంచెం ఒదిగి ఉండేవాళ్ళం.

మిగతా బంధువుల సంగతి ఎలా ఉన్నా, రెండు కుటుంబాల విషయంలో మాత్రం, వారి ఇళ్ళకు వెళ్ళినప్పుడల్లా బిక్కుబిక్కుమంటూ గడిపేవాళ్లం. ఏ మాత్రం గీత దాటినా, మా అమ్మా, నాన్నా కళ్ళతోనే మమ్మల్ని అదుపులో పెట్టేవారు.

అందులో ఒక కుటుంబం - మా నాన్న తరపు బంధువులు, వకీల్



సాబ్ వాళ్ళు. ఆయన మా నాన్నకు బాబాయి వరుస అయ్యేవాడు. మా నాన్నకు ఆయన దేవుడితో సమానం. పల్లెటూళ్ళో చదువు సంధ్యలు లేకుండా రికామీగా తిరుగుతున్న నాన్నను వరంగల్‌కు తీసుకొచ్చి సభ్య సమాజంలో ఒక స్థానం కల్పించినందుకు గాను, ఆయనంటే మా నాన్నకు అపరిమితమైన గౌరవం. వణుకు. మా నాన్నంటే మాకు సింహస్వప్నం. అట్లాంటిది, ఆయనకు మా నాన్నే భయపడుతుంటే, మేమంతా వాళ్ళ ఇల్లంటే పులిబోనుతో సమానంగా ఫీలయ్యేవాళ్ళం. వాళ్ళింట్లో అంతా ఆధునికం. కళ్ళు విప్పార్చుకుని వాళ్ళగేమ్స్‌ను (ఆట వస్తువులు అనకూడదంట) చూసేవాళ్ళం. అప్పట్లోనే ఆ ఇంట్లోని పిల్లలకు, ఎవరికి వాళ్ళకు సెపరేట్‌గా అల్మారాలుండేవి. వాటికి వాళ్ళు తాళాలు కూడా వేసుకునేవారు. మా ఇంట్లో అసలు అల్మారాలు కాదు కదా, కప్‌బోర్డులు కూడా లేవు. వాళ్ళింట్లో పిల్లలకు ఒక్కొక్కరికి ఒక్కో సైకిల్ ఉండేది. వాళ్ళింట్లో ఫోన్ కూడా ఉండేది. టెలిఫోన్ ఎక్స్చేంజ్ వాళ్ళు ఫోను చేసి పాటలు వినిపించేవాళ్ళట. వాళ్ళు మమ్మల్ని బాగానే చూసినా మాకు ఇబ్బందిగానే ఉండేది. ఊపిరి ఆడనట్టుగా ఉండేది.

ఇంకొకరు మా అమ్మకు వరసకు అమ్మమ్మ అయ్యే షాహుకారు వాళ్ళు. జనగామ తరపు బంధువులు. మా చిన్నప్పుడు వాళ్ళను 'కోటికి పడగలెత్తిన..' వాళ్ళనేవారు. వాళ్ళింటి భోషాణంలో కోటి రూపాయలుండేవని, దాన్నొక నాగుపాము కాపలా కాస్తుందని రకరకాల కథలు చెప్పుకునే వాళ్ళు.

అంత ధనవంతులైనా, వాళ్ళింట్లో మా అమ్మకు చాలా స్వాతంత్ర్యముండేది. వాళ్ళింటి ముందు పెద్దపెద్ద అరుగులు ఉండేవి. వీధిలో నుండి ఓ పది మెట్లు ఎక్కగానే కన్పించే ఈ అరుగుల మీద ఆ ఇంటి పెద్ద షాహుకారు కూర్చొని ఉండేవాడు. ఆయనకు సరిగ్గా కన్పించదు. ఆయన పక్కనే కుర్చీలో తెల్లగా దేవతలా ఉండే ఆయన భార్య కూర్చుని ఉండేది. ఆమె ఒంటిమీద ఓ కిలో నగలు ఉండేవి.

ఇంటికి ఎవరొచ్చినా, "ఎవర్రా అదీ?" అని ఆయన అరిచేవాడు.

మేము వెళ్ళినాసరే, "ఎవరే అది?" అని అరవగానే, ఆయన భార్య "మన శకుంతల, దాని కొడుకు నర్సింహుడు" అని చెప్పి కుర్చీలో నుంచి లేచి మా అమ్మను అక్కున చేర్చుకునేది.

"బాగున్నావా తాతా?" అని అమ్మ ఆయనను పలకరిస్తే, "నేను బాగున్నా! నీ మొగుడెట్లున్నడే? నీ కొడుకు ఏం చదువుతాండు?" అని అంటూ చేతి కర్రతో నన్ను గుచ్చేవాడు.

వాళ్ళకు ట్రంకు పెట్టెల వ్యాపారం ఉండేది. ఇంటి నిండా, ఎక్కడ చూసినా, వందల కొద్దీ ట్రంకు పెట్టెలుండేవి. ఇనుప రేకుతో చేసి వాటిపై రంగు రంగుల ఆకులు, పూలు, పక్షులు, జంతువులు దించేవారు.

నేను వాటిని విచిత్రంగా చూస్తూ ఉండిపోయేవాణ్ణి. అట్లాంటిది ఒకటి స్కూల్‌కు తీసుకెళ్ళే బాక్స్ కొనాలని నాకు ఎంతో కోరికగా ఉండేది. కానీ, అమ్మ కళ్ళతోనే మందలించేది.

సొంత అమ్మమ్మ కాకపోయినా, అమ్మ పిలిచినట్టుగానే ఆమెను నేను కూడా 'అమ్మమ్మ' అని పిలవాలని చెప్పింది. నేను అలాగే పిలిచేవాణ్ణి.

మా అమ్మ నన్ను బలవంతంగా తనకు తోడుగా రమ్మని నన్ను తీసుకునివెళ్ళినా, అక్కడకు వెళ్ళిన తర్వాత ముచ్చట్లలో పడి నన్ను మరచిపోయేది. నేను ఇల్లంతా కలియదిరిగేవాణ్ణి. గంటకో, అర్ధ గంటకో ఎవరో వచ్చి చేతిలో ఏదో తినడానికి పెట్టేవారు. అది తింటున్నంత సేపూ అమ్మపక్కనే కూర్చుని వాళ్ళు మాట్లాడుకునే మాటలు వినేవాణ్ణి.

నాకు పూర్తిగా అర్థం కాకున్నా, అమ్మమ్మ వాళ్లకు మగ సంతానం లేరని, అందుకే వాళ్ళు సొంత మనవణ్ణి పెంచుకున్నారనీ, ఆ గొడవలేవో మాట్లాడుకునే వాళ్ళు.

వాళ్ళింట్లో ఇద్దరు వ్యక్తులు నన్ను బాగా ఆకర్షించే వారు. ఒకతన్ని చూస్తే మాత్రం నాకు నిక్కరు తడిచేది. అయినా ఆ ఇంటికి ఎప్పుడు వెళ్ళినా అతన్నే దూరం నుంచి చూస్తూ నిలబడేవాణ్ణి. ఆయన కాళ్లకు ఇనుప గొలుసులు వేసి ఒక స్తంభానికి కట్టి ఉంచేవారు. అందరినీ "రా, రా! అన్నం పెడత, వొస్తవా" అంటూ పిలిచేవాడు. ఎప్పుడూ పిచ్చిగా నవ్వుతూనో, జుట్టు పీక్కుంటూనో ఉండేవాడు. అక్కడ నిలబడి చూస్తున్న నన్ను అమ్మ లాక్కుపోయేది. అతనికి పిచ్చి అని చెప్పేది. అమ్మమ్మ వాళ్ల మీద ఎప్పుడైనా కోపం వస్తే, 'అసలు ఆ ఆస్తి అంతా ఆ పిచ్చి మనిషిదేనని, ఆయనను మోసం చేసి, మందుపెట్టి వీళ్ళు కాజేశారని, అమ్మ అక్కసుతో చెప్పేది. నాకు అర్థమయ్యి కానట్లు ఉండేది.

కానీ, ఆయన ఎప్పుడూ ఎవరినీ ఏమనేవాడు కాదు. ఒక్కోసారి ఉన్నట్టుండి గుండెలు అవిసేలా అరిచేవాడు. ఆ తర్వాత వెక్కివెక్కి ఏడ్చేవాడు.

వరంగల్ వదిలిపెట్టి ఇరవై ముప్పై యేళ్ళు గడిచినా ఇంకా అక్కడ పలకరించే స్నేహితులున్నారాయనకు. తృప్తిగా తన ఇంటిని చూసుకుని శంకర్ విలాస్‌కు బయలుదేరి వెళ్ళాడు. ఓ టేబుల్ ముందు తెలిసిన ముఖం. గురుమూర్తి మావయ్య! ఆశ్చర్యపోయాడతను. అష్టైశ్వర్యాలతో తులతూగే కుటుంబం. బక్కచిక్కిపోయి మురికిబట్టలతో ఇలా హోటల్‌లో? ఏం జరిగిందాయనకు?

నేను దూరం నుంచే చూస్తూ నిలబడేవాణ్ణి.

రెండోవ్యక్తి గురుమూర్తి మామయ్య. ఆ ఇంటికి పెంపకానికి వచ్చిన వారసుడు. ఆయనకు కొత్తగా పెళ్ళయింది.

ఎప్పుడూ చలాకీగా ఉండేవాడు. నవ్వుతూ ఉండేవాడు. ఆయన వేసుకునే బట్టలు పుచ్చపువ్వుల్లా తెల్లగా ఉండేవి. జేబులో నోట్లు కనబడుతుండేవి.

నన్ను చూడగానే "రారా అల్లుడూ!" అంటూ ఎగరేసుకుంటూ ఎత్తుకొని ముద్దు పెట్టుకునే వాడు.

"నీ బుగ్గలు నాకిస్తావా?" అనేవాడు.

నేను ఇవ్వననేవాణ్ణి.

"పోనీ ముద్దు పెట్టుకోనా?" అంటూ కొరికేవాడు.

కొత్తగా కొనుక్కున్న తన స్కూటర్‌మీద ఊరంతా తిప్పేవాడు. నేను ఎప్పుడూ రుచి చూడని చాక్లెట్లు, పిప్పరమెంట్లు కొనిచ్చేవాడు. ఊరంతా తిప్పి తీసుకొచ్చి "అక్కా! ఇదిగో నీ కొడుకు" అంటూ నన్ను అప్పగించేవాడు.

అతని జ్ఞాపకం నాకో మధురస్మృతి.

•••

అట్లాంటి గురుమూర్తి మామయ్య, కోటీశ్వరుడు, కోట్లకి పడగెత్తిన అపర కుబేరుడు, ఆగర్భ శ్రీమంతుడు నా కళ్ళముందు ఒక చిన్న హోటల్లో, ఆకలితో ఉన్నాడేమో, పరిసరాలను పట్టించుకోకుండా, ఆబగా అన్నం తింటూ ఉండడం చూసేసరికి నా కళ్ళు చెమర్చాయి.

ఇందుకేనా, ఈ దృశ్యాన్ని చూడబోతున్నాననేనా, హైదరాబాదు నుంచి వచ్చే దారి పొడవునా, జనగామ గురించిన పాత జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి.

తల వంచుకుని అన్నం తింటున్న గురుమూర్తి మామయ్య నన్ను చూడలేదు. నాకు అతన్ని పలకరించాలని ఉన్నా, మామయ్యను ఎలా ఫేస్ చేయాలో అర్థం కాలేదు.

మా జీవితాల్లో వచ్చిన మార్పులు ఆయన కర్ణాకర్ణిగా వినే ఉంటాడు.

అదే జీవితం గొప్పదనం. ఒక్కోసారి మనకు ప్రాణప్రదమైన వ్యక్తులు, కాలం గడుస్తున్న కొద్దీ మరుగున పడిపోతారు. వాళ్ళులేకుండా ఒక్క క్షణం కూడా గడపలేని స్థితి నుండి ప్రయాణించి, మనం వాళ్ళను ప్రయత్న పూర్వకంగా గుర్తుకు తెచ్చుకోవాల్సిన

స్థితికి వచ్చేంత మతిమరుపు కలిగిస్తుంది కాలం.

'మరుపు' మానవాళికి కాలం ప్రసాదించిన వరం.

కానీ. అప్పుడప్పుడు 'అరే! ఇలా జరిగిందే?' అని కూడా అన్పిస్తుంది.

ఇప్పుడు, నా పరిస్థితీ అలాగే ఉంది.

హైదరాబాద్‌లో నా ఆఫీసులో కొంపలు మునిగేంత పని ఉంది. వారం రోజుల్లో, గోవాలో నా నాలుగో సినిమా షూటింగ్ ప్రారంభమవుతుంది. దాంట్లో నటించబోతున్న హీరో, హీరోయిన్ కాల్షీట్లు, లొకేషన్స్ హోటళ్ళ రిజర్వేషన్ వంటి ఎన్నో గొడవలున్నాయి. ఇప్పుడు ఈ ఫెస్టివల్, దీని కోసం చేయాల్సిన అరేంజ్‌మెంట్స్ కూడా ఎన్నో ఉన్నాయి.

కానీ, ఇప్పుడు నాకు అవన్నీ గుర్తుకు రావడం లేదు.

గురుమూర్తి మామయ్యను ఎట్లా ఫేస్ చేయాలా అన్నదే, నా ఆలోచన.

హోటల్ యజమాని తిరుమల్ నా అవస్థ గమనించి, "ఆయన మీకు తెల్సాసార్!" అని అడిగాడు.

"అవును. మా బంధువే!"

"అలాగా! రోజూ మధ్యాహ్న సమయంలో మన దగ్గరే భోంచేస్తున్నాడు. వెళ్ళి మాట్లాడండి సార్!" అన్నాడు.

ఇక నాకు ముందడుగు వేయక తప్పలేదు.

ఆయన దగ్గరకు వెళ్ళి నిల్చుని, "నమస్కారం మామయ్యా!" అని అన్నాను.

ఆయన పట్టించుకోకుండా తినసాగాడు.

నేను ఆయన భుజం మీద చెయ్యివేసి తట్టాను.

తింటున్నవాడల్లా ఆగి తలెత్తి 'ఎవరన్నట్టుగా' నన్ను చూశాడు.

"మామయ్యా! నేను.."

"నర్సింహా! నువ్వా? ఎన్నాళ్ళయిందిరా చూసి. అందుకే గుర్తుపట్టలేదు. బాగున్నావా? భోంచేస్తావా?" అని అడిగాడు నవ్వుతూ.

ఆ నవ్వు మనిషి ఎంత నలిగిపోయినా, పుచ్చు పువ్వులాంటి ఆ నవ్వు, పెరిగిన తెల్లటి గడ్డంలో నుంచి, తొంగిచూసింది.

అలా నవ్వేసరికి, నాకు, నా గుండెను రంపపు పళ్ళ యంత్రం మధ్యలోపెట్టి తిప్పుతున్నట్టుగా, నా గుండెనెవరో బాధల సంద్రంలోకి లంగరువేసి లాగినట్టుగా, అన్పించింది. ఆయన నవ్వుకున్నా అంత బాధ కలిగేది కాదు. ఆ నవ్వులో అంత విషాదం తొణికిసలాడుతుంది.

"బాగున్నాను మామయ్యా!" అన్నాను, గద్గదికమైన గొంతుతో.

నన్ను కూర్చోమని సైగచేశాడు. నేను కూర్చున్నాను.

ఆయన తినడం ఆపాడు.

"తినండి మామయ్యా" అన్నాను.

ఆయన గబగబా తినేసి వాష్‌బేసిన్ దగ్గరకు వెళ్ళి చేతులు కడుక్కుని వచ్చి కూర్చున్నాడు.

"ఆఁ ఇప్పుడు చెప్పరా అల్లుడూ! ఏంటి సంగతులు. పెద్దోడివై పోయావ్! పేపర్లో అప్పుడప్పుడు చూస్తున్నాలే!" అని అన్నాడు.

ఇద్దరం నిశ్శబ్దంగా కూర్చున్నాం. చుట్టూ రణగొణధ్వని ఉన్నా, మా ఇద్దరి గుండెల్లో చెలరేగుతున్న ఘోష ముందు అది నామ మాత్రం.

నక్కతోక తొక్కిన అవికా గోర్

బొద్దుగా ఉండే చిన్నారి పెళ్ళికూతురు అవికా గోర్ సన్నబడి స్లిమ్ అయిన తరువాత అదృష్టం బాగా కలిసి వచ్చింది. మొన్నీ మధ్య అవికా 'ఆల్మోస్ట్' అనే షార్ట్ ఫిలింలో నటించింది. ఈ ఫిలింలో అవికా నటనకి ఫిదా అయిపోయిన ఫ్రెంచి ప్రొడ్యూసర్ తను త్వరలో తీయబోయే ఓ భారీ బాలీవుడ్ సినిమాకి అవికాను హీరోయిన్‌గా తీసుకోవాలని డిసైడ్ అయిపోయాడట! డిసైడ్ అవడమే కాకుండా ఆమెకు ఆ విషయం చెప్పి ఓకే అనిపించుకున్నాడట కూడా! ఈ భారీ ఛాన్స్‌తో చదువుకోవాలన్న తన కోరికను ప్రస్తుతం పక్కన పెట్టేసి బాలీవుడ్ సినిమాకురెడీ అయిపోతోందట అవికా! సన్నబడిన తరువాత అవికాను చూసిన టాలీవుడ్ దర్శకనిర్మాతలు కూడా కొందరు ఆమె డేట్ల కోసం ప్రయత్నిస్తున్నారట!

ఇక నా వశం కాలేదు.

"ఏంటి మామయ్యా? ఇది..."

గుండెల్లో పొంగుతున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయాను. కళ్ళ నుండి జలజల రాలాయి కన్నీళ్ళు.

ఏడుస్తున్న నన్నుచూసి మామయ్య కూడా కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

"ఏమైందిరా?" అన్నాడు మాటలు కూడదీసుకుంటూ.

"కోటికి పడగలెత్తిన మీరు ఇలా...?"

"హు. కోట్లు. మాయమైపోయినయిరా. మా వంశానికి కోట్లు ఎట్టొచ్చినయ్యో అట్లాగే పోయినయిరా. ఒక అమాయకుణ్ణి మోసం చేసి దక్కించుకున్న కోట్లు కాలగర్భంలో కలిసిపోయినయ్. కళ్ళ ముందే ఆస్తులు కరిగిపోయాయి. ఎందుకంటే ఏం చెప్పగలము. కర్మ ప్రారబ్దం, నమ్మిన వాళ్ళు మోసం చేశారు. వ్యాపారంలో లక్షల్లో నష్టపోయాను. కొడుకులు సమర్థులై వంశాన్ని నిలబెడతారనుకుంటే వాళ్ళు వాళ్ళ స్వార్థం చూసుకున్నారు. ఊరు వదిలి పారిపోయారు. అష్టైశ్వర్యాలు అనుభవించిన నా భార్య, మా ఇంటి మహాలక్ష్మి, అలవి కాని వ్యాధితో కుంగి, కృశించి మరణించింది.

కళ్ళముందే సామ్రాజ్యం కూలిపోయింది. ఇళ్ళూ భవంతులూ పరాధీనమైపోయాయి. వాటి మీద మమకారం చావక అక్కడే కాపలా కుక్కలా తిరుగుతున్నాను. బ్రతుకు శిథిలమై పోయింది. కొన్నాళ్ళు వృద్ధాశ్రమంలో ఉంచారు. ఉన్నాను. ఇప్పుడు కొడుకులు నా బాధ్యత తీసుకున్నారు.

బాధ్యత అంటే ఏంటో తెలుసా! ముగ్గురు కొడుకులు కలిసి నెలకు ముప్పై మీల్స్ టికెట్లు కొనిస్తారు. వాటితో నెల రోజులు మధ్యాహ్న భోజనం చేస్తాను. మధ్యాహ్న భోజన పథకం అన్నమాట. ఒక్కపూట భోజనం, ఈ వయసులో, నా ఒంటికి మంచిదట. ఏ రోగం రాకుండా, ఆరోగ్యంగా ఉండొచ్చునంట కదా?" అంటూ జేబులో నుంచి మీల్స్ టికెట్లను తీసి దోసిట్లో పట్టుకుని చూపించాడు.

ఆ రెండు చేతులను నా రెండు చేతులతో మూశాను.

"నాతో హైదరాబాద్ రా మామయ్యా! నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను".

"రాను రా! నేను శాపగ్రస్తుడిని, నా నీడ కూడా తమ కుటుంబాల మీద పడకూడదని నేను కన్నవాళ్ళే నన్ను దూరంగా ఉంచారు. అందులో నిజం కూడా ఉందేమో? అందుకే, మా వంశపునీడ కూడా నీ మీద పడకూడదు. నేను తాకితే, పచ్చనిచెట్లు కూడా బూడిదైపోతాయటరా. నువ్వు బాగున్నావు, అంతేచాలు. గొప్పోడివైనా, చిన్ననాటి అభిమానంతో 'మామయ్యా' అంటూ పలకరించావు. నేను పులకరించి పోయాను. అది చాలు. అయినా మీకు మేమేం చేశాం రా. అష్టైశ్వర్యాలు ఉన్నప్పుడు మీ అమ్మకు ఒక్క చీర కూడా పెట్టని నేను ఏ ముఖం పెట్టుకుని రావాలిరా? ఎంతైనా మా శకుంతలక్క అదృష్టవంతురాలు. నీలాంటి కొడుకును కన్నది. ఏ లోకంలో ఉన్నదో.." అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

"పోనీ.. " అంటూ జేబులో చెయ్యి పెట్టబోయాను.

"నాకు డబ్బులిస్తావారా! వద్దు. కర్మఫలం అనుభవించాల్సిందే".

"మరెట్లా?"

"ఏముందిరా, కాలం గడిచిపోతుంది. అయినా, ఇంకెన్నాళ్ళురా నీకెప్పుడైనా ఈ గురుమూర్తి మామయ్య చనిపోయాడన్న వార్త తెలిస్తే, వీలైతే ఒక కన్నీటి బొట్టు కార్చు. అంతే..." అంటూ వెళ్ళిపోయాడు.

నేను నిశ్చేష్టుణ్ణయి నిలబడి పోయాను.

ఇంతలో తనే మళ్ళీ నా దగ్గరకొచ్చి "రోజుకి ఒక్క పూట భోజనం సరిపోవడం లేదు రా! రాత్రి అయ్యేసరికి పేగులు 'అన్నమో రామచంద్రా' అని అరుస్తున్నాయ్‌రా! ఆకలికి నిద్ర కూడా పట్టడం లేదురా!" అని దీనంగా అన్నాడు.

నేను భోరున విలపించాను.

నేను తిరుమల్ వైపు చూశాను. అతను 'సరే' నన్నట్లుగా తలూపాడు.

నేను తిరిగి చూసేసరికి, నడిచి పోతున్నాడు.

గురుమూర్తి మామయ్య...

సెల్:90308 83785

మన భావోద్వేగాలు మన తిండిని శాసిస్తాయా? ఔననే అంటున్నారు వైద్య నిపుణులు. కొందరు ఏ చిన్న బాధ కలిగినా లేక సంతోషం కలిగినా ఇక ఆ పూట విపరీతంగా తినేస్తారు. మరి కొందరు దీనికి పూర్తి విరుద్ధం! ఆ సంతోషం వల్లనో, ఆవేదన వల్లనో కడుపు నిండిపోయిందంటారు. అస్సలు తినడం మానేస్తారు. ఐతే ఇది వ్యాధి లక్షణమే అంటున్నారు వైద్యులు. ఈ మధ్య ఇలా తిండికి సంబంధించిన వ్యాధులకు గురయ్యేవారి సంఖ్య పెరుగుతోందట. మరి అదేంటో విపులంగా తెలుసుకోండి!!

తిండితో తంటా

తీవ్రమైన భావోద్వేగాలు కోపం, ప్రవర్తనలో మార్పులు, వ్యాకులత, యాంగ్జయిటీ వంటి అనేక సమస్యల వల్ల మనం తిండి తినే తీరులో మార్పులు కనిపిస్తాయి. సదరు వ్యాధికి అవి లక్షణాలుగా మారతాయి. దానివల్ల కొన్ని సార్లు అవి భౌతికంగానే కాదు, మానసికంగా కూడా మార్పులు తెస్తాయి. ప్రభావం చూపిస్తాయి. ఒక్కోసారి అవి ప్రాణాంతకం కూడా కావొచ్చునంటున్నారు పరిశోధకులు.

ఈటింగ్ డిజార్డర్స్

ఆహార రుగ్మతలకు అనేక మానసిక, శారీరక కారణాలున్నాయి. ప్రవర్తన, జీవన విధానం, ఉద్వేగాలు, మానసిక, వ్యక్తిగత, సామాజిక అంశాలకు సంబంధించిన కారణాలెన్నో తిండిమీద ప్రభావం చూపిస్తాయి. అవే ఎన్నో రుగ్మతలకు దారి తీస్తాయి. ఇందులో చాలావరకు మానసికమైనవే. అవి క్రమంగా శారీరక ఆరోగ్య సమస్యలకూ దారి తీస్తాయి. వ్యక్తిత్వంపై ప్రభావం చూపించి న్యూనత భావం కలిగిస్తాయి.

ఇప్పుడీ భోజన రుగ్మతలు సర్వత్రా పెరిగిపోతున్నాయట. మహిళలు, పురుషులు ప్రత్యేకంగా కౌమార వయసులోకి వచ్చే టీనేజీ పిల్లల్లో ఎక్కువగా ఈ సమస్యలు తలెత్తుతున్నాయని అనేక నివేదికలు చెబుతున్నాయి. ఈ భోజన రుగ్మతల్లో ఎన్నో రకాలున్నాయి.

ఫ్యాషన్ డిజార్డర్

పిల్లలు టీనేజీలోకి వస్తుండగానే అందంపైన ఎక్కువ దృష్టి సారిస్తారు. బాగా లావెక్కి అసహ్యంగా కనిపిస్తున్నామేమో అనే సందేహం పట్టి పీడిస్తుంది. ఏమాత్రం ఎక్కువగా తిన్నా బరువు పెరిగి అందం దెబ్బతింటుందేమో, అందరిముందు లావుగా కనిపిస్తామేమో అన్న బాధతో తినడం మానేస్తారు. దాంతో ఉండాల్సిన దానికంటే బరువు తగ్గి ఎముకల పోగులా మిగిలిపోతారు. తినాలనుకున్నప్పటికీ, తినలేని ఈ రుగ్మతనే అనరెక్సియా నర్వోజా అంటారు. కౌమార దశలోకి ప్రవేశించిన యువతలో ముఖ్యంగా అమ్మాయిల్లో కనిపించే ఈ జాడ్యం ఐదు శాతం నుంచి 20 శాతం మందిలో ప్రాణాంతకంగా మారుతుంది. ఒకరిని చూసి ప్రభావితం అవుతూ చేసే ఈ భావననే ఫ్యాషన్ డిజార్డర్ అని కూడా అంటారు. ఈ వ్యాధి వల్ల కండరాలు బలహీనంగా మారి ఎముకల సాంద్రత మందగిస్తుంది. నీరసం, నిస్సత్తువ ఏర్పడి మూత్రపిండాలు, హార్ట్ ఫెయిల్యూర్ వంటి సమస్యలకూ దారి తీయవచ్చు.

బులీమియా నర్వోజా

తింటే బరువు పెరిగిపోతామేమో అని అనుకుంటూనే అదే పనిగా అతి ఎక్కువగా తినడం ఈ వ్యాధి లక్షణం. భోజనంపై అమిత ఇష్టం వల్ల రుచికరమైన ఆహారపదార్థాలను గబగబా తినేస్తారు. ఆ తర్వాత తాము తిన్న పదార్థాల వల్ల బరువు పెరిగిపోతామన్న ఆందోళనతో ప్రయత్న పూర్వకంగా చేయిపెట్టి మరీ వాంతులు చేసుకుంటారు. దీన్నే బులీమియా నర్వోజా అని కూడా పిలుస్తారు. బులీమియా నర్వోజా వ్యాధి ఒక్కోసారి డిప్రెషన్ లక్షణాలతో కూడి ఉంటుంది. ఈ వ్యాధి ఒక్కోసారి మరణానికి సైతం దారితీసే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఈవిధంగా అదేపనిగా తినడం, వాంతులు చేసుకోవడం వల్ల జీర్ణక్రియ మందగించి, జీర్ణక్రియ సైకిల్ దెబ్బతినే ప్రమాదం ఉంది.

బింజ్ ఈటింగ్ డిజార్డర్

ఈ రుగ్మత ఉన్న రోగులు ఏ ఆహారాన్ని అయినా

స్వీట్లపై మక్కువే కారణం

ఎలాంటి భోజనమైనా చివరకు ఒక స్వీట్‌తో ముగిస్తేనే అదొక రకమైన సంతృప్తి ఉంటుంది. కడుపు నిండా తిన్నామనే భావన కలుగుతుంది. అలాంటి భోజనం తింటే ఆహా అనిపిస్తుంది కదా! కొందరికి భోజనం తర్వాత పక్కాగా స్వీట్ తినాలన్న కోరిక బలంగా ఉంటుంది. ఇది కూడా దాదాపు ఒక వ్యసనం లాంటిదని చెప్పవచ్చు. కానీ ఇది ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. ఇది ఇతర ఈటింగ్ డిజార్డర్స్‌కు దారి తీస్తుందని న్యూరోసైన్స్ యూరోపియన్ జర్నల్‌లో ప్రచురితమైన ఓ పరిశోధన ద్వారా తేలింది.

అదేపనిగా తినేస్తూ ఉంటారు. తినడం అంటే వీరికి పిచ్చి. ఎప్పుడూ ఆకలితో ఉన్నట్టుగానే తింటారు. దీన్నే బింజ్ ఈటింగ్ డిజార్డర్ అంటారు. ఇది డిప్రెషన్ వ్యాధితో కలిసి ఉంటుంది. బాధలో ఉన్నా, సంతోషంలో ఉన్నా వీరిలో తినే పరిమాణం ఇంకా పెరుగుతుంది. వీరిలో జీవననాణ్యత తక్కువ. దీనివల్ల విపరీతంగా బరువు పెరిగిపోతారు. రక్తపోటు విపరీతంగా పెరుగుతుంది. కండరాలు, ఎముకల రుగ్మతలు, గుండెజబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువ.

ఆర్థోరెక్సియా నర్వోజా

ఇది సరైన ఆహారం తీసుకోవాలనే తపన నుంచి వచ్చిన రుగ్మత. అంటే ఈ రుగ్మతలో అన్నీ ఆరోగ్య సంబంధమైన సందేహాలే ఉంటాయి. తాము తిన్నది సరైన ఆహారమైనా సరే, అది సమతులాహారమేనా, శుభ్రమైనదేనా లాంటి అనేక సందేహాలు పట్టిపీడిస్తుంటాయి. ఆరోగ్యకరమైన పరిమాణంలోనే తింటున్నామా లేక ఎక్కువగానో తక్కువగానో తింటున్నామా అనే డైలామాలో పడి అసలు తినడం మానేస్తుంటారు ఒక్కోసారి. దీంతో వారు తిండి విషయంలో చాలా కఠిన నియమాలు ఆచరిస్తుంటారు. ప్రతీదీ తినేటప్పుడు దాని ఆరోగ్య విలువలూ, పోషకాలూ వంటి వాటిని లెక్కలేసుకుని తింటుంటారు. ఫలానా పదార్థం ఆరోగ్యానికి మంచిది కాదని తెలిస్తే జిహ్వా చాపల్యాన్ని కఠినంగా నియంత్రించుకుంటారు. ఇటీవల ఆరోగ్య స్పృహ మరీ ఎక్కువగా పెరగడంతో ఈ పిచ్చి పరాకాష్టకు చేరినందువల్ల వచ్చిన అనర్థమే ఇది. ఆరోగ్యం కోసం మంచి నియమాలు పాటించడంలో తప్పులేదు కానీ అదేపనిగా ఆరోగ్యం గురించే ఆలోచిస్తూ ఒకరకమైన నిస్పృహ , న్యూనతకూ గురై ముప్పుతెచ్చుకోవడం సరికాదు. అందుకే కాబోలు మన పెద్దలు అతి ఎప్పుడూ అనర్థదాయకమే అంటుంటారు.

వస్తువుల్ని తినేస్తున్నారా?

ఎక్కువగా పిల్లలు, కొందరు పెద్దలు కూడా బలపాలు, ప్లాస్టిక్, మట్టి వంటి వాటిని నోటిలో పెట్టుకుని రుచి చూస్తుంటారు. ఈ రుగ్మతను పైకా అంటారు. అయితే ఇలా ఆహారం కాని పదార్థాలను రుచి చూసే అందరికీ పైకా ఉందని చెప్పడం సాధ్యం కాదు. ఆ అలవాటుతో పాటు ప్రవర్తనకు సంబంధించిన మార్పులు, పెరుగుదల లోపాలు ఉన్న సందర్భాల్లో మాత్రమే దాన్ని ఒక రుగ్మతగా పరిగణించాలి. ఈ సమస్య ఎక్కువగా పిల్లలో కనిపిస్తుంది. పెద్దల్లో ఈ రుగ్మత తక్కువే. ఇది ఉన్న వాళ్లు బియ్యంలో మట్టి గడ్డలు, ఇసుక, పిండి, పేపర్ ముక్కలు లాంటి అనేక రకాల వస్తువులు నమలడం, తినడం చేస్తుంటారు. అలా ఎందుకు చేస్తుంటారనడానికి కారణాలు చెప్పడం కష్టం. కొన్ని సందర్భాల్లో బలమైన అనుబంధాలు లేనందువల్ల, కుటుంబ పరమైన సమస్యలతో మానసికంగా ఒత్తిడికి లోనయ్యే పిల్లల్లో ఈ తరహా రుగ్మతలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అంతేకాక ఐరన్, కాల్షియం, జింక్, థయమిన్, విటమిన్ సి, విటమిన్ డి వంటి లోపాలు ఉన్నప్పుడు కొన్ని ఖనిజలవణాల లోపాలు ఉన్న పిల్లలు లేదా పెద్దల్లో ఈ తరహా రుగ్మతలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సరైన పోషకాహారం కనుక వారికి అందిస్తే ఈ సమస్య నుండి బైటపడే అవకాశాలున్నాయి.

తొలి రెండు స్థానాలు మనవే

అధిక బరువులో తెలంగాణ పట్టణ మహిళలదే దేశంలో రెండో స్థానం. ఆంధ్రప్రదేశ్ పట్టణ మహిళలు ప్రథమ స్థానంలో నిలిచారు. ఏపీ పట్టణాల్లో 45.6 శాతం మంది మహిళలు అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నారు. అక్కడి పురుషులు కూడా 44.4 శాతం ఊబకాయంతో ముందు వరసలో ఉన్నారు. ఆ తర్వాత రెండో స్థానంలో తెలంగాణా ఉంది. దేశంలో మేఘాలయలో అత్యంత తక్కువగా 18.4 శాతం మంది పట్టణ మహిళలు, 17.1 శాతం పట్టణ పురుషులు ఊబకాయం బారిన పడ్డారు. దేశవ్యాప్తంగా పట్టణ మహిళలే అధికంగా స్థూలకాయంతో బాధపడుతున్నట్లు 2015 -16 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో తేలింది.

ఇవి తినేరు జాగ్రత్త

పిజ్జా, చాకోలేట్, ఐస్‌క్రీం, ఫ్రెంచ్‌ఫ్రైస్ వంటివి ఎంత టేస్టీగా ఉంటాయో! అనుకుంటున్నారా! అయితే మీరు జాగ్రత్త పడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నమాట. ఓ ప్రత్యేక పద్ధతిలో తయారయ్యే ఇలాంటి ఫుడ్ ఐటమ్స్‌తో ఈటింగ్ డిజార్డర్స్ వచ్చే ప్రమాదం ఉంది. ఇలాంటి ఆహారం ఎంత తగ్గిస్తే ఆరోగ్యానికి అంతమంచిదంటున్నారు వైద్యులు. వీటిని తరచుగా తినేవాళ్లు ఫుడ్ అడిక్టివ్స్ అయినట్టే అంటోంది అమెరికాలోని న్యూయార్క్ ఒబేసిటీ రీసెర్చ్ బృందం. ఇలాంటి ఆహార పదార్థాలు తినడం వల్ల ఈటింగ్ డిజార్డర్ వచ్చే అవకాశం ఉందంటోంది. కామన్ అడిక్టివ్ ఫుడ్స్ అనే అంశంపై యూనివర్సిటీ ఆఫ్ మిచిగాన్, కొలంబియా యూనివర్సిటీకి చెందిన న్యూయార్క్ ఒబేసిటీ రీసెర్చ్ సెంటర్ చేసిన సర్వేలో ఈ నిజం బయటపడింది. అత్యంత అడిక్టివ్ ఫుడ్‌గా చాక్లెట్, పిజ్జాలను తేల్చింది ఈ సర్వే.

- నివేదిత

ఫాస్ట్‌ఫుడ్ మాయాజాలం

దీర్ఘకాలం పాటు ఒత్తిడికి లోనైన వారిలో అతి తిండి కూడా కనిపిస్తుంది. ఇక ఫాస్ట్‌ఫుడ్ సంస్కృతికి ఎక్కువగా బలవుతున్న వారిలో టీనేజ్ పిల్లలు ఉన్నారు. ఆడపిల్లల కంటే మగపిల్లల సంఖ్య మరీ ఎక్కువ. ఎక్కువ ఫ్యాట్ ఉండే ఫాస్ట్‌ఫుడ్ తినడం ఓ మత్తుమందు లాంటిదట. ఒకరోజు తింటే ప్రతీరోజూ అదే సమయానికి అదే కావాలనిపిస్తుంది. దీనివల్ల ఆరోగ్యం పాడైపోవడంమాట అటుంచి మానసిక ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. న్యూట్రిషన్ రీసెర్చ్ అండ్ ప్రాక్టీస్ సంస్థ హైస్కూల్ పిల్లలపై జరిపిన పరిశోధనలో వెల్లడైన ఈ అంశం సంచలనం రేకెత్తించేదిగా ఉంది. ఫాస్ట్‌ఫుడ్ తీసుకునే పిల్లల్లో ఆలోచనాత్మక ఆచరణ అతి తక్కువ స్థాయిలో ఉందట. అంటే పిల్లల మానసిక ఎదుగుదలను ఫాస్ట్‌ఫుడ్ చంపేస్తుంది.

మదరిండియా 2

-వక్కంతం సూర్యనారాయణరావ్, సెల్:98662 67287

"అమ్మ ఒక ప్రతిపాదన పెట్టింది" ఏకాంత్ గుర్తు చేసుకుంటూ అన్నాడు.

"ఏమిటది?"

"హోమ్ పార్లమెంట్!" ఏకాంత్ బలహీనంగా నవ్వాడు. 'అందరి అభిప్రాయాలూ తెలుస్తాయి. మెజారిటీ..'.

"మన విషయంలో నీ తమ్ముళ్ళూ చెల్లెలూ ఎలా రియాక్టవుతారు?"

"ఏ విషయమైనా ఒక్కటే. వాళ్ళందరికీ అమ్మమాటే వేదం. అమ్మ మాట లక్ష్మణరేఖ!" ఏకాంత్ చిరునవ్వు నవ్వే ప్రయత్నం చేశాడు.

ఆర్డరిచ్చిన వాటిని వాళ్ళ ముందు పెట్టి సర్వర్ వెళ్ళిపోయాడు.

ఏకాంత్ ముఖంలోకి తదేకంగా చూసింది రంజన. "ఈ లోకంలో అతి మెత్తనైన వస్తువేదో నీకు తెలుసా ఏకాంత్?"

ఏకాంత్ కళ్ళు చిట్లించాడు. "జనరల్ నాలెడ్జిలో - ఈ ప్రశ్న ఎప్పుడూ, ఎక్కడా తగల్లేదు!"

"అమ్మ మనసు!" రంజన నవ్వుతూ అంది.

ఏకాంత్ విరక్తిగా నవ్వాడు. "మా అమ్మ విషయంలో నీ అభిప్రాయం నిజం కాకపోవచ్చు. అమ్మకు వచ్చినవన్నీ కష్టాలే. తగిలినవన్నీ ఎదురుదెబ్బలే. మమ్మల్నందర్నీ ఇంత ఉన్నత చదువులు అమ్మ ఎలా చదివించగలిగిందో నాకు ఇప్పటికీ అర్థం కాదు"

"రిమార్కబుల్ కదూ?"

"ఔను. చిన్నప్పుడు అమ్మ మాకు కొన్ని భర్తృహరి సుభాషితాలు నేర్పించింది. అందులో ఒక శ్లోకం ఇప్పటికీ నాకు గుర్తే. 'సంపదలున్నప్పుడు గొప్ప వాళ్ళ మనసు కుసుమ కోమలంగా - పువ్వులాగా మెత్తగా ఉంటుది. ఆ మనసే ఆపదల్లో కఠిన శిలగా మారిపోతుంది! అదే ఆ శ్లోకార్థం".

"గొప్పగా ఉంది!" రంజన అంది.

"అమ్మ మనసు పువ్వులా కోమలంగా ఉండేదేమో! నాన్న పోయాక అది కఠినశిలగా మారిపోయినట్టుంది. లేకపోతే అమ్మ ఇంత సాధించి ఉండేది కాదు!"

రంజన ఏకాంత్ కళ్ళలోకి చూసింది. 'ఒక సంగతి చెప్పనా? నా దృష్టిలో ఈ సూక్తి అమ్మ మనసుకు వర్తించదు! అమ్మ మనసు వెన్న. అది ఎప్పటికీ గట్టిపడదు!"

"మా అమ్మ సంగతి నీకు తెలీదు"

"తెలుసుకుంటాను" రంజన సీరియస్‌గా అంది. "ఇందాక నువ్వు చెప్పిన సుభాషితాన్ని నాకు అప్లై చేసుకుంటాను. నిన్ను ప్రేమిస్తున్నాను. పెళ్ళాడాలనుకుంటున్నాను. దానికి ఆటంకాలనే ఆపదలు ఎదురయ్యేలా ఉన్నాయి. ఇప్పుడు నా మనసును కఠిన శిలగా మార్చుకుంటాను!"

ఏకాంత్ అయోమయంగా చూశాడు. "ఇందాకా అమ్మ మనసు వెన్న అనీ ఆ సూక్తి 'అమ్మ'కు వర్తించదనీ అన్నావు! నువ్వూ ఆడదానివే, రంజనా!"

"నేను ఆడదాన్నే. అయితే ఇంకా నేను 'అమ్మ' కాలేదు!' రంజన గంభీరంగా అంది.

ఏకాంత్ కనుబొమలు ముడివేశాడు. నుదురు మీద గీతలు ఏర్పడ్డాయి. "రంజనా... ఏం చేస్తావు"

"చెప్పను. చేసి చూపిస్తా".

•••

నిగమ భర్త ఫోటో ముందు నిలుచుంది. ఏకాంత్ తెచ్చిన సమస్యకు సమాధానం చెప్పమని



జరిగిన కథ

భర్త మరణించినప్పటికీ అతడి స్ఫూర్తితో ముగ్గురు కొడుకుల్నీ, కూతుర్నీ నీతీ నిజాయితీలు రంగరించి పెంచి పెద్ద చేస్తుంది నిగమ. కానీ అత్యున్నత స్థానాలకు ఎదిగిన తర్వాత ఆ కొడుకులు తండ్రి స్ఫూర్తికి భిన్నంగా అక్రమార్కులుగా మారిపోతారు. దాంతో కన్న కొడుకులకు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తుందా కన్నతల్లి. అమ్మతనాన్ని వదులుకోవడానికి సిద్ధపడటంతో న్యాయస్థానం విస్తుపోతుంది. ఆ తర్వాత......

ఆమె హృదయం ఫోటోగా మారిపోయిన భర్తను ఏదో అందరాని లోకాలలో ఉన్న భర్తను నిస్సహాయంగా అడుగుతోంది. భర్త పోయాక నిస్సహాయురాలైన తను పిల్లల కోసం అసహాయురాలిగా రూపొందింది. ఇప్పుడు ఆ అసహాయురాలిని కన్న కొడుకు నిస్సహాయురాలిగా మార్చేశాడు. జీవన పరీక్షలు ఎదుర్కోడానికే ఈ నిగమ జన్మించిందా?

డోర్ బెల్ మోగి, ఆమె ఆలోచనల్ని చెల్లా చెదురు చేసింది. కళ్ళను పొరల్లా కప్పిన తడిని చీర చెంగుతో తుడుచుకుంటూ నిగమ గుమ్మం వైపు నడిచింది. తలుపు తెరిచింది. గుమ్మంలో నిలబడ్డ యువతిని ప్రశ్నార్థకంగా చూసింది.

"ఎవరమ్మా? ఎవరు కావాలి?"

"మిసెస్ నిగమగారు..." యువతి చిరునవ్వుతో అంది.

"నేనే"

"లోపలికి రావచ్చా? నేను... ఏకాంత్ తల్లి గారితో మాట్లాడానికి వచ్చాను."

"నువ్వు...."

"నా పేరు రంజన. మా అమ్మ పేరు సుగుణ. నాన్న పేరు రాజవర్మ. ఆయన గురించి మీకు తెలుసు"

నిగమలో ఏదో సంకుల సమరం ప్రారంభమైంది. ఏకాంత్ రంజనను తన మీద ప్రయోగిస్తున్నాడా? రంజన తననే చూస్తోంది.

"ఏకాంత్ లేడు"

రంజన చిన్నగా నవ్వింది. "నేను ఏకాంత్ కోసం రాలేదు. రాను కూడా! ఏకాంతే నా కోసం వస్తుంటాడు. నేను కేవలం మీ కోసం వచ్చాను. నేనొస్తున్నట్టు ఏకాంత్‌కి తెలీదు. ఊహించలేడు కూడా!" రంజన చకచక చెప్పుకు పోయింది.

నిగమ అప్రయత్నంగా రంజనను ఎగాదిగా చూసింది. అనార్కలి డ్రెస్సులో అందంగా వుంది. కొద్దిగా పొడవైనా, దశాబ్దాల క్రితం అనార్కలి పాత్రలో జీవించిన నటి మధుబాలను గుర్తుకు తెస్తోంది రంజన.

నిగమ ఆలోచనల్లోంచి తేరుకుని తలుపు బార్లా తెరిచింది. మౌనంగా లోపలికి నడవసాగింది. తలుపు మూసిన చప్పుడు. రంజన లోనికివచ్చి తలుపు మూసినట్టుంది. నిగమ సోఫా వద్ద ఆగి, రంజన వైపు తిరిగింది.

"కూర్చోమ్మా."

"థాంక్సాంటీ" రంజన కూర్చుంటూ అంది. "మీరు నన్ను ఇంట్లోకి రానివ్వరేమో అని భయపడ్డాను. నిజం చెప్తున్నందుకు క్షమించండి."

"గడప ముందుకి వచ్చిన శత్రువును కూడా ఆహ్వానించి, ఆదరించే సంస్కృతి మనది" నిగమ అంది.

"ఆహ్వానించిన మీరు ఆదరిస్తారనే నమ్ముతున్నాను." రంజన చిరునవ్వుతో అంది.

నా మనసులో ఏముందో మీకు తెలుసు. మీ మనస్సులో ఏముందో నాకు తెలుసు. ఆ విషయాలు చర్చించే అవసరమూ, అర్హతా నాకు లేవు. మా నాన్న తప్పు చేశాడు. దానికి క్షమాపణ అడగాల్సింది ఆయనే ఆయన కూతురు కాదు. నేను మిమ్మల్ని కోరేది ఒక్కటే. రంజనను కేవలం రంజనగానే చూడండి. మీ అబ్బాయిని ప్రాణంలా ప్రేమిస్తున్న యువతిగానే చూడండి. రాజవర్మ కూతురుగా మాత్రమే చూడకండి! ఎందుకంటే నేను మేజర్ని..."

నిగమ రంజన వైపు ఆశ్చర్యంగా చూసింది. "మేజర్‌వి అయినప్పటికీ నువ్వు నీ మూలాల్ని తెంచేసుకోలేవు రంజనా. తెంచుకోమని నేను చెప్పను. మానవ సంబంధాలు పవిత్రంగా ఉండాలి. అంతే. మీ నాన్న మీద కానీ, మీ కుటుంబం మీద కానీ నాకు శత్రుత్వం లేదు. ఉంటే - పగ తీర్చుకునే ఆయుధంగా నా కొడుకుల్ని తయారు చేసి ఉండేదాన్ని..."

"అలాగైతే...." రంజన ఉత్సాహంగా ఏదో అనబోయింది.

"అలాగని మీ కుటుంబంతో నాకు మైత్రీ



భావన కూడా లేదు. మీ మీద నాకు పగా లేదు; ప్రేమా లేదు. మీ కుటుంబంతో నాకు గతంలో ఏ సంబంధమూ లేదు. సంబంధ బాంధవ్యాలు లేని ఒక వ్యక్తి స్వార్థానికి నా భర్త బలైపోయారు. నిజం చెప్పాలంటే, అలాంటి వ్యక్తితో సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకోవాలన్న కోరిక నాకు లేదు."

"ఆంటీ, దాపరికం నాకు నచ్చదు. ఒకవైపు తల్లి ప్రేమ, ఒక వైపు ప్రేయసి ప్రేమ. ఈ రెంటి మధ్యా ఏకాంత్ నలిగిపోతున్నాడు.

నిగమ చిన్నగా నవ్వింది. "తల్లి ప్రేమ గర్భం లోంచీ బిడ్డతో పాటు పుడుతుంది. ప్రేయసీ ప్రియుల ప్రేమ గర్భంలోకి చేరడానికి పుడుతుంది. గర్భస్థ శిశువు జన్మించి, శరీరాలు వేరయ్యాక ఉద్భుతిగా జన్మించేది తల్లి ప్రేమ. శరీరాలు ఐక్యం కావాలన్న ఉద్భుతితో జన్మించేది ప్రేమికుల ప్రేమ. తల్లి ప్రేమ సున్నితం. సూక్ష్మాతిసూక్ష్మం. ప్రేయసీ ప్రియుల ప్రేమ స్థూలం. శారీరక వాంఛలు పెనవేసిన పగ్గం అది. తల్లిప్రేమ సున్నితమైన పట్టుదారం. పగ్గం ముందు దారం ఆగదు, రంజనా!"

రంజన అర్థం కానట్టు చూసింది. "పగ్గంతో దారాన్ని జయించాలన్న స్వార్థం నాలో లేదు ఆంటీ. ఏకాంత్ ద్వారా మీ వ్యక్తిత్వాన్ని నేను అర్థం చేసుకున్నాను. నిజం చెప్తున్నాను. మా అమ్మలో మీలాంటి వ్యక్తిత్వం ఉండాలని కోరుకుంటాను నేను. ఆ కోరిక తీరదు. అమ్మ నాన్నకు నీడ. నాకు రెండు కోరికలున్నాయి. నేను ఏకాంత్‌కి భార్యకావాలి. ఇది మొదటి కోరిక. నేను నిగమ గారికి కోడలు కావాలి. ఇది రెండో కోరిక. ఒకే ఒక్క కార్యంతో రెండు కోరికలూ తీరుతాయి..."

సోఫాలోంచీ లేచి నిలుచున్న రంజనను నిగమ నిదానించి చూసింది. రంజన ఆమె వైపు చూసి చిరునవ్వు నవ్వింది.

"కృతకమైన వెలుగులోంచి సహజకాంతిలోకి రావాలనుకుంటున్నాను. నా కోరిక తీరాలని దీవించండి, ఆంటీ!" అంటూ రంజన చేతులు జోడించింది.

రంజన కోరిక నిగమను అయోమయంలో పడేసింది. ఆమె తేరుకునేలోగా తలుపు చప్పుడు చేస్తూ తెరుచుకుంది. ఇద్దరూ గుమ్మం వైపు చూశారు. ఏకాంత్ లోపలికొచ్చి, తలుపు మూశాడు. రంజనను చూసి, ఆశ్చర్యంతో అలాగే నిలుచుండిపోయాడు.

"హాయ్....ఏకాంత్!" రంజన నవ్వుతూ అంది.

"రంజనా...నువ్వు...ఇక్కడ?"

"సారీ ఏకాంత్. ఇక్కడికి వస్తున్నట్టు నీకు చెప్పలేదు. రావడానికి నీ పర్మిషన్ తీసుకోలేదు."

ఏకాంత్ బెరుకుగా తల్లి వేపు చూశాడు. "అమ్మా...రంజన చెప్పేది..."

"నిజం! నాకు తెలుసు!" నిగమ నవ్వుతూ అంది. "మొదట్లో గుమ్మంలో ప్రత్యక్షమైన రంజనను చూడగానే నా మీదికి నువ్వే ప్రయోగించి ఉంటావని అనుకున్నాను. నా అనుమానానికి అర్థం లేదని రంజన మాటల్లో అర్థం చేసుకున్నాను."

ఏకాంత్ తేలిగ్గా నిట్టూర్చాడు. నిలబడే వున్న రంజన వైపు ఒకసారి చూసి, అమ్మ వైపు తిరిగాడు. "అమ్మా రంజనకు కాఫీ ఇష్టం. మేం కాఫీ తాగిన ప్రతీసారీ నువ్వు చేసే ఫిల్టర్ కాఫీ గురించి చెప్తూ ఉంటాను!"

"ఇద్దరికీ కాఫీ తెస్తాను!"ఏకాంత్ అభిప్రాయం గ్రహించి నిగమ అంది.

రంజన సోఫాలో కూచుంది. ఏకాంత్ వచ్చి, ఆమె ఎదురుగా కూచున్నాడు.

"నువ్వింత సాహసం చేస్తావనుకోలేదు!" అన్నాడు నవ్వుతూ, "అమ్మకు ఏం చెప్పావు? అమ్మ ఏమంది?"

రంజన పూసగుచ్చినట్టు తామిద్దరి మధ్య జరిగిన సంభాషణను వల్లించింది. ప్రెజెంటేషన్ పూర్తయింది. జడ్జిమెంట్ రావాలి!" అంది నవ్వుతూ.

•••

ఏకాంత్, సాకేత్, సంకేత్ సోఫామీద పక్కపక్కనే కూచున్నారు. వాళ్ళ ఎదురుగా నిగమ, ఆమె దగ్గరగా నిశితా కూచున్నారు. పెద్దవాళ్ళూ, ప్రయోజకులూ అయిన కొడుకుల్ని నిగమ గర్వంగా చూస్తూ ఉండి పోయింది. ఏకాంత్ త్వరలో కలెక్టర్ కాబోతున్నాడు. సాకేత్ ముంబాయిలో అమెరికన్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పెద్ద ఉద్యోగమే చేస్తున్నాడు. సంకేత్ హౌస్‌సర్జన్ పూర్తి కావస్తోంది.

"అమ్మా..." ఏకాంత్ పిలుపు నిగమను హెచ్చరించింది.



ఆత్మాభిమానం మెండుగా ఉన్న స్త్రీ నిగమ. పిల్లలందరితో ఇంట్లోనే సమావేశం ఏర్పాటు చేసింది. పెద్ద కొడుకు ఏకాంత్ తెచ్చిన సమస్యపై వాళ్ళంతా తమ తమ అభిప్రాయాలు చెప్పారు. మరి తన భర్తపై అవినీతిపరుడనే ముద్రవేసి జైలుకుపంపి అతడి మరణానికి కారణమైన వ్యక్తితో ఆమె వియ్యమొందేందుకు సిద్ధపడిందా? తమ కుటుంబ శత్రువును ఆమె కొడుకులు, కూతురూ సమర్థించారా? వ్యతిరేకించారా?

ఆలోచనల్లోంచి దిగి వచ్చిన నిగమ చిరునవ్వు నవ్వింది. "నా బిడ్డల్ని చూస్తూ ఉంటే, అన్నీ మరిచిపోతాను.. ఏదైనా సమస్య వస్తే సమిష్టి నిర్ణయం తీసుకోడం మనం పాటించే విధానం. ఇప్పుడు ఏకాంత్ మూలంగా ఒక సమస్య మన ముందు నిలబడింది. ఏకాంత్, రంజన అనే యువతిని ప్రేమిస్తున్నాడు. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడు. రంజన రాజవర్మ కూతురు. రాజవర్మ మీ నాన్నగారిని అవినీతి కేసులో ఇరికించి, ఆయన మరణానికి కారణమయ్యాడు..."

"అమ్మా... అదంతా దశాబ్దాల గతం!" ఏకాంత్ అడ్డొస్తూ అన్నాడు.

"అవును ఏకాంత్. అదంతా గతం. మీ కోసం... నా సంతానం కోసం నేను నా జ్ఞాపకాల పొరల అడుగున పూడ్చిపెట్టిన గతం. నీ ప్రేమ ఆ గతాన్ని తవ్వి, వర్తమానంలో ఒక ప్రశ్నార్థకంగా మార్చింది!" నిగమ గంభీరంగా అంది.

"అమ్మా... అన్నయ్య ప్రేమ తవ్వితీసిన గతాన్ని శాశ్వతంగా పూడ్చిపెట్టేద్దాం!" సాకేత్ అన్నాడు.

నిగమ ఆశ్చర్యంగా చూసింది. ఎంత చిన్నవిషయమైనా అదే పనిగా, కూలంకషంగా చర్చించే పట్టుదల సాకేత్ సొంతం. అతనిలో ఆ పట్టుదల, పట్టు సడలిందా?

"సాకేత్ విషయం పూర్తిగా వినకుండానే తేల్చేస్తున్నావ్!" నిగమ సాకేత్ కళ్ళల్లోకి చూస్తూ అంది.

"చెప్పావుగా అమ్మా? రంజన ఎవరో చెప్పావు. రాజవర్మ ఎవరో చెప్పావు. ఏకాంత్ కోరికేమిటో చెప్పావు. సమస్య అర్థమైపోయింది పూర్తిగా విన్నట్టే!" సాకేత్ చిన్నగా నవ్వాడు.

"సరే..." నిగమ తలపంకిస్తూ అంది. "అర్థమైవుంటే, నీ అభిప్రాయమేమిటో చెప్పు!"

"ఎన్నో మంచిగుణాలు మాకు రంగరించి పోశావు. క్షమాగుణం నేర్పావు. పగలూ, ప్రతీకారాలూ మంచివి కావని బోధించావు. ఇవన్నీ మా వ్యక్తిత్వాల్ని సానబట్టాయి. నా ప్రశ్న ఒక్కటే. రాజవర్మ చేసిన పనికి, ఆయన కూతుర్ని ఎందుకు శిక్షించాలి?"

"సాకేత్, ఇంతవరకూ, నా జీవితంలో ఎవరినీ శిక్షించమని నేను అనలేదు!" నిగమ సీరియస్‌గా అంది.

"ఆమెను నేను స్వీకరించకపోతే శిక్షించడమే!" ఏకాంత్ అన్నాడు. అతని కంఠంలో అసహనం పలికింది.

“అమ్మా... రాజవర్మను క్షమించడం మంచిది కాదా? క్షమించడం అనేది గొప్ప విషయం కాదా?” సంకేత్ మొదటిసారిగా నోరు విప్పాడు.

“ఎవర్నయినా సరే, నీ కోసం కాకుండా, నీ స్వార్థం కోసం కాకుండా ‘ఆ వ్యక్తి కోసం క్షమించడం గొప్ప విషయమే. అదే నిజమైన క్షమా గుణం. ఏకాంత్ రాజవర్మను క్షమించమంటున్నాడు. రాజవర్మను నా కొడుకు తన ప్రేమ కోసం, పెళ్ళికోసం కాకుండా - రాజవర్మ కోసమే క్షమిస్తే అది చాలా చాలా గొప్ప విషయం!” నిగమ అందర్నీ కలియజూస్తూ అంది.

ఏకాంత్ అయోమయంగా చూస్తూ సాకేత్ చేతి మీద తన చేతిని వేశాడు.

“అమ్మా ఏకాంతన్నయ్యతో నేను లోతుగా చర్చించాను. రంజన అన్నయ్యకు ఆరో ప్రాణం. ఆమెకు అన్నయ్యా అంతే. ఇద్దరూ దంపతులు కాకపోతే ఏమైపోతారో అన్న భయం కలుగుతోంది నాలో..” సాకేత్ తల్లి వైపే చూస్తూ అన్నాడు.

“అమ్మను మరో భయం కూడా పట్టి పీడిస్తోంది” నిశిత అన్నల వైపు చూస్తూ అంది. రాజవర్మ కోటీశ్వరుడు. అతనిది అంతులేని ధనదాహం. స్వార్థం కోసం అతను ఏ అన్యాయమైనా చేస్తాడు. కలెక్టరుగా ప్రజలకు సేవ చేయాల్సిన తన కొడుకు ఒక అవినీతిపరుడికి అల్లుడై తాను కూడా పతనమైపోతాడేమో అన్న భయం అమ్మది.”

“అమ్మను మాత్రమే కాదు, అందర్నీ పీడించే అనుమానమే అది!” సంకేత్ కల్పించుకుంటూ అన్నాడు. “ఏకాంత్ పర్సనల్ విషయం అది. అనుమానాలనూ, భయాలనూ నివృత్తి చేయాల్సింది పెద్దన్నయ్యే!”

ఏకాంత్ కూచున్న చోటునుంచి లేచాడు. తల్లి పాదాల వద్ద నేల మీద కూచున్నాడు. తల పైకెత్తి, తల్లి ముఖంలోకి చూశాడు. “ఈ ఏకాంత్ నీ రక్తం పంచుకుపుట్టిన నీ కొడుకమ్మా! లోకంలో ఏ వ్యక్తీ, ఏ శక్తీ ఏకాంత్‌ని పతనం వైపు లాగలేదు! నువ్వు నాలో నాటిన ‘నీతి’ని రంజన తండ్రి అవినీతి కలుషితం చేయలేదు! ఆయన నీ కొడుకును మార్చలేడు. నీ కొడుకే ఆయన్ని మారుస్తాడు!

నిగమ నిట్టూరుస్తూ ఏకాంత్ తల నిమిరింది. “మీ నాన్న జీవించి వుంటే, తనకి ఇలాంటి సమస్య ఎదురై ఉంటే ఏం చేసేవారో తెలీదు. ఏ విధంగా స్పందించి ఉండేవారో తెలీదు. ఈ జన్మకి, ఈ నిగమకి స్ఫూర్తి ఆయనే. ఆ స్ఫూర్తిని గుండెల్లో నింపుకుని, వ్యక్తిగతమైన వ్యతిరేకతను దిగమింగుతున్నాను సాకేత్; సంకేత్ నిశితా తమ అభిప్రాయాలు చెప్పిన తర్వాత, నా నిర్ణయం చెప్తాను.”

“అన్నయ్య రంజనను చేసుకోవడం నాకు ఇష్టమే!” సాకేత్ ఉత్సాహంగా అన్నాడు.

“నాకు అభ్యంతరం లేదు!” సంకేత్ అన్నాడు

“అమ్మ వ్యతిరేకత లేదంది కాబట్టి, నేనూ ఓటేస్తున్నా!” నిశిత జాగ్రత్తగా అంది.

నవ్వు ముఖాలతో తననే చూస్తున్న కొడుకుల్నీ కూతుర్నీ నిగమ కలియచూసింది.

“ఏకాంత్, రంజన ఈ ఇంటి కోడలవుతుంది!” అంది నిగమ.

•••

రంజన ఏకాంత్ భార్య అయింది. అయితే, నిగమ అన్నట్టు ఆ ఇంటికోడలు కాలేదు. కారణం? రంజన పెళ్ళయ్యాక అప్పగింతల సందర్భంలో తప్పించి అత్తారింట్లో అడుగుపెట్టలేదు. అప్పగింతలు అవగానే కూతుర్నీ, అల్లుణ్ణీ రాజవర్మ హనీమూన్ పంపేశాడు. పారిస్, వెనిస్...వగైరా విదేశీ విలాస నగరాలు.

హనీమూన్ నుంచి తిరిగొచ్చాక వధూవరులు ఇంటికి ఇలా వచ్చి, అలా వెళ్ళిపోయారు. ఏకాంత్ ఉద్యోగ కార్యక్రమం మీద హుటాహుటిన న్యూఢిల్లీ వెళ్ళాడు. అమ్మకు చెప్పి, తను తిరిగొచ్చేదాకా రంజన పుట్టింట్లో ఉంటుందంటూ, ఆమెను పుట్టింట్లో దింపేశాడు.

“అమ్మా, వదిన మనింటికి కాపురానికి రాలేదేం?” నిశిత అడిగింది తల్లిని.

నిగమ విరక్తిగా నవ్వింది. “ఏకాంత్ రంజన తన భార్య కావాలనుకున్నాడు. ఈ ఇంటి కోడలు కావాలని అనుకోలేదేమో!”

“అమ్మా...?”

“జీవితాన్ని ప్రాక్టికల్‌గా చూడ్డం నాకు అలవాటైపోయింది నిశితా!” నిగమ చిరునవ్వుతో అంది. “తల్లిదండ్రులకి రంజన ఒక్కతే కూతురు. వాళ్ళ ఒక్కగానొక్క గారాబాల కూతుర్ని వదిలి ఉంటారని నేను అనుకోను. వాళ్ళు పంపితే గానీ రంజన రాదు. రంజన వస్తేగానీ నీ అన్న తీసుకురాలేడు.”

నిశిత ఆందోళనగా చూసింది. “అయితే అన్నయ్య ఎక్కడుంటాడు?”

“అక్కడా వుంటాడు, ఇక్కడా వుంటాడు” నిగమ సాదాగా అంది. “ఇదంతా ఒక తల్లిగా నా ఊహ మాత్రమే సుమా! ‘పెళ్ళవగానే కొడుకు పెళ్ళాం కొంగు పట్టుకుని తిరుగుతూ తనని నిర్లక్ష్యం చేస్తాడని తల్లి అనుకుంటుంది’ అన్నారు మానసిక నిపుణులు!! నేను కూడా తల్లినే కదా!”

“రాగానే అన్నయ్యను అడిగేస్తాను!” నిశిత ఆవేశంగా అంది.

నిగమ నవ్వింది. “పిచ్చిపిల్లా, ఊహల ఆధారంగా మనిషి స్పందించడం సరికాదు. చూద్దాం. కొత్త దంపతులు కదా! రంజన కొత్తకోడలు. పుట్టి పెరిగిన ఇంటి మీద మమకారం కట్టి పడేస్తుంది! రేప్పొద్దున పెళ్ళయితే నువ్వూ నన్ను అంటిపెట్టుకునే ఉండాలనుకుంటావ్!”

నిశిత కళ్ళు పెద్దవి చేసి చూసింది. నిగమ కూతుర్ని తదేకంగా చూస్తూ చిరునవ్వు నవ్వింది.

“మూడు ముళ్ళూ పడగానే మొగుడితో వెళ్ళిపోతావా?”

నిశిత మాట్లాడకుండా అమ్మ దగ్గరగా జరిగింది. రెండు చేతుల్నీ ఆమె మెడ చుట్టూ వేసి, తన చెంపతో అమ్మ చెంపను సున్నితంగా నొక్కింది. “అమ్మా” నిశిత గుసగుసగా అంది. “నిన్ను వదిలి వెళ్ళలేనే! నేను నేను...ఇల్లరికం మొగుణ్ణి తెచ్చుకుంటా!”

అనుష్క సన్యాసం తీసుకోనుందా?

నిజంగా కాదులెండి! ఓ బయోపిక్ సినిమాలో అనుష్క సన్యాసినిగా నటించబోతోందట! గ్లామర్ హీరోయిన్‌గా అందాలు ఆరబోసి, హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాలకి కేరాఫ్ అడ్రస్‌గా మారిన అనుష్కను ఆమె అభిమానులు సన్యాసినిగా ఆదరిస్తారా? అన్న అనుమానం ఓ వైపు ఉన్నా, అనుష్క నటన అందరినీ ఆకట్టుకుంటుందన్న నమ్మకాన్ని ఆ సినిమా దర్శకనిర్మాతలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రెండు మూడు సినిమాల్లో అనుష్క బిజీగా ఉందనీ, అవి పూర్తి కాగానే తమ సినిమా షూటింగ్‌లో పాల్గొంటుందని వారు చెబుతున్నారు.

“ఇల్లరికమా!” నిగమ కూతురు తల నిమురుతూ అంది. ఆమె కంఠంలో ఆశ్చర్యం, ఒక విధమైన ఆనందం లీలగా ధ్వనించాయి.

•••

“ఇల్లరికమా!?” ఏకాంత్ నిర్ఘాంతపోతూ అరిచాడు.

“ఆ ఇల్లరికమే!” రంజన అంది.

“పిచ్చి పట్టిందా?”

“పిచ్చి అనేది పట్టి వుంటే, నాక్కాదు; నాన్నకు పట్టి వుంటుంది! ఎందుకంటే ఇల్లరికం ఐడియా ఆయనదే!” రంజన చిన్నగా నవ్వింది.

ఏకాంత్ తటాలున మంచం మీద నుంచి లేచి, నిటారుగా కూచున్నాడు. “నో! నో! దిసీజ్ మ్యాడ్‌నెస్! అమ్మ గుండె పగిలిపోతుంది! అలాంటి ఆలోచన పెట్టుకోవద్దనీ, అలాంటి ఆశలు అల్లుకోవద్దనీ మీ నాన్నకు చెప్పు!”

“చెప్పాను. అమ్మ కూడా చెప్పింది. మా మాటలు మా నాన్న మీద రాతి బండ మీద రబ్బరు సుత్తి దెబ్బల్లా పని చేశాయి”

“రంజనా” ఏకాంత్ నీరసంగా అన్నాడు.

రంజన రెండు అరచేతుల్నీ ఏకాంత్ ఛాతీ మీద బోర్లించి, అతన్ని మంచం మీద వెల్లకిలా తోసింది. పక్కనే కూచుని, అతని ఛాతీమీద చెంపను ఆన్చి వాలుగా పడుకుంది. ఆమె చెవికింద ఏకాంత్ గుండె వేగంగా లబ్‌డబ్ అంటోంది. తల ఎత్తి రంజన భర్త ముఖంలోకి చూసింది. ఏకాంత్ ముఖం సీరియస్‌గా ఉంది.

“ఏకాంత్, కంగారు పడిపోతున్నావ్...”

“రంజనా, ఇప్పటికే నీ కోసం పెద్ద అడ్వెంచర్ చేశా. ఆత్మాభిమానాన్నే రక్తంలా చేసుకున్న అమ్మ మనసును ఆరాటపెట్టి, ఆమె హృదయాన్ని లొంగదీశాను. తనకు భర్తను దూరం చేసిన వ్యక్తితో వియ్యం అందుకునేలా చేశాను. అమ్మ చేసిన ఆ త్యాగంతో, నేను చేసిన సాహసంతో మీ నాన్న తృప్తి పడాలి.

“అనుకున్నది సాధించేదాకా నాన్నకు తృప్తి ఉండదు! ఆయన జగమొండి!” రంజన ఏకాంత్ ఛాతీమీద తల వాలుస్తూ అంది.

ఏకాంత్ రంజనను రెండు చేతుల్తో పైకి లేపాడు. ఆమె కళ్ళల్లోకి తదేకంగా చూశాడు.

“రంజనా, నన్ను పెళ్ళాడాలన్న నీ కోరిక తీర్చడం కోసం నేను మా అమ్మను ఒప్పించాను. ఇల్లరికం విషయంలో నువ్వు మీ నాన్నను ఒప్పించాలి!”

రంజన నీరసంగా చూసింది. “సారీ ఏకాంత్. నాకు ఆ శక్తి లేదు. నాన్నది ఉడుం పట్టు”

ఏకాంత్ ముఖం బిగుసుకుపోయింది. రంజనను పక్కకి జరుపుతూ మంచం మీంచి దిగాడు. “ఓకే, రంజనా! మీ నాన్నతో నేనే మాట్లాడతాను!”

•••

అల్లుడు చెప్పిందంతా విని, రాజవర్మ గొల్లున నవ్వాడు. “ఏకాంత్ నువ్వూ, మీ అమ్మా ఇద్దరూ అమాయకులే. మీ అమ్మగారికి ముగ్గురు కొడుకులున్నారు. నాకు కొడుకులు లేరు. రంజనను చేసుకునే కుర్రాడినే కొడుకుగా భావించాలని ఏనాడో అనుకున్నాం. ఆడపిల్లలు లేని ఇంటికి వెళ్ళే అమ్మాయిని కోడలైనా, కూతురైనా నువ్వే!' అన్నట్టు, మగపిల్లల్లేని ఇంటికి అల్లుడయ్యే అబ్బాయిని అల్లుడైనా, కొడుకైనా నువ్వే నాయనా!” అంటారు”

“అది సెంటిమెంటల్ అబ్జర్వేషన్” ఏకాంత్



అడ్డు తగిలాడు.

“ఏకాంత్, నువ్వు చదువుకున్న వాడివి. ఇంటలెక్చువల్. ఒక మాట చెప్తా ఆలోచించు. నేను పెద్ద వాణ్ణయ్యాను. ఎప్పుడో అప్పుడు లోకం నుండి నిష్క్రమిస్తాను. నేను సాధించి, స్థాపించిన వర్మ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఏం కావాలి? ఎవరు చూస్తారు? రంజనా? అసంభవం! రంజన భర్తే చూసుకుంటాడు అన్న నమ్మకం నాలో, మీ అత్తయ్యలో దశాబ్దాలుగా జీర్ణించుకుపోయి వుంది. ‘మీకేం భయం వర్మగారూ! ఐఏఎస్ అల్లుడున్నాడు. అన్నీ చూసుకుంటాడు!” అంటూ అప్పుడే అనడం ప్రారంభించారు నా మిత్రులు”

“అది కాదు మామగారూ...”

“పూర్తిగా విను ఏకాంత్!” రాజవర్మ కంఠం తీవిగా ధ్వనించింది. “ఇల్లరికం అనే పేరు వల్ల మీ అమ్మగారికీ, నీ కుటుంబానికీ వచ్చే నష్టం ఏమీ లేదు! రేప్పొద్దున్న ట్రాన్స్‌ఫరై వేరే రాష్ట్రానికి వెళ్తావనుకో. రంజనను తీసుకెళ్ళవా? అక్కడ కాపరం పెట్టవా? అంత మాత్రాన తల్లికి దూరమైపోయినట్టు ఆమె అర్థం చేసుకోవాలా?”

“లేదనుకోండి. కానీ...”

“వందల కోట్ల ఆస్తిపాస్తుల్నీ, పరిశ్రమల్నీ మేధావి అయిన నీ చేతుల్లో పెట్టాలన్న ఆలోచన నాది. కొడుకు పారిశ్రామికవేత్తగా, కోటీశ్వరుడుగా ఎదగడం ఏ తల్లికి ఇష్టం ఉండదు? ఒక పని చేద్దాం. ఇల్లరికం ప్రతిపాదనతో నేనే మీ అమ్మగారి వద్ద కెళ్తాను. ఆమెను నొప్పించకుండా ఒప్పిస్తాను. ఇల్లరికం అన్నంత మాత్రాన నువ్వు నాకు అంకితం అయిపోవడం లేదనీ, కేవలం నా బాగోగులు చూసుకోడానికి నా ఇంట్లో ఉండే అల్లుడే అనీ, శాశ్వతంగా ఆమె కొడుకే అని వివరిస్తాను. ఇల్లరికం అనే ఖడ్గంతో తల్లీ కొడుకుల బంధాన్ని నేను ఖండించడం లేదని ఆమెకు నచ్చ చెప్తాను. సరేనా?” రాజవర్మ నవ్వుతూ అన్నాడు.

ఏకాంత్ కంగారుగా చూశాడు. రాజవర్మతో మాట్లాడ్డం అమ్మకి ఇష్టం లేదని తనకి తెలుసు. అమ్మ ఆస్తి ఆత్మాభిమానం. ఈయన ఆస్తి పట్టుదల. ఇద్దరికీ పొసగదు. అమ్మ తనను అపార్థం చేసుకుంటుంది.

“మీరొద్దులెండి. అమ్మతో నేనే మాట్లాడతాను”

“మాట్లాడ్డం కాదు అల్లుడూ ఒప్పించాలి. ఇది నీకు లైఫ్ టైమ్ ఛాన్స్. ఒక ఐఏయస్. నా సంస్థలకు ఛైర్మన్ అయితే ఎలా వుంటుందో ఊహించుకో!”

“అన్నీ అమ్మకు వివరిస్తాను” ఏకాంత్ బలహీనంగా అన్నాడు.

•••

నిగమ తన ఎదురుగా కూచున్న ఏకాంత్ వైపు నిదానించి చూసింది. ఏకాంత్ తల కిందికి వాలి వుంది. అపరాధం భారం అతని తల మీదికిచేరి తలను వంచినట్టుంది.

“ఇది నేను ఎప్పుడో ఊహించాను ఏకాంత్”

“అమ్మా!” ఏకాంత్ తలెత్తి చూసి, బలహీనంగా అన్నాడు.

“అయితే, ఇంత త్వరగా నీ నోటమ్మట వింటానని ఊహించలేకపోయాను” నిగమ చిన్నగా, విరక్తిగా నవ్వుతూ అంది “ఎలా ఊహించగలిగానో తెలుసా?”

ఏకాంత్ అప్రయత్నంగా తల ఎత్తి ప్రశ్నార్థకంగా చూశాడు.

“మనిషి తెచ్చే వెలుతురుతో పాటు వేడి కూడా వస్తుంది, ఏకాంత్!” నిగమ గంభీరంగా అంది. “రాజవర్మకి కొడుకులు లేరు. రంజన ఒక్కగానొక్క కూతురు. ఒక్కగానొక్క కూతురున్న తల్లిదండ్రులు అల్లుడిని ఇల్లరికం రమ్మనడం సర్వసాధారణం”

“పెళ్ళి సంప్రదింపులప్పుడు వాళ్ళు ఈ ప్రస్తావన తేలేదుగా అమ్మా” ఏకాంత్ పరోక్షంగా రాజవర్మ కుటుంబాన్ని సమర్థిస్తూ అన్నాడు.

“అవసరం లేదు! పెళ్ళయ్యాక వాళ్ళు ‘అడిగే’ స్థితిలో వుండరు. ఆజ్ఞాపించే స్టేజిలో, చెప్పే స్థితిలో వుంటారు. భవిష్యత్తులో నా కోడలి తల్లిదండ్రులు విధించే నిబంధనల్ని నేను ఆనాడే ఊహించాను. ‘రేప్పొద్దున నా కొడుకుని ఇల్లరికం ఇవ్వను’ అని నేను అనలేను! ఎందుకో తెలుసా ఏకాంత్?”

(ఇంకా వుంది)

కీళ్ళనొప్పులు వాటి కారకాలు ఆధునిక హోమియో చికిత్స...

డా. మురళి అంకిరెడ్డి
M. D (Homeo)
స్టార్ హోమియోపతి

నేటి ఆధునిక జీవనం కీళ్ళపైన మరింత ఒత్తిడి తీసుకువస్తోంది. ఎక్కువ సమయం కూర్చోవడం, తగినంత శారీరకశ్రమ లేకపోవడం, బరువు పెరగడం వంటి కారణాలు కీళ్ళజబ్బులకు పరోక్షంగా దోహదం చేస్తున్నాయి. వంశపారంపర్య కారణాల వల్ల కూడా ఈ సమస్యలు చుట్టుముట్టే అవకాశం లేకపోలేదు. శరీర రక్షణ వ్యవస్థకు సంబంధించిన లోపాలు, సమస్యలు కూడా కీళ్ళ జబ్బులనుపెంచుతాయి. వీటన్నింటికి తోడు కొన్ని రకాల వ్యాధులు, ప్రమాదాల్లో గాయపడడం వల్ల కీళ్ళు దెబ్బతిని చాలా సందర్భాల్లో అంగవైకల్యాన్ని కూడా తీసుకురావచ్చు. కీళ్ళను అవసరానికి మించి ఉపయోగించడం వల్ల కీళ్ళుబలహీనమై సమస్యలకు లోనయ్యే అవకాశం ఉంది.

నడవడమే కష్టం ఎందుకంటే?: కీళ్ళలోసమస్య ఉన్నప్పుడు మోకాళ్ళు లేదా ఇతర కీళ్ళ భాగం విపరీతమైన నొప్పి వాపు, బిగుతుగాఉండటం, నడవడానికిఇబ్బంది వంటివి బాధిస్తాయి. మెల్లమెల్లగా కీళ్ళు వాటిరూపాన్నికోల్పోవడం తో కాలు నిర్మాణంలో కూడా తేడా కనిపిస్తుంది. సకాలం లో దీనికి చికిత్స తీసుకోకపోతే అంగవైకల్యం వచ్చే అవకాశం ఉంది. కీళ్ళలో అరుగుదల నష్టం ఎక్కువైన తరువాత కీళ్ళ కదలికతగ్గుతుంది. కండరాలపటుత్వంలో అసమానతలు ప్రారంభమవుతాయి. కొన్నిరకాల పనులు చేయలేము. కూర్చోని లేచినప్పుడు మెట్లుఎక్కడం,దిగడం వంటి పనులకు చాలాఇబ్బందులు ఎదురవుతాయి. మన టాయిలెట్లుఉపయోగించడంకూడా సమస్య అవుతుంది.

ఎందుకా వాపు - కీళ్ళలో జరిగేమార్పులు: కీళ్ళుఅతుక్కునే భాగాన్ని ఆర్టిక్యులర్ కార్టిలేజ్ అంటారు. కీళ్ళసమస్య ఉన్నప్పుడు ముందుగా ఈ ఆర్టిక్యులర్ కార్టిలేజ్ నుంచే మార్పులు మొదలవుతాయి. ఏ కారణంవల్ల కీళ్ళు ప్రభావితం అయినా ఈ కార్టిలేజ్ పలుచబడి, సాగి ముడతలు పడుతుంది. కీళ్ళభాగంలో పాలుసుల మాదిరిగా ఏర్పడుతుంది. ఫలితంగా కీళ్ళ కదలికలకు అంతరాయం ఏర్పడుతుంది. దీని పక్క భాగంలోని రక్తనాళాలు ఉబ్బడం ద్వారా కార్టిలేజ్‌కు ఎక్కువగా రక్త సరఫరా జరుగుతుంది.ఈ మార్పులవల్ల ఆస్టియోఫైట్స్ ఏర్పడతాయి. సాధారణంగా ప్రతి 40 రోజులకు పాత ఎముక కణాలు చనిపోయి కొత్తవి పుడుతుంటాయి. ఆస్టియో ఆర్థరైటీస్ సమస్య ఉన్నప్పుడు ఈ కణాలు ఎముక అరిగిన దగ్గర కాకుండా వేరేచోటఏర్పడతాయి. తద్వారా ఈ ఆస్టియోఫైట్స్ కీళ్ళనురాపిడికి గురిచేస్తాయి. దీనివల్ల కీళ్ళు గట్టిపడటం, వాపు మొదలైనవి కలుగు తాయి. కీళ్ళలోపలి ద్రవం సన్ననిరంధ్రాల ద్వారా ఎముకల మధ్యకు వెళ్ళి గడ్డలుగాతయారవుతుంది. ఈకారణంగా ఎముకలోని ట్రాబిక్యులే అనే భాగానికి నష్టం వాటిల్లు తుంది. క్రమంగా కీళ్ళలోని జిగురుపదార్థం తగ్గడంవల్ల కీళ్ళుగట్టిగామారి కదలికలో ఇబ్బంది ఎక్కువ అవుతుంది.

ఆపరేషన్ లేకుండా హోమియోలోచికిత్స: కీళ్ళనొప్పులతో బాధపడుతున్నవారికి రక్తపరీక్షలు, ఎక్స్‌రే, ఎం.ఆర్.ఐ. స్కానింగ్‌ద్వారా ఏకారణం వల్ల ఏ కీళ్ళుదెబ్బతిన్నది? వ్యాధి ఏ రకమైనది అన్న విషయాన్ని నిర్ధారణ చేయవచ్చు. చాలా సందర్భాల్లో కీళ్ళనొప్పులు ముఖ్యంగా ఆస్టియోఆర్థరైటీస్ తగ్గాలంటే కీళ్ళమార్పిడి చికిత్స తప్ప గత్యంతరం లేదని భయపడుతుంటారు. కాని ఆపరేషన్‌లేకుండా జబ్బును తగ్గించగల మందులు అందుబాటులోకి తెచ్చింది.

అత్యాధునిక హోమియో వైద్యం: ఆధునిక హోమియో మందులు ఇన్‌ఫెక్షన్లు వంటి టాక్సిన్స్‌ని బయటకు పంపించి వాపును తగ్గిస్తాయి. దెబ్బతిన్న భాగానికి రక్తసరఫరా సవ్యంగా జరిగేట్లు చేసి, గాయం త్వరగా మానడానికి సహకరిస్తాయి. కండరాలను బలోపేతం చేస్తాయి. నొప్పిని, వాపునుతగ్గించడంలో తోడ్పడతాయి. ఆస్టియో ఆర్థరైటీస్ తొలిదశలోనే చికిత్స ఆరంభిస్తే దెబ్బ తిన్న కార్టిలేజ్‌నుపునరుద్ధరించగల అవకాశం హోమియో వైద్యంలో ఉంది. సమస్యను నిర్లక్ష్యంచేస్తే మాత్రం ఆపరేషన్ తప్పని పరిస్థితి ఏర్పడుతుంది.

www.starhomeo.com | సికింద్రాబాద్ । కొత్తపేట । కూకట్‌పల్లి । వరంగల్ । గచ్చిబౌలి
విజయవాడ । తిరుపతి । వైజాగ్ । రాజమండ్రి । కర్నాటక | **✆ 90300 64224**

డయాబెటీస్ - ఆయుర్వేదం

ఎవరు చెప్పారు? డయాబెటీస్ వ్యాధి ఇక జీవితాంతం సమస్య అని, ఇప్పుడు స్టార్ ఆయుర్వేద మీకొరకు తీసుకొని వచ్చింది. ప్రపంచ ప్రామాణికమైన అత్యున్నత సౌకర్యాలు కలిగిన వైద్యం. దీనితో మీ సమస్యలన్నీ పరిష్కార మవుతాయి. ఈ రోజు భారతదేశంలో ప్రతి 100 మందిలో 14 మంది డయాబెటీస్ బారిన పడుతున్నారు. ఈ వ్యాధి దుష్ఫలితాలు. విపరీత మైన దాహం. అధిక మూత్రవిసర్జన. ఆకలి ఎక్కువగా ఉండటం, ఎంత ఆహారం తీసుకున్నా శక్తి లేక పోవడం, బలహీనంగా ఉండటం. బరువు తగ్గడం, నీరసం, నిస్సత్తువ, చూపు మందగించటం, మబ్బుగా, మసకగా కనిపించటం, ఎక్కువ అలసట, కాళ్ళు లాగడం, ఏదైనా దెబ్బలు (గాయాలు) తగిలితే త్వరగా తగ్గక పోవడం. కొన్నేళ్ళ తర్వాత శరీరం లోని గుండె, మెదడు, కాళ్ళు, చేతలలోని పెద్ద రక్తనాళాలు దెబ్బ తినడం. చిన్న రక్తనాళాలు దెబ్బతిన్నందు వల్ల కంటిలోని రెటీనా దెబ్బ తినటం. నరాల బలహీనత, కళ్లుమంటలు, మానసిక, సెక్స్ సమస్యలు.నిత్యం వాడే షుగర్ వ్యాధి నిరోధక పాశ్చాత్య రసాయనాలు చర్మంమీదమచ్చలు, తలనొప్పి, జీర్ణ సంబంధిత సమస్యలకు కారణమవుతా యి. దాంతో పాటు అవాంఛిత ఫలితాలు కలగవచ్చు. కానీ ఆయుర్వేదంతో ప్రతికూల ఫలితాలుండవు. ఇది ఎంత ప్రభావ పూర్వకమో, అంత శాశ్వతంకూడా. ఇప్పుడు స్టార్ ఆయుర్వేద సరికొత్త ఫార్ములాతో మీ ముందుకు వచ్చింది. ప్రకృతిలో ఉన్న వన మూలికలనుపయోగించి, 36సం॥ల అనుభవం తో లక్షలమంది పేషెంట్లకు ఉపశమనం కలిగించిన మందులు ఇప్పుడు మీ అందుబాటు లోకి వచ్చాయి. మీరు ఎనేళ్ళ నుండి బాధపడు తున్నారు, ఇది అనువంశి కమా లేదా మానసిక ఒత్తిడి వల్ల వచ్చిందా? రోగలక్షణాలకు మీ వ్యాధి తీవత్రకు మా నిపుణులైన డాక్టర్లు అమూలాగ్రం పరిశీలించి, మందులు ఇస్తారు. ఈ మందులు మొదలు పెట్టాక వాటిని మెల్లమెల్లగా పాశ్చాత్య రసాయనిక మందులు తగ్గించబడతాయి. ఈ అత్యాధునిక ఫార్ములాతో కూడిన మందులు వల్ల మీకు సరికొత్త జీవితం ఖాయం.

డయాబెటీస్‌ను వ్యాధిగా భావించకండి. అది కేవలం మీరు చేయవలసిన జీవితవిధానాలలో మార్పులను సూచిస్తుంది. మీ జీవితంలో మార్పు ను తీసుకు వచ్చి దానిని కంట్రోలులో ఉంచడమే కాదు. ప్రీ-డయాబెటిక్స్‌తో పూర్తిగా తగ్గించవచ్చు. ఉదా॥అత్యాధునిక స్టార్ ఆయుర్వేద మందుల తో పాటు పీచుపదార్థాలు అధికంగా తీసుకో వడం, ఉప్పు, చక్కెర సంబంధిత పదార్థాలు అధికంగా తీసుకోవడం, వ్యాయామం చేయడం ద్వారా డయాబెటీస్‌ను శాశ్వతంగా పరిష్కరించ వచ్చు. సంప్రదాయ, అత్యాధునిక టెక్నాలజీ, అత్యాధునిక మందులు 36 సం॥ల అనుభవం కలిగిన ఆయుర్వేద డాక్టర్‌లు ఇప్పుడు స్టార్ ఆయుర్వేదలో మీకు అందు బాటులోఉన్నారు. డయాబెటీస్ గురించి బాధ పడకండి. దానిని మీరు సరైన శ్రద్ధతో కంట్రోలులో ఉంచు కోక పోతే మెల్లిమెల్లిగా అది మీశరీరాన్ని కబలిస్తుంది. 5000ఏళ్ల ఆయుర్వేద వైద్య విధానం ఇప్పుడు అత్యాధునిక టెక్నాలజీ రూపంలో మీ సేవకై వచ్చింది మా స్టార్ ఆయుర్వేద.

డా. లక్ష్మీ M. D (Ayurveda)
స్టార్ ఆయుర్వేద

ADVT

✆90300 85456 | సికింద్రాబాద్ । కొత్తపేట । కూకట్‌పల్లి । వరంగల్ । గచ్చిబౌలి
విజయవాడ । తిరుపతి । వైజాగ్ । రాజమండ్రి । కర్నాటక | **www.starayurveda.com**

వెంకటమ్మ కల...

ముసునూరి సుబ్బయ్య చౌదరి

ఎటు చూసినా గోదావరి. సుడులు తిరుగుతూ, ముందుకు ఉరుకుతూ, పొంగుతూ, ఒంగుతూ ఎటు చూసినా గోదావరే. కాలసర్పం గరళాన్ని కక్కుతూ జరజరా ముందుకు పోతున్నట్లు నురగలు కక్కుతూ సాగిపోతోంది గోదావరి. లయకాలంలో పరమేశ్వరుడు ఇహాన్నంతా తనలో కలిపేసుకున్నట్లుగా ఊళ్ళూ, పూళ్ళూ ముంచుతూ పంటల్నీ, పశువుల్ని తనలో కలిపేసుకుంటూ, ఎటు చూసినా గోదావరే.

మామూలుగా ఉన్నప్పుడు ముద్దులొలుకుతూ, సిగ్గులు వారుస్తున్నట్లు వయ్యారాలు పోతున్నట్టుగా సాగే గోదావరి నేడు వరద పోటెత్తడంతో నేల కనిపించకుండా కమ్మేసి ఎటు చూసినా గోదావరే. అది గోదావరి మధ్యలోని లంక గ్రామం. గ్రామం మధ్యలో ఉన్న రావిచెట్టు చిటారు కొమ్మ మీద రెమ్మలను గట్టిగా పట్టుకుని బిక్కుబిక్కుమంటోందో పండు ముసలి.

మామూలుగానే ఆ ఊరి చుట్టూ ఎప్పుడూ గోదావరి ఉంటుంది. ఊళ్ళోకి వెళ్ళాలంటే ఒక్క వేసవి కాలం తప్పా మిగతా కాలం అంతా పడవలో దాటాల్సిందే! గోదావరి మధ్య లంకలో ఊరెందుకు కట్టారో, ఎప్పుడు కట్టారో, ఏమో తెలియదు. కానీ చుట్టు పక్కల మండలాల్లో పేరు పొందిన ఊరు అది. ఆ ఊరిని చుట్టి ఉన్న గోదావరి మధ్య చిన్న చిన్న లంకలు ఉంటాయి. ఆ లంక భూములే ఆ ఊరి వ్యవసాయ భూములు. ఆ లంకల్లో పండే పొగాకుకి మంచి విశిష్టత ఉంది. ప్రత్యేకంగా దానికి లంక పొగాకు అని పేరు కూడా వచ్చింది.

ఆ ఊరిలో పుట్టినవాళ్లకు గోదావరి అంటే అంత భయం ఉండదు. ఆమె ప్రతి సంవత్సరం ఇంటికి వచ్చే తోబుట్టువుగా భావిస్తారు. పసుపు, కుంకుమలతో స్వాగతం చెబుతారు. ప్రతి ఏడాది మామూలుగానే వాళ్ళని పలుకరించి వెళ్ళిపోయే గోదావరికి ఒక్కోసారి ఏమవుతుందోగానీ, ఊళ్ళోకి వచ్చి వీధుల్లో తిరిగి వెళ్తుంది. మరోసారి ఉగ్రరూపంతో ఊరినంతా ముంచేస్తుంది. విచిత్రం అలా వరదల్లో ఉన్నప్పుడు పడవలపై ఏటిగట్టు అవతల ఉండే ఊరిలో ఉండి, గోదారి తల్లి శాంతించగానే మళ్ళీ ఆనందంగా ఆ లంక గ్రామంలోకి వచ్చేస్తారు. పంటలు, పశువులు నాశనమైనా, గోదారితల్లిని మాత్రం పల్లెత్తుమాట అనరు. తన తోబుట్టువు ఎందుకు అలిగిందనుకుంటారంతే!

వెంకటమ్మ ఆ ఊళ్ళోనే పుట్టి పెరిగింది. ప్రస్తుతం పండు ముసలి. నీ వయసెంత అని అడిగితే అబ్బో ఎప్పుడో భూమి పుట్టినప్పుడు పుట్టాను అంటుంది. అది కాదు, కాస్త గుర్తు చేసుకుని చెప్పు అంటే... 'అప్పుడెప్పుడో గోదావరి తల్లికి బాగా కోపం వచ్చింది. ఇంటి కప్పులు కూడా మునిగిపోతుంటే ఎందుకోమరి ఏటిగట్టు గండి కొట్టేసింది. నీరంతా అటు లాగేయడంతో ఊళ్ళో వరద తగ్గింది. గండి పడింది కాబట్టి ఆ ఏడు గోదావరిని గండి గోదావరి అంటారు. అదిగో అప్పుడు పుట్టాన్నేను', అంటూ చమత్కారంగా చెప్పేది.

వెంకటమ్మ వయసు కచ్చితంగా తెలియదుగానీ, తలంతా ముగ్గుబుట్టగా మారిపోయింది. ముఖం నిండా ముడతలు పడ్డాయి. పగిలిపోయిన కళ్ళద్దాల్లోంచి చికిలించి చూస్తుంది. పళ్ళున్నాయిగానీ, ఎన్నున్నాయో తెలియదు. బుగ్గలు మాత్రం లోనికి పోయాయి. ఇదివరలో లావుగా ఉండేదనడానికి గుర్తుగా వదులై వేలాడుతున్న జాకెట్‌ని అస్తమానం పైకి సరిచేసుకుంటూ ఉంటుంది. వేళ్ళు వణుకుతున్నా పట్టు బాగానే ఉంది.

ఇప్పటికీ ఎవరిమీదా ఆధారపడకుండా తన పని తనే చేసుకుంటుంది. తన గుడిసెను శుభ్రంగా ఉంచుకుంటూ, తన వంట తనే చేసుకుంటుంది. ఇంటి ముందున్న రెండు జామ చెట్లు, వెనకవైపు ఉన్న రెండు సపోటా చెట్లను జాగ్రత్తగా చూసుకుంటూ, అవి లేనప్పుడు వేరేవాళ్ళ దగ్గర ఉన్న సీజనల్ పళ్ళను కొని, ఊళ్ళో ఉన్న బడి ముందు కూర్చుని పళ్ళతోపాటు, నిమ్మ బిళ్ళలు, బఠానీలు, సెనగపప్పు అమ్ముకుంటూ ఉంటుంది. అదే ఆమె జీవనాధారం.

వెంకటమ్మను ఇప్పుడు అందరూ వెంకటమ్మ అని అంటున్నారు గానీ, చిన్నప్పుడు శ్రీ వీర వెంకట మహాలక్ష్మీ అని పిలిస్తేనే పలికేది. అందులో ఒక అక్షరం తగ్గినా తల తిప్పి చూసేది కాదు. అంతిష్టం తన పేరంటే, ఆమెకు. ఇంకో ఇష్టం ఏంటంటే విమానం, బొమ్మ విమానమనుకునేరు, నిజం విమానమే. ఆకాశంలో విమానం నలకలా కనిపిస్తూ పోతూంటే "అదిగదిగో విమానం నాకు





కనిపిస్తోంది. అదిగో మబ్బుల్లోంచి పోతోంది. అదిగో" అంటూ అందర్నీ ఊరిస్తూ నోరంతా తెరచుకుని అది కనుమరుగయ్యేదాకా చూస్తూనే ఉండేది.

"మనకలాగే కనిపిస్తదిగానీ దగ్గర్నుండి చూస్తే మన ఊరంత ఉంటుందట. అందులో బోలెడంత మంది జనం పడతారట. అందులో వన్నం, కూర, కావాల్సినయి ఏసుకుని తినొచ్చట. ఇసుకదొందులు కూడా ఉంటాయట" నాలుక చప్పరిస్తూ అందరికీ ఆరిందలా చెబుతుండేది.

దొందుల చేప పులుసు కూరంటే మహా ఇష్టం. విమానం గురించి తెలిసీ, తెలియని వాళ్ళు చెప్పేదంతా విని, తన ఫ్రెండ్స్ దగ్గర కోసేస్తుండేది.

మొత్తానికి ఆ చిన్నారికి విమానం ఓ కల. ఎప్పటికైనా విమానం ఎక్కేసి గాల్లో తిరిగెయ్యాలనేది మరో కల. పాపం, అప్పటికీ ఆ అమ్మాయికి తెలియదు. తను ఉట్టికే ఎగరలేదు... ఇక విమానం దాకా ఎలా ఎగురుతానని?

శ్రీ వీర వెంకట మహాలక్ష్మికి పదేళ్ళ వయసొచ్చింది. ఐదవ తరగతి పుస్తకం పట్టింది. కొత్తగా కొన్న నోట్స్ నిండా విమానం బొమ్మలు, తన ఊహ ప్రకారం రకరకాలుగా గీసేసి తన దగ్గరున్న రంగులద్దింది. అవి చూసి పంతులమ్మ గారు వీపు సాపు చేశారు. అయినా ఆమె దారి ఆమెదే. ఆ దారంతా గాల్లో ఎగిరే ఊహలే.

ఇలా ఆనందంగా సాగుతున్న ఆ అమ్మాయి జీవితానికో పెద్ద కుదుపు వచ్చింది. అవి గోదావరి రోజులు. గోదావరి ఆ ఒడ్డు, ఈ ఒడ్డు ఒరుసుకుంటూ ప్రవహిస్తోంది. కొత్త గోదావరిలో వచ్చే పుల్లల్ని తీసుకుంటూ సంవత్సరానికి సరిపడా వంట చెరకు సేకరిస్తారు ఆ ఊరివాళ్ళు. అలాగే ఆ చిన్నారి తల్లీదండ్రి గోదావరి ఒడ్డున నిలబడి పుల్లలను ఒడ్డుకు లాగుతున్నారు. ఈలోపు గోదావరి ఒరవడికి ఒడ్డు కరిగి పెద్ద మట్టిపెళ్ల వచ్చి వాళ్ళమీద పడి కప్పేసింది. గోదావరి పొంగింది. వాళ్ళేమయ్యారో ఎవరికీ తెలియదు. గోదావరి తల్లి తీసుకుపోయిందని అందరూ అనుకున్నారు.

అనాథల్లా మిగిలిపోయిన పిల్లల్ని, ఏటిగట్టుకు అవతల ఉండే మేనమామ వాళ్ళింటికి తీసుకెళ్ళాడు. అది ఆయనకిష్టమైందిగానీ ఆయన భార్యకు ఇష్టంలేదు. పిల్లలు రావడంతో మూతి ముడుపులు మొదలయ్యాయి. పిల్లలను బడికి పంపుదామంటే వినకుండా "అందరికీ నేను వండి వార్చలేను. పిల్లను ఉంచేయండి, చేతికిందకు ఆసరాగా ఉంటుంది" అంది అత్త. తప్పలేదు మేనమామకి. ఆరోజు నుండి ఆ చిన్నారి పనిపిల్లగా మారిపోయింది.

ఒకరోజు గిన్నెలు తోముతుండగా పైనుండి హెలికాప్టర్ అతి కిందుగా శబ్దం చేసుకుంటూ వెళ్ళిపోయింది. పనిమానేసి దాన్ని ఆశ్చర్యంతో, ఆనందంతో చూస్తూ ఉండిపోయింది. ఫెడేల్మని వీపుమీద ఓ గుద్దు పడింది. టప టపా నాలుగు మొట్టికాయలు

ఆమె పేరు వీర వెంకట మహాలక్ష్మి. ఆమె జీవితం ఓ కమ్మటి కల! సాఫీగా, హాయిగా సాగిపోయే అలాంటి జీవితాన్ని కాలం కాటేసింది. విధి వక్రించింది. వీర వెంకట మహాలక్ష్మి వెంకటమ్మగా మారిపోయింది. చివాట్లు, దెబ్బలు తినడమే జీవిత పరమావధిగా మారింది. మరి గోదారమ్మ ఆమె జీవితాన్ని అలాగే వదిలేసిందా? ఆమె కన్న కల నెరవేరలేదా? తోడబుట్టిన తమ్ముళ్ళు అమెనేం చేశారు?

పడ్డాయి. ఉలిక్కిపడి చూసింది. ఎదురుగా అత్త. రాక్షసిలా ఇంతంత గుడ్లేసుకుని చూస్తూ ఉంది.

"ఏమే, ఎంతసేపు తోముతావ్ ఈ నాలుగు గిన్నెలు. పని మానేసి ఆకాశం వంక చూస్తున్నావ్. అక్కడేమన్నా కోతులాడుతున్నాయా?" కసిరింది అత్త.

"విమానం.. దగ్గర్లోంచి వెళ్ళింది" వెక్కిళ్ళు పెడుతూనే బెక్కుతూ అంది.

"ఏంటీ విమానమా.. నోర్మూసుకుని పని చూసుకో. విమానం గిమానం అన్నావంటే వీపు విమానం మోతెక్కిపోద్ది జాగ్రత్త" అని హెచ్చరించి రెండడుగులు ముందుకు వేసి, "ఒసే వెంకటమ్మ, ఈ పని అయ్యాక.."

"నా పేరు వీర వెంకట మహాలక్ష్మి" అని బెక్కుతూనే చిరుకోపంగా అంది.

"నోర్మూయ్. అదేం కుదరదు. నేను పెట్టిందే పేరు. నీ పేరు ఇక నుంచి వెంకటమ్మే. ఈ పని అయ్యాక పశువుల దొడ్డి తుడిచెయ్" శాసిస్తున్నట్టుగా చెప్పి వెళ్ళిపోయింది.

అదిగో ఆరోజు నుండి 'శ్రీ వీర వెంకట మహాలక్ష్మి' పేరు 'వెంకటమ్మ'గా మారిపోయింది. మొదట్లో చిరాగ్గా ఉన్నా, ఆ పిలుపుకి అలవాటు పడిపోయింది వెంకటమ్మ. పదిహేనేళ్ళు వచ్చాయి వెంకటమ్మకి. పెద్ద మనిషి అయి సంవత్సరం దాటింది. కాస్త లోకం పోకడ తెలుస్తోంది. కాలం మిసమిసలాడే ఒంపులు తెచ్చింది. కుర్రాళ్ళ చూపులు ఆమె మీదకు వీస్తున్నాయి. అత్త తరపు బంధువొకడు అదేపనిగా ఇంటికి రావడం, తనను ఆకలిగా చూడటం, ఒంటిమీద చేతులు వేయడం, అది చూసినా, అత్త మాట్లాడకపోవడం చూసి చిరాకొచ్చి అత్త ఉండగానే మేనమామకు అంతా చెప్పింది బంధువు ప్రవర్తన గురించి.

అత్త కయ్యిమంది. "మా వైపు వాళ్ళంటే లోకువ కదూ. అయినా ఏం దొబ్బుదాలి? ఆడు నిన్ను పెళ్ళి చేసుకుంటానంటున్నాడు. ఇంకేం తీపుడాయి?"

"అదేంటి? వాడికి నలభై ఏళ్ళు. ఇంచుమించు నా వయసుంటుంది. ముగ్గురు పిల్లలు. మొన్నీ మధ్యనే కదా పెళ్ళాం చచ్చిపోయింది. అప్పుడే మళ్ళీ పెళ్ళికి తయారయ్యాడా?" చిరాగ్గా అన్నాడు మేనమామ.

"ఏం, తప్పేంటి? ఇంతోటి సుందరాంగికి అంత కంటే మంచి సంబంధం వస్తుందా? ఈ పెళ్ళి కుదిర్చిపెడితే పదివేలు ఇస్తానన్నాడు. ఏc డబ్బంటే చేదా?" అంది అత్త.

"కాదత్తయ్యా, నాకప్పుడే పెళ్ళి ఇష్టం లేదు. తమ్ముళ్ళు చిన్నవాళ్ళు. వాళ్ళు చదువుకోవాలి. వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడాలి. నేను పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే ఎలా" అంది వెంకటమ్మ ఏడుపు గొంతుతో.

"నీకిదేపనా ఏటెల్ల కాలం, నిన్ను నీ తమ్ముళ్ళను పోషించడమేనా నా పని. పెళ్ళి చేసుకుని వాళ్ళను తీసుకుపో. ఇంత ముద్దెడతాడులే. అనాథ బతుకులు. ఎక్కడ బ్రతికితే ఏంటి?" అంది అత్త నిరసనగా.

"మేమెందుకు వాళ్ళ దగ్గర, వీళ్ళ దగ్గర తినాలి అత్తా, మాకు మా నాన్న ఇచ్చిన నాలుగెకరాల భూమి ఉంది. ఇన్ని రోజులు వాటిమీద వచ్చే కౌలుతోనే కదా మమ్మల్ని పోషించింది. మేమెందుకు అనాథలుగా బ్రతకాలి" నిలదీసింది వెంకటమ్మ.

ఒక్క క్షణం నిశ్చేష్టురాలయింది. అంతే అమాంతం లేచి వెంకటమ్మను ఆ చెంప ఈ చెంప వాయించింది. జుట్టు పట్టుకుని వంగదీసి పెడీపెడీ నాలుగు గుద్దులు గుద్దింది. ఆయాసపడుతూ "ఏంటే ఆస్తులు గురించి మాట్లాడుతున్నావ్? ఇన్నాళ్ళు మిమ్మల్ని పెంచినందుకు ఆ భూమి నేను తీసుకుంటాను. నేను చెప్పినట్టు వాణ్ణి పెళ్ళి చేసుకుని మీ వాళ్ళను తీసుకుపో! ఇంతకి ఎక్కువ తక్కువ జరిగిందా? నీ ప్రాణాలు నీవి కావు. జాగ్రత్త" విస విసా వెళ్ళిపోయింది, అత్త. గుడ్లలో నీరు కుక్కుకుంటూ కూలబడిపోయింది వెంకటమ్మ. బిక్కుబిక్కుమంటూ ఆ మూల, ఈ మూల దాక్కున్న తమ్ముళ్ళు వచ్చి అక్కను చుట్టేసుకున్నారు. వాళ్ళను దగ్గరకు పొదుముకుంటూ బావురుమంది వెంకటమ్మ.

ఏడ్చి ఏడ్చి అలసిపోయిన వెంకటమ్మ ఒక నిర్ణయానికి వచ్చేసింది. 'వాళ్ళ పంచన, వీళ్ళ పంచన బ్రతుకుతున్నందుకే తను, తన తమ్ముళ్ళు ఇంత లోకువయిపోయారు. తన కాళ్ళమీద తను బ్రతికితే ఎవరూ తన జోలికి రారు' అని నిర్ణయించుకుని ఆ రాత్రే తమ్ముళ్ళను తీసుకుని పుట్టిన ఊరికి చేరుకుంది.

శిథిలమైన ఇంటిని కష్టపడి బాగుచేసుకుని పాలు పొంగించి ఇంట్లోకి చేరిపోయారు. మేనమామ, అత్త వచ్చారు. మేనమామ నచ్చజెప్పబోయాడు. అత్త కస్సుబుస్సుమంది. మేనమామతో తన తమ్ముళ్ళను చదివించుకోవాలనుందని, తను కష్టపడి వాళ్ళను చదివిస్తానని, తమ మానాన తమని వదిలేయమని నచ్చజెప్పింది. అత్తను పట్టించుకోలేదు. శాపనార్థాలు పెడుతూ వెళ్ళిపోయింది అత్త. మేనకోడలు తల నిమిరి భార్య వెనకే వెళ్ళిపోయాడు మేనమామ.

వారసత్వంగా వచ్చిన నాలుగెకరాల భూమిలో ధైర్యంగా వ్యవసాయం మొదలుపెట్టింది. ఊళ్ళో పెద్ద రైతు, షావుకారుకు చెప్పి పెట్టుబడి పెట్టించాడు. నిలదొక్కుకుంది వెంకటమ్మ.

ఐదవ తరగతి పూర్తయిన పెద్ద తమ్ముణ్ణి హైస్కూల్‌లో చేర్చింది. చిన్న తమ్ముడిని ఊరి బడిలో నాల్గవ తరగతిలో చేర్చింది. సాయంకాలం పూట దీపం దగ్గర చేరి చదువుకుంటున్న తమ్ముళ్ళను చూసి మురిసిపోయేది.

ఒకరోజు హైస్కూల్‌లో చదువుతున్న పెద్ద తమ్ముడు 'అక్కా అక్కా' అంటూ ఆనందంతో పరిగెత్తుకొచ్చాడు.

"ఏమిట్రా, ఎందుకా పరుగు" అంటూ దగ్గరికి తీసుకుంది.

"అక్కా.. ఈరోజు మాకు విమానం పాఠం చెప్పారు. అది మనకు చిన్నగా నలకలాగా కనిపిస్తుందిగానీ, అందులో 300 మందికి పైగా పడతారట. ఒక దేశం నుండి ఇంకో దేశం సముద్రం మీద జుయ్యిమంటూ వెళ్ళిపోతారట" ఆయాసపడుతూ చెప్పాడు. వాడికి తెలుసు విమానం

కాజల్ లిప్‌లాక్‌లు వేస్తయినట్లే!

తెలుగులో రెండు భారీ ఫ్లాపులు మూటకట్టుకున్న తరువాత కాజల్ తన ఆశలన్నీ బాలీవుడ్ సినిమా మీదే పెట్టుకుంది. గతంలో తెలుగులో ఎప్పుడూ పెట్టని లిప్‌లాక్‌లను కూడా ఈ సినిమాలో అప్లయ్ చేసేసింది. సాధ్యమైనంత గ్లామర్‌గా కనిపించింది. ఇన్ని చేసినా ఆ సినిమా అక్కడ బాక్సాఫీసు వద్ద తుస్సుమంది. దాంతో కాజల్ పరిస్థితి ఏమిటి? అన్న ప్రశ్న అందరిలోనూ తలెత్తుతోంది. కొత్త సినిమాలు అంగీకరిస్తుందా? లేకపోతే పెళ్ళి ఆలోచన చేస్తుందా? అన్న అనుమానాన్ని చాలా మంది వ్యక్తం చేస్తున్నారు.

గురించి కబుర్లంటే అక్కకి చాలా ఇష్టమని.

నోరెళ్ళబెట్టి వింది వెంకటమ్మ. పైన ఏదో వెళుతున్న శబ్దం వినిపించి బయటకు పరిగెట్టింది. అది విమానం. మబ్బుల్లో కనిపించలేదు. నిరాశగా తల వంచుకుని పనిలో పడిపోయింది. కానీ గాల్లో విమానం శబ్దం వినబడితే మాత్రం పరిగెత్తుకెళ్ళి ఆకాశం వంక ఆరాటంగా చూస్తూండిపోయేది. ఆమెకు సంబంధం లేని విమానం. ఎందుకో ఆమె జీవితంలో ఒక బంధమయిపోయింది.

కాలం గడిచింది. తమ్ముళ్ళిద్దరూ పెద్ద చదువులకు వచ్చారు. ఆ చదువుల కోసం కూడబెట్టినదంతా అయిపోయింది. అప్పులు కూడా చేయవలసి వస్తోంది వెంకటమ్మకు.

తిప్పలు పడుతున్న వెంకటమ్మను చూసి పెద్ద తమ్ముడు “ఇంకెంతక్కా... ఒక్క సంవత్సరం ఆగు. నాకు పెద్ద ఉద్యోగం వస్తుంది. మన కష్టాలన్నీ తీరిపోతాయి. హాయిగా మనం పట్నం వెళ్ళిపోదాం” అంటుండేవాడు.

“అంతేకాదక్కా.. పట్నంలో ఉన్న ఎయిర్‌పోర్ట్‌కి తీసుకెళ్ళి నిన్ను విమానం ఎక్కిస్తాను. అక్కతో కలిసి మద్రాసు వెళ్ళి చిరంజీవిని చూసొస్తాం” అనేవాడు చిన్న తమ్ముడు.

వాడలా అనగానే ఆనందం పెల్లుబికిపోయేది వెంకటమ్మకు. “చాలు రా! నాకా ఒక్క కోరికా తీర్చండి చాలు. ఒక్కసారి విమానం ఎక్కాలి. గాల్లో ఝుమ్మని తిరిగి రావాలి. అది చాలు నా బతుక్కి, ఇంకేం అక్కర్లేదు” పొర్లిపోతున్న ఆనందంతో అనేది వెంకటమ్మ. తన తమ్ముళ్ళు తనను విమానం ఎక్కించి తిప్పుతానన్నారని అందరికీ చెప్పుకుని మురిసిపోయేది.

ఊళ్ళో వాళ్ళందరూ తల్లీ, తండ్రీ లేకున్నా సంసారాన్ని ఈడుస్తున్న వెంకటమ్మ అంటే బోలెడంత సానుభూతి చూపేవారు. “అది సరేలేవే వెంకటమ్మ. నీ వయసు పాతిక దగ్గరికి వచ్చింది. ఇప్పటికే ముదురు మునక్కాడలా తయారయ్యావు. ఇప్పుడయినా మా మాట విని పెళ్ళి చేసుకో. నీకో తోడు ఉండాలి” అంటూండేవారు.

అది విని “ఇంకా నయం, నేను పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే నా తమ్ముళ్ళేం కావాలి, వాళ్ళ చదువేం కావాలి. వాళ్ళకు పెద్ద ఉద్యోగాలు రావాలి. వాళ్ళకు పెళ్ళిళ్ళు చేయాలి. అవన్నీ నా చేతులమీదనే జరగాలి. ఆ తరువాతనే పెళ్ళి” అనేది వెంకటమ్మ.

“అప్పుడు నిన్నెవరు చేసుకుంటారే” అని అంటున్నా పట్టించుకునేది కాదు. చూస్తుండగానే తమ్ముళ్ళ చదువులు అయిపోయాయి. వాళ్ళకు మంచి ఉద్యోగాలు వచ్చాయి. వాళ్ళకు వచ్చిన ఉద్యోగాలు చూసి పిల్లను మేమిస్తామంటే మేమిస్తామని అంతా ఎగబడ్డారు. తన తమ్ముళ్ళకు నచ్చిన అమ్మాయిలనిచ్చి పెళ్ళిళ్ళు చేసేసింది వెంకటమ్మ. వాళ్ళు పట్నంలో స్థిరపడిపోయారు. వెంకటమ్మ లంకలోనే ఉండిపోయింది. చదువులకు, పెళ్ళిళ్ళకు చేసిన అప్పులు తీర్చడంలో తల మునకలైపోయింది వెంకటమ్మ. అవన్నీ అయిపోయే సరికి, ఆమె తల తెల్లబడటం మొదలుపెట్టింది. వెంకటమ్మ కూడా పెళ్ళి ఊసు మర్చిపోయింది. కానీ ఒక్కసంగతి మాత్రం మర్చిపోలేదు. విమానం ఎక్కాలి, గాల్లో తిరగాలి అంతే. తన తమ్ముళ్ళు తనను ఎలాగైనా విమానం ఎక్కిస్తారు అది ఆమెకు మిగిలిన కోరిక, పిచ్చి నమ్మకం కూడానూ.

కానీ ఎన్ని రోజులైనా తమ్ముళ్ళ నుంచి కబురు రాలేదు. కనీసం చూసి పొమ్మని కూడా పిలవలేదు. పోనీ వాళ్ళయినా ఒక్కసారిటు తొంగి చూడలేదు. చూసిచూసి కొన్నాళ్ళకు తనే తీరిక చేసుకొని పట్నం బయల్దేరింది. ఎలాగోలా అడ్రస్ పట్టుకుని పెద్ద తమ్ముడి ఇంటికి చేరుకుంది వెంకటమ్మ.

మంచి జీతం, ఖరీదైన ఇల్లు, అందమైన కూతురుతో వాళ్ళ సంసారం వైభవంగా ఉంది. ఆ వైభోగమంతా చూసి చాలా సంతోషించింది వెంకటమ్మ. ఒక్కసారి తమ్ముణ్ణి అడిగింది విమానాన్ని చూపించమని.

“ఇల్లెక్కి చూస్తే బోలెడు విమానాలు కనిపిస్తాయి. నన్ను విసిగించకు” అని ఆఫీసుకు వెళ్ళిపోయాడు పెద్ద తమ్ముడు. పైన డాబా ఎక్కి చూసింది.

నవ్యవీక్లి-నాటా సంయుక్త నిర్వహణలో బహుమతి పొందిన కవిత

నేర్చుకోవాలనుకున్నప్పుడల్లా వీధి అరుగుపై

నేర్చుకోవాలనుకున్నప్పుడల్లా వీధి అరుగుపై
నిశ్శబ్దంగా కూర్చుంటాను
సాయంకాలం బడి పిల్లలు ఇండ్లకు పోతూంటారు
అలసి.... ముఖాలను వ్రేలాడేసుకుని... పుస్తకాల
మూటలతో
ఒక షరీఫ్... ఒక చంద్రకళ... ఒక బెంజిమిన్... ఒక
రాముడు
ఒక సమూహమై
వివిధ పుష్పాలను గుదిగుచ్చిన పూల ‘బొకే’లా
కనిపిస్తారు వాళ్ళు
కులం... తరగతి...మతం...వయసు...ఏవీ ఉండవు
ఒకే బడి... ఒకే వీధి... ఒకే ఊరు... ఒకే ప్రాంత
స్పృహ... అంతే
అందరి ముఖాల్లోనూ ధనుర్మాస మేఘాల్లా...
నిండా ఆర్ద్రత
ఎక్కడి నుండో ఒక మసీదు నుండి నమాజ్
వినిపిస్తూంటుంది
ఆకాశంలో నుండి ఎవరో పిలుస్తున్నట్టు
అప్పుడే నరసింహ దేవాలయ కంచు గంట ధ్వని...
గణగణా
టపటపా రెక్కలనాడించుకుంటూ పావురాలు
గుంపులు గుంపులుగా వస్తాయి
ఏమౌతుందో తెలియదు... మనసు నిండా
అకస్మాత్తుగా
ఒక హరివిల్లు విరుస్తుంది
హృదయం... చిగురాకై రెపరెపలాడ్తుంది
సన్నగా... శీతకాలపు మంచుతో చీకటి
కురుస్తూండగా
భుజాలపై నాగళ్ళతో
రైతులు కొందరు నడుచుకుంటూ... వెళ్తుంటారు
వీధిలో
మళ్ళీమానవ సమూహమే
ఒకడంటున్నాడు.. ‘భూమిని మనం నాగటి పోటుతో
గాయపరుస్తాం గదా
చూడు ప్రతిగా ఆ తల్లి మనకు
ఆహారాన్నందిస్తోంది’ అని.
ఎవరో కొరడాతో కొడ్తున్న అనుభూతి
‘గాయానికి’ ప్రతిగా తల్లి ప్రేమతో తల నిమరడం
కదా అది-
చీకటి చిక్కపడ్తోంది
రైతుల వెనుక గేదేల మందతో శివకాముడు...
కాపరి
ప్రతి గేదె ముఖంలో... కాంతులీనుతూ.. వెలుగుతూ
రెండు కళ్ళు బల్బుల్లా
ప్రతి గేదె ముఖంలోనూ ఎంత అమాయకత్వమో
ఒట్టి ఆకాశంలో ఉన్నంత నిర్మలత్వం... శుభ్రత....

అన్నీ సమూహంగానే.. తలలు వంచుకుని...
ఒద్దికగా
ప్రక్కకు ప్రక్కకు జరుగుతూ... సహనం.. ఓర్పు...
సమిష్టి... మంద
కలిసికట్టుగా... పశువులు... గేదెల మంద
చేతిలోని పుస్తకం వైపు చూశాను
అక్షరాల కుప్పలు... పశువుల వలె... పక్షులవలె...
మనుషులవలె
కాళోజీ కవిత్వ చరణాలు కనిపిస్తున్నాయి... చేతుల్లో
నేనింకా ‘నా’ నుండి ‘మా’ వరకే ఎదుగలేదు
‘మన’ అన్నప్పుడు కూడా అభ్యుదయం-
చాలా సహనంతో... సంయమనంతో... సర్దుబాట్లతో
గేదెల మంద... నడుస్తూ వెళ్తూ... కనిపిస్తూనే ఉంది

ఏదో అర్థమైనట్టు లేచి... ఇంట్లోకి వెళ్తే
ఎదురుగా... భళ్ళున వెలుగులు
విరజిమ్ముతూ....ప్రకాశిస్తూ కరెంట్ బల్బు
చాలా సహనంతో... సంయమనంతో... నిలకడగా

-పి.అమరజ్యోతి
సెల్:93923 83718

విచిత్రంగా ఆమె చూసినంతసేపూ ఒక్క విమానం కూడా రాలేదు. రెండురోజులున్నా తమ్ముడేం పట్టించుకోకపోవడం, మరదలు మూతి ముడుచుకోవడం చూసి విసిగి చిన్న తమ్ముడి దగ్గరకు వెళ్ళింది వెంకటమ్మ.

వాళ్ళూ బాగానే ఉన్నారు. మొదటిరోజు బ్రహ్మాండంగా చూశారు. రెండోరోజు నుండి మరదలు మొదలుపెట్టింది. "పెద్ద తమ్ముణ్ణి ముద్దు చేసి మంచి చదువులు చదివించారు. చిన్న తమ్ముడిని పట్టించుకోలేదు. వాళ్ళముందు మేమెందుకూ సరిపోవడం లేదు" అంటూ సణగడం మొదలు పెట్టింది.

చిన్నతమ్ముడితో "ఒరేయ్ నన్ను విమానం ఎక్కిస్తానన్నావుకదా. మళ్లీ మళ్ళీ రాలేను, ఒక్కసారి విమానం ఎక్కించరా" వేడుకుంటున్నట్టుగా అంది వెంకటమ్మ.

"నాకెక్కడి తీరిక. అయినా నీ ముద్దుల పెద్ద తమ్ముణ్ణి అడగలేదా? బాగా గారాబం చేసి చదివించావుగా. వాడిని తీసుకుని వెళ్ళమనకపోయావా?" ఈసడించుకుంటున్నట్టు అన్నాడు చిన్న తమ్ముడు.

"అడిగాను. పాపం వాడికి ఖాళీ లేదట..

అందుకనీ..."

"ఆహా.... వాడికి ఖాళీ లేదా.. మేం పనీపాటా లేకుండా తిరుగుతున్నామనుకున్నావా? నాక్కూడా వీలుపడదు" నిక్కచ్చిగా చెప్పేశాడు తమ్ముడు.

వీళ్ళతో తన కోరిక తీరదని తెలుసుకుని నీరుగారిపోయిన వెంకటమ్మ ఇంటికి బయల్దేరింది. ఇది జరిగిన నాలుగు నెలలకే తమ్ముళ్ళిద్దరూ వచ్చి ఉన్న నాలుగెకరాలు అమ్మేసి, చెరి సగం పంచుకుని అక్క సంగతి పట్టించుకోకుండా వెళ్ళిపోయారు. అయినా వాళ్ళనేమీ పల్లెత్తుమాట కూడా అనలేదు వెంకటమ్మ. ఎవరినీ ఏమీ అననిచ్చేది కాదు. చుట్టు పక్కల పండ్లతోటల్లోనివి, పట్నం నుండి పళ్ళు కొని తెచ్చుకుని వాటిని అమ్ముకోవడం మొదలుపెట్టింది.

కాలం గడుస్తున్న కొద్దీ ఊళ్ళో చదువుకున్న పిల్లలందరూ ఉద్యోగాలకోసం పట్నాలకు వెళ్లిపోవడం, మూడేళ్ళకోసారి పెద్ద గోదావరి ఊరిని ముంచుతుండటంతో ఊరు తరిగిపోవడం మొదలు పెట్టింది. మూడు వేల గడపలుండే ఊరు, మూడు వందల గడపకు చేరింది. కట్టుకున్న పెద్ద పెద్ద లోగిళ్ళను వదలలేక కొందరు, పుట్టిన ఊరుమీద మమకారం చంపుకోలేక ఇంకొందరు మాత్రం ఊళ్ళో ఉండిపోయారు. ఏటికేడు ఊరు తగ్గుతున్నా వెంకటమ్మ వయసు మాత్రం పెరుగుతూనే ఉంది. వయసుతో పాటు విమానం ఎక్కలేనన్న నిరాశ కూడా ఎక్కువవుతోంది. ఇప్పటికీ ఆకాశంలో విమానం వెళుతుంటే ఆమె చింకి కళ్ళతో చూడాలని ప్రయత్నం చేస్తూనే ఉంటుంది.

ముదిమి వయసు దాటి శరీర శ్రమతో శుష్కించి పోయిన వెంకటమ్మ ఇక ఒక నిర్ణయానికి వచ్చేసింది. 'బ్రతికుండగా ఎలాగూ విమానం ఎక్కలేక పోయాను. చచ్చాకయినా స్వర్గానికో, నరకానికో విమానం మీద తీసుకుపోతారట కదా అప్పుడైనా విమానం ఎక్కకపోతానా' అని ఈ మధ్య చావు కోసం ఎదురుచూడ్డం మొదలుపెట్టింది.

వర్షాకాలం వచ్చింది. శ్రావణ మాసంలో ముసురు పట్టింది. వర్షాలకు పండ్లు అమ్మకం లేక, ఇంట్లోనే ఉండిపోయింది వెంకటమ్మ. చలిగాలికి జ్వరం వచ్చింది. మూలుగుతూ మంచం మీదే పడుకుండిపోయింది. ఈలోపుగా గోదావరి వరద రావడం, ఊరిని చుట్టుముట్టడం, ఇండ్ల దగ్గరకు కూడా వచ్చేయడం జరిగింది.

వరద ఇంకా పెరగవచ్చునన్న సూచనతో ప్రభుత్వం వాళ్ళు ఊరిలో ఉన్నవాళ్ళందర్నీ బలవంతాన ఖాళీ చేయించింది. లాంచీల మీద గోదావరి దాటించి ఏటి గట్టు అవతల దించారు. కానీ గుడిసెలో ఉన్న వెంకటమ్మ సంగతి అందరూ మర్చిపోయారు.

మంచం కిందకు నీరు చేరడంతో జ్వరంతో పడి ఉన్న వెంకటమ్మకు మెలకువ వచ్చింది. చుట్టూ నీళ్ళు చూసి బెంబేలెత్తి గుడిసె బయటకు వచ్చింది. ఎటు చూసినా నీరే. వరద పెరుగుతోంది. వడి కూడా పెరుగుతోంది. ఆ కర్రా, ఈ కర్రా పట్టుకుని పక్క ఇంటి డాబా మెట్లెక్కింది. ఊళ్ళో ఎవరూ కనిపించడం లేదు. వెంకటమ్మకు భయం వేసింది.

నీళ్ళు పెరుగుతున్నాయి. డాబా మీదకు చేరుకున్నాయి. డాబాను ఆనుకుని రావిచెట్టు కొమ్మ ఉంది. ఆ కొమ్మమీదకు చేరి పాక్కుంటూ పైకి వెళ్ళింది. ఆమె పట్టుకున్న కొమ్మదాకా నీళ్ళు వచ్చేశాయి. ఆమె పై పైకి వెళుతూనే ఉంది. నీళ్ళు పైపైకి వస్తూనే ఉన్నాయి. ఆఖరికి చిటారు కొమ్మకు చేరింది. అక్కడకు కూడా నీళ్ళు వస్తే..

సరిగ్గా అప్పుడే లంకల్లో ఎవరైనా మిగిలిపోయారేమోనని అత్యవసర సహాయానికిగాను లంక గ్రామాల మీదుగా ప్రభుత్వం పంపిన హెలికాప్టర్ ఎగురుతూ వచ్చింది. చుట్టూ చూసి ఎవరూ లేరని వెళ్ళిపోతున్న వాళ్ళకు రావిచెట్టు మీద ఏదో ప్రాణి ఉన్నట్టు అనిపించింది. దగ్గరకు వచ్చి చూశారు. ఆత్రుతగా తాళ్ళనిచ్చెన వేశారు. వారం రోజుల నుండి సరిగ్గా తిండితిప్పలు లేక నీరసించి పోయిన వెంకటమ్మకు శోష వచ్చి కొమ్మమీదే పడుకుండిపోయింది. హెలికాప్టర్ శబ్దానికి కళ్ళు తెరిచింది. ఆమెకు కలో, నిజమో అర్థం కావడంలేదు.

కానీ ఒకటి మాత్రం అర్థమయింది. బహుశా తను చచ్చిపోయి ఉంటుంది. స్వర్గానికి తీసుకెళ్ళటానికి విమానం వచ్చింది. తను విమానం ఎక్కిగాల్లో.. ఆపైన ఆలోచించడం లేదు. విమానం ఎక్కుతానన్న ఆనందం ఆమెను ఊపిరి సలపనివ్వడం లేదు. "అదిగో వచ్చేసింది... వచ్చేసింది విమానం"

తాళ్ళనిచ్చెన ద్వారా దిగిన సహాయక సిబ్బంది ఆమెను పొదివి పట్టుకున్నారు. తాళ్ళనిచ్చెన పైకి లాగడంతో ఆమె హెలికాప్టర్‌లోకి చేరింది. అత్యవసర వైద్యుడు ఆమె పరిస్థితి చూసి వైద్యానికి ఉపక్రమించాడు.

"ఇది విమానమేనా.. నేను విమానం ఎక్కానా?" ముద్దగా మాట్లాడుతూ అడిగింది వెంకటమ్మ.

హెలికాప్టర్ అని చెబితే ఆమెకు అర్థం కాదేమోనని "అవును ఇది విమానమే. నువ్వు విమానంలో క్షేమంగా ఉన్నావు. కంగారు పడకు" చెప్పాడు డాక్టర్.

"నేనోసారి .. కిందకు.. చూస్తా" ఆనందంతో ఉబుకుతున్న కళ్ళ నీళ్ళను తుడుచుకునే ఓపిక లేక అలాగే కన్నీళ్ళు కారుస్తూ అడిగింది వెంకటమ్మ.

ఆమె చూస్తున్నప్పుడు ఇంజక్షన్ చేయొచ్చని కిటికీ దగ్గరకు తీసుకొచ్చాడు డాక్టర్. వెంకటమ్మ కిందకు చూసింది. అంతా గోదావరి, మునిగిపోయిన ఇళ్ళు, కొసలు కనబడుతున్న చెట్లు, విమానాన్ని చూసి కేరింతలు కొడుతున్న జనం పిచ్చుకల్లా కనిపిస్తున్నారు. 'తను విమానం ఎక్కింది. గాల్లో ఎగురుతోంది' అలాగే చూస్తుండిపోయింది వెంకటమ్మ.

ఇంజక్షన్ చేద్దామని ఆమె చేయి పట్టుకున్న వైద్యుడికి, అప్పటికే ఆమె ప్రాణం పోయిందని అర్థం అయింది. అనుమానంగా నాడిని చూస్తూ, ఆమె వంక చూశాడు డాక్టర్. ఆమె నవ్వుతోంది. కళ్ళు ఆనందంతో విప్పారి ఉన్నాయి. వాటిలో జీవం లేకపోయినా సాధించాలనుకున్నదేదో సాధించానన్న సంతృప్తి, తను కన్న కల నిజమైందన్న ఆనందం మాత్రం కనిపిస్తున్నాయి.

సెల్: 99499 41996

సురభి

బ్లూ సిటీ

పండుగలకు, పబ్బాలకు, పెళ్ళిళ్ళకు కొత్తకొత్త రంగులతో భవనాలు సరికొత్తగా మెరిసిపోతుంటాయి. ఒకప్పుడు ఇళ్ళకు సున్నంతో వెల్ల వేసేవారు. మారుతున్న కాలంతోపాటు కొత్త ట్రెండ్‌లు పుట్టుకొస్తున్నాయి. ఇళ్ళను కూడా రకరకాల రంగులు, పెయింటింగ్స్‌తో నింపేస్తున్నారు. కానీ ఆ నగరంలో మాత్రం ఏ ఇంటిని చూసినా ఒకే రంగు కనిపిస్తుంది. అదెక్కడో, ఆ విశేషం ఏంటో తెలుసుకుందామా!

మొరాకోలోని చెఫ్‌షావన్ నగరంలో అడుగుపెడితే అక్కడి ఇళ్ళన్నీ ఆకాశంలా నీలిరంగులో మెరిసిపోతుంటాయి. ఇంటిగోడలతోపాటు ఇళ్ళకున్న తలుపులు, కిటికీలు, మెట్లు, నగరంలోని ఫుట్‌పాత్‌లు కూడా నీలిరంగులోనే ఉంటాయి. ఇదేదో రికార్డు కోసం చేసిన ప్రయత్నమనుకుంటే మాత్రం పొరబాటు! 86 సంవత్సరాల క్రితం పొట్ట చేత బట్టుకుని స్పెయిన్ నుంచి వలస వచ్చిన శరణార్థులు నగరాన్ని నిర్మించుకున్నారు. ప్రశాంత జీవనం గడపాలని, నీలి రంగును స్ఫూర్తికి ప్రతీకగా భావించి తాము కట్టుకున్న ఇళ్ళకు నీలిరంగు వేసుకున్నారు. అప్పటినుంచీ ఆ సంప్రదాయం అలాగే కొనసాగుతోంది. దీంతో ఈ నగరం పర్యాటక ప్రదేశంగా మారింది. స్వచ్ఛతకు, ఆధ్యాత్మికతకు, ప్రశాంతతకు నీలిరంగును సూచనగా భావిస్తారు. ఏది ఏమైనా ఈ నగరం ప్రస్తుతం పర్యాటకులను ఆకట్టుకుంటోంది!

అమ్మాయి కాదు

ఫోటోలో ఉన్న ఈ అమ్మాయిని చూస్తే ఎవరైనా సరే, 'ఎంతందంగా ఉన్నావే...' అని పాడుకోవాల్సిందే! కానీ అలా పాడేముందు ఒకసారి మళ్ళీ పరీక్షగా చూడండి. ఎందుకంటే అక్కడ ఉన్నది అమ్మాయి కాదు అబ్బాయి! షాఫర్ అనే కుర్రాడివే ఈ ఫోటోలన్నీ! నమ్మలేకపోతున్నారు కదూ! అమెరికా, కాలిఫోర్నియాలోని ఆరెంజ్ కౌంటీకి చెందిన రిచర్డ్ షాఫర్ ఓ మేకప్ ఆర్టిస్ట్. ఎవరికైనా సరే మేకప్ వేయటంలో, తనకు తాను మేకప్ చేసుకోవటంలో దిట్ట. అతనికి డిస్నీ సినిమాలన్నా, అందులోని పాత్రలన్నా చాలా ఇష్టం. ఇంకేముంది, తనకున్న టాలెంట్‌తో రోజుకో డిస్నీ క్యారెక్టర్‌లా మారిపోతున్నాడు. అలా మారడానికి కనీసం రెండు గంటలు పడుతుందని చెబుతున్నాడు రిచర్డ్. ఈ మేకప్ మెళకువల్ని రిచర్డ్ తనంతట తానే నేర్చుకున్నాడట. చిన్నప్పుడు రిచర్డ్‌ని తోటివారంతా ఆండ్రోగైనస్ (పురుష, స్త్రీ లక్షణాలు కలిసి ఉండడం) అని గేలి చేసేవారట. రిచర్డ్ ఆ ఎగతాళిని పాజిటివ్‌గా తీసుకుని డిస్నీ రాజకుమారుడు, రాజకుమారిలాగా మేకప్ చేసుకుంటూ ఫేమస్ అయిపోయాడు. డిస్నీ క్యారెక్టర్స్ మేకప్ వేసుకుని, ఫోటోలు తీయించుకుని వాటిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తున్నాడు. అంతేకాదండోయ్, రిచర్డ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకి 80 వేలమంది ఫాలోయర్లు కూడా ఉన్నారు. అబ్బాయిలూ, రిచర్డ్ ఫోటోలు చూసి అమ్మాయనుకొని మనసు పారేసుకోకండేం!

స్పినీ రక్షణ

పిల్లులు స్టేషన్‌మాస్టర్‌గా, డోర్ మ్యాన్‌గా ఉద్యోగాలు చేస్తున్నాయ్! శునకాలు ఎయిర్‌పోర్ట్ రక్షకులుగా ఉద్యోగాలు చేస్తున్నాయ్! పక్షులు పెయింటింగ్స్ వేస్తున్నాయ్! ఇప్పుడు ఆ జాబితాలోకి వచ్చి చేరింది స్పినీ. ఇంతకీ ఈ స్పినీ ఎవరు? అది చేస్తున్న ఉద్యోగం ఏంటో తెలుసుకోవాలంటే మనం స్కాట్లాండ్ వెళ్ళాల్సిందే!

స్కాట్లాండ్‌లోని పెర్త్ గ్రామర్ స్కూల్‌లో విద్యార్థులను భోజనం చేయనీయకుండా, ఆడుకోనివ్వకుండా పక్షులు తెగ ఇబ్బంది పెడుతున్నాయట! వాటితో విసుగెత్తిపోయిన టీచర్లు, విద్యార్థులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆ బెడద వదిలించుకోలేకపోయారు. ఆఖరికి స్కూలు యాజమాన్యం బాగా ఆలోచించి స్పినీ అనే గద్దను రంగంలోకి దించింది. అందుకోసం దాదాపు ఏడు లక్షలు ఖర్చు పెట్టిందట యాజమాన్యం! స్పినీ ఉద్యోగంలో జేరాక, పక్షులనేవే ఆ స్కూలు దరిదాపుల్లో కనిపించడం లేదట! మొత్తానికి స్పినీ ఆ స్కూలు సెక్యూరిటీ గార్డ్‌గా మారింది. పక్షులకు కూడా ఉద్యోగాలు ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది మరి!



నేచురల్ ఆభరణాలు

గుర్తింపు రావాలంటే ఏ పని చేసినా వెరైటీగా ఉండాలి మరి! అప్పుడే అందరి కళ్ళల్లో పడతాం. అందుకే ఆమెరికాలో ఓ కుటుంబం బతకడానికి సంపాదన కోసం అలాంటి వెరైటీ వ్యాపారమే మొదలుపెట్టింది. జనాన్ని ఆకర్షించేందుకు వెరైటీగా ప్లాన్ చేసి ఓ నగల దుకాణం పెట్టిందా కుటుంబం. నగల దుకాణం అంటే, బంగారం, వెండి నగలు అమ్మకానికి పెట్టారనుకుంటే పొరబాటే! తేనెతో తయారుచేసిన ఆభరణాలు మాత్రమే అక్కడ లభిస్తాయి.

రెజిన్, సిట్రైన్, వెండి, బంగారం, తెల్లటి సాఫైర్ రాళ్ళతో గొలుసులు, గాజులు, ఉంగరాలు తయారుచేసి వాటిని తేనెతో నింపుతున్నారు. తేనెతో చేసిన ఈ ఆభరణాలను ఆన్‌లైన్‌లో కూడా అమ్మకానికి పెట్టారు. ఫోటోలు చూడండి ఆభరణాలు ఎంత బాగున్నాయో!

-నర్మద వాసిరెడ్డి

సినీ నారాయణీయం

(ఎమ్మెస్ నారాయణ జీవితచిత్రం) 23

డాక్టర్ దేవుడైతే ఆటోవాడూ దేవుడే!

చిన్నవాడు కదా అని వాడి నెత్తెక్కి కూర్చోను. గొప్పవాడు కదా అని వాడి ముందు నేల మీద కూర్చోను. నేను ఇప్పటి వరకూ అలాగే బతికా. నేను ఎవర్నీ హర్ట్ చేయలేదు. వాడు తక్కువైతే నేను ఎక్కువ చేయలేదు. వాళ్ళు ఎక్కువైతే నేను తక్కువ చేయలేదు. నేనేంటో అదే చేశాను. అదే నా క్యారెక్టర్.

ఒకడు మట్టిలో జారిపడ్డాడనుకోండి నవ్వుతారు. కానీ వాడికి దెబ్బ తగులుతుంది. వాడికి అది బాధే. కమెడియన్ జీవితం కూడా అలాంటిదే. నేను చిన్నప్పుడు స్టాండ్ వేసి ఉన్న మా మావయ్య సైకిలు ఎక్కి తొక్కేస్తుంటే సైకిల్ పడిపోయి నా ఎడం చెయ్యి బోన్ డిస్‌లొకేషన్ అయింది. అది చూసి మా నాన్న ఏం చేశాడంటే, చేతిని గట్టిగా గుంజి సరిజేయాలని ప్రయత్నించాడు. అయితే అది ఎక్కడుందో అక్కడే ఉంది. అందుకే నా ఎడం చేయికి ఒక బెండు ఉంటుంది. కుడిచేయి మాత్రం సమానంగానే ఉంటుంది. 'ఒట్టేసి చెప్తున్నా' సినిమాలో డైరెక్టర్ సార్ నా బెండు చెయ్యి చూసి, దీని మీద ఒక షాట్ వేద్దాం సార్ అని సాంగ్‌లో రాశాడు. నేను ఫ్యాక్షనిజాన్ని వదిలి వెళ్ళిపోతుంటే, 'తొంటి చెయ్యి ఊపి చూడు' అని బ్యాక్‌గ్రౌండ్ సాంగ్ వస్తుంది. చాలామంది అనుకుంటారు వీడికి గీర, అందుకే చెయ్యి అలా పెట్టి నడుస్తూ ఉంటాడు అనుకుంటారు. గీర కాదది. బోన్ డిస్‌లొకేషన్. ఒక కమెడియన్‌గా నాకా వంకర పనికొచ్చింది. ఒక కమెడియన్‌కి ఎన్ని వంకరలుంటే అంత గొప్పన్నమాట! అదే పనికొచ్చింది మనకి".

అది వాళ్ళు చెబితేనే మనకి ఆనందం

"నా లైఫ్‌లో పెద్ద ఇన్సిడెంట్ ఒకటి జరిగింది. మద్రాసు మహాలింగపురంలో బ్రౌన్‌స్టోన్ అపార్టుమెంట్ అని ఒక అపార్టుమెంట్ ఉంది. అది అంజనా ప్రొడక్షన్స్ ఆఫీసు. దాంట్లో నేను, చిరంజీవిగారి తమ్ముళ్ళు నాగబాబు, పవన్ కల్యాణ్‌గారు కలిసి కథలు తయారు చేసేవాళ్ళం. పవన్ కల్యాణ్‌గారు, అప్పుడు నాకు ఆయన బాగా పరిచయం. నేను రచయితగా కూడా ఉండే వాణ్ణి. ఆయన కూడా ఇంగ్లీషు నవలలవీ బాగా చదివి స్టోరీ మేకింగ్‌లో ముఖ్యమైన పాత్ర వహించేవారు. అప్పుడు నేను రచించిన కథ 'ముగ్గురు మొనగాళ్ళు'. అఫ్‌కోర్స్ నా పేరు లేకపోవచ్చు అది వేరే విషయం. కానీ కథలు రాయడానికి చాలా కృషి చేసేవాణ్ణి. అప్పుడు నేను, ఆయన, పురాణం సూర్య ట్రీట్‌మెంట్. అప్పుడు పవన్‌కల్యాణ్‌గారు చాలా యంగ్‌గా ఉండేవారు. ఆయన పుస్తకాలు చదివేవారు. మేమిద్దరం చిరంజీవిగారి కోసం కొన్ని కథలు తయారుచేసి ఆయనకు చెప్పేవాళ్ళం. చిరంజీవిగారు కొన్నింటిని ఆమోదించేవారు, కొన్నింటిని రిజెక్ట్ చేసేవారు. అలాంటి కథల్లో 'ముగ్గురు మొనగాళ్ళు' సినిమా కథని చిరంజీవిగారు ఆమోదించారు. ఈ విషయాలనే ఆ మధ్య జరిగిన 'అత్తారింటికి దారేది' సినిమా థాంక్స్‌మీట్‌లో పవన్ కల్యాణ్‌గారు గుర్తు చేసుకున్నారు. ఆయన అలా గుర్తు చేసుకోవడం నాకు చాలా సంతోషం అనిపించింది. ఇటువంటి విషయాలు మనం చెప్పుకోవడం కాదు. వాళ్ళు నోటి వెంట చెబితేనే మరింత ఆనందంగా ఉంటుంది.

ఒకవైపు ముగ్గురు మొనగాళ్ళు సినిమా స్టోరీ డిస్కషన్స్. అదే సమయంలో నాకు మా కాలేజీలో చాలా ముఖ్యమైన రోజులు. ఆ విషయం నేను కల్యాణ్ బాబు గారికి చెప్పాను. ఆయన ఊరుకున్నారు. నాగబాబుగారు ప్రొడ్యూసర్. ఆయన ఇప్పటికీ నన్ను చాలా గౌరవిస్తారు. షూటింగ్ అంటే అందులో టెక్నికాలిటీస్ అవీ ఇవీ చాలా ఉంటాయి. అప్పుడు ఇక నేను చేసేదేం లేక కల్యాణ్‌బాబుకీ, నాగేంద్ర బాబు గారికి చెప్పకుండా పారిపోయి నేను కాలేజీలో జాయినవ్వవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో ఇక ఎవరు ఎన్ని చెప్పినా కూడా కుదరని పరిస్థితన్నమాట. నేను కాలేజీకి వెళ్ళి తీరాల్సిందే. నాగేంద్రబాబుగారు కూడా అంతకు ముందు ఒక ఆపరేషన్ చేయించి నాకు హెల్ప్ చేశారు. అవన్నీ నాకు గుర్తున్నాయి.

చిరంజీవిగారికి భీమవరంలో ఒక ఫ్రెండు ఉన్నారు. ఆయన ఒక కార్డియాలజిస్టు. మద్రాసు నుంచి వాళ్ళు ఆయనకి ఫోన్ చేశారు. ఇలా స్టోరీ డిస్కషన్‌లో ఉండగా ఆయన చెప్పకుండా వెళ్ళిపోయారు. ఆయన్ని కొంచెం పంపించండి అని.

నేను గర్వించా. ఎందుకంటే ఒక స్టోరీకి, నా మేకింగ్‌కి ఇంపార్టెన్స్ ఇస్తున్నారనేది ఒక మంచి కారణం. నాకు అదొక హ్యాపీ. అయినప్పటికీ కాలేజీలో ఒన్‌వీకో, టూ వీక్సో వర్క్ చేయకపోతే నా ఉద్యోగం పోతుంది. అప్పటికి నేను సెటిల్ అవ్వలేదు. డాక్టరు గారు నా కోసం రెండు రోజులు కబురుపెట్టారట. నేను దొరకలేదు. సరే మూడో రోజు. నేను వెళ్ళి హాస్పిటల్‌లో కూర్చున్నా. గంటన్నర కూర్చున్నా. నా పక్కనే ఉన్న చిన్న పిల్లవాడు చేతిలో ఉన్న దేన్నో పట్టుకుని గోడ మీద గీతలు గీశాడు. ఆ కుర్రాణ్ణి కాంపౌండర్ పట్టుకున్నాడు. పట్టుకొని లోపలికి తీసుకెళ్ళాడు. బయటికి తీసుకొచ్చిన తరువాత గోడ మీద గీతలు గీశాడు. దానికి 200 రూపాయలు అవుతుందని డాక్టరుగారు కబురు పెట్టారని చెప్పాడు. ఆ పిల్లాడి తాలూకా వాళ్ళు 200 లు ఇస్తామన్నారు. అప్పటి దాకా నాకున్న అభిప్రాయాలు మారాయి.

డాక్టర్ ఈజ్ ఏ మెకానిక్

లోపలికి వెళ్ళా. డాక్టరుగారు కూర్చుని ఉన్నారు. నమస్కారమండీ అన్నా. నిన్ను గంటన్నరసేపు బయట ఎందుకు కూర్చోబెట్టానో తెలుసా అన్నారాయన. ఎందుకు అన్నా. ఒక మెగాస్టార్ తన సినిమా గురించి కథ రాయమని చెబితే, నాగేంద్ర బాబుగారు వీళ్ళందరూ మీ కోసం వెతుకుతుంటే మీరు చెప్పకుండా వచ్చేసి మాకు దొరక్కుండా తిరుగుతున్నారు. ఇక్కడికి రమ్మని మీకు కబురు పంపించినా గానీ మీరు రాకుండా ఇలా డిలే చేయటమేమిటి? ఏదో ఒకటి చెప్పాలి కదా? అందుకనే పనిష్‌మెంట్‌గా ఈ గంటన్నర మిమ్మల్ని బయట కూర్చోబెట్టడం అన్నారు. నేను ఆయనతో మాట్లాడుదామనుకున్న మ్యాటర్ వేరు. ఇక్కడ నుంచి నేను మాట్లాడదామనుకున్న మ్యాటర్‌ని వేరు చేశాడాయన. నేను ఒకటే అన్నా. నేను వాళ్ళ పట్ల తప్పు చేస్తే నాకు పనిష్‌మెంట్ ఇవ్వటానికి మీరెవ్వరూ అన్నా. నేనొక డాక్టర్ అన్నాడు. డాక్టర్ అంటే ఏంటన్నా. ఏంటీ అన్నాడు ఆయన. నేను చెప్తా. డాక్టర్ ఈజ్ గాడ్ ఆన్ ద ఎర్త్ అని అంటారు. వాళ్ళందరూ చదువురాని వాళ్ళు. తెలియని వాళ్ళు మిమ్మల్ని అనవసరంగా పెంచేటటువంటి అజ్ఞానులు, నేనేమంటానో చెప్పనా అన్నా. ఏమంటావు అన్నాడు ఏకవచనంలో. మీరు నన్ను ఏమని పిలిచారు అన్నా. ఆ ఏమంటారు? అన్నారాయన.

డాక్టర్ ఈజ్ ఎ మెకానిక్. జస్ట్ హ్యూమన్ మెకానిక్. మీ దగ్గరికి వచ్చేటప్పుడు నాకు ఒక స్కూటర్ ఉంది. ఒక మెకానిక్ దగ్గరికి వెళ్ళా. నా స్కూటర్ ఒక హ్యూమన్ బాడీ. విత్ అవుట్ బ్రెయిన్ ఎ స్కూటర్, విత్ బ్రెయిన్ ఈజ్ ఎ హ్యూమన్. హీ ఈజ్ ఎ మెకానిక్ ఆఫ్ ది స్కూటర్. యు ఆర్ మెకానిక్ ఆఫ్ ద హ్యూమన్ బాడీ. నాకో బ్రెయిన్ ఉంది. దాన్ని కూడా మెకానిజం చేయగలవు నువ్వు. కారణం నీకో బ్రెయిన్ ఉంది. నేను లిటరేట్. ఎం.ఏ. తెలుగు లిటరేచర్. నా లిటరేచర్‌తో కోట్లమందిని మార్చగలను నేను. జస్ట్ నీ దగ్గరికి ఏ పేషంట్ వస్తే వాడికే వైద్యం చేయగలవు నువ్వు. డాక్టర్ ఈజ్ జస్ట్ ఎ హ్యూమన్ మెకానిక్. నన్ను పనిష్ చేసే అధికారం గానీ, హక్కు గానీ నీకు లేవు. నీది చాలా తప్పు. అహంకారం నీది. క్యాస్ట్ ఫీలింగ్ నీది. గునిపూడి ఏరియాలో హాస్పిటల్ పెట్టి, చిరంజీవి ఫోటో పెట్టుకుని వైద్యం చేస్తున్న ఒక క్యాస్ట్ ఫీలింగ్ ఉన్న ఒక మెకానిక్‌వి నువ్వు అన్నా. ఆయన రియాక్షన్ ఏం లేదు. నువ్వు మూర్ఖుడివి అనుకో. పోరా ఇక్కడినుంచి అంటావు నన్ను. ఎందుకంటే ఇది నీ ప్లేస్ కాబట్టి అన్నా. అదే డాక్టరు పాతికేళ్ళ తరువాత నా తల్లి మరణిస్తే ఆ అంత్యక్రియలకు హాజర్ అయ్యాడు. ప్రపంచంలో డాక్టర్లందరికీ చెప్పండి. డాక్టర్ ఈజ్ ఎ మెకానిక్. డాక్టర్ దేవుడు అనుకుంటే, డాక్టర్ దగ్గరికి టైమ్‌కి రోగుల్ని హాస్పిటల్‌కి తీసుకెళ్ళే ఆటోవాడు కూడా దేవుడే.

ఎమ్మెస్ రచయితగా ఉన్నప్పుడు మద్రాసులో అంజనా ప్రొడక్షన్ ఆఫీసులో నాగబాబు, పవన్ కల్యాణ్‌లతో స్టోరీ డిస్కషన్స్ చేస్తూ కథలు తయారు చేసేవారు. అలా ముగ్గురు మొనగాళ్ళు స్టోరీ డిస్కషన్స్ జరుగుతున్న సమయంలో ఎమ్మెస్ భీమవరంలో కాలేజీకి వెళ్ళాల్సి వచ్చింది. ఆయనకు అడకత్తెరలో పోకచెక్కలాంటి పరిస్థితి ఏర్పడింది. అప్పుడు ఎమ్మెస్ ఏం చేశారు?

ఆ ప్రొడ్యూసర్‌కి పదివేలు తిరిగిచ్చేశా

1985లో ఒక మిత్రుడు నన్ను కలిశాడు. ఒక టీవి ఎపిసోడ్ చేద్దామని వచ్చాడు. ఆయన పేరు శ్రీనివాస్‌రెడ్డి. ఎంతవుద్దండి అన్నా. ఎంతైతే మీకెందుకండి మీరు డైరెక్టు చేయండి అన్నాడు. నేను డైరెక్ట్ చేశా. నర్సాపురంలో షూటింగు. మా కాలేజీలో లెక్చరర్ మెంటె రాణిగారు. ఆవిడతో రిబ్బన్ కట్ చేయించి షూటింగ్ ప్రారంభించా. అప్పుడు హైదరాబాద్‌లో ప్రభూ అని ఒక స్టూడియో అతను ఉండేవాడు. నేనెళ్ళి మాట్లాడితే, వీడికేం తెలియదు. వీడు వెర్రి వెధవ అని జమ కట్టాడు. రివైండ్ క్యాసెట్లు, అంతకుముందు చేసి వాడేసిన మూడు క్యాసెట్లు చేతిలో పెట్టి ఒక కెమెరామెన్‌ని ఇచ్చి పంపాడు. ఇంతకీ వాడెవడంటే పెళ్ళిళ్ళకి వీడియోలు తీసే కెమెరామెన్ అన్న మాట. వాణ్ణి పెట్టుకుని ఓ సినిమా తీశా. సినిమా పేరేంటంటే 'ఓ చెల్లి పెళ్ళి' 30 మినిట్స్ ఎపిసోడ్. దాంట్లో రాజా అన్నయ్య సాంబమూర్తి రాజు హీరో. నేను డైరెక్ట్ చేశాను.

దాన్ని తీసుకుని హైదరాబాద్ వచ్చా. బాబూ ఖాన్ ఎస్టేట్‌లో ఓ చిన్న సూట్ ఉండేది. అక్కడ ప్రభు అనేవాడున్నాడు. అక్కడికి డబ్బింగ్ చెప్పడానికి కొంతమందిని పిలిచాడతను. కాదంబరి కిరణ్ కుమార్, అనంత్ వచ్చారు. నాకప్పుడు వీళ్ళందరూ స్టార్స్. అనంత్‌గారిని అడిగాను. సార్ ఎలా ఉంది అన్నా. పర్లేదండీ మీరు ఎప్పుడన్నా ఇంట్లో చూసుకోవచ్చు అన్నాడాయన. ఆయన కరెక్ట్ గానే చెప్పాడు. ఏంటీ! ఇలా అన్నాడని చూస్తే, చాలా చోట్ల పిక్చర్ కనబడటం లేదు. ఎందుకంటే వాడి పారేసిన క్యాసెట్లో తీసింది కదా మరి! నేను చెప్పా. ఇది అన్యాయం నాకు ఈ విషయం తెలియదు అన్నా. ఒకడు అన్నాడు, అదేంటి క్యాసెట్ ఏంటో తెలియదా నీకు? అన్నాడు. డైరెక్టర్‌కి అన్నీ తెలియాలి అన్నాడు. నాకవన్నీ తెలియవండీ. నాకు డైరెక్షన్ మాత్రమే తెలుసు అన్నా. తరువాత చాలా కాలానికి ఆ ప్రొడ్యూసర్ ఒకసారి, హైదరాబాద్ జూబ్లీహిల్స్ సెంటర్‌లో కనిపించాడు. శ్రీనివాస్‌రెడ్డిగారూ అని పిలిచి, కారు ఎక్కండి అన్నా. నా కారెక్కాడు. కూర్చున్నాడు. సార్ అప్పుడు మీరు ఎంత ఖర్చుపెట్టారు అన్నా. 'పదివేలు' అన్నాడు. ఆ డబ్బు ఇస్తానుగానీ, వడ్డీ మాత్రం ఇవ్వలేనన్నా. 10 వేల రూపాయలు కట్ట ఇచ్చి, క్షమించండి, నాకు డైరెక్షన్ తెలియకుండా చేసేశాను. మిస్టేక్ జరిగింది. ఏమనుకోకండి అని పంపించేశాను.

(ఇంకావుంది)

-కూనపరాజు కుమార్
సెల్: 99899 99599

హావేలీ

-ఎస్. ఘటికాచలరావు

(కొత్త సీరియల్ ప్రారంభం)

రైలు కొండల మధ్య మలుపులు తిరుగుతూ నిదానంగా తన గమ్యం చేరుకోవడానికి ఆరాట పడుతోంది. దాని గమ్యం అరకు లోయ!

దానికి పక్కనే కొంతదూరంలో, కనుచూపు మేరలోనే రోడ్డు మీద రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సొకటి నిదానంగా అరకులోయ వైపు వెళ్తోంది. పర్వత ప్రాంతం కావడం వల్ల, రోడ్డు మెలికలు తిరిగి ఉండడం వల్ల అంతకన్నా వేగం పెంచడం సాధ్యం కాదన్నట్టు డ్రైవర్ బస్సు నడుపుతున్నాడు.

దాదాపు ఆ రెండూ పోటీపడి వెళ్తున్నట్టున్నాయి. కాసేపటికి రెండు దారులూ మరింతగా విడిపోయాయి. బస్సులో ఉన్నవారికి రైలు కనుమరుగైంది.

అయినా దేని గమ్యం దానిదేనన్నట్టుగా ఆ బస్సు రత్నగిరి ప్రాంతంలో ఆగింది.

అప్పుడు సమయం సరిగ్గా ఉదయం ఆరు గంటలు. మంచుతెరల నడుమ నారింజ రంగులో సూర్యుడు 'నా పని మొదలైంది' అన్నట్టు కనిపిస్తున్నాడు. ప్రకృతి అత్యంత రమణీయంగా ఉంది. అయితే సూర్యుడు తన ప్రతాపం చూపించాలంటే కనీసం మరో గంట వ్యవధైనా కావాలి. మంచు తెరలింకా తొలగిపోనందున చుట్టుపక్కల ప్రదేశాలు స్పష్టంగా కనబడడం లేదు. రోడ్డుకు ఒక వైపు లోయలో ఏదో చిన్న గ్రామం ఉన్నట్టుంది.

బస్సులో నుంచి పాతికేళ్ళ యువకుడొకడు వీపుమీద ఒక చిన్న బ్యాగ్‌తో దిగాడు. 'రిక్వెస్ట్ స్టాప్'తో తన పనై పోయిందన్నట్టు బస్సు బయలుదేరింది.

దిగిన వ్యక్తి చిన్నగా నిట్టూర్చి జేబులో చేతులుంచుకుని చుట్టూ ఓసారి కలియజూశాడు. రోడ్డుకు ఒకవైపు లోతైన లోయ. మరోవైపు బండ రాళ్ళ గుట్టలాంటి కొండ. మరోమారు రోడ్డుకిరువైపులా చూశాడు. కనుచూపు మేరలో ముందూ వెనకా వాహనాలేవీ రావడం లేదు.

అసలే కొండ ప్రాంతం. అందులో అప్పుడే ప్రారంభమైన చలికాలం. ఎముకలు కొరికే చలిలో

పళ్ళ బిగువున చలి తట్టుకుంటూ తూర్పువైపు చూశాడు. మంచుతెరల నడుమ చంద్రబింబం లాంటి సూర్యబింబం గమ్మత్తుగా అనిపించింది. సూర్యగ్రహణం రోజు మసిపూసిన గ్లాసుగుండా చూసే సూర్యబింబంలా అనిపించింది. కొండకిందుగా కంటికి కనిపించేవరకూ పచ్చని పచ్చిక బయళ్ళు, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ తన్మయత్వంతో కొంతసేపు కదలకుండా అక్కడే నిలబడిపోయాడా యువకుడు.

కాస్సేపటికి తేరుకుని చూస్తే బస్సు దిగిన ప్రాంతానికి కొద్దిదూరంలో ఒక చిన్న పాక కనిపించింది. మెల్లగా దానివైపు నడిచాడు.

దాన్ని సమీపిస్తుండగానే అతనికి ప్రాణం లేచి వచ్చినట్లైంది. అతనూహించినట్టే అదొక చిన్న హోటల్. బాటసారులకు కల్పతరువు. అదే సమయంలో ఆ హోటల్‌కు అక్కడ ఆగే ప్రతి బస్సు కామధేనువులాంటిది.

అరకులోయకెళ్ళే దారి. రోడ్డుకిరువైపులా లోయ. ఓ యువకుడు ఎటూకాని చోట బస్సుదిగి ఒక హోటల్ దగ్గరకెళ్ళి ఫలానా గ్రామానికి దారెటని అడిగాడు. హోటల్ ఓనర్ అదోలా చూసి దారిచూపించాడు. అతడెళ్ళిపోతుంటే పనిగట్టుకుని వెళ్ళి అతన్నే గమనించసాగాడా ఓనర్. గ్రామంలో కూడా అదే పరిస్థితి. కొందరు అతన్ని ఫాలో అవటం ప్రారంభించారు. ఒకడైతే అతన్ని అడ్డుకున్నాడు. వాళ్ళెందుకు అలా ప్రవర్తిస్తున్నారు?

‘చూడ్డానికి చిన్నగుడిసెలా ఉన్నా ఇది దాదాపు పుష్పక విమానం లాంటిది. ఎంతమంది లోపలికొచ్చినా మరొకళ్ళకు జాగా ఉంటుంది. అదే సమయంలో ఆ హోటల్లోని గిన్నెలన్నీ అక్షయ పాత్రలు. ఎంతమంది వచ్చినా ఖాళీ అయిపోవు. ఒక్కోసారి ఆలోచిస్తే ఈ హోటల్ బిజినెస్ గొప్ప పుణ్యకార్యంలా అనిపిస్తుంది. అన్నదాతా సుఖీభవ! అని ఊరికే అనలేదు. డబ్బులు వసూలు చేస్తారు గదా అనుకున్నా సమయానికి కడుపు నింపి జీవుణ్ణి తృప్తి పరుస్తారు. వసూలు చేసే డబ్బు కొన్ని సందర్భాల్లో అసందర్భంగా ఉన్నా ఆ సమయానికి తప్పదు మరి. అంత డబ్బు వెచ్చించి తినాల్సిందే. డిమాండ్ అండ్ సప్లై సూత్రం. ఇంత దూరం కొండమీదికి సరుకులు తేవాలంటే అతనిక్కూడా ఖర్చవుతుందిగా మరి. అవే ధరలు కాస్త లాభాపేక్ష లేకుండా నిర్ణయిస్తే హోటళ్ళన్నీ పుణ్యధామాలే. ఆ యజమానులకు, అక్కడ పనిచేసే వారికీ పదిజన్మలకు సరిపడా పుణ్యం దక్కుతుంది. అదంతా వారివారి ఆలోచనా విధానాలపై ఆధారపడి ఉంటుంది’.

తన ఆలోచనలకు తనే చిన్నగా నవ్వుకుంటూ లోపలికి నడిచి తనవీపుమీద ఉన్న చిన్నబ్యాగ్ కింద పెట్టి అక్కడున్న కుర్చీలో కూర్చున్నాడతను.

ఆకలిగా ఉంది. కేవలం టీతో సరిపెట్టుకోలేనేమో అనిపించిందతనికి.

టిఫిన్ ఏముందని అడిగాడు. అందుకా షాపు వాడిచ్చిన జవాబు ‘ఎవర్ గ్రీన్ ఇడ్లీ’.

నవ్వుకుని ఓ ప్లేటిమ్మన్నాడు. నాలుగిడ్లీలు అతని ముందుకొచ్చాయి. పట్నంలో అయితే ప్లేటంటే రెండే ఇడ్లీలు. సైజు కాస్త పెద్దవిగా రెండు తినేసరికి కడుపు నిండినట్లైంది. కాస్త నిదానించి నాలుగూ ఖాళీ చేశాడు.

తింటూనే హోటలు వాడితో మాటలు కలిపాడు.

“ఎన్నాళ్ళుగా ఉందీ హోటల్ ఇక్కడ?”

“పదేళ్ళు” క్లుప్తంగా ఉందతని సమాధానం. జవాబిచ్చే మూడ్‌లో లేనట్టుంది.

ఎక్కువ మాట్లాడకూడదనుకుని మౌనం వహించాడతను. ఇడ్లీలు తిని ముగించేలోపే సర్వరు నెక్స్ట్ ఐటమ్ అడిగాడు. తల అడ్డంగా ఊపి ‘టీ’ అన్నాడు. టీ వచ్చేలోపు చేతులు కడుక్కుని మూడు గ్లాసుల నీళ్ళు తాగేశాడు.

ఇప్పుడు ప్రాణానికెంతో హాయిగా ఉంది. ‘క్రితం రోజు రాత్రి ఆకలి కాలేదని ఏమీ తినకపోవడమే ఈ ఆకలికి కారణం. ఆకలున్నా లేకపోయినా ఎంతో కొంత తినేస్తే కడుపు ప్రశాంతంగా ఉంటుంది. శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. అల్సరు సమస్యలు అసలేరావు. ఇకముందు అలాగే చెయ్యాలి’ అనుకున్నాడు.

సమయం ఆరున్నర. మంచుతెరలు త్వరగా కరిగేట్టు కనబడలేదు. ఇంత తొందరగా రాకుంటే బాగుండేదేమో అని పించింది. టీ తాగడం ముగించి, తిని తాగిందానికి డబ్బు చెల్లించి మళ్ళీ బ్యాగ్ భుజాన తగిలించుకుని నడక సాగించాడు.

వెళ్ళే ముందు “ఆ కిందన కనిపించే పల్లె చేరుకోడానికి దగ్గర దారేదైనా ఉందా?” అనడిగాడు.

షాప్‌ఓనర్ ఆ వ్యక్తి వంక అదోలా చూస్తూ సంజ్ఞలతో దారి చూపించాడు.

అతను తనవంక ఎందుకలా చూశాడో అర్థం

అతను తనవంక ఎందుకలా చూశాడో అర్థం కాక ఒకట్రెండు సార్లు వెనక్కి తిరిగిచూస్తూ ముందుకు అడుగులు వేశాడు.

ఆ టీ కొట్టువాడింకా అతన్ని చూస్తూనే ఉన్నాడు. అతని చూపుల తూపుల నుంచి తనను తాను కాపాడుకుంటున్నట్టుగా మళ్ళీ వెనక్కు తిరిగి చూడదల్చుకోలేదు.

దాదాపుగా వంద అడుగులు వెళ్ళి మళ్ళీ వెనక్కు తిరిగి చూశాడు. టీ కొట్టువాడు కొండ అంచుకు వచ్చి అతన్నే గమనిస్తున్నాడు. చకితుడయ్యాడా యువకుడు.

రోడ్డు ఏటవాలుగా ముందుకు సాగుతోంది. కొంతదూరం వెళ్ళాక రోడ్డుకు పక్కనే ఒక చిన్న కాలిబాట కనిపించింది. అది ఆ హోటల్ ఓనరు చెప్పిందే అని గుర్తించాడు. అది రోడ్డు నుంచి చీలి కొండ దిగువకు సాగిపోతోంది. ఆ కాలిబాట వెంబడి నడక సాగించి కొంతదూరం వెళ్ళాక ఆగి తూర్పువైపు చూశాడు. నారింజ రంగు నుంచి పసుపు రంగుకు మారుతున్న సూర్యుడు, చూస్తుండగానే పట్టు వస్త్రంలా మెరవసాగాడు. ఇక ఆపై సాధారణంగా సూర్యుణ్ణి నేరుగా చూడ్డం అసంభవం. అతను చుట్టూ చూశాడు. ఇప్పుడు పరిసరాలు కాస్త స్పష్టంగా కనబడుతున్నాయి.

వెంటనే బ్యాగ్ లోనుంచి బైనాక్యులస్ తీసి పరిసరాలన్నీ జాగ్రత్తగా గమనించాడు. దూరంగా అగ్గిపెట్టెల పరిమాణంలో ఇళ్ళు కనబడుతున్నాయి. అన్నీకలిపి ఓ యాభై లేదా వంద ఇళ్ళ కన్నా ఉండవేమో. చిన్నగ్రామం లాగుంది. అలాగే తన బైనాక్యులస్ పరిసర ప్రాంతాల వైపు తిప్పాడు. ఆ ఇళ్ళతో సంబంధం లేనట్టుగా, కాస్త దూరంగా ఒక పెద్ద భవంతి కనబడింది. ఠక్కున అక్కడ ఆగిపోయింది అతని చెయ్యి. బైనాక్యులస్ తీసేసి చూశాడు. అంతలోనే నవ్వుకున్నాడు.

'బైనాక్యులస్ లోనే ఆ మహలు చాలా చిన్నదిగా కనబడుతుంది. అలాంటిది మామూలు కళ్ళకు ఎలా కనబడుతుంది? సినిమాల్లో కూడా చూసేవాళ్ళకు ఏదో టెన్షన్ క్రియేట్ చేసిన అనుభూతి కలిగేందుకు ఇలాగే చేస్తారు. ఐతే ఎందుకు చేస్తారో ఇప్పుడర్థమైంది. అదొక అనాలోచిత, అసంకల్పిత చర్య' అనుకుని మళ్ళీ చూశాడు.

అంతకన్నా దగ్గరగా చూడాలనుకుంటే కుదరలేదు. ఆ భవంతి అక్కడున్న ఇళ్ళతో పోల్చి చూస్తే పదిరెట్లు పెద్దదిలాగుంది. ఆ భవంతికి వెళ్ళేందుకు వేరే కాలిబాటేదైనా ఉండవచ్చనేందుకు ఆనవాలుగా భవంతి నుంచి ఆ గ్రామం వరకూ కొంతమేరకు దట్టంగా చెట్లు మొలిచి కనబడుతున్నాయి. భవంతి పక్కనే మామిడితోపు లాగుంది.

దూరం నుంచి చూస్తే భవంతి ఇంచుమించుగా పాడు బడినట్టు కనబడుతోంది. బహుశా రంగు వెలిసి పోయినందువల్ల అలా అనిపిస్తోందేమో. అతను నిలబడ్డ చోటుకు గ్రామంలో తిరిగే మనుషులు కనబడుతున్నారు. ఐతే భవంతి పరిసరాల్లో జన సంచారం కనబడలేదు.

మరికాస్సేపు ఆ గ్రామాన్నీ, భవంతినీ, పరిసరాలనూ గమనించి చూసినవి మనసులో నిక్షిప్తం చేసుకుని గ్రామం వైపు అడుగులు వేశాడు.

గ్రామం మొత్తం మీద ప్రధానంగా ఉన్నవి నాలుగైదు వీధులు మాత్రమే. గ్రామంలో ప్రవేశించి నడుస్తూండగా అందరూ తనవంక అదోలా చూడడం గమనించాడు.

అతను కొత్తవాడన్న సంగతి అందరికీ తెలిసిపోయింది. తన ముఖకవళికల్లో అది ప్రస్ఫుటంగా ప్రతిబింబించడాన్ని అతను నివారించుకోలేకపోయాడు.

అలా నడుస్తూ కొంతదూరం వెళ్ళాక ఎవరో అడ్డొచ్చినట్టు ఠక్కున ఆగిపోయాడు.

నిజంగానే ఎవరో అడ్డంగా నిలబడి ఉన్నారు.

ఎవర్నువ్వు అన్నట్టు కళ్ళెగరేశాడా వ్యక్తి.

మాట్లాడకుండా కాస్సేపు అతనివంకే తీక్షణంగా చూశాడు. అతని చూపుల తీవ్రతకు అడ్డం నిలబడ్డ వ్యక్తి కాస్త జంకినట్టు కనబడినా అంతలోనే యథాస్థితికి వచ్చి మళ్ళీ అదే విధంగా కళ్ళెగరేశాడు.

ఈసారి ఆ యువకుడు మెల్లగా తన జేబులో నుంచి ఒక చిన్న కాగితం ముక్క తీసి ఎదురుగా నిలబడి ఉన్నతనికి అందించాడు.

అందులోని అక్షరాల వెంట అతని కళ్ళు పరుగెత్తాయి.

వెంటనే ఆ వ్యక్తివైపు చూసి వెనక్కు తిరిగి చేతులతో సంజ్ఞ చేసి దారి చూపాడు.

ఆ వ్యక్తి అతను చూపిన దారిలో నడక సాగించాడు.

కాస్సేపటికి ఏదో అనుమానం వచ్చి ఠక్కున ఆగి వెనక్కు తిరిగి చూశాడు.

అతని వెనక ఓ అరడజను మంది యువకులు, మధ్య వయస్కులు వస్తున్నారు. అతను ఆగడం చూసి వాళ్ళు కూడా ఠక్కున ఆగిపోయారు.

ఆ వ్యక్తి చూపుల్లో కొద్దిగా బెరుకు కనిపించినట్టనిపించింది వాళ్ళకు.

దాంతో కొద్దిగా ధైర్యం పుంజుకున్న మనుషులు రెండడుగులు ముందుకు వేశారు. అంతలోనే అతడి చూపులు మళ్ళీ తీక్షణంగా మారడంతో ఆగిపోయారు.

యధాలాపంగా మళ్ళీ ముందుకు అడుగులు వేశాడతను. అలా కొంతదూరం వెళ్ళాక ఒక ఇంటి ముందు ఆగాడు. తలుపు మూసి ఉంది. టకటకమని తలుపు తట్టాడు.

కాస్సేపటికి తలుపు తెరుచుకుంది. ఎదురుగా ఒక యాభై ఏళ్ళు పైబడిన వ్యక్తి ఒకతను నిలబడి ఉన్నాడు. వచ్చిన వ్యక్తి తన జేబులో నుంచి మడతపెట్టిన కాగితం ఒకటి తీసి అతనికిచ్చాడు.

దాన్ని చదువుకున్న వెంటనే కాక కాసేపయ్యాక అతని ముఖం వికసించింది.

"అరెరె. మా మల్లన్న కొడుకువా. లోపలికి రా. ఏంటందరూ అలా చూస్తున్నారు? ఇతను మా బంధువుల అబ్బాయే, మా అక్క కొడుకు. వెళ్ళండి" అంటూ వెనక నిలబడి ఉన్న గ్రామస్థులతో చెప్పాడతను. అతను ఎప్పై గోపాలరావు.

అందరూ ముఖాలు చూసుకుని అక్కణ్ణుంచి నిష్క్రమించారు.

"నాన్నగారు కులాసాయేనా బాబూ" లోపలికి రాగానే అడిగాడతను.

తలూపాడా యువకుడు.

"ఎప్పుడో పుష్కరం క్రితం నీకు పుష్కరం వయసున్నప్పుడు పుష్కరాల్లో చూశాను. మళ్ళీ ఇదే చూడ్డం. ఆ తరువాత మా మల్లన్నను కూడా కలవను వీలు కాలేదు. నీ పేరేంటన్నావ్" అంటూ మళ్ళీ అతనిచ్చిన కాగితం చూశాడు.

"విష్ణువర్ధన్. విష్ణు అని పిలవొచ్చు" అన్నాడా యువకుడు.

"ఇంతకూ ఇక్కడికి ఏ పనిమీద వచ్చావు?"

బికినీ కోసం తగ్గిందట!

రాయ్ లక్ష్మీ! ఈ పేరు తెలుగులో వినిపించి చాలా రోజులవుతోంది. ఆ మధ్య తెలుగు సినిమాల్లో ఐటెంసాంగ్స్‌లో అడపాతడపా కనిపించినా, పూర్తి స్థాయిలో సినిమాలు చేసి చాలా సంవత్సరాలయింది. దక్షిణాదిన అదృష్టం కలిసి రాకపోవడంతో ఉత్తరాది మీద కన్నేసింది రాయ్ లక్ష్మీ. ఇప్పుడు 'జూలీ 2' అనే సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా కోసం ఆ మధ్య బరువు పెరిగింది. ఇప్పుడు బరువు బాగా తగ్గి బికినీ వేసుకోవడానికి రెడీ అవుతోందట! ఈ సినిమాలో వేరు వేరు సందర్భాలలో వేరియేషన్స్ చూపించడం కోసమే ఇలా బరువు పెరగడం, తగ్గడం చేస్తోందట! మొత్తానికి బాలీవుడ్‌లో నిలదొక్కుకోవడానికి రాయ్ లక్ష్మీ బాగానే ఒళ్ళు వంచుతోందని అంటున్నారు.

ఆ మాట అడుగుతున్నప్పుడు అతని స్వరంలో ఏదో ఆదుర్దా.

"పరీక్షలకు చదువుకోడానికి. 'పట్నంలో ఐతే కుదరదు. పల్లెలో మీ గోపాలరావు మావయ్య ఉన్నారు. అక్కడికెళ్ళి చదువుకో. మళ్ళీ పరీక్షల సమయానికి వస్తే సరి' అన్నారు నాన్నగారు. అందువల్ల వచ్చాను".

"ఏం పరీక్షలు?" తేలిగ్గా ఊపిరి తీసుకున్నాడు.

"ఐ.పీ.ఎస్".

ఆ మాట వినగానే గోపాలరావు ముఖంలో క్షణంపాటు ఏదో ఆదుర్దా, అటుపైన కొద్దిగా గౌరవంతో కూడిన భయం కనిపించింది.

"పెద్ద పరీక్షే" అన్నాడు నెమ్మదిగా.

"మీ వద్ద ఉండడం వల్ల డిపార్టుమెంట్‌కు సంబంధించిన మెళకువలు కూడా తెలుసుకోవచ్చని నాన్నగారు చెప్పారు. అందువల్ల వచ్చాను. పైగా ఇక్కడి ప్రశాంత వాతావరణం చూస్తూంటే చదువుకోడానికి ఇంతకన్నా అనువైన ప్రదేశం ఉండదేమో అనిపిస్తోంది. ఈ గ్రామం నాకు బాగా నచ్చింది" అన్నాడు ఉత్సాహంగా.

"చాలాదూరం నుంచి వచ్చావు. కాస్త సేద దీర్చుకో. అమ్మాయి కాఫీ ఇస్తుంది. అమ్మా రాధా" అంటూ పిలిచాడు గోపాలరావు.

"అవునూ. ఎందుకు అందరూ నా వెనక వచ్చారు? పైగా అందరూ నన్ను అదోలా శత్రువును చూసినట్టు చూశారు" అన్నాడు విష్ణు అర్థం కానట్టుగా.

ఆ ప్రశ్నకు గోపాలరావు తడబడ్డాడు.

"అబ్బే. అదేం లేదు. నువ్వు వచ్చింది పోలీస్ ఇంటికి గదా. పై పెచ్చు చాలా హుందాగా ఉన్నావు. అందువల్ల ఎవరైనా పెద్ద పోలీసు అధికారేమో అనుకుని ఉంటారు. పెద్ద అధికారులను చూసుండరు కదా, కాస్త భయం అంతే".

"పోలీస్ అధికారి ఐతే మాత్రం భయం ఎందుకట?"

అతను జవాబు చెప్పలేదు. అంతలో అతని కూతురు బయటికి వచ్చింది. విష్ణు తన ప్రశ్నను రెట్టించలేదు. రాధ వైపు చూశాడు. చామనఛాయ, సుమారు ఐదున్నర అడుగుల ఎత్తు. కొద్దిగా సన్నగా ఉంది. ఆడపిల్లలు ఆ మాత్రానికే చాలా ఎత్తు ఉన్నట్టుగా అనిపిస్తారు. ఆకర్షణీయమైన రూపం. లంగా ఓణీ వేసుకుంది. ఉంగరాల ముంగురులు. చూడముచ్చటగా ఉందా అమ్మాయి. అతని కళ్ళు, మనసు రెండూ చెదిరాయి.

"మా అమ్మాయి పేరు రాధ. ఇంటర్ పాసయ్యింది. చదివింది అరకులోనే. పైకి చదవలేక పోయింది. ఇంటి పట్టున ఉంటూ నాకు సహాయంగా ఉంటోంది".

"పై చదువులు ఎందుకు చదవలేదు?"

"ఇన్నాళ్ళూ అక్కడే ఉండేవాళ్ళం. ఉద్యోగ రీత్యా ఇక్కడికి రావల్సి వచ్చింది. పై చదువులకు మళ్ళీ అరకు వెళ్ళాలి. కాదంటే అక్కడే

హాస్టల్లో ఉండాలి. వయసొచ్చిన పిల్ల, పైగా తల్లి లేని పిల్లను అంతదూరం పంపడం శ్రేయస్కరం కాదని మానిపించాను. హవేలీ కేసు విషయమై మొదటిసారి ఇక్కడికి వచ్చినప్పుడు ఇక్కడి వాతావరణం, ఈ ప్రదేశం బాగా నచ్చింది. ఇక్కడే ఉండిపోయాను. మళ్ళీ అక్కడికి వెళ్ళ దల్చుకోలేదు".

అంతలో రాధ కాఫీ తెచ్చింది. దాన్నందుకుని సిప్ చేస్తూ కలయజూశాడు.

ఇల్లు చిన్నదిగా, చాలా పొందికగా ఉంది. చాలా శుభ్రంగా ఉంది. అక్కడక్కడా గోడమీద వాల్ హేంగింగ్స్ ఉన్నాయి. కొన్ని వాటిలా లేవు. అంతా అమ్మాయి చేతిపనిలా ఉంది. చాలా అందంగా ఉన్నాయి కళాఖండాలన్నీ.

అతనలా తన వర్క్ వైపు చూడడం ఆ అమ్మాయి గమనించింది. కొద్దిగా సిగ్గు, బిడియం కనిపించిందామె ముఖంలో.

"ఇవన్నీ మీ హస్తకళలేనా?" అడిగాడు ఉత్సుకత ఆపుకోలేక.

అవునన్నట్టు తలూపింది సిగ్గు, బిడియం మరింత ఎక్కువై.



"వెరీ నైస్. రెడీమేడ్‌గా కొన్న వస్తువులు అనుకున్నా. రియల్లీ నైస్" అన్నాడు. అభినందించేందుకు అతనికి మాటలు చాల్లేదు.

మరింతగా సిగ్గుపడింది. దాంతో ఆమె అందం ద్విగుణీకృతమైంది. అతని ఆనందం నాలుగింతలైంది. అన్నింటివంక మరోమారు చూసి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. కాఫీ తాగడం ముగించి కప్పు ఆమె చేతికందించాడు. అప్పుడు సమయం ఉదయం ఎనిమిది గంటలు.

"అమ్మాయ్. బాబుకు కాస్త వేణ్ణీళ్ళు పెట్టమ్మా. స్నానం చేస్తాడు. ఈ చలిలో చన్నీళ్ళు కుదరదు" రాధను పురమాయించాడు గోపాలరావు.

"ఊరు చాలా చిన్నదిగా ఉంది. అంతా కలిపి యాభై ఇళ్ళుంటాయా?"

"ఇంకా ఎక్కువే ఉండొచ్చు. అంతా ఇక్కడ వ్యవసాయం మీద ఆధారపడ్డ వాళ్ళే. చుట్టుపక్కల ఏ విధమైన ఫ్యాక్టరీలు లేవు. కాబట్టి కాలుష్యం లేదు. ఆహ్లాదకరంగా, ప్రశాంతంగా ఉంటుంది. అందరూ పొలాల్లో పని చేసే కష్ట జీవులే. భగవంతుడి దయవల్ల గ్రామంలో తిండికి లోటు లేదు".

"సాయంత్రం పూట ఊరి బయట తోటలో కెళ్ళి కూర్చుని చదువుకుంటే చాలా బాగుంటుంది కదూ" అన్నాడు తన మనసులోని ఉద్దేశ్యం చెప్తున్నట్టుగా.

"ఇష్టమొచ్చినట్టు ఈ గ్రామంలో తిరగడం మంచిది కాదు బాబూ. కాస్త జాగ్రత్త" ఆ మాట లంటున్నప్పుడు అతని ధ్వనిలో కాస్త కరకుదనం కనిపించింది.

అది గమనించిన విష్ణు దాన్ని పెద్దగా పట్టించుకోక "వచ్చేటప్పుడు కొండ మీది నుంచి చూస్తే ఊరికి దూరంగా ఏదో ఒక రాజమహల్ కనబడింది. అదేమిటి?"

ఆ ప్రశ్న వినగానే ఉలికిపడ్డాడు గోపాలరావు. అతని ముఖంలో ఏదో భయం గోచరించింది. గొంతు తడారిపోయి నట్లైందతనికి.

కాస్సేపటికి "అది పాడుబడ్డ హవేలీ" అన్నాడు గొంతు పెగల్చుకొని.

అతని ముఖంలోని భయాందోళనలు విష్ణు దృష్టిని దాటిపోలేదు. అతని ప్రవర్తనకు విస్తుపోతూ, "అంటే?" అనడిగాడు.

"ఒకప్పుడు ఇక్కడి ప్రజలందరికీ పెద్దదిక్కుగా ఉన్న రాజా విజయేంద్రవర్మ రాజమందిరం. ప్రస్తుతం అక్కడ ఎవరూలేరు. వాళ్ళ వంశమూ లేదు. దాదాపు ఏడాదిగా ఎవరూ ఆ హవేలీ ఛాయలకు వెళ్ళిన దాఖలాలు లేవు".

తండ్రి వంక అదోలా చూసింది రాధ. అది కూడా విష్ణు దృష్టి నుంచి తప్పిపోలేదు.

అంతలోనే తేరుకుని ఓహో అన్నట్టు తలాడించాడు.

"భవంతి దూరం నుంచి చూడ్డానికి చాలా అందంగా ఉంది. మైసూర్ ప్యాలెస్, లలిత మహల్ వంటి కట్టడాలను చూసినట్టు అనిపిస్తోంది. వెరీ గుడ్ ఆర్కిటెక్చర్" అన్నాడు తన్మయత్వంగా.

గోపాలరావు ఆ విషయం చర్చించదల్చుకోనట్టు ఉండిపోయాడు. రాధ కూడా అతని మాటలేవీ పట్టనట్టుగా లోపలికి వెళ్ళిపోయింది. వెళ్తూ వెళ్తూ అతని బ్యాగ్ అందుకుని పక్కనున్న గదిలో ఉంచింది. ఆమెను అనుసరించి పక్క గదిలోకి వెళ్ళాడు.

"ఇవాల్టినుంచి మీరిక్కడున్నంత కాలం ఇది మీ గది. ఎప్పు డేం అవసరమైనా నిస్సంకోచంగా అడగండి. మిమ్మల్ని బాగా చూసుకోవాల్సిన బాధ్యత మనదని నాన్నగారు చెప్పారు. ఐపీఎస్ అంటే చాలా గొప్ప ఉద్యోగమే. దానికి చదవాలంటే చాలా ఏకాగ్రతకావాలి. మానాన్న చేసే పనికన్నా పెద్దది, గొప్పది కూడా. అందులో చేరడమంటే చాలా గౌరవప్రదమైన విషయం. బాగా చదివి పరీక్ష పాసై అందులో చేరండి" స్థిరంగా ఉన్నాయి ఆమె మాటలు.

అవి మాటల్లా అనిపించలేదు. ఆమె మాట్లాడిన చివరి వాక్యంలో ఏదో అభ్యర్థన దాగి ఉన్నట్టనిపించింది.

రూమంతా కలయజూశాడు. అక్కడ కూడా గోడమీద వాల్ హేంగింగ్స్ ఉన్నాయి. అక్కడ ఒక చోట గోడ మీద ఒక ఫోటో కనబడింది. చూడ్డానికి ఎవరో మహారాజులా అనిపించింది.

"అదెవరి ఫోటో?" అడిగాడు ఆసక్తిగా.

అంతలోనే అక్కడికి వచ్చిన గోపాలరావు "విజయేంద్ర వర్మ అంటే ఆయనే. ఈ గ్రామంలో దాదాపు అందరి ఇళ్ళ లోనూ ఆయన ఫోటో ఉంటుంది" అన్నాడు.

గోపాలరావు వైపు విచిత్రంగా చూశాడు విష్ణు.

"మేమిక్కడ బాడుగకు దిగాం. ఈ ఇంటి ఓనర్ దాన్ని అక్కడ నుంచి తీయవద్దని మరీ మరీ చెప్పి వెళ్ళాడు".

'ఓహో. అలాగా' అన్నట్టుగా తల పంకించాడు విష్ణు.

అంతలోనే రాధ వచ్చి నీళ్ళు కాగాయని చెప్పింది.

స్నానం చేసి వచ్చి "సార్, మిమ్మల్ని నేనెలా పిలవాలి? అంకుల్ అనొచ్చా?" అనడిగాడు విష్ణు. నవ్వి అలాగే అన్నట్టు తలూపాడు.

ఆ తరువాత చెప్పుకొచ్చాడు గోపాలరావు.

"ఒక రకంగా చెప్పాలంటే మనది దూరపు చుట్టరికం. మీ తల్లిగారు మా పెద్దమ్మ కూతురు. ఇద్దరం దాదాపు ఒకే ఈడు వాళ్ళమైనా నన్ను అన్నయ్యా అని పిలిచేది. మా కుటుంబాల మధ్య పెద్దగా రాకపోకలు లేవు. మీ నాన్న మల్లికార్జున రావును మేము మల్లన్నా అని పిలిచేవాళ్ళం. ఇరవై ఏళ్ళక్రితం విజయనగరంలో ఆయన గొప్ప లాయర్. తరువాతి కాలంలో అక్కణ్ణుంచి వైజాగ్ వచ్చేశారు. అప్పుడే మొదటిసారి నిన్ను చూశాను. ఆ తరువాత పన్నెండేళ్ళ క్రితం చివరిసారిగా గోదావరి పుష్కరాల్లో చూశాను. ఇక్కడికి ట్రాన్స్ఫరైన తరువాత అటువైపు వెళ్ళేందుకు అవకాశం దొరకలేదు. సొంత అక్కచెల్లెళ్ళు అన్నదమ్ముళ్ళ వద్దకు వెళ్ళేందుకే టైమ్ దొరకని ఈ కాలంలో పెద్దమ్మ సంతతని చూడడం కుదిరే పనేనా?"

అతను చెప్పిందంతా మౌనంగా విన్నాడు విష్ణు. అతని మాటల్లో వాస్తవముంది.

(ఇంకా వుంది)

ఆరోగ్యమే మహాభాగ్యం

బరువులెత్తితే ఇవి తప్పవు

రుమటాయిడ్ కీళ్ళ నొప్పులు (rhe-u-mato-id arth-r-it-is) చాలా మందికి అనుభవంలోకి వచ్చే వ్యాధి! కొందరు వయస్సు రీత్యా వీటి బారిన పడితే మరికొందరకి జన్యుపరంగా ఇవి సంక్రమిస్తాయి. ఇప్పటి వరకూ ఎక్కువ పని చేసేవారిలోనే కీళ్ళనొప్పులు వచ్చే అవకాశాలు ఉన్న విషయం తెలిసిందే! ప్రతిరోజూ శక్తికి మించి బరువులు మోసే వారిలో రుమటాయిడ్ కీళ్ళనొప్పులు వచ్చే అవకాశం ఉందన్న విషయం స్వీడన్‌లో నిర్వహించిన ఓ పరిశోధనలో వెల్లడైంది. కేవలం వయస్సు మళ్ళిన వారిలో మాత్రమే ఈ నొప్పులు కనిపిస్తాయన్నది భ్రమ మాత్రమే అని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. పదికిలోల కన్నా ఎక్కువ బరువును చేతులతోనో, వీపు వెనక భాగంలో పెట్టుకుని మోసే రోజూవారీ కూలీలల్లో ఈ సమస్య చాలా చిన్న వయస్సులోనే వచ్చే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. రోజువారీ కూలీలనే కాకుండా పెద్ద పెద్ద బరువులను తరచూ ఎత్తే వారిలో కూడా ఈ సమస్య చిన్నతనంలోనే కనిపించే ప్రమాదం ఉందని వీరు స్పష్టం చేస్తున్నారు. సుమారు నాలుగువేల మంది మీద వీరు పరిశోధనలు నిర్వహించారు. వీరిలో ఎక్కువ మంది రోజువారీ కూలీలు. మరికొందరు సాధారణ పనులు చేసుకునే వ్యక్తులు. మామూలు పనులు చేసే వారికన్నా కూడా రోజూవారీ కూలీల్లోనే రుమటాయిడ్ కీళ్ళనొప్పులు రావడం వీరు గుర్తించారు.

మందారతో రక్తపోటు అదుపు

జుత్తుకు మంచి మందుగా ఉపయోగపడే మందార పువ్వు రక్తపోటును తగ్గించడానికి సహాయపడుతుందన్న విషయం ఇటీవల పరిశోధనల్లో వెల్లడైంది. మందార పువ్వులతో తయారు చేసిన టీని తాగితే తొలిదశలో ఉన్న రక్తపోటును త్వరగా తగ్గించుకోవచ్చు అంటున్నారు పరిశోధకులు. అమెరికాలోని హ్యూమన్ న్యూట్రీషియన్ రీసెర్చ్ సెంటర్ వారు ఈ పరిశోధన నిర్వహించారు. 30 నుంచి 70 సంవత్సరాల వయస్సు ఉన్న సుమారు 50 మంది మీద వీరు పరిశోధనలు నిర్వహించారు. వీరందరూ రక్తపోటు తొలిదశలో ఉన్నవారే! వీరిని రెండు గ్రూపులుగా విభజించి ఒక గ్రూపు వారికి మందారపూలతో చేసిన టీని ఇచ్చారు. మరో గ్రూపు వారికి మామూలు టీ ఇచ్చారు. కొన్ని వారాల అనంతరం వీరి రక్తపోటును పరిశీలించగా మందార పువ్వులతో తయారు చేసిన టీని తాగిన వారిలో రక్తపోటు క్రమేపీ తగ్గడాన్ని గుర్తించారు. మామూలు టీ తాగిన వారిలో ఎలాంటి మార్పునూ వీరు గమనించలేదు. కేవలం మందార పువ్వుల టీ తాగడం వలనే వీరిలో రక్తపోటు అదుపులో ఉందా? మరే ఇతర కారణాలేమైనా దోహదం చేశాయా? అన్న అంశం మీద వీరు ఇంకా పరిశోధనలు నిర్వహిస్తున్నారు.

ఒక్క ఫ్రెండ్ చాలు

డిప్రెషన్‌లో ఉన్న వారికి మందులు, చికిత్స కన్నా ఆత్మీయుల, బంధువుల అభిమానం చాలా వరకూ పనిచేస్తుందన్న విషయం తెలిసిందే! వీరు కూడా చేయలేని పని స్నేహితులు చేస్తారు అంటున్నారు పరిశోధకులు. డిప్రెషన్‌లో ఉన్న వారిని పూర్తిగా ఆ స్థితి నుంచి బయటపడేయడమే కాకుండా వారిని మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంచడానికి స్నేహితులు బాగా కృషి చేస్తారని వారు చెబుతున్నారు. ఆత్మీయులు బంధువులు ఇచ్చే సపోర్టు కన్నా స్నేహితులు ఇచ్చే సపోర్టు చాలా బాగా పని చేస్తుందని వారు అంటున్నారు. సుమారు మూడువేల మంది మీద వీరు పరిశోధనలు నిర్వహించారు. వీరందరూ డిప్రెషన్‌తో బాధ పడుతున్నవారే! వీరిలో కొందరికి కుటుంబ సభ్యులు, ఆత్మీయులు సపోర్టు ఇచ్చారు. మరికొందరికి స్నేహితులు సపోర్టు ఇచ్చారు. మొదటి గ్రూపు వారికన్నా రెండో గ్రూపు వారు త్వరగా డిప్రెషన్ మూడ్ నుంచి బయటపడడమే కాకుండా శారీరకంగా, మానసికంగా పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా మారడాన్ని వీరు గమనించారు. రెండో గ్రూపువారిలో ఇంత త్వరగా మార్పు రావడానికి కారణం స్నేహితులేనని వారు స్పష్టంచేస్తున్నారు. వయస్సు, ఒకేలా ఆలోచించడం తదితర అంశాల కారణంగా స్నేహితుల ప్రభావం చాలా చక్కగా పనిచేస్తుందని వీరు అంటున్నారు.

బార్లీతో గుండె పదిలం

మూత్ర సంబంధ సమస్యలు తలెత్తినప్పుడు మాత్రమే బార్లీని వాడుతుంటారు చాలా మంది. అయితే దీన్ని ప్రతి రోజూ ఏదో ఒక రూపంలో ఆహారంగా తీసుకోవడం వలన గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడమే కాకుండా గుండె సంబంధిత సమస్యల నుంచి కూడా తప్పించుకోవచ్చు అంటున్నారు పరిశోధకులు. ఏడు దేశాలలో విస్తృతంగా స్టడీ నిర్వహించిన అనంతరం వీరు గుండె ఆరోగ్యానికి బార్లీ మంచిదని నిర్ధారించారు. బార్లీని తీసుకోవడం వలన చెడు కొలెస్ట్రాల్, మంచి కొలెస్ట్రాల్ రెండూ అదుపులో ఉంటాయని చెబుతున్నారు. గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో ఓట్స్ కన్నా బార్లీనే సమర్థవంతంగా పనిచేస్తుందని వీరు స్పష్టం చేస్తున్నారు. బియ్యం, గోధుమలకు ప్రత్యామ్నాయంగా ఆహారంలో బార్లీని చేర్చుకోవాలని వీరు సూచిస్తున్నారు.

-అవినాష్

ఆకాశం నీ హద్దురా! అవకాశం వదలొద్దురా!

"పాతికేళ్ళ వయస్సు అంటే, నిరాశా వాదానికి ఫుల్‌స్టాప్. ఆశావాదానికి కామా. శంకితుడికి అదో ప్రశ్నార్థకం. ధైర్యవంతులు, తెలివైనవారికి విజయాన్నందించే చౌరస్తా!"

పాతికేళ్ళు: వ్యక్తి జీవితంలో ముఖ్యమైన టర్నింగ్ పాయింట్ ఈ వయసు. కెరీర్ ప్లానింగ్ జంక్షన్. కొందరు అప్పుడే బయలుదేరతారు. మరికొందరు అప్పటికే విజయాలు సాధించి ఉంటారు. మరికొందరికి అప్పటికే అపజయాలు వెంబడిస్తాయి. స్థిరపడే ఆలోచ నల అంకురాలు మొదలవుతాయి. ప్రేమచిగుళ్ళు మొలకెత్తి పెళ్ళి ఆశలు చిగురిస్తుంటాయి. రుచి చూడ బోయే జీవితానికి రూపకల్పన జరుగుతూ ఉంటుంది.

సరిగ్గా ఆ సమయంలో ఎటువెళ్ళాలి? ఏ మలుపు తీసుకోవాలి? అనే సందిగ్ధం తలెత్తుతుంది. దాన్నుండి బైటపడి కట్టుదిట్టమైన ప్రణాళికలతో గమ్యం వైపు దూసుకెళ్లడమే కెరీర్ ప్లానింగ్.

అలాకాకుండా పాతికేళ్ళ లోపే కుటుంబ కష్టాలు మొదలై ఆర్థిక ఇబ్బందులు, బరువు, బాధ్యతలు తోడై చదువు ఆగిపోయి, చిన్నాచితకా ఉద్యోగా లతో చాలీచాలని జీతాలతో, నిస్సారంగా జీవి తాన్ని సాగించే వాళ్ళూ మనకు తారసపడతారు.

గేరు మార్చండి

పాతికేళ్ళ దగ్గరే జీవితం దూసుకెళుతుందనో, లేక చతికిలబడుతుందనో భావించనక్కర్లేదు.

ఆ మైలురాయి దగ్గర నాలుగురోడ్ల కూడలిలో ఆగి, ఎటు వెళ్ళాలో నిర్ణయించుకుని, గేరు మార్చి వేగం పెంచుకుని దూసుకెళ్ళవచ్చు.

ప్రయాణం మొదలు కాకపోయినా ఒడిదుడు కులను, అపజయాలను సమీక్షించుకుని కొత్త ప్రయాణం ప్రారంభించి అద్భుత విజయాలు అందుకోవచ్చు.

దటీజ్ ద పవర్ ఆఫ్ 25 మైల్‌స్టోన్. గెట్, సెట్, గో... పాతికేళ్ళ దగ్గరుండే దూకుడు, వేగం, ధైర్యం క్రమంగా వయసు పెరుగుతున్న కొద్దీ తగ్గు ముఖం పడుతుంది. ఏ రంగంలో రాణించాలన్నా పాతికేళ్ళ దగ్గరే ప్రయాణం మొదలు. ఆ సమయంలో కెరీర్‌ని స్థిరంగా ప్లాన్ చేసుకోగల వాళ్ళే విజేతలు.

అభిరుచి ఆగిపోనివ్వకండి

చాలామంది యువతలో పాతికేళ్ళదగ్గర సృజ నాత్మకత, సహజ సిద్ధమైన టాలెంటు కెరీర్ ప్లానింగ్‌లో పడి ఆగిపోతాయి. జీవితంలో స్థిరపడే అంశాల పైనే ఆలోచనలన్నీ కేంద్రీకృతమవుతాయి. మంచి ఉద్యోగం, ఇల్లు, కారు, ఆస్తులు, వ్యాపారవిస్తరణ... వంటి వాటికి పరిమిత మవుతారు.

అలాకాకుండా.. .కెరీర్‌తో పాటు మనలో ఉన్న 'ప్రత్యేకతను గుర్తించి దానికనుగుణంగా రాణించ డమే అసలైన విజయం. ఈ పని ఫలానావారే చెయ్యగలరనిపించుకోవడంలో లభించేదే మన విజయానికి విలాసం.

అందుకే నేటి యువత అవకాశాలు, అభివృద్ధి ఉన్నవైపే పరుగులెడుతోంది.

"ఇది నేర్చుకోవాల్సిన వయసు. ఎంత వీలైతే అంత, ఎంత అవకాశం ఉంటే అంత నేర్చుకునే వయసు, చదువుకునే వయసు. ఎంత అనుకూ లిస్తే అంత దేశంలో, ప్రపంచంలో పర్యటించాలి. ఆ అనుభవం మనకెంతో ఉపయోగపడుతుంది. ఎప్పటికప్పుడు ఈ క్షణం నాది అనుకునే నూతన ఉత్తేజమే విజయం.

పరిమితులు దాటి బైటపడాలి

ప్రతి మనిషిలో అనంతశక్తితోబాటు ఏదో లోపం కూడా ఉంటుంది. దాన్ని భూతద్దంలో చూస్తూ భయపడే వాళ్ళు వికాసానికి దూరమవుతారు. నిరాశ, నిస్పృహల ఊబిలో కూరుకుపోయి నిర్లయ శక్తి కోల్పోతారు.

"కొత్త బాధ్యతలు చేపడుతుంటేనే, కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టగలుగుతాం. కొత్త ఆవి ష్కరణలెప్పుడూ విజయ పరంపరకు నిచ్చెన మెట్లే. ఎక్కుతున్న కొద్దీ పైపైకి తీసుకెళ్తాయి".

అందుకే శ్రీశ్రీ ఓ పాటలో "కొంతమంది కుర్ర వాళ్ళు పుట్టుకతో వృద్ధులు/పేర్లకీ, పుకార్లకీ, పకీ ర్లకీ నిబద్ధులు..." అంటూనే "కొంతమంది యువ కులు ముందుతరం దూతలు నవజీవన బృందా వన నిర్మాతలు.." అన్నారు.

తనను తాను తెలుసుకోవాలి

కొన్నిసార్లు మన ప్రతిభ ఏమిటో, ఎటు వెళ్తు న్నామో మనకే అర్థం గాదు. భూమి పొరలు తొలుచుకుంటూ వెళితేనే నీటి ఊట బైట పడేది. ఈ క్రమంలో ఎన్నో చేదు అనుభవాలుండొచ్చు. సమయం, వృథా కావచ్చు. అయినా నీళ్ళు కావాలను కుంటే లోతుకు దిగాల్సిందే. అదే సంకల్పం. ఆ సంకల్పమే మనలోని నిజరూప దర్శనాన్ని కల్గి స్తుంది. మన సహనానికి పరీక్ష పెడుతుంది. అయినా శోధన ఆపకూడదు. ప్రయత్నం విరమిం చకుండా లోతులు దిగితేనే నీరు దక్కేది.

విలువలకి తిలోదకాలివ్వకండి:

"ఆలోచనల్ని పాజిటివ్‌గా మలచుకుంటే మాటలూ అలాగే ఉంటాయి. మాటలు పాజి

విజయ విలాసం

స్టెప్స్ టు సక్సెస్ 26

- ఎం. వెంకటేశ్వరరావు, సెల్: 90307 07037

టివ్‌గా ఉంటే అదే మన ప్రవర్తనగా మారుతుంది. ప్రవర్తనలో పాజిటివ్‌నెస్ ఉంటే అవి అలవాట్లుగా మారతాయి. అలవాట్లు పాజిటివ్‌గా ఉంటే అవి మన విలువలుగా మారతాయి. ఆ విలువల్ని పాజిటివ్‌గా ఉంచుకుంటే... అవి మన గమ్యాన్ని నిర్దేశిస్తాయి. గమ్యం పాజిటివ్‌గా ఉంటే అదే మన విజయానికి విలాసమవుతుంది".

-మహాత్మాగాంధీ

రోషం, పట్టుదల, తెగువ, ధైర్యం ఇవన్నీ పాతికేళ్ళకి అలంకారాలు. వయసుకి తగ్గట్టు అవన్నీ ఉండాలి. అయితే ఆకర్షణలు, అలవాట్లు, వ్యసనాలు కూడా తోడుండి ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. వాటికి క్రమ శిక్షణ, విలువలు అవరోధాలుగా కన్పిస్తాయి. ఆ సమయంలో 'విచక్షణ'తో ఆలోచించకుండా విలువలకు తిలోదకాలిస్తే భవిష్యత్తు అగమ్యగోచరమే. భవిష్యత్తు కలలతో, విలువలతో కూడిన నిర్ణయాలతో, ప్రణాళికా బద్ధంగా నిబద్ధతతో ముందుకెళ్ళిన వారినే విజయం వరిస్తుంది.

మన చుట్టూ అపరిమిత అవకాశాలు

చదివిన చదువుకి, చేస్తున్న ఉద్యోగానికి పొంతన లేకుండా కాలం వెళ్ళదీస్తున్న వాళ్ళు చాలామంది ఉన్నారు. శ్రద్ధ తీసుకోవాల్సిన వయసులో కెరీర్‌ని అశ్రద్ధ చెయ్యడంవల్ల, స్పష్టత లోపించడం వల్ల గాలి వాటంలా ఎక్కడో ఒకచోట సెటిలై అసంతృప్తి ఫీలవుతుంటారు. చదువుకున్న దానికి రిలేటెడ్‌గా ఉద్యోగం ఉండాలన్న రూలేం లేదు. చదువుతో సంబంధం లేకుండా మన హాబీలను, ఇష్టాలను కెరీర్‌గా మలచుకోవచ్చు. నేడు ఎన్నో కొత్తకొత్త కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఎన్నో అవకాశాలున్నాయి.

అభిరుచికి తగిన రంగాన్ని ఎంచుకుని విజయం సాధించడమే విజేతల లక్షణం. సహజ నైపుణ్యాన్ని సాగరంలో కలిపేయకుండా కాపాడుకోవాలి.

'ఆకాశం నీ హద్దురా..! అవకాశం వదలొద్దురా!" అన్నారు అందుకే.

నిర్ణయంలో స్పష్టత

చాలామందికి చాలా సందర్భాల్లో పాతికేళ్ళు వచ్చే దాకా సొంత నిర్ణయాలు తీసుకునే అవకాశం రాదు. అప్పటివరకూ అన్నీ తల్లిదండ్రులే చూసుకుంటారు. పాతికేళ్ళ తర్వాతైన సొంత నిర్ణయాలు తీసుకోగల్గాలి. సలహాలు తీసుకోవచ్చు. కానీ నిర్ణయం మనదే కావాలి. అలా నిర్భయంగా స్వతంత్ర నిర్ణయాలు తీసుకున్నవారే ఏ పనిలోనైనా దూసుకెళ్ళ గలరు.

వారసులే కానక్ఖర్లేదు

డాక్టరు కొడుకు డాక్టరు, యాక్టరు కొడుకు యాక్టరే కానక్ఖర్లేదు. అట్టడుగుస్థాయి నుంచి అత్యున్నత శిఖరాల కెదిగినవారు ఎందరో ఉన్నారు. అబ్దుల్ కలాం, సచిన్ టెండూల్కర్, నరేంద్రమోడీ, ఎ.ఆర్. రెహ్మాన్.... ఇలా ఎందరో భిన్న నేపథ్యం నుండి వచ్చి ప్రతిభతో ఉన్నత స్థానాలకు ఎదిగి రాణించారు.

వారసులూ రాణిస్తున్నారు

వారసత్వం తప్పేం కాదు. కుటుంబ నేపథ్య వ్యాపారాల్లోకి ప్రవేశించడం సులభం. కానీ స్వయం ప్రతిభ ఉన్న వాళ్ళే రాణించగల్గుతున్నారు. అక్కినేని నాగార్జున, ముఖేష్. అనిల్ అంబానీ, రాబోయే తరాల్లో ఇన్ఫోసిస్ నారాయణమూర్తి కొడుకు రోహన్, విప్రో ప్రేమ్‌జీ కొడుకు రిషద్... ఇలా ఎందరో రాబోతున్నారు.

మీకు మీరే సాటి

మిమ్మల్ని ఎవరితోనూ పోల్చుకోకండి. మీకు మీరే సాటి. రేపటి కొత్త ఆవిష్కరణలకు మూలాధారాలై, సరికొత్త విజయాలకు విలాసాలుగా 'జయకేతనం' ఎగుర వేస్తారు.

మానవమేధకు ఎల్లలు లేవు. సంకల్పమే ఆయుధం. యువతలో నిద్రిస్తున్న అనంతశక్తిలో నలుసంత శక్తినైనా గుర్తించగల్గితే 'విజయ విలాసం' నీదే.

(అయిపోయింది)

హేట్సాఫ్

"నా ఆశయాల్ని మార్చేయ గలమని భావించారు గాబోలు. అందుకే టెర్రరిస్టులు నాపై హత్యాయత్నం చేశారు. దానివల్ల నాలో కొత్త బలం. ధైర్యం, శక్తి పుట్టుకొచ్చాయి. తాలిబన్లు, టెర్రరిస్టుల పిల్లలకి కూడా విద్య అందించాలని అభిలషిస్తున్నా" "మలాల "డే" నా ఒక్కదాని గురించికాదు. ప్రతి మహిళది, పిల్లలది, ఎవరైతే తమ హక్కుల కోసం ఉద్యమిస్తారో వాళ్ళందరిది" మలాల తన 16వ ఏట యు.ఎన్‌లో చేసిన ప్రసంగమిది.

మలాల యూసఫ్‌జయ్ పాకిస్తాన్‌లోని స్వాత్ జిల్లా మింగోరాలో జన్మించింది. ప్రస్తుతం లండన్‌లో బర్మింగ్‌హామ్‌లో చదువుకుంటోంది. ఆడపిల్ల చదువులు, హక్కుల గురించి ఉద్యమించినందుకు, అతి పిన్నవయసులో నోబెల్ పురస్కారం అందుకుంది.

మలాల తండ్రి స్కూలు నడిపేవాడు. పన్నెండేళ్ళ వయసులో మలాల, ఆడపిల్లల చదువుపై తాలిబన్ల నిషేధం, ఆధిపత్యం గురించి తన బ్లాగులో రాసింది. అదిచూసి న్యూయార్క్‌టైమ్స్ కోసం ఓ జర్నలిస్ట్ డాక్యుమెంటరీ తీశాడు. అప్పుడు మలాల తన గళం విప్పి పత్రికలలో, టీవీలో ఇంటర్వ్యూలిచ్చింది. ఆమె పేరు 'ఇంటర్నేషనల్ చిల్డ్రన్ శాంతి ప్రైజు' కోసం ప్రతిపాదించారు.

అక్టోబరు 9, 2012న స్వాత్‌లో మలాల స్కూలు బస్‌లో వెళ్తుండగా... ఒక ఉగ్రవాది బస్సెక్కి ఆమెపై కాల్పులు జరపగా, తల ఎడమ భాగంలోనూ, భుజం ప్రాంతంలో బుల్లెట్లు దిగాయి. చికిత్స కోసం ఆమెను ఇంగ్లాండ్ తరలించారు. ఈ ఘటన అంతర్జాతీయంగా సంచలనమై, మలాలకు అనూహ్య ఆదరణ లభించింది. DEU-T-S-C-HE WA-L-LE ఆమె గురించి 2013లో "ద మోస్ట్ ఫేమస్ టీనేజర్ ఇన్ ద వరల్డ్" అని అభివర్ణించాడు. పాకిస్తాన్‌లో పిల్లల చదువు ప్రాథమిక హక్కు బిల్లు పాసయ్యేంత వరకూ వెళ్లిందీ ఘటన.

2013-14లో "ద మోస్ట్ ఇన్ఫ్లూయన్షియల్ పీపుల్ ఇన్ ద వరల్డ్"లో మలాల ఒకరుగా టైమ్స్ పేర్కొంది. 2013 జూలైలో పిల్లల చదువుపై ప్రసంగించేందుకు ఐ.రా.స కేంద్ర కార్యాలయం ఆమెను ఆహ్వానించింది. ఆ యేడాది అక్టోబరులోనే కెనడా ప్రభుత్వం ఆమెకి సిటిజెన్‌షిప్ ప్రకటించగా, 2014 ఫిబ్రవరిలో స్వీడన్ ప్రభుత్వం, 'వరల్డ్ చిల్డ్రన్ ప్రైజు" ప్రకటించింది. 2015లో మలాల తనని తాను ఫెమినిస్టుగా వర్ణించుకుంది. 2014లో యూనివర్సిటీ ఆఫ్ కింగ్ కాలేజీ గౌరవ డాక్టరేట్ లభించింది.

2014లో కైలాష్ సత్యార్థితో నోబెల్ సంయుక్త బహుమతి అందుకుంది. పదిహేడేళ్ళ ప్రాయంలో నోబెల్ బహుమతి పొందిన వ్యక్తిగా ఖ్యాతి కెక్కింది మలాల. 2015లో ఆమెపై తీసిన "He named me Malala" డాక్యుమెంటరీ ఆస్కార్ జ్యూరీకి నామినేట్ అయింది. అరుదైన విజయాలందుకున్న ఈ యువ కెరటానికి జయహో!

పరాయి శ్రీమతి

-పి.వి.డి.ఎస్ ప్రకాష్

'జీవితం రైలు ప్రయాణం లాంటిది. ఓ కలయిక, ఓ వీడ్కోలు' అన్నారెవరో? ఆ మాటలు నిజమనిపించేలా జరిగిందా సంఘటన. తన చెల్లి పెళ్లి సన్నాహాల నిమిత్తం ఓ వారం ముందుగా విశాఖకు బయల్దేరిన శ్రీమతిని ఆ సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కించి అలా వీడ్కోలు చెప్పి ఇలా వెనక్కి తిరిగానో లేదో... నవ్వుతూ కనిపించింది వైదేహి.

"నువ్వేంటిక్కడ?" ఇద్దరినోటా ఒకేమాట.

"శ్రీమతిని రైలెక్కించేందుకు..." నేచెప్తున్న వాక్యం పూర్తి కాకుండానే, ఆత్రుత ఆపుకోలేక వైదేహి కూడా అనేసింది- "హజ్బెండ్‌కి వీడ్కోలు చెప్పేందుకు".

"నువ్వెలాగున్నావు?"

"ఇదిగో.... ఇలా!" ఏకకాలంలో మా ఇద్దరి నుంచి మళ్లీ ఓ ప్రశ్న... ఓ సమాధానం.

ఏకవచనం ప్రయోగించుకునే చనువు మా ఇద్దరికీ ఉంది. కారణం, ఒకప్పుడు ఒకే ఊరిలో, ఒకే కాలనీలో కలిసి తిరిగాం. ఒకే స్కూల్, ఒకే కాలేజీ కాకున్నా ఒకే క్లాసు చదువుకున్నాం. అవసరాలకనుగుణంగా క్లాస్ పుస్తకాలు ఇచ్చి పుచ్చుకున్నాం. 'కంబైన్డ్ స్టడీస్' పేరుతో కొన్ని నిద్రలేని రాత్రులు గడిపాం. సబ్జెక్ట్‌లకు సంబంధించి సందేహాలు తీర్చుకుంటూ వార్షిక పరీక్షలు రాశాం. ఉత్తీర్ణత సాధించినపుడు ఉప్పొంగిపోయాం. అంతేకాదు... భవిష్యత్తులోనూ ఇలాగే కలిసిమెలిసి జీవితం సాగించాలని ఎన్నో కలలు కన్నాం. అనూహ్యంగా ఆ కలలన్నీ కల్లలు కావడంతో 'ఎవరికి వారే యమునా తీరే..' అనుకుంటూ ఇప్పుడిలా విడివిడిగా బతికేస్తున్నాం.

మొదట్లో మేమిద్దరమూ కేవలం స్నేహితులమే. ఆ తర్వాత్తర్వాతే... స్నేహానికి మించిన మ్యాజిక్ మా మధ్య 'సమ్‌థింగ్ స్పెషల్'గా సాగుతోందని తెలిసి వచ్చింది. సరిగ్గా అప్పుడే... ఎప్పుడెప్పుడు కలుసుకుంటామా? అనే ఎదురు చూపులు. కలుసుకోలేని పరిస్థితుల్లో పిచ్చిచూపులు. కలుసుకున్న వెంటనే... కలుసుకున్నామనే ఆనందం అరక్షణమైనా మాలో మిగలకుండా కాసేపట్లో విడిపోతామనే బెంగ. భయం. దిగులు.

అంతేనా! కలుసుకున్న ప్రతిక్షణంలోనూ చుట్టూ ఉన్న లోకాన్ని మరిచి కళ్లల్లో కళ్ళుపెట్టి చూసుకోవడం, ఒకరి చేతిని మరొకరు ఆత్మీయంగా స్పృశిస్తూ అనిర్వచనీయానందాన్ని ఆహ్వానించడం, అంతలోనే గమ్మత్తుగా పెదాలపై ముద్దుల ముద్రలేయడం, గాఢమౌన కౌగిళ్లలో ఒడుపుగా, ఒద్దికగా ఒకరికొకరు ఒదిగిపోవడం...

ఆ జ్ఞాపకాలు తలచుకున్న కొద్దీ ఇప్పటికీ ఒళ్లంతా థ్రిల్లింతే!

కలుసుకున్న ప్రతి సందర్భంలోనూ తప్పని ఓ వీడ్కోలు. విడిపోయేముందు గుండెల్నిండా బాధ. దూరమవుతూ... చేతులూపుతూ 'బైబై...' చెప్తుంటే శరీరంలోని అతి విలువైన భాగమేదో కోల్పోతున్నట్లు కళ్లను కమ్మేస్తూ నీటి తెర. ఫలితం... ఎదుటి దృశ్యాలన్నీ మసకబారి పోవడం, ఆపై కళ్లు తుడుచుకుంటూ తను కనిపించేదాకా చూపులు సారించడం.

ఆ ప్రేమపిచ్చిలో తలమునకలవుతూ మాలో



మేం సంబరపడుతుండగానే వైదేహి పెళ్లి హఠాత్తుగా జరిగి పోయింది. తల్లిదండ్రులు కుదిర్చిన సంబంధాన్ని కాదనే ధైర్యం తనకి లేక... ఎదురుపడి నచ్చచెప్పే సాహసం నేను చేయలేక అలా చేష్టలుడిగిన సమయంలోనే తను పెళ్లి కూతురైపోయింది. 'కనీసం కలిసి బతుకుదామం'టూ నిక్కచ్చిగా ఓ నిర్ణయాన్ని గట్టిగా ప్రకటించలేక... 'లేచి పోదాం రారమ్మ'ని చేయందించలేక... ఓ పక్క నేను నరక యాతన అనుభవిస్తున్న సమయంలోనే తల వంచి ఆమె తాళి కట్టించేసుకుంది.

నిద్ర బరువుతో కనురెప్పలు వాలిపోతున్న ఓ అర్ధరాత్రి వేళలో వైదేహీ వివాహవేడుకకి ఓ అతిథిగా, ఓ ఆహ్వానితుడిగా వెళ్లి గుండెల విసేలా మౌనంగా రోదించిన దృశ్యం ఇప్పటికీ నా మనోఫలకం నుంచి చెదిరిపోలేదు.

కొత్త పెళ్లికొడుకు చేయిపట్టుకుని కొత్తజీవితాన్ని అనుభవించేందుకు ఉన్న ఊరుకి, చిన్ననాటి స్నేహితులకి వీడ్కోలు చెప్తూ ఓ సాయంత్రం నా దగ్గరికి వచ్చింది వైదేహి. అప్పుడు మా ఇద్దరి మధ్య మౌనం తప్ప మాటలు లేవు. గుండెల్లో దిగులు తప్ప మరో అనుభూతి లేదు. 'ఇక, వెళ్లివస్తాన'ంటూ నా జీవితం నుంచి శాశ్వతంగా సెలవు పుచ్చుకుంది వైదేహి.

సరిగ్గా అప్పుడే 'ఇకపై జీవితంలో మరెప్పుడూ కలుసుకో కూడద'నే నిర్ణయం తీసుకున్నాం. కాకపోతే... ఎప్పుడైనా, ఎక్కడైనా ఒకరికొకరు తారసపడితే ముఖాలు మాడ్చుకోకుండా చిర్నవ్వులతో పలకరించుకోవాలని ఒట్టు వేసుకున్నాం.

అంతదుఃఖంలోనూ వీడ్కోలు చెప్పే ముందు మా ఇద్దరి మధ్య ఓ ఆత్మీయ స్పర్శ... ఓ చిన్నిహగ్... అనిర్వచనీయం... అత్యద్భుతం.

అదంతా జరిగిన అయిదేళ్ల తర్వాత మళ్లీ ఇన్నాళ్లకి ఇలా... ఈ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై గోదావరి ఎక్స్‌ప్రెస్ సాక్షిగా అనుకోకుండా ఒకరి కొకరం ఎదురుపడ్డాం... చిర్నవ్వులతో పలకరించుకుంటూ.

ఈ అయిదేళ్లకాలం వైదేహిలో కించిత్ మార్పు కూడా తీసుకురాలేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. సాధారణంగా పెళ్లయిన వెంటనే కొంత మంది ఆడపిల్లలు బొద్దుగా మారిపోతారు. కానీ... అప్పట్లాగానే సన్నజాజితీవెకు చీరకట్టినట్టు అందంగానే ఉంది వైదేహి.

"నువ్వేం మారలేదు" నేను.

"నువ్వూనూ. అదే హెయిర్‌స్టయిల్‌తో అంతే సన్నగా" తను. ఆ తర్వాత మా ఇద్దరి మధ్య కొద్ది క్షణాల మౌనం.

●●●

"పిచ్చిపిచ్చిగా ఉంది" అన్నాను నేను. ఆమె కనిపించిన సంతోషాన్ని ఎలా వ్యక్తం చేయాలో అర్థం కాక.

"నాకూ అలాగే ఉంది" అంది తను కళ్లల్లో మెరుపులు గుమ్మరిస్తూ.

"అనుకోకుండా భలే కలిశాం!" ఇద్దరిలోనూ ఆనందం, ఆశ్చర్యం.

"ఇవాళెందుకో... ఆయనతో స్టేషన్‌కి రావడం మంచిదే అయింది. నువ్వు కనిపించావు" చెప్పింది



వైదేహి.

"ఔను. ఇవాళ్టిరోజునే గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి శ్రీమతి టికెట్ రిజర్వ్ చేయడం ఇంకా మంచిదైంది. నిన్ను చూశాను" అన్నాను నేను. ఆమెని చూస్తుంటే గుండె గూటికి పండుగొచ్చింది. ట్రైన్ వెళ్లిపోయినా ప్లాట్‌ఫారం నిండా జనాలే... నవ్వుతూ, తుళ్లుతూ, కబుర్లు చెప్తూ, మేమిద్దరం ఇలా కలుసుకున్నందుకు వేడుక చేసుకుంటున్నట్టు సందడి సందడిగా స్టేషన్.

"ఒక్కసారి నీ చేయి పట్టుకోవచ్చా?" ఆ హడావుడిలోనే ఆమె కళ్లలోకి చూస్తూ కాస్త మొహమాటంగానే ఆ మాట అడిగేశాను. కనిపించిన వెంటనే చిర్నవ్వులు రువ్వుతూ ఆత్మీయ కరచాలనం చేసుకోవడం ఒక్కటే మాకు ముందునుంచీ తెలిసింది. అందుకు భిన్నంగా చాన్నాళ్లకు కలిసిన వైదేహిని అస్సలు తాకకుండా మాట్లాడుతుంటే నాలో ఏదో వెలితి. అందుకే... ఆమె ఏమనుకుంటుందోననే సంకోచాన్ని సైతం పక్కకునెట్టి నిస్సిగ్గుగా మనసులో మాటని బయట పెట్టేశాను.

"పట్టుకోవాలనుందా?" అడిగింది తను.

"ఔను.... ఒక్కసారి. ఒకే ఒక్కసారి" అన్నాను బతిమాలు తున్నట్టు. గతంలో ఇలాంటి ఫార్మాలిటీ లేకుండా ఒకర్నొకరం ముట్టుకునేవాళ్లం. కానీ, ఇప్పుడు మా ఇద్దరి మధ్యా ఎవ్వరూ లేకున్నా... కనిపించని తెర ఏదో మా సాన్నిహిత్యాన్ని అడ్డుతున్న ఫీలింగ్.

నవ్వింది తను. ఆ నవ్వుకు అర్థం తెలీలేదు నాకు.

"పర్మిషన్ కావాలా?"

"పరాయి సొత్తువి కదా!" అన్నాను నేను. నిజానికి, పెళ్లి... ఓ ఆడను, ఓ మగను ఒకటిగా చేస్తుంది. కానీ, అదే పెళ్లి ఇద్దరు స్నేహితుల్నీ వేరు చేస్తుందనడానికి మేమిద్దరమే సాక్ష్యం.

"అంటే?"

"మరొకరి శ్రీమతివి".

"ఔనా...? ఫ్రెండ్‌వనుకున్నాను. అందుకే ఈ స్టేషన్‌లో ఇంతమంది ఉన్నా నీ దగ్గరికి వచ్చి 'హలో...!' చెప్పాను" అంది తను.

"అది తెలుసు." అన్నాను నేను.

"సరే... నువ్వన్నట్లే నేను ఇంకొకరి శ్రీమతిని. నా చేయి పట్టుకోవాలంటే మరి, నా పర్మిషన్ ఎందుకు? ఆ అడిగేదేదో ఆయన్నే అడుగు" అంది వైదేహి మూతి సున్నాలా చుట్టి. తను ఎప్పుడూ అంతే! మూతి సున్నాలా పెట్టి రెచ్చగొడుతుంటుంది.

"ఎవర్ని... మీ ఆయన్నా? బాగుంటుందా?"

"ఏంటి బాగుండేది?"

"అదే... ఒక్కసారి పర్మిషనిస్తే మీ ఆవిడ చేయి పట్టుకుంటానని మీ ఆయన్ని అడగడం ఏమైనా బాగుంటుందా? అని" చిన్నగా నవ్వాను.

"పిచ్చిమొద్దూ! నిజంగా చేయి పట్టుకోవాలని పిస్తే పర్మిషన్ అక్కర్లేదు. ఇదిగో... ఇలా పట్టేసుకోవడమే" అంటూ చొరవగా తనే నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని పెదాలతో ముద్దాడింది.

ఆకలై అంబలి అడిగితే ఏకంగా అమృతాన్నే చిలకరించిన దేవతలా కనిపించింది వైదేహి ఆ క్షణంలో నాకు. నిజానికి, మనింట్లో విరగగాసిన జామపండు కన్నా... గోడ దూకి పక్కింటి పెరట్లో దొంగిలించిన పండుకే తీపి ఎక్కువన్న సంగతి అప్పడే కొత్తగా అవగతమవుతోంది నాకు.

'ఈ చిలిపి నేస్తం ఇక ఎప్పటికీ నాది కాదంటూ ఆమె మెడలోని తాళి నావంక చూస్తూ ఎగతాళి చేస్తున్నా... ఆమె ఇచ్చిన చనువు నాలో అంతులేని సంబరాన్ని నింపింది. తనూ నాలాగే ఆలోచిస్తోందేమో? అనిపించింది నాకు. నా చేతిని కాసేపు ఆమె చేతిలో అలా ఉంచాను. అది తప్పనిపిస్తున్నా... ఎంతో బాగుంది. అప్పట్లో ఒకర్నొకరు ఇష్టపడుతున్న దశలో... ఏ ఒక్కటీ ఒప్పుకోకుండా 'అన్నీ పెళ్లయ్యాకే'నంటూ తప్పించుకు తిరిగింది తను. కాస్త చొరవ తీసుకుని అప్పుడప్పుడూ ఇచ్చిపుచ్చుకున్న ఎంగిలి ముద్దులు... దొంగచాటు కౌగిళ్ళు తప్ప 'అసలు కార్యం' అలా... కలలా మిగిలిపోయింది. ఆ కల సాకారమయ్యే ముహూర్తం వరించి రానుందా? ఆకాశాన్ని తాకుతున్న ఆశలు. అయినా.... తనకూ నాకూ ఆకాశానికీ, నేలకూ మధ్య ఉన్నంత వ్యత్యాసం. ఆమెని అందుకోగలడా? హృదయానికి హత్తుకుని ఓ రాత్రంతా సేదతీరగలడా? ఆలోచిస్తూ ఆమె వంకే అలా చూస్తున్నాను.

ఆ తర్వాత కొద్ది క్షణాలకు - "ఇక్కడే ఇలా ఈస్టేషన్‌లోనే ఉండిపోదామా?" మరోసారి ఇద్దరి నోటినుంచి ఒకే మాటలు... టీవీ చానెల్స్‌లో ఒకేసారి ఇద్దరు మాట్లాడే చర్చల మాదిరి.

దాంతో, తనేమైనా మాట్లాడుతుందేమోనని నా మాటలకి కొద్దిసేపు విరామం ప్రకటించాను.

సరిగ్గా అదేపంథాను అనుసరించిందేమో...? తనూ నిశ్శబ్దాన్నాశ్రయించింది.



కాసేపటి తర్వాత ఇద్దరం ఒకేసారి "వీలైతే నాలుగు మాటలు... కుదిరితే కప్పు కాఫీ" అంటూ మళ్లీ మాటలు కలిపాం.

అరగంట క్రితం శ్రీమతి జతగా స్టేషన్‌లోకి అడుగు పెట్టాను. అది చాలా రొటీన్. ఇప్పుడు వైదేహి తోడుగా బయటికి వస్తున్నాను. ఇది వెరైటీ. ఓ దేవత చేయి పట్టుకుని నడిచొస్తున్న ఆ క్షణాలు జీవితంలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ క్షణాలే.

●●●

"ఒకేమాట... ఒకేబాట... ఒకే గమ్యం" అన్నాను నేను. దగ్గర్లోని కాఫీడేలో ఇద్దరం కూచుని "వన్ బై టూ" కాఫీని షేర్ చేసుకుంటుండగా.

"రెండు గమ్యాలు. రెండు జీవితాలు" అంది తను చటుక్కున నా మాటల్ని విబేధిస్తూ.

ప్రశ్నార్థకంగా ఆమెవంక చూస్తే, "నిజం... మనమిద్దరం మరో ఇద్దరితో రెండు వేర్వేరు దారుల్లో ఇక్కడికి చేరుకున్నాం. నీ వైఫ్‌ని రైలెక్కించడానికి నువ్వూ... ఆఫీస్ టూర్ కెళ్తున్న నా హజ్బెండ్‌తో కలిసి నేనూ ఈ స్టేషన్‌కొచ్చిన సంగతి మరిచిపోతే ఎలా సారూ" అంది వైదేహి.

'ఎలా సారూ?' అంటూ అప్పుడప్పుడు నన్ను తను ఓ రేంజ్‌లో ఆటాడుకున్న దృశ్యాలు చటుక్కున కళ్ల వాకిళ్లలో ఒక్కసారిగా మెదిలాయి. అవన్నీ గుర్తు తెచ్చుకుంటూ మారు మాట్లాడకుండా కాఫీ సిప్‌చేస్తుంటే మళ్లీ తనే అంది- "ఒకప్పుడు ఇద్దరం ఒకటవ్వాలనుకున్నా.. మరో ఇద్దరు ప్రవేశించడంతో నలుగురయ్యాం. మన జీవితాల్లోకి నీకో పెళ్లాం. నాకో మొగుడు వచ్చి చేరారు".

ఆ మాటలన్న తర్వాత భారంగా నిట్టూర్చిందో... అది నా భ్రమో తెలీక తికమకపడుతూనే - "పెళ్లి వరకూ దారి తీయని ప్రేమకథగా మిగిలిపోయాం" అన్నాను.

"అనుకోకుండా మళ్లీ ఇలా కలిశాం. జీవితం అంటే ఇదేనేమో. ఓ కలయిక... ఓ వీడ్కోలు" అంది వైదేహి. ఆమె కనిపించిన మొదటి క్షణంలోనే నాలో నేను అనుకున్న మాటల్నే మళ్లీ తననోట వింటుంటే పట్టరానంత ఆనందంగా ఉంది.

ఆ తర్వాత టాపిక్ డైవర్ట్ చేస్తూ వైదేహి - "చాలా సీరియస్‌గా మాట్లాడేసుకుంటున్నాం. ఇప్పుడు చెప్పు.... ఎక్కడుంటున్నావు. ఏం చేస్తున్నావు?" అడిగింది.

ఆ తర్వాత ఆమె అడిగిన ప్రశ్నలు, నే చెప్పిన జవాబులను బేరీజు వేసుకుంటే... మేమిద్దరం మళ్లీ ఒకే కాలనీలో పక్క పక్క వీధుల్లోనే ఉన్నట్లు తెలిసింది. భర్త ఉద్యోగ బదిలీ రీత్యా నెల్లాళ్ల క్రితమే వైదేహి ఈ ఊరొచ్చింది.

"అంటే... మళ్లీ మనం తరచూ కలుస్తుండవచ్చన్న మాట.." అంది నవ్వుతూ.

"మళ్లీ అదేంటీ?"

"ప్రతి కలయిక తర్వాత ఓ వీడ్కోలు తప్పనిసరి. ఇప్పుడిలా కలుసుకున్నాం. విడిపోకుండా ఇక్కడే... ఇలాగే ఉండిపోతామా? కదలమా?" అంటూ టేబుల్‌పై గిరాటేసిన తన వ్యానిటీ బ్యాగ్‌ని భుజాన వేసుకుని తను లేచింది.

"అప్పుడే?"

"నాకూ వెళ్లాలనిలేదు. అయితే, ఇంటిదగ్గర మా ఆడపడుచు ఎదురుచూస్తుంటుంది. బాధ్యత"

అంది వైదేహి ముఖం గంటుపెట్టుకుని మరీ.

ఇక, నేనూ లేవక తప్పలేదు.

"మళ్లీ ఎప్పుడు... ఎక్కడ?" ఆమె ఆటో ఎక్కబోతుండగా అడిగాను.

"రేపు మధ్యాహ్నం తను వాళ్ల అత్తగారింటికి వెళ్తుంది. ఆ తర్వాత ఫుల్‌ఫ్రీడమ్. అన్నట్లు, నీ నంబర్ నా దగ్గర ఉంది కదా! ఫోన్‌చేస్తా. నా కాల్ కోసం ఎదురుచూసే నీలోని పిచ్చిప్రేమికుడిని తట్టి లేపుతా" నవ్వుతూ అంది.

ఆ తర్వాత- "మరీ అంత సస్పెన్స్ భరించలేనేమో? ఓ పని చేద్దాం. రేపు సాయంత్రం మనం మా ఇంట్లోనే కలుద్దాం" ఆమె చెప్తుండగానే ఆటో తుర్రుమంది.

●●●

వాల్‌క్లాక్‌లో పెద్దముల్లు, చిన్నముల్లు ఒకే ముల్లుగా కనిపించే అర్ధరాత్రి పన్నెండు గంటల వేళ.,.. ఒకరి ఊపిరి వేడికి మరొకరు మన్మథుడిలా కాలి బూడిదవుతూ ఒకే కౌగిట్లో ఒక్కటిగా ఇద్దరం పెనవేసుకుపోతున్నాం. రక్తం కారేలా ఒకరి పెదాలు ఒకరు కొరుకుతూ... యుగయుగాల తనివి తీరేలా ఒకర్నొకరు గిల్లుతూ, గిచ్చుతూ ఏ సగమేదో తెలీని రసజగంలో తేలియాడుతున్నాం.

"ఇంకా..." అంది వైదేహి నన్ను మరింత గట్టిగా హత్తుకుంటూ.

"ఇంకా.... ఇంకా?" అన్నాను నేను మత్తుగా.

"ఊ..." అంది తను గమ్మత్తుగా.

గదిలోని వాతావరణం శోభనరాత్రిని తలపించేలా ఉంది. మల్లెల హారాలతో అలంకరించిన పందిరి మంచంపై పాల వెన్నెల్లాంటి తెల్లటి దుప్పటి. ఆ దుప్పటిపై ఎర్రెర్రని గులాబీ రేకలతో తీర్చిదిద్దిన హృదయాకారం. మధ్యలో బాణం గుర్తు చుట్టూ ఉన్న గోడలపై నిలువెత్తు ఖజూరహో శిల్పసౌందర్యాలు. పక్కనే టీపాయ్‌పై గ్లాసుడు పాలు, పళ్ళు మిఠాయిలు.

"ఏమిటిదంతా?" అడిగాను నేను ఆ సాయంత్రం రాగానే.

"నువ్వొస్తున్నావనీ..."

"వస్తే..."

"ఏకాంతవేళ... ఏకాంతసేవ" జలతరంగిణి మోగినట్లు మధురంగా నవ్వింది వైదేహి. ఆ తర్వాత యాపిల్ పండొకటి తీసుకుని ముక్కలుముక్కలుగా తరిగి ఓ ముక్కను నోటికందించింది. సగం ముక్కని నేను కొరకగా... మిగిలిన ముక్కను తన నోట్లో పెట్టుకుంది.

"ఎంగిలి" అనబోయాను నేను.

"అమృతం" అనేసింది తను.

"ఇన్నాళ్లూ ఇంతప్రేమను ఎక్కడ దాచుకున్నావు?" అడిగాను నేను.

"ఇదిగో... ఇక్కడ" అంటూ తన పైట తప్పించి జాకెట్ చాటు ఎత్తయిన గుండెల్ని చూపించింది. ఒకేసోఫాలో పక్కపక్కనే కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పుకుంటూ కదిలే కాలాన్ని అస్సలు పట్టించుకోలేదు.

"ఆకలేయట్లేదా?" అడిగింది కాసేపటి తర్వాత వైదేహి.

"ఆకలుండదు... దప్పికుండదు... నిన్ను చూస్తుంటే" అన్నాను కవితాత్మకంగా నేను.

"అలాగా... అయితే, అయ్యగారికి ఇవాళ పస్తే మరి" అంది తను నవ్వుతూ.

"నీ సహవాసంలో ఉపవాసం వల్ల కూడా కడుపు నిండుతుంది".

"భోంచేద్దాం.." అంటూ డైనింగ్ టేబుల్ దగ్గరకి దారి తీసింది తను. ఆమె వెనుకనే నేను. భోజన పదార్థాలు చూస్తేనే ఆకలి తీరిపోయేలా ఉంది. పప్పు, కూర, రోటిపచ్చడి, సాంబారు, రసం, పెరుగుతో పాటుగా పచ్చగా పులిహోరా, పరమాన్నం.

"ఏవిటివన్నీ?"

"పండుగలా వచ్చావు.. అందుకే"" అంటూ నా చెయ్యి గిచ్చింది.

కొసరికొసరి తను వడ్డిస్తుంటే పీకల్దాకా తిని 'బ్రేవ్'మని తేన్చాను.

"ఇక... సెలవా?" అన్నాను నేను రాత్రంతా తనతో గడపాలనే కోరిక గుండెల్లో బుసకొడుతున్నా.

"ఇంత రాత్రివేళ ఎక్కడికి వెళ్తావు?" అడిగింది తను.

"ఇంకెక్కడికి... మా ఇంటికే?" పక్కవీధిలోనే కదా!" అన్నాను నేను.

"నువ్వక్కడ... నేనిక్కడ ఒంటరిగా ఉండటం ఎందుకు?" అంది తను.

"అంటే...?"

"పిచ్చిమొద్దూ... అర్థం కాలేదా? జంటగా మనిద్దరం ఈ రాత్రి ఇక్కడే గడుపుదాం" అంటూనే బెడ్‌రూంలోకి తీసుకెళ్లి పక్కపై తోసేసి మల్లెపూల చెండులా తను నాపై ఒరిగింది. చేతుల్తో తనని చుట్టేస్తుంటే... తను ముద్దుల్తో మురిపిస్తోంది. చొక్కా గుండీలు తీసి ఛాతీపై ఒక్కో వెంట్రుకని చటుక్కున లాగేస్తోంది. ఆ క్షణంలో ఆ సన్ననైన నొప్పి కూడా మధురంగానే ఉంది. అలా అలా ఒకరితో ఒకరు ఆటాడుతుండగానే... వాల్‌క్లాక్‌లో పెద్దముల్లు చిన్నముల్లుని ఆబగా కబళించేసింది.

ఇక్కడ ఏకశయ్యపై కూడా జరుగుతున్న తంతు అదే.

ఒకర్నొకరు అల్లుకుంటూ, గిల్లుకుంటూ తమకంలో తేలిపోతున్న తరుణంలో గాలి అలలు తేలియాడుతూ.. డిస్టర్బ్ చేస్తూ - 'నీ జతగా నేనుండాలి..' అంటూ పాట వినిపిస్తోంది. ఉలిక్కిపడి లేచిచూస్తే.. పక్కనే టీపాయ్ మీద సెల్‌ఫోన్ రాగాలు పోతోంది.

శ్రీమతి చేసిన కాల్ అది. నిద్ర మత్తు వదిలించు కుంటూ ఫోన్ లిఫ్ట్ చేశాను.

నేను నా గదిలో, నా బెడ్‌పైన... అంటే ఇంతసేపూ వైదేహితో నేను? అది కలా? ముఖంపై చల్లని నీళ్లు చల్లినట్లయింది. రేపు సాయంత్రం వైదేహిని కలుస్తాననే ఆలోచనల్లో వేగిపోతూ ఇంటికొచ్చి అలా పక్క

ఇక్కడే ఎందుకు కొంటోంది?

సమంత చెన్నైలో ఉంటుందన్న సంగతి తెలిసిందే! తాజాగా హైదరాబాద్‌లో ఓ అత్యాధునికమైన అపార్ట్‌మెంట్ కొనడానికి సమంత రెడీ అయిపోయింది. తను కోరుకున్న విధంగా ఉండే అపార్ట్‌మెంట్ కోసం తెగ గాలిస్తోంది. టాలీవుడ్‌లో ఎక్కువ సినిమాలు చేస్తోంది కాబట్టి ఇక్కడ కొనుక్కుంటోందా? లేక హైదరాబాద్ అబ్బాయిని పెళ్ళి చేసుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడ ఇల్లు కొంటోందా? అన్న అనుమానం చాలా మందికి వస్తోంది. నేను ప్రేమించిన వాడినే పెళ్ళిచేసుకుంటాను. ఇక నా పెళ్ళి మీద ప్రచారం ఆపేయండి అంటూ మీడియాని కోరింది కూడా! దీంతో సమంత పెళ్ళిగొడవ పక్కన పెట్టేసి ఆమె కొనబోయే ఇంటి మీద పడ్డారు కొందరు.

మీద వాలిపోయి అన్నిగంటలూ గాఢనిద్రలో మునిగిపోయి...వైదేహిని సొంతం చేసుకోవాలనే ఒకే ఒక కోరిక అంతశ్చేతనలో అలజడి సృష్టించిన ఫలితమే... ఆ కల.

"చాలాసార్లు మీ ఫోన్‌కి ట్రై చేశాను. ట్రైన్ జర్నీలో ఉన్నా కదా! సిగ్నల్స్ అందలేదేమో? ఇప్పుడే ట్రైన్ విజయవాడ చేరుకుంది. అర్ధరాత్రి అయింది కదా!" ఒక్క క్షణం ఊపిరి కూడా తీసుకోకుండా శ్రీమతి ప్రేమ గలగలా మాట్లాడేస్తోంది.

"నన్నే తలచుకుని ఆకలిదప్పుల్తో అలా ఉండిపోకండి. వేళకింత తినండి. మనిద్దరం కాకుండా ముందుగా నే బయల్దేరి తప్పు చేశానేమో? అక్కడ మీరు ఒంటరిగా ఉన్నారనే భావన నన్నొక్క క్షణం నిలువనీయడం లేదు. రిజర్వేషన్ చేయించుకున్న దగ్గర్నుంచీ జర్నీ డేట్ ఎప్పుడెప్పుడా? అని ఎంతో ఆశగా ఎదురుచూసిన నేను.. ట్రైన్ బయల్దేరిన దగ్గర నుంచీ మిమ్మల్ని విడిచి వెళ్తున్నాననే ఆలోచనతోనే సతమతమవుతున్నాను. ట్రయిన్ దగ్గర మీరు వీడ్కోలు చెప్తుంటే.. మళ్లీ ఎప్పుడు కలుస్తామో? అనే ఆలోచనతో కన్నీటిచుక్కొకటి చటుక్కున చెక్కిలిపై జాలు వారింది. నిజమండీ... ఒక్కక్షణం మిమ్మల్ని విడిచి ఉండలేను. పెళ్లికి ముందు సంగతేమో కానీ.. పెళ్లి తర్వాత ఎప్పుడూ ఒంటరిగా పక్కమీద పడుకోలేదు కదా! భార్యతో కొన్నిరాత్రులు గడిపిన అనుభవాలు గుర్తొస్తూ మీరు ఇబ్బంది పడుతున్నారా? ఓ పని చేయండి. ఆఫీసులో ఆ ఇన్‌స్పెక్షనేదో వేగంగా కంప్లీట్ అయిందనిపించేసుకుని... మీరూ ఇక్కడికి వచ్చేయండి. అల్లుడుగారొచ్చారంటూ మా వాళ్లు హడావుడి చేస్తారు..." నవ్వుతోంది ప్రేమ.

"ఓ నాలుగు రోజులు గడిపేస్తే.. పెళ్లికి ఎలాగూ రావాల్సిందే కదా!" అన్నాను నేను. విజయవాడ స్టేషన్నుంచి గోదావరి ఎక్స్‌ప్రెస్ కదిలేదాకా తను మాట్లాడుతూనే ఉంది. ఆ మాటల్లో ఇద్దరం కలిసి తొలిసారి చూసిన సినిమా, తొలిసారి వెళ్లిన హోటల్, తొలిసారి చేసుకున్న దైవదర్శనం... మధ్యలో 'తేనెవెన్నెల' జుర్రుకుంటూ గడిపిన హనీమూన్ ట్రిప్... ఇలా అనేకానేక సంగతుల్ని ప్రస్తావిస్తుంటే ఆమెతో సాహచర్యం కమనీయ, రమణీయ కావ్యంలా తోచింది.

"నిజానికి, ఒంటరిగా నేనెక్కడికి వెళ్తున్నాను. ఇన్నాళ్లూ మీరు పంచిన మధురక్షణాల్ని జ్ఞాపక సుమాలుగా సిగలో ముడుచుకుని... ఆ పరిమళాల్ని ఆఘ్రాణిస్తున్నాను. అక్కడ మీరు కూడా నాలాగే ప్రతి క్షణం నన్నే తలచుకుంటున్నారు కదూ!" అడుగుతుంటే నా గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. స్టేషన్‌లో తనకలా ఫేర్‌వెల్ చెప్తూనే... కలలా కనిపించిన ఒకనాటి నేస్తంతో కబుర్లలో మునిగిపోయాననే పచ్చి నిజాన్ని చెప్పనా?

"చెప్పండి.." రెట్టించి మరీ అడుగుతోంది ప్రేమ.

"మాటిమాటికీ నువ్వే గుర్తొస్తున్నావు" అన్నాను నేను గొంతు పెగల్చుకుని.

"ఆ సంగతి నాకు తెలుసండి. పెళ్లి మంత్రాల్లో ఏ మహత్తుందో కానీ... ఓ ఆడా, ఓ మగా భార్యాభర్తలైన క్షణం నుంచీ శరీరాలు రెండైనా ఒకే ప్రాణమైపోతారు. ఒకే జీవిత మవుతారు. ఒకేమాట... ఒకే బాట... ఒకే గమ్యంగా సాగిపోతారు. వీలైనంత తొందరగా మీరు రండి. మీ మరదలికి అక్షింతలు వేయడమే కాదు. క్షణమొక యుగంగా విరహంతో వేగిపోతున్న మీ ప్రియ శ్రీమతికి ఓదార్పు ఇచ్చేందుకు కూడా మీరు తొందరగా రావాలి. మీ రాకకోసం నిలువెల్లా కన్నులై ఎదురుచూస్తున్నాను. ఇక... సెలవా?" అంది ప్రేమ.

"ఓకే, తప్పకుండా వస్తాను. బెంగపడకు' అన్నాను నేను. ఆ క్షణం నుంచీ నాలో అపరాధ భావన. వైదేహి కనిపించగానే ఎంత తప్పుగా ఆలోచించాడు తను. తలొంచి తాళి కట్టించుకుని... ఇంటి గడప తొక్కిన శ్రీమతి కాస్త పక్కకు వెళ్లగానే మనసావాచాకర్మేణా ఆమె పంచిన మధురానుభవాలన్నీ మరిచిపోయి మరీ ఇలా పరాయి శ్రీమతి వైపు పరుగులు తీయడం ఎంతవరకు సమంజసం? ఛీ... ఛీ నా మనసు పెడదోవ పట్టింది. ఇప్పుడు... ఈక్షణంలో ప్రేమ ఫోన్ చేయడం మంచిదే అయింది. చేస్తున్నదీ... చేయబోతున్నదీ పునరాలోచించుకుని ప్రక్షాళన చేసుకోవడానికి అవకాశం చిక్కింది. వైదేహి కనిపించిన ఆ క్షణం నుంచీ మనసు కల్లు తాగిన కోతిలా ఎన్ని గెంతులు వేసింది. ఎన్ని చిత్రాలు చేసింది. ఆలోచిస్తుంటే సిగ్గేస్తోంది. ఇక వైదేహిని అస్సలు కలవకూడదు. ఒకవేళ తను ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకూడదు అనుకున్నాను నేను.

•••

తెల్లారి లేచిన వెంటనే సెల్‌ఫోన్ చెక్ చేస్తే... శ్రీమతి దగ్గర్నించి పది మిస్‌డ్ కాల్స్, బహుశా తను విశాఖ చేరి ఉంటుంది. ఆ సంగతి చెప్పేందుకు ఫోన్ చేసి ఉంటుంది అనుకుంటుండగానే ఇన్‌బాక్స్‌లోకి ఓ మెసేజ్ వచ్చిపడింది.

ఆ మెసేజ్ వైదేహి దగ్గర్నుంచి.

'ఏమై ఉంటుంది?' ఆలోచిస్తూ ఆ మెసేజ్ ఓపెన్ చేశాను. సుదీర్ఘమైన మెసేజ్ అది.

"నిన్న నువ్వు అనూహ్యంగా కనిపించావు. ఆనందమేసింది. ఆపుకోలేని ఉద్వేగానికి లోనై చనువుగా నీ చేతినందుకుని మరీ ముద్దాడాను. 'రారమ్మ'ని ఇంటికి కూడా ఆహ్వానించాను. ఆ తర్వాత ఆలోచిస్తే... ఎప్పుడో విడిపోయిన బంధాన్ని ఇప్పుడు అతికించి ఏం ప్రయోజనం? నువ్వు కేవలం స్నేహితుడివే అయితే ఫరవాలేదు. కాఫీ ఇచ్చి కాలక్షేపం చేయొచ్చు. కానీ... స్నేహానికి మించిన ప్రేమ మన మధ్య ఉంది కదా! నువ్వూ నేనూ కలిసిన ఆ ఏకాంత క్షణాల్ని ఏంచేస్తాం? ఒంటరితనాన్ని వెలివేసి జంటతనాన్ని ఆహ్వానించగలమా? ఆ తర్వాత నీ భార్యకీ, నా భర్తకీ తెలీకుండా ఆ రహస్యాన్ని దాచగలమా? అలా ఎన్నాళ్లు... ఎన్నేళ్లు?

మనిద్దరం కలిస్తే... ఆ కలయికను బహిరంగంగా చెప్పుకోలేని స్థితిలో మరో అబద్ధపు జీవితాన్ని ఆరంభించాలన్నమాట. అదిప్పుడు అవసరమా? రహస్యంగా కలిసి ఒకరికొకరు అర్పించుకున్నంత మాత్రాన జంటగా మారిపోగలమా? మనిద్దరం ఓ జంటని ఈ లోకం ముందు తలెత్తుకుని దర్జాగా ప్రకటించగలమా? అయినా... మనం అనుభవించని సౌఖ్యమా అది? మనం ప్రేమికులుగా ఉన్నప్పుడు శరీరాల్లో కుతకుతలాడే వేడి నెత్తురు అలజడి సృష్టిస్తూ... 'ఆపోజిట్ సెక్స్' గురించి ఆరా తీయమని ప్రొవోక్ చేస్తుంటే తమాషాగానే ఉండేది.

కానీ... ఎవరి జీవితాలు వాళ్లకి ఏర్పడిన ఇన్నాళ్ల తర్వాత, అప్పుడు మిస్సయిన అనుభవాలు ఇప్పుడు కావాలనుకోవడం ఆశించడం ఏ మాత్రం అభిలషణీయం? శారీరకంగా ఏకం కాని స్వచ్ఛమైన స్నేహం మనది. ఆ స్వచ్ఛత అలాగే ఉండనిద్దాం.

నిన్న స్టేషన్‌లో రైలెక్కిన దగ్గర్నుంచీ వరుస కాల్స్‌తో అనుక్షణం నన్నే తలచుకుంటున్న నా భర్తని తలచుకుంటే నాకు గర్వంగా ఉంది. సమక్షంలోనే కాదు, పరోక్షంలోనూ ఆయన మనసంతా నేనే నిండి ఉన్నానన్న భావనే నాకెంతో సంబరమనిపించింది. బహుశా నీ భార్య కూడా నీ గురించి ఇంతలా తపిస్తూనే ఉంటుందనిపిస్తోంది. అమాయకంగా మన జీవితాల్లోకి అల్లుకుపోయిన వారిద్దర్నీ విస్మరించి మనిద్దరం కలిసి ఏదో సాధించాలనుకోవడం స్వార్థం... మోసం కదా! ఈ సాయంత్రం నువ్వు మా ఇంటికి రావద్దు. వచ్చినా నేనుండను. కారణం, ఈ మధ్యాహ్నమే నేను మా ఆడపడుచుతో వాళ్లింటికి వెళ్తున్నాను. ఇది ఇప్పటికిప్పుడు తీసుకున్న డెసిషన్ కాదు. నిన్ను కలవకముందే తీసుకున్న నిర్ణయం. ఇప్పుడు ఆ నిర్ణయాన్నే అమలు పరచాలనుకుంటున్నాను. ఊరు నుంచి మా ఆయన ఇంటికి రాగానే వీలైనంత త్వరగా ఈ కాలనీ లోంచి సిటీలో మరెక్కడికైనా మారిపోవాలనుకుంటున్నాను. ఇది నీ నుంచి పారిపోవడం కాదు. మనసు మార్చుకున్నాను. జీవితమంటే ఓ కలయిక... ఓ వీడ్కోలు. మన కలయిక 'కల' ఇక. ఈ వీడ్కోలే శాశ్వతం. తప్పుగా భావించకు మిత్రమా! మళ్లీ మనం కలవద్దు - వైదేహి.

సెల్:90005 44160

హోమియోకేర్ ఇంటర్‌నేషనల్‌లో
స్పాండిలోసిస్ సమస్యలకు సరైన పరిష్కారాలు

డా. శ్రీకాంత్ మోర్లావర్
CMD
హోమియోకేర్ ఇంటర్‌నేషనల్

మన శరీరంలోని వెన్నెముక అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుంది. దీని నిర్మాణం ఎంతో సంక్లిష్టమైనది. ఈ వెన్నెముక మెదడు నుండి వచ్చే వెన్నుపామును (Spinal Cord) కాపాడుతూ, శరీరంలోని ప్రతి కదలికకూ సహకరిస్తూ, శరీరానికి మూలస్తంభంగా నిలుస్తుంది.

స్పాండిలోసిస్ అనగా: వెన్నెముకలోని డిస్కులలో మరియు ఫేసెట్ జాయింట్లలోని మృదులాస్థి క్షీణతకు గురి కావడాన్ని స్పాండిలోసిస్ అని అంటారు. దీనినే స్పైనల్ ఆర్థరైటిస్ అని కూడా పిలుస్తారు. ఈ సమస్య ఎక్కువగా 40 సం॥ వయస్సు పైబడిన వారిలో కనిపిస్తుంది. కానీ ప్రస్తుత జీవనశైలిలో ఎన్నో మార్పులు రావడం, ఎక్కువ సమయం కంప్యూటర్ల ముందు పని చేయడం, ఎక్కువ సమయం వాహనాల మీద ప్రయాణించడం మరియు కొన్ని ఇతర కారణాల వలన వెన్నెముక మీద ఒత్తిడి పెరిగి ఈ సమస్య చిన్న వయస్సు వారిలో కూడా ఎక్కువగా కనిపిస్తుంది.

సాధారణంగా వెన్నెముకలోని రెండు పూసల మధ్య డిస్కులు ఉంటాయి, మరియు వాటి వెనుక భాగంలో ఫేసెట్ అనే జాయింట్లు ఉంటాయి. వీటిలోని మృదులాస్థి వెన్నెముకకు సంబంధించిన అన్ని కదలికలకు సహకరిస్తూ, ఒత్తిడిని తట్టుకునే షాక్ అబ్సార్బర్‌లుగా పని చేస్తాయి. వీటి చుట్టూ ఉండే కండరాలు, లిగమెంట్లు మరియు టెండాన్లు జాయింట్లను దృఢంగా ఉంచుతాయి. వెన్నుపూసలలో నాళాన్ని స్పైనల్ కెనాల్ అంటారు. దీని నుండి వెన్నుపాము ప్రయాణిస్తూ నిర్దిష్ట ప్రాంతాలకు నరాలను తీసుకు వెళుతుంది. ఏ కారణం చేతనైనా ఈ డిస్కులు లేదా ఫేసెట్ జాయింట్లు క్షీణతకు గురి అయితే వెన్నెముకలో మార్పులు సంభవించి, నొప్పి మరియు కదలికలు కష్టతరంగా మారడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వీటి ప్రభావం అక్కడ నుండి వెలువడే నరాలపై పడితే తీవ్రమైన నొప్పి, అవయవాల పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతాయి. సాధారణంగా వెన్నెముకలోని మెడ భాగాన్ని సర్వైకల్ స్పైన్, వీపు భాగాన్ని థొరాసిక్ స్పైన్, నడుము భాగాన్ని లుంబార్ స్పైన్ మరియు క్రింది భాగాలను సాక్రం, కాకిక్స్ అని అంటారు. క్షీణతకు గురి అయిన ప్రాంతాన్ని బట్టి సర్వైకల్ స్పాండిలోసిస్, థొరాసిక్ స్పాండిలోసిస్, లుంబార్ స్పాండిలోసిస్ అని పిలవటం జరుగుతుంది. వీటిలో సర్వైకల్ స్పాండిలోసిస్ మరియు లుంబార్ స్పాండిలోసిస్ సమస్యలను మనం ఎక్కువగా గమనించవచ్చు.

కారణాలు: వయస్సు పైబడటం ● వెన్నెముకకు దెబ్బ తగలటం, ఎక్కువగా బరువులు మోయడం ● ఒకే పొజిషన్‌లో ఎక్కువ సమయం కూర్చోవడం ● ద్విచక్ర వాహనాలపై ఎక్కువగా ప్రయాణించడం ● కంప్యూటర్ల పైన రోజంతా పని చేయడం ● ఎత్తయిన దిండ్లు వాడటం మరియు ఫోన్‌లో మాట్లాడేటప్పుడు మెడను సాగదీసి ఒక ప్రక్కకు వంచడం వలన మెడనొప్పి వస్తుంది.

లక్షణాలు: 'స్పాండిలోసిస్' సమస్యకు సంబంధించిన లక్షణాలు, అది ప్రభావం చూపిన భాగాన్ని బట్టి ఉంటాయి.

సర్వైకల్ స్పాండిలోసిస్:

- మెడనొప్పి సాధారణం నుండి తీవ్రస్థాయిలో
- నొప్పి – భుజాలకు, చేతులకు మరియు వ్రేళ్ళ వరకు వ్యాపించడం
- మెడ బిగుసుకుపోవడం లేదా కదలికలు తగ్గిపోవడం
- మెడ నరాలపై ఒత్తిడి పడటం వలన చేతులు బలహీనపడటం, పట్టు కోల్పోవడం, తిమ్మిర్లు, మొద్దుబారటం వంటి లక్షణాలను గమనించవచ్చు.
- కొన్ని సార్లు తలనొప్పి, కళ్ళు తిరగడం, వికారం, వాంతులు కావడం వంటి లక్షణాలు గమనించవచ్చు.

లుంబార్ స్పాండిలోసిస్:

- నడుము నొప్పి, ఉదయాన్నే నడుము బిగుసుకుపోవడం
- నొప్పి నడుము నుండి పిరుదులకు మరియు కాళ్ళ వరకు వ్యాపించడం
- నడుము భాగంలోని నరాలపై ఒత్తిడిపడటం వలన కాళ్ళలో తిమ్మిర్లు, మొద్దుబారటం, నడకలో బ్యాలెన్స్ తప్పడం, మల మూత్రాల విసర్జనపై నియంత్రణ కోల్పోవడం.
- సయాటికా వంటి లక్షణాలను గమనించవచ్చు.
- వెన్నెముకలోని ఏ భాగంలోనైనా నొప్పి దీర్ఘకాలికంగా ఉండి, జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే నిర్లక్ష్యం చేయకూడదు. ఇది క్యాన్సర్ లేదా క్షయ అయి ఉండవచ్చు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు: సి.బి.పి., ఎక్స్‌రే, సి.టి. స్కాన్, ఎమ్.ఆర్.ఐ. స్కాన్, హెచ్.ఎల్.ఏ.బి.27. ● చేతులు, కాళ్ళ కదలికలను మరియు రిఫ్లెక్సస్‌ను పరీక్షించడం వంటి పరీక్షలు చేయడం ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు.

హోమియోకేర్ ఇంటర్‌నేషనల్ చికిత్స: హోమియోకేర్ ఇంటర్‌నేషనల్‌లో అందించబడే జెనెటిక్ కాన్‌స్టిట్యూషనల్ చికిత్సా విధానం ద్వారా రోగి మానసిక మరియు శారీరక లక్షణాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స అందించడం ద్వారా, వెన్నెముకను దృఢంగా చేసి 'స్పాండిలోసిస్' సమస్యలు తిరగబెట్టకుండా వ్యాధిని సంపూర్ణంగా నయం చేసే అవకాశం ఉంటుంది.

ఉచిత కన్సల్టేషన్ 955 000 1188 / 99

www.homeocare.in

“షీ ఈజ్ నౌ ఆల్‌రైట్ సర్...” చెప్పింది సమంత.

“నో ప్రాబ్లమ్! ఏదైనా ఉంటే చెప్పండి. యశోదలో చెక్ చేయిద్దాం. మనకి మెడికల్ రీయంబర్స్‌మెంట్ ఫెసిలిటీ ఉంది కదా” అన్నాడు ఓదార్పు చూపుతూ.

“ప్రస్తుతం అవసరం లేదు సర్.” చెప్పింది సమంత.

“శ్రీకర్‌కి ఓకే చెప్పు. లేకుంటే మన కర్కరే నీకు ఈమెయిల్ పంపించే ప్రమాదముంది” సమంతను చూస్తూ చెప్పింది సమీర, గంట తర్వాత సమంత క్యాబిన్ దగ్గరకు వచ్చి.

“అదేంటి, అతడు మ్యారీడ్ కదా?” అడిగింది సమంత.

“మ్యారీడో కాదో తెలీదు. తనతో డేటింగ్‌కి ఎవరైనా సిద్ధపడతారేమోనని గురుడు ఎదురు చూస్తున్నాడు. కొండొకచో నీపైన అతడికేదో స్పెషల్ ఇంట్రస్టు ఉంది. నీ గురించి నీ సమాచారం రాబట్టాలని నన్ను రెండుసార్లు కెలికాడు..” చెప్పింది సమీర.

“కెలకడమేంటే? ఆ లాంగ్వేజీ మార్చులేవా?” కాస్త కోపంగా అంది సమంత.

“నేను తెలుగులో కాస్త పూర్ లే” అంది సమీర.

“నీ తెలుగు తగలెయ్య. వెళ్ళు, నువ్విక్కడే ఉంటే నిన్ను కేకలెయ్యడానికైనా ఆ కర్కరే మళ్ళీ వస్తాడు” చెప్పింది సమంత కంప్యూటర్ మానిటర్‌లో తల దూరుస్తూ.

జరిగిన కథ

సమంత, శ్రీకర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. అతని ప్రపోజల్‌ను ఆమె తిరస్కరిస్తుంది. తనకోసం మరో కంపెనీలో పెద్ద ఆఫర్‌ను శ్రీకర్ వదులుకోవడాన్ని జీర్ణించుకోలేక స్నేహం చేయడానికి మాత్రం అంగీకరిస్తుంది. ప్రేమ పెళ్ళి అనే భావన మీద సమంత వ్యతిరేకతకు కారణం బాల్యంలో ఆమె తండ్రి ప్రవర్తన, తల్లి పడిన కష్టాలే. అవన్నీ గుర్తుతెచ్చుకుంటూ ఊరు చేరుకుంటుంది. ఊళ్ళో తనకు పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నారని తెలుసుకుని శ్రీకర్ విషయంలో ఒక నిర్ణయానికి వస్తుంది. నిజానికి శ్రీకర్‌తో స్నేహానికి ముందే ఆమె ఆలోచనలు ఒక కొలిక్కి వస్తాయి. ఆ తర్వాత......

సరిగ్గా అదే నిమిషంలో శ్రీకర్ ఫోన్ చేశాడు. “సారీ, నౌ ఐయామ్ బిజీ, ఐ విల్ కాల్ లేటర్” అంటూ వెంటనే రికార్డెడ్ మెసేజ్ పంపింది.

మళ్ళీ రెండు గంటల తర్వాత శ్రీకర్ ఫోన్ చేశాడు. అదే మెసేజ్ పంపింది.

రెండు గంటల తర్వాత అతడొక మెసేజ్ పెట్టాడు, “ఐ విల్ కమ్” అంటూ.

“సారీ! ప్లీజ్, టుమారో మీట్ ఎట్ ఈవెనింగ్ సిక్స్ ఓ క్లాక్” అని మెసేజ్ పెట్టింది.

అనుకున్నట్టుగానే మర్నాడు ఆఫీసుకు దగ్గర్లో ఉన్న కాఫీ షాపులో వెయిట్ చేశాడు శ్రీకర్.

“నౌ ఐయామ్ నాట్ వెల్. నేచురల్ ప్రాబ్లమ్” అని మళ్ళీ మెసేజ్ పెట్టింది.

ఆ రోజు రాత్రి సమీర, సమంతకి కబుర్లు చెబుతూ తన సెల్‌లో ఏదో కొత్త గేమ్ ఉంటే ఆడుతూ, అనుకోకుండా సమంత సెండింగ్ మెసేజ్ చూసింది.

“ఏమిటి నీకు పీరియడ్సా? మొన్న ఊరికెళ్ళేప్పుడే కదా అయ్యావు. మళ్ళీనా...ఎనీ హెల్త్ ప్రాబ్లమ్...” అడిగింది కాస్త ఆందోళనగా సమీర.

“అదేం లేదు. శ్రీకర్ కలుద్దామని గొడవ పెడుతున్నాడు. ముందు కలుద్దామనుకున్నాను. వీలైనంతవరకు అతన్నించి దూరంగా ఉందామని అనుకుంటున్నాను. అందుకే ఆ కారణం చెప్పి తాత్కాలికంగా తప్పించుకున్నా” చెప్పింది సమంత.

“నిన్ను కలుస్తానని చెప్పింది ఫిజికల్ నీడ్ కోసం కాదు కదా. అతడికదో మానసిక తృప్తి! వెళ్ళుంటే బాగుండేదేమో...” అంది సమీర.

“ఎందుకో అతడికి కనబడాలంటే భయం వేస్తోంది. ముఖ్యంగా అతడిలోని సిన్సియర్ లవర్‌ని చూసి భయపడుతున్నాను” చెప్పింది సమంత.

“అతన్ని అవాయిడ్ చేస్తున్నావా?”

“అదేం లేదు...కొంతకాలం”

“కొంత కాలమంటే ఎంత కాలం?”

“నా పైన అతడికి సాఫ్ట్ కార్నర్ పోయేంత వరకూ. అతడికి విసుగొచ్చే వరకు.”

“నువ్వు పర్వర్టెడ్‌గా ఆలోచిస్తున్నావేమో...” అంది సమీర.

“ఎలాగైనా అనుకోవచ్చు. అందులో తప్పు

లేదు. అతడిలో మేల్ ఇగో నన్ను ధ్వంసం చేయక ముందే తప్పుకుంటే మంచిది కదా" అని భావిస్తున్నాను చెప్పింది సమంత.

"అతన్నెందుకు అలా అనుకుంటావ్?"

"ఏమో, చెప్పలేను. ఏ పుట్టలో ఏ పాముందో..." చాలా క్యాజువల్‌గా అంది సమంత.

సరిగ్గా అదే సమయంలో రమణతో కలిసి తన ఫ్లాట్‌లో సిట్టింగ్ వేశాడు శ్రీకర్.

"ఈ రోజు నాన్న ఐదు సార్లు ఫోన్ చేశాడురా. తన స్నేహితుడి కూతురు కూకట్‌పల్లిలో ఉందట. ఒకసారి వెళ్ళి చూసి రమ్మని పోరు పెడుతున్నాడు" చెప్పాడు.

"మరి ఆ విషయం సమంతకి చెప్పవచ్చు కదా?"

"చెప్పి, ఆయన చెప్పే విషయం కాన్ఫరెన్స్‌లో వినిపించాలని ప్రయత్నించాను. తను లిఫ్ట్ చేయలేదు. ఈవెనింగ్ కలుద్దామంటే తన ప్రాబ్లమ్ చెప్పింది" చెప్పాడు.

"ప్రాబ్లమా..." ఆదుర్దాగా అడిగాడు రమణ.

"అదే లేరా...త్రీ డేస్ ప్రాబ్లమ్" ఇబ్బందిగా చెప్పాడు శ్రీకర్.

"అయితేనేం ఫోన్‌లో చెప్పవచ్చు కదా?"

"ఎలా రియాక్ట్ అవుతుందోనని భయం. పర్సనల్‌గా కలిసి బ్రీఫ్ చేద్దామనుకుంటున్నాను."

"నువ్వు బ్రీఫ్ చేయడానికి ఇది ప్రాజెక్ట్ రిపోర్ట్ కాదు...జీవితం. ఆమెతో ఏదో ఒకటి తేల్చుకో" చెప్పాడు రమణ స్థిరంగా.

"సమంత చాలా పెంకి ఘటంరా. ఒకసారి నిర్ణయానికి వస్తే దాన్నించి ఆమెను దూరం చేయడం చాలా కష్టం." తనకు అర్థమైన సమంత గురించి చెప్పాడు శ్రీకర్.

"ఎంత పెంకి ఘటమైతే మాత్రం ఏంరా... పెళ్ళికి సిద్ధమంటున్నావు కదా? తనకిక అభ్యంతరం దేనికి..." కాస్త అసహనంగా అన్నాడు రమణ.

"నువ్వు ప్రేమలో పడితే ఆ కష్టాలు తెలుస్తాయిరా..." అన్నాడు శ్రీకర్ దెప్పుతూ.

"అయితే నీది ప్రేమంటావా?"

"వై...నాట్...ఎందుకు కాదు" అడిగాడు.

"అలాంటి భ్రమల్లో నీలాంటి వాళ్ళు బ్రతికేస్తుంటార్రా! ఆమె పైన నీకు ఉన్నది ప్రేమ కాదు, వ్యామోహం. నిన్ను రెచ్చగొట్టేది నీ మేల్ ఇగో" విశ్లేషించాడు రమణ.

"అలా ఎందుకనుకుంటున్నావురా. ఆమె కాదంటే నేను ఎవర్నీ పెళ్ళి చేసుకోను. ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉండిపోతాను."

"ఎవరైనా స్క్రిప్టు రైటర్లు ఉంటే నీ కహానీలు చెప్పుకో, నాక్కాదు" అన్నాడు రమణ స్కాచ్ గొంతు దిగుతుండగా.

"కావాలంటే ఇప్పుడే తనకి చెబుతాను" రెచ్చిపోతూ అన్నాడు.

"చెప్పు చూద్దాం" అన్నాడు రమణ.

శ్రీకర్, సమంత సెల్‌కి రింగ్ చేశాడు.

సమంత సెల్ సైలెంట్‌లో ఉంది. అప్పుడే మాగన్నుగా ఆమె నిద్రపోతోంది.

సమీర ఏదో బుక్ చదువుతూ కూర్చుని ఉంది.

సమంత సెల్ రెండు మూడు సార్లు రింగ్ కావడం వైబ్రేషన్ ద్వారా ఆమె గమనించింది.

ఏదైనా ఇంపార్టెంట్ కాల్ ఏమోనని సెల్ తన చేతిలోకి తీసుకుంది. స్క్రీన్‌పై 'శ్రీ' అని కనిపించింది.

శ్రీకర్ అన్న విషయం అర్థమై... తియ్యాలా వద్దా? అనుకుంటూండగా మళ్ళీ వైబ్రేషన్ వచ్చింది.

నిద్ర పోతోందని చెప్పడానికి ఫోన్ స్విచ్ ఆన్ చేసింది.

ఆమె చెప్పేలోపు శ్రీకర్ గడగడ ఒప్పు చెప్పి



నట్టు చెప్పేశాడు.

"సమంతా, నువ్వు నన్ను పెళ్ళి చేసుకోకపోతే జీవితాంతం బ్రహ్మచారిగానే ఉండిపోతాను. నాన్న ఎంత ఒత్తిడి చేసినా నిర్ణయం మార్చుకునేది లేదు" అని చెప్పి ఫోన్ పెట్టేశాడు.

సమీర నిస్పృహగా చూసి 'పాపం' అనుకుంది.

పక్క మీద సమంత ప్రశాంతంగా నిద్రపోతోంది. తను ఇంత హాయిగా ఎలా నిద్రపోతోందో ఆమెకి అర్థం కాలేదు.

"పడుకోవే....అతన్ని కెలికావు. అది తట్టుకోలేక అతగాడు నిద్రకు దూరమయ్యాడు. నువ్వేమో ఇక్కడ ఏమీ పట్టనట్టు నిద్రపోతున్నావు..." అనుకుంది స్వగతంలో. అలా అనుకుందే కానీ సగం మాటలు పైకే అనేసింది.

ఆమె గొంతు చప్పుడుకు కాస్త అటూ ఇటూ కదిలి..

"సమీరా...త్వరగా లైట్ ఆర్పేయ్.." అంది మత్తుగా.

"లైట్లు ఆర్పి మొగుడు దగ్గర పడుకోవాల్సిన దానివి. నీకేమిటే ఈ ఖర్మ..." కాస్త పెద్దగానే అంది.

తనకి పెళ్ళి చేస్తే ఎంచక్కా కాపురం చేసుకోవడానికి సిద్ధమే. కానీ తన కన్నా ఇద్దరు అక్కలు ముందు ఉన్నారని తండ్రి నానుస్తున్నాడు. ఈ లోపు ఎవరితోనైనా ప్రేమలో పడితే...'గీత' దాటు తానేమోనని భయం. ఆమెకు తన స్నేహితురాలు ఐశ్వర్య సంఘటన గుర్తుకు వచ్చింది. ఐశ్వర్య తనకి మంచి ఫ్రెండ్. వేరే కంపెనీలో పని చేస్తోంది. ఆమె ఫ్రెండ్ గంగాధర్ కంపెల్ చేయడంతో ఒకసారి అతడి ఫ్లాట్‌కి వెళ్ళింది. మొదట ఒకటి రెండుసార్లు కండోమ్‌తో కలిశారు. అది ఇద్దరికీ అసంతృప్తి కలిగించింది.

"అన్నం స్పూన్‌తో తినడానికి, చేతితో తినడానికి ఉన్నంత తేడా ఉంది ఐసూ" అన్నాడట.

"నాక్కూడా అలాగే ఉంది" అని చెప్పాలనుకుంది. కానీ ఈ లోపే అతడు మరో సారి ఆక్రమిస్తూ..."ఒక్కసారికి ఏమీ కాదులే" అతడు ప్రవేశించాడు. ఆ మోహంలో నెట్టేయలేకపోయింది. కట్ చేస్తే నెల తర్వాత నెల తప్పింది. టాబ్లెట్లు వేసుకుంటే పని చేయలేదు. చచ్చీచెడీ డి అండ్ సీ చేయించుకుంది. లేడీ డాక్టర్ తిట్టిన తిట్లు తిట్టకుండా తిట్టిందట.

"చదువుకున్నారు. ఉద్యోగం చేస్తున్నారు. ఆ మాత్రం జ్ఞానం లేదా? ఇలా రెండు మూడు సార్లు జరిగితే, తర్వాత కావాలన్నా పిల్లలు పుట్టరు" అని హెచ్చరించిందట.

"మీరా...ఇంకా నువ్వు పడుకోలేదా?" కళ్ళు మూసుకునే మళ్ళీ అరిచింది సమంత.

"పడుకుంటున్నాలేవే తల్లి" అని లైట్లు ఆర్పింది.

•••

సూర్య కిరణాలు చుర్రుమనడంతో ఇద్దరూ లేచారు. సమంత వాచీ చూసుకొని, హడావిడిగా

అన్నదమ్ములిద్దరి పెళ్ళిళ్ళూ ఒక్కసారే చెయ్యాలనేది తండ్రి ఆలోచన. దాంతో అతడి మీద తండ్రి ఒత్తిడి పెంచాడు. ఇక తాడోపేడో తేల్చుకోవాల్సిందే అనుకున్నాడతను. కానీ ఆమె తప్పించుకు తిరుగుతోంది. చివరకు ఒకసారి ఆమెను దొరకబుచ్చుకున్నాడు. కెఫేలో కూర్చోబెట్టి మెల్లిగా పెళ్ళి ప్రస్తావన తీసుకువచ్చాడు. అతడి సెంటిమెంటల్ భావాలన్నీ విని ఆమెలా స్పందించింది? అతడెలా రియాక్టయ్యాడు?

లేచి రెడీ అవుతుండగా సమీర చెప్పింది.

"మీ గురుడు రాత్రి పన్నెండుకు ఫోన్ చేశాడు" చెప్పింది.

"అర్ధరాత్రుళ్ళు ఫోన్లేమిటట? నేనేమైనా అతగాడి పెళ్ళాన్ని అనుకున్నాడా? ఫోన్లో నెంబరు కలుపు, ఝాడిస్తాను" అంది కోపంగా.

"అబ్బా...నువ్వు కాస్త కూల్ కావే...అతడే టెన్షన్‌లో ఉన్నాడో? ఏమో! నువ్వే అనుకుని నాతో గడగడ చెప్పేశాడు. నువ్వు కాదంటే బ్రహ్మచారిగానైనా మిగిలి పోతాడట. వాళ్ళ నాన్న ఎంత ఒత్తిడి చేసినా ఎవర్నీ పెళ్ళాడడంట" చెప్పింది.

"అతగాడికి వాళ్ళ నాన్న నుండి ఒత్తిడి ఉందా?" స్వగతంలో అనుకుంటూ పైకే అనేసింది.

"నిన్ను మీ అమ్మ ప్రాణాలు తీస్తున్నట్టు, అతన్ని వాళ్ళ నాన్న ప్రాణాలు తీస్తున్నాడేమో..." అంది జాలిగా.

మళ్ళీ ఆలోచనల్లోకి జారుకుంది సమంత.

ఆ రోజు భోజనం పూర్తయిన తర్వాత, అందరూ వక్క పలుకు వేసుకుంటూ జామ చెట్టు కింద కూర్చున్నారు. మావయ్య వాలు కుర్చీలో కూర్చుని పేపరు తిరగేస్తున్నాడు.

చిన్నగా సువర్చల పిన్ని కదిపింది.

"సమూ...ఎంత కాలం ఇలా ఉంటావు. నీకు ఆ మూడు ముళ్ళూ వేయిస్తే మీ అమ్మకు సంతోషంగా ఉంటుంది కదా?" అంది.

"ఆమె సంతోషంగా ఉంటుందో లేదో కానీ నా సంతోషం హరించుకుపోతుంది.." స్వగతంలో అనుకుంటూ పైకే అనేసింది.

"అలా ఎందుకనుకుంటావురా! పాతిక వేల జీతగత్తెవి, నీకు సమస్యలేముంటాయి..." అంది సులోచన.

ఒకసారి పెద్దమ్మ కళ్ళలోకి చూసి, "అమ్మ కేవలం పేదరికం వల్లే బాధ పడలేదు. నాన్న అనబడే మగవాడి దాష్టీకానికి బలైంది. ఆయన సప్త వ్యసనాలకు కుంగి కృశించిపోయింది. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని తోడబుట్టిన మీరు కూడా నిరూపించారు" బాధతోనూ, కోపంతోనూ అంది. కొద్ది నిమిషాలు ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

కాసేపటి తర్వాత రాజారావు మావయ్య అన్నాడు. "సరేరా, మా సెలక్షన్ నీకు నచ్చవచ్చు నచ్చక

ముచ్చటగా మూడవ సారి ఫెయిల్

కొందరికి ప్రేమలు అచ్చిరావు. ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకుంటే అది అడియాసే అవుతుంది. అలాంటి వారి జాబితాలో నయనతార పేరు కూడా చేర్చాల్సిందే అంటున్నారు కోలీవుడ్ జనాలు. ఇప్పటి వరకూ నయన రెండు సార్లు ప్రేమలో విఫలమైన సంగతి తెలిసిందే! మొన్నటి వరకూ ఆ విషయాలను కథలు కథలుగా చెప్పుకున్నారు. మూడవసారి ప్రేమలో పడిన తరువాత ఈ కథలు కనుమరుగైపోయాయి. తిరిగి ఇప్పుడు మూడవ కహానీ వెలుగులోకి వచ్చింది. ఈ మూడవ ప్రేమ వ్యవహారం కూడా బెడిసికొట్టిందని అంటున్నారు. మూడవ ప్రేమికుడు విఘ్నేష్ నయన్‌కు నచ్చడం లేదనీ, అందుకే అతగాడిని దూరం పెట్టిందనీ అంటున్నారు. ఇద్దరూ కలిసి అటెండ్ అవ్వాల్సిన ఫంక్షన్లకు కూడా విడివిడిగా రావడమే ఈ వార్తలకు కారణం. ఈ విషయంలో విఘ్నేష్, నయన నోరు విప్పకపోయినా, ఈ ప్రేమ వ్యవహారం కూడా అటకెక్కిందని చెబుతున్నారు. ఏది ఏమైనా నయన ప్రేమ వ్యవహారాలన్నీ పక్కన పెట్టేసి పెద్దలు కుదిర్చిన పెళ్ళి చేసుకుంటే బెటరంటూ తమిళ తంబిలు ఆమెకు సలహా ఇస్తున్నారు.

పోవచ్చు. నువ్వు చదువుకున్నావ్. అన్ని విధాలా నచ్చిన వ్యక్తి...నీ వ్యక్తిత్వాన్ని గౌరవించే వ్యక్తిని నువ్వే చూసుకో. మేం వచ్చి అక్షింతలు వేస్తాం" చెప్పాడు.

"ఆ సలహాలేంట్రా? సునంద జీవితమంటే అలా అయిపోయింది. అందరిదీ అలా ఎందుకవుతుంది? మనమే కులమూ, గోత్రమూ, మంచీ, చెడూ చూసి చేద్దాం" అంది సులోచన.

"ఈ రోజుల్లో చదువుకున్న వాళ్ళు అవేవీ పట్టించుకోవడం లేదక్కా" చెప్పాడు రాజారావు.

అందరూ అన్నీ మాట్లాడుతున్నా సునంద మాత్రం నిర్వికారంగా చూసింది.

"నువ్వు ఏం మాట్లాడడం లేదు ఏమిటమ్మా..." అడిగింది సమంత.

"నేను మాట్లాడేది ఏముందే...మా అక్కాచెల్లెలు చెప్పిన దానికంటే కొత్తగా నేను చెప్పేది ఏముంది? నిన్ను పిలిపించింది నీ పెళ్ళి విషయం ఏదో ఒకటి తేల్చేందుకే కదా" అంది సునంద.

తమకిచ్చిన గౌరవానికి కృతజ్ఞతగా సునంద వైపు చూశారు అక్కా, చెల్లెలు.

"అమ్మా, పెళ్ళి విషయంలో మాత్రం నన్ను ఒత్తిడి చేయకండి" కఠినంగా అంది సమంత.

సమంత ఎంత మొండి ఘటమో అందరికీ తెలుసు. ఊరికి బయల్దేరేప్పుడు సునంద అంది. "నీకు చెప్పేంత జ్ఞానం నాకు ఉందో లేదో తెలీదు. నువ్వు ఒకింటి దానవు అయితేనే మీ అమ్మగా నేను సంతోషిస్తాను" అంది. ఒక నిమిషం కలవర పడింది సమంత.

మరు నిమిషంలోనే తల్లిని దగ్గరకు తీసుకొని. "అమ్మా, నేను సంతోషంగా ఉండడమే కదా నీకు కావల్సింది. అది నాకు వదిలేసెయ్" అంది ధీమాగా. సమంత ముఖంలోనూ, స్వరంలోనూ కన్పించిన ఆత్మవిశ్వాసానికి ఒకింత ముగ్ధులయ్యారు అందరూ.

"సమూ, నీకు నీళ్ళు కాగాయి. బాత్‌రూంలో పెట్టనా" అడిగింది సమీర.

జ్ఞాపకాల నుండి బయటకు వచ్చి "థాంక్స్ మీర" అంది.

"థాంక్స్ దేనికీ, వేణ్ణీళ్ళు పెడుతున్నందుకా? నీ ఫియాన్సీ సమాచారం ఇచ్చినందుకా?" అంది అల్లరిగా సమీర.

"నీకు మాత్రం తెగ తొందరగా ఉందే...ఎవరినో ఒకరిని చూసి నీకు మూడు ముళ్ళూ వేయిస్తా! అప్పుడు గానీ నీకు తిక్క కుదరదు" అంది సమంత.

"ఆ పుణ్యం కట్టుకోవే తల్లీ! వచ్చే జన్మలో నీ కడుపున పుడతా" అంది సమీర నవ్వుతూ.

"నో...ఛాన్స్ నేను పెళ్ళే చేసుకోనుగా" అంది సమంత తిరిగి నవ్వుతూ.

"పెంకి ఘటం" అనుకుంటూ సమంతకి బాత్‌రూంలో నీళ్ళు పెట్టింది సమీర.

•••

మూడురోజుల తర్వాత ఠంచన్‌గా సమంత ముందు వాలిపోయాడు శ్రీకర్.

తప్పుకోవడం ఇక ఆమెకి సాధ్యం కాలేదు. అతడి వెంట ఆఫీసుకి దగ్గరగా ఉండే కాఫీ షాప్‌కి వెళ్ళింది. బేరర్‌ని పిలిచే ముందు మెనూకార్డు చూస్తూ "సమంతా, ఏమైనా తింటారా?" అడిగాడు.

నిజానికి ఆమెకి ఆకలిగా ఉంది. టిఫిన్ తెప్పిస్తే అతడి సమక్షంలో ఎక్కువ సేపు ఉండాల్సి వస్తుందని "ఏమీ అక్కర్లేదు, కాఫీ చాలు" అంది.

"అయితే నాకు ఆకలిగా ఉంది. నేను దోసె ఆర్డర్ ఇస్తాను. అది పూర్తయ్యే లోపు ఏదైనా కబుర్లు చెప్పు. టిఫిన్ అయిపోయిన తర్వాత వన్ బై టూ కాఫీ తాగుదాం" అన్నాడు.

ముఖం గంటుగా పెట్టి ఇతడేదో స్కాంతో వచ్చాడని అర్థమై, "సరే" అంది.

శ్రీకర్ చిన్నగా సమంతని సంభాషణలోకి దించాడు.

"సమంతా, నా అయిదేళ్ళ వయస్సులో అమ్మ చనిపోయింది. నాన్నే అన్నీ అయి మమ్మల్ని పెంచాడు. వచ్చే పిన్ని మమ్మల్ని సరిగా చూస్తుందో లేదోనని నాన్న మరో పెళ్ళి కూడా చేసుకోలేదు. నాన్నకు మరో ప్రపంచం లేదు. నాన్నది చిన్నపాటి ఫారెస్ట్ వాచర్ ఉద్యోగం. మమ్మల్ని స్కూలుకి రెడీ చేయడం, స్కూలు నుండి ఇంటికి తేవడం ఇదే ప్రపంచంగా బ్రతికాడు. తను పస్తులుండి హైస్కూలు చదువు తర్వాత పట్నంలో పెట్టి చదివించాడు. సిగరెట్ తాగితే ఆ అలవాటు మాకూ వస్తుందని సిగరెట్ తాగేవాడు కాదు. మద్యానికి దూరంగా ఉండేవాడు. ముందు తను చూసి బావుందంటేనే మమ్మల్ని సినిమాలకి తీసుకెళ్ళేవాడు. మాకు ఏమీ తెలీదు. బడి... నాన్న తప్ప మరో ప్రపంచం లేదు. అమ్మ ఎలా ఉంటుందో నాకు కాస్త లీలగా గుర్తు గానీ, తమ్ముడికి అదీ లేదు. జీవితమంతా నాన్న మా కోసం కష్టపడ్డాడు. మమ్మల్నిద్దర్నీ ఒక ఇంటి వాళ్ళను చెయ్యాలని కలవరపడుతున్నాడు. నాన్నకు ఏడాది క్రితం బైపాస్ ఆపరేషన్ జరిగింది. మళ్ళీ హార్ట్ ఎటాక్ వస్తే... బ్రతుకుతానో లేదో అన్నది ఆయన బెంగ. తమ్ముడు తన కొలీగ్ అరుణను ప్రేమించాడు. వాళ్ళ ఇంటి వైపు నుండి ఎలాంటి అభ్యంతరం లేదు. తను కూడా డాక్టర్. నా పెళ్ళి, వాడి పెళ్ళి ఒకేసారి చేయాలని నాన్న కోరిక. రెండేళ్ళ నుండి ఒత్తిడి చేస్తున్నాడు. నాకు నచ్చిన అమ్మాయి దొరకలేదని వాయిదా వేస్తున్నాను. అన్నయ్య మళ్ళీ చేసుకుంటాడులే. ముందు నేను చేసుకుంటాను అని నాన్నపై ఒత్తిడి తెస్తున్నాడు తమ్ముడు. పెద్దవాడికి పెళ్ళి చెయ్యకుండా చిన్నవాడికి చేస్తే వంశానికి అరిష్టంరా అని నాన్న వాడిని కేకలేస్తున్నాడు. మొన్న నాలుగు సార్లు ఫోన్ చేశాడు. ఆ ఒత్తిడి తట్టుకోలేక నీకు చేశాను. అందుకే రాత్రి నీకు చెప్పకుండా ఉండలేకపోయాను" చెప్పడం ఆపాడు శ్రీకర్.

ఒక నిమిషం ఆమె హృదయం అతడిపట్ల జాలితో నిండిపోయింది. బిడ్డల్ని కనురెప్పల్లా కాపాడుతున్న అతడి తండ్రిని చూడాలనిపించింది.

అయినా తమాయించుకొని "శ్రీ నేను ఎప్పుడూ చెప్పే నా సమాధానం ఒక్కటే. పెళ్ళి ఒక ఎమోషనల్ ఫీలింగ్ తప్ప అది అనివార్యమని నేను అనుకోవడం లేదు. నా దృష్టిలో పెళ్ళి అన్‌నెసరీ బైండింగ్. అది నాకు ఇష్టం లేదు. నా సంపాదనతో నా ఇష్టం వచ్చినట్లు స్వేచ్ఛగా బ్రతకడంలోనే నాకు తృప్తి ఉంటుంది. మీ పట్ల నాకు సింపతీ ఉంది. బట్ ఐయామ్ హెల్ప్‌లెస్. మీరు మంచి వాళ్ళు కాబట్టే మీతో ఈపాటి స్నేహమైనా చేస్తున్నా. దీనిని మీరు అడ్వాంటేజ్‌గా తీసుకోకండి. మీ ఎమోషనల్ డ్రామాలోకి నన్ను ఇన్వాల్వ్ చేయ

శ్రియ అంత చీపా?

అపార్థం చేసుకోకండి. ఈ మాట అన్నది ఆమె పారితోషికం విషయంలో! ఒకప్పుడు తెలుగులో శ్రియ స్టార్ హీరోయిన్. స్టార్ హీరోలందరితో ఆడిపాడింది. కొత్త నీరొచ్చి పాత నీటిని కొట్టేసినట్టు...కొత్త హీరోయిన్లు మిస్సైల్స్‌లా దూసుకు వస్తుండడంతో శ్రియకు అవకాశాలు అడుగంటిపోయాయి. అడపాతడపా ఫోటో షూట్లతోనూ, ర్యాంప్‌వాక్‌లతోనూ కాలం గడుపుతున్న శ్రియకు క్రిష్ రూపంలో అదృష్టం తలుపు తట్టింది. బాలకృష్ణ వందవ సినిమాలో హీరోయిన్‌గా శ్రియను ఓకే చేశారు. ఇంత వరకూ బాగానే ఉంది. అసలు కథంతా ఇక్కడే ఉంది. ఈ సినిమా కోసం శ్రియకు ఇస్తున్న పారితోషికం 35 లక్షలు మాత్రమే! శ్రియకు ఇప్పుడు సినిమాలు లేకపోవడంతో ఆమెకు అంత ఇస్తే సరిపోతుందని డిసైడ్ అయ్యారట! ఈ మొత్తం చూసి టాలీవుడ్ జనాలు నోరెళ్ళబెడుతున్నారు. శ్రియ ఈ సినిమాకి ఫ్రీగా చేసినా ఆమెకు పేరు వచ్చేదని, ఇంత తక్కువ తీసుకుని తన స్టామినాను తనే తక్కువ చేసుకుంటోందని ఆమె అభిమానులు వాపోతున్నారు. కొత్తగా వస్తున్న హీరోయిన్లకే అంత ముట్టజెబుతున్నారు. స్టార్ హీరోయిన్ స్థాయికి వెళ్ళిన శ్రియకు ఇంత తక్కువ ఇస్తారా? అని కూడా వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కండి. మీలాంటి అబ్బాయిల కోసమే అన్వేషించే అమ్మాయిలు కోకొల్లలు ఉన్నారు. వారిలో ఎవరో ఒకర్ని ఎంపిక చేసుకోండి. మీ తమ్ముడికి లైన్ క్లియర్ చేయండి. మీ నాన్నను కూడా మెంటల్ స్ట్రెస్ నుండి రిలీవ్ చేయండి..." నిష్కర్షగా చెప్పింది.

గాయపడ్డట్టు చూశాడు శ్రీకర్.

అదేమీ పట్టించుకునే స్థితిలో ఆమె లేదు. అప్పటికి రెండుసార్లు చేతి వాచీ చూసుకుంది.

"ఓకే శ్రీ, నాకు కాఫీ తాగే మూడ్ కూడా లేదు. మీరు ఆకలిగా ఉందన్నారు కదా. మీరు కానివ్వండి. బై..." చెప్పి విస విస బైటకు నడిచింది సమంత.

నిస్పృహగా కూర్చుండిపోయాడు శ్రీకర్. అతడి మెదడంతా బ్లాంక్‌గా మారిపోయింది. బేరర్ దోసె తెచ్చాడు. అతడికి తినబుద్ధి కాలేదు. ప్లేట్లోనే చేయి కడిగేశాడు. ఆకలి చచ్చిపోయినట్టయింది అతడికి. ఎలా ఫ్లాట్‌కి చేరుకున్నాడో అతడికే తెలీదు.



•••

గదికొచ్చి పడుకున్న గంట తర్వాత తమ్ముడు దినకర్‌కి ఫోన్ చేశాడు.

"ఏంటన్నయ్యా..." అడిగాడు.

"దినా, నీ మ్యారేజ్ ఫిక్స్ చేసుకోరా. నాతో పెట్టుకోకు" అన్నాడు.

"అదేంటన్నయ్యా అలా అంటున్నావ్" అడిగాడు దినకర్.

"నాతో పెట్టుకుంటే నువ్వు ఆజన్మాంతం బ్రహ్మచారిగానే ఉండిపోతావు" అన్నాడు కాస్త కటువుగా.

"నువ్వలా ఎందుకనుకుంటున్నావ్ అన్నయ్యా! నీకేం తక్కువ. అరుణ కజిన్ సిస్టర్ ఒకామె యుఎస్‌లో ఉందట. తనకన్నా కూడా ఆమె బావుంటుందట. ఒకసారి చూడన్నయ్యా. నీకు నచ్చితే నీ పెళ్ళి కూడా ఫిక్స్ చేద్దాం" చెప్పాడు దినకర్.

"పెళ్ళి చూపులు...పిచ్చి చూపులు. అవి నేను చూడను" అన్నాడు.

అన్నయ్య డిప్రెషన్‌లో ఉన్నాడని అర్థమైంది దినకర్‌కి. అన్న చెప్పకున్నా అతడెక్కడో గాయ పడ్డాడని మాత్రం అర్థమైంది. మరో నిమిషంలోనే అరుణకు ఫోన్ చేసి తన అన్న వాడిన లాంగ్వేజ్ చెప్పాడు. ఆమె చాలా సులువుగానే గ్రహించింది.

"మీ అన్నయ్య ఎవర్నో చాలా డీప్‌గా ప్రేమించాడు. అవతల నుండి పాజిటివ్ రిప్లయ్ ఉన్నట్టు లేదు. నిజానికి మీ అన్నయ్య స్టేటస్‌కి ఏం తక్కువ? ఏ ఆడపిల్ల ఆయన్ని కాదని అంటుంది?" అంది అరుణ.

"అరుణా, అన్నయ్య చాలా సెన్సిటివ్‌రా! ఏదైనా అఘాయిత్యం చేసుకుంటాడేమో" దినకర్ మనసు కీడు శంకించింది.

"దినకర్ నువ్వు వర్రీ కాకు. మీ నాన్న నుండి ఆయనకి మ్యారేజ్ విషయంలో ఫోన్ కాల్ పోకుండా చూడు. నేను మా నాన్నను కన్విన్స్ చేస్తాలే కొద్ది కాలం" అంది అరుణ.

"థాంక్స్ అరుణా..." అన్నాడు బేలగా దినకర్.

"వాట్...రా? బాబూ....నువ్వు డాక్టరువిరా... పేషెంట్‌వి అయితే ఎలా?" అంది నవ్వుతూ అరుణ.

"నేను కేవలం డాక్టర్‌నే. నువ్వు సైకియాట్రిస్ట్‌వి కదా?" అన్నాడు దినకర్.

"సర్లే, మ్యారేజ్ వాయిదా వేస్తున్నానని నాకు చేయాల్సిన గిట్టుబాట్లు ఆపకు" అంది అరుణ.

"ఎవరే ఆడవాళ్ళు వెనకబడ్డారని చెప్పింది. నీ దగ్గరకు వస్తే తెల్లవార్లు నన్ను నిద్ర పోనివ్వవు" అన్నాడు నవ్వుతూ దినకర్.

"మిస్టర్ డాక్టర్, యవ్వనం జారిపోతే క్షణం కూడా వెనక్కి రాదు. అందుకే నిన్ను జుర్రుకుంటున్నా" అంది అరుణ అల్లరిగా.

"సర్లే తల్లీ...నీకు దండం. రేపు వీకెండ్ వస్తాలే" చెప్పాడు దినకర్.

నవ్వుతూ ఫోన్ పెట్టేసింది అరుణ.

అరుణ ఫోన్ పెట్టేసిందే కానీ, దినకర్ అన్నయ్య శ్రీకర్ గురించి చాలా బలంగా ఆలోచిస్తోంది. అరుణ వైజాగ్‌లోని కింగ్ జార్జ్ హాస్పిటల్‌లో సైకియాట్రిస్ట్‌గా పని చేస్తోంది.

దినకర్ విజయవాడలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో పని చేస్తున్నాడు. ఇద్దరూ క్లాస్‌మేట్స్. మనసులూ, తనువులూ కలిశాయి. తాళి అనే పబ్లిక్ లైసెన్సు కోసమే ఇద్దరూ ఎదురు చూస్తున్నారు. వీకెండ్‌లో అరుణ దగ్గరకు వెళ్ళడం దినకర్‌కి అలవాటు. అతన్ని డిజప్పాయింట్ చేయడం ఇష్టం లేదు. అందుకే తరచూ అడ్వాంటేజ్ తీసుకుంటుంది. అది అతడికి ఇష్టం కూడా.

•••

రెండు మూడు వారాలుగా శ్రీకర్ సమంతకి ఫోన్ చేయలేదు. మొదటి వారం పట్టించుకోలేదు సమంత. రెండవ వారం ఆమెకెందుకో కొంత వెలితిగా, గిల్టీగా అనిపించింది. ఆ రోజు రాత్రి భోజనం పూర్తి చేసుకొని సమీర ల్యాప్‌టాప్‌లో తల దూరుస్తుండగా అడిగింది సమంత.

"శ్రీకర్ ఎందుకని ఫోన్ చేయడం లేదే" అడిగింది.

సమీర, సమంత ముఖంలోకి సీరియస్‌గా చూసి, "అతడేమైనా రోడ్ సైడ్ రోమియో అనుకుంటున్నావా? ఇన్ఫోసిస్ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్. యాభైవేల జీతగాడు. ఏదో అమ్మాయి బావుందని, పద్ధతైన పిల్లని నిన్ను పెళ్ళాడాలని అనుకున్నాడు. అతన్ని ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించావు కదా? ఈ మెంటల్ దానితో ఎక్కడ వేగుతాంలే అని మంచి సంప్రదాయమున్న పిల్లని చేసుకొని సెటిలవ్వాలనుకొని ఉంటాడు" అంది సమీర.

"అంటే నేను సంప్రదాయం లేని పిల్లనా?" అంది కోపంగా సమంత.

"నీకు లేదని ఎవరన్నారే...పెళ్ళీ పెటాకులు వద్దన్నావుగా...ఇంక గురుడు ఏం చేస్తాడు. నిన్ను నమ్ముకుని ఎంతకాలం తడి గుడ్డలేసుకొని పడుకుంటాడు.." అంది సమీర.

"అబ్బా, బూతు లేకుండా మాట్లాడవా?" అంది సమంత.

"నువ్వనే బూతు జరిగితేనే నువ్వూ నేనూ పుట్టాం. సృష్టి మొత్తాన్ని జీవ జాతులన్నింటినీ నడిపేది అదే. అదే లేకపోతే ఏదీ లేదు" అంది.

"అబ్బా చాల్లేవే....నీ మెట్ట వేదాంతం. ప్రేమా.. దోమా అన్నాడు కదా? మగాడు ఎంత స్వార్థ పరుడో చెప్పడానికే అతడి విషయం కదిపాను" కంక్లూడ్ చేసింది సమంత.

"ఓహో, అట్లా వచ్చావా? అయితే విను ఒక నిజం చెబుతాను. నువ్వు కాఫీ షాపులో ట్రీట్‌మెంట్ ఇచ్చిన తర్వాత శ్రీకర్ వారం రోజులు జ్వరాన పడ్డాట్ట. వాళ్ళ తమ్ముడు విజయవాడ నుండి వచ్చి తనతో పాటు తీసుకెళ్ళాడు. రోజూ నిన్ను కలవరించడం అతడి దినచర్యట. ఇదంతా అతడి ఫ్లాట్‌మేట్ రమణ నాకు చెప్పాడు. నీతో మాట్లాడమన్నాడు. అదొక పాషాణ శిల్పంలే, అది కరగదు. కొద్ది రోజుల తర్వాత అతడే మర్చిపోతాడులే అని నేనే సలహా ఇచ్చాను" చెప్పింది సమీర.

ఒక నిమిషం షాకయినట్టు చూసి మళ్ళీ తేరుకొని.... "ఆడది దాసోహమనే వరకు మగాళ్ళు అందరూ ఇటువంటి వేషాలు వేస్తూనే ఉంటారు. ఒక్కసారి అది లొంగి ఇద్దరు బిడ్డలు పుట్టిన తర్వాత దాని ముఖం కూడా చూడరు. ఎంత మందిని చూడలేదు" సమర్థించుకుంది సమంత.

"నీ ఖర్మ" అనుకుంటూ మంచంపై వాలి దుప్పటి కప్పుకుంది సమీర. సమంతకి నిద్ర పట్టలేదు. శ్రీకర్ అమాయకమైన ముఖమే గుర్తుకు వచ్చింది. మరు నిమిషమే ఫూల్ అని తిట్టుకుంది.

(ఇంకా వుంది)

మను వెడ్స్ తను

లవ్ స్టోరీ

'తను వెడ్స్ మను' అని హిందీలో ఒక సినిమా వచ్చింది. దానికి సీక్వెల్‌గా 'తను వెడ్స్ మను రిటర్న్‌డ్' అంటూ కూడా వచ్చింది. వాటికి, ఈ కథకు ఏ మాత్రం సంబంధం లేదు. అవి అవే, ఇది ఇదే-

అతడి పేరు మనోజ్. లేక మనోహర్ కావచ్చు. పాతకాలంగా పిలవాలనిపిస్తే 'మనువు' అనే అన వచ్చు. అంత మాత్రం అతడిని 'మను' అంటారు.

"పెద్దాడా మనూ" అని పిలుస్తాడు తండ్రి.

"నాన్నా మనూ" అంటుంది తల్లి.

కొడుకు మీద అంత ప్రేమవాళ్ళకు, అంత గారాబం, అంత మురిపెం, చిన్నప్పటినుంచీ కూడా బహుశా ఇంటికి పెద్ద కొడుకు కావటం వల్లనేమో.

తల్లిదండ్రుల అతిప్రేమ, అతిగారాబం కారణం గానే అతడికి 'తను' పరిచయమైంది. 'తను'తో సాన్నిహిత్యం పెరి గింది. 'తను' మాయాజాలంలో ఇరుక్కు పోయాడు.

చిన్నప్పటినుంచీ అతడికి 'తను'తో నేస్తం. ఎప్పుడూ ఆమె అతడిని అంటిపెట్టుకుని తిరిగేది. అతడికి నీడలా నడిచేది. ఆమె సన్నిధానంలో అతడెంతో హాయి ఫీలయ్యేవాడు. సుఖాన్ని పొందేవాడు.

'తను' అంటే అతడికెంతో పిచ్చి!

'తను' కూడా అంతే. అతడంటే ఎంతోప్రేమ ఉన్నట్లు ప్రవర్తించేది. అతను ఏ పని చేయబోయినా అడ్డుపడేది. చేయనిచ్చేది కాదు. తన వద్దే ఉండ మనేది.

చదవనిచ్చేది కాదు. రాయనిచ్చేదికాదు. ప్రకృతి అంటే అతడికెంతో ఇష్టం. ఊరిచివరి పొలాల్లోకి వెళ్లి ఆ పచ్చదనంలో ఎగిరే పిట్టల్ని, కదిలే మబ్బుల్ని చూస్తూ తిరగాలనిపించేది. 'ఏం వెళ్తావు కూర్చో' అంటూ చేయి పట్టుకుని లాగేది 'తను' కూర్చుండి పోయేవాడు.

ఆమె సావాసంలో పడి, ఆమె మోజులో పడి, ఆమె మాయలోపడి అతడికి ఏ పనీ చేయాలని పించేది కాదు. తర్వాత చేద్దాంలే తర్వాత చేద్దాంలే అనుకుంటూ ప్రతి పనినీ వాయిదా వేసుకుంటూ పోయేవాడు. అంతగా ఆమె అతడికి సుఖాన్ని అందించేది. అంతగా ఆమె అతడికి హాయిని సమకూర్చేది.

కొడుకుమీద ఆమె ప్రభావాన్ని తండ్రి ఏనాడో పసిగట్టాడు. "ఒరేయ్ దాని సావాసం మానుకోరా, దాన్ని వది లేయరా" అనే వాడాయన. చివాట్లు వేసే వాడు. ఒకటి రెండుసార్లు కొట్టాడు కూడా.

కాని ఏమీ కాలేదు. 'మను' 'మనూ'యే 'తను'కి బానిసే!

ఇంతగా ఆమె చెప్పినట్లు చేస్తున్నా 'తను'కి తృప్తి ఉండేది కాదు. "ఇంకా, ఇంకా" అంటూ అత డిని సాధించేది. కోరిక తీరని రాకాసిలా అతడిని పెన వేసుకుపోయేది. అతడిని తనకు పూర్తిగా బాని సను చేసుకునేది.

ఆమె చెప్పినట్లు వింటూ, ఆమెకు బానిసగా మారిపోవటంవల్ల జీవితంలో అతను ఎంతో కోల్పో యాడు. సరిగ్గా చదవ లేకపోయేవాడు. చిన్న ఉద్యో గంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. సమాజంలో ప్రతిష్ఠను తెచ్చుకోలేక పోయాడు.

ఆఫీసు కూడా అంతే. అతడివెంటే ఆమె ఆఫీ సుకు వచ్చేది. అతడిని ఏ పనీ సరిగ్గా చేయనిచ్చేది కాదు. అతడి మెడ చుట్టూ చేతులు వేసి కువకువ లాడేది. "ఏం చేస్తావులే, ఊరుకో, తర్వాత చేయవ చ్చులే" అనేది. కుక్కపిల్లలా అతడు తోక ఊపుతూ పాటించేవాడు.

ఆఫీసులో వాళ్ళు చెవులు కొరుక్కోవటం విని పించేదతనికి. "వాడు దానికి బానిసరా, వేస్ట్‌ఫెలో.."

ఒక దశ వచ్చేసరికి ఆమె మూలంగా తనెంత నష్టపోతున్నాడో మనూకి కూడా తెలిసి వచ్చింది. సిగ్గుతో కుంగిపోయాడు.

విరక్తితో ఆమెకు గుడ్‌బై చెప్పేయాలను కున్నాడు. విడాకు లిచ్చేయాలనుకున్నాడు. కాని దీర్ఘకాలబంధం.. ఏమీ చేయలేకపోయాడు. నిస్సహా యంగా మిగిలిపోయాడు.

రానురాను అతనికి ఆమె మీద యావ్ష పుట్టసా గింది. ఇంక భరించలేక, నలుగురికీ ఆమె గురించి చెప్పుకుని వాపోదామనో, ఓదార్పు చెందుదామనో హెచ్చరించుదామనో అతడీ కథను రాయటానికి పూనుకున్నాడు.

అంతలో ఆమె మళ్ళీ వేంచేసింది. అతడి చేయి పట్టుకుని మంచం వేపుకు లాగసాగింది. "నీ సుఖమేగా నే కోరుతున్నా" అంటూ ఘంటసాల గొంతుతో పాడసాగింది.

"నోర్మూయ్" అన్నాడతను.

మృదువుగా అరచేతిని అతడి నోటిమీద ఉంచింది.

"ఇదేమిటి?"

"నువ్వేగా మూయమన్నావు!" అంది చిలిపిగా.

ఇంకేమి మాట్లాడతాడు మానవుడు!!

●●●

అయ్యా, అదండీ సంగతి.. తను గురించి మీకింతగా చెబుతున్నాను గాని ఆమె ఎవరో, ఆమె పూర్వాపరా లేమిటో, పూర్తి పేరేమిటో చెప్పనేలేదు కదూ. అయితే వినండి. ఆమె పేరు బద్ధకం!

జన్మలో ఆమె ప్రేమలో పడకండి. ఆమె మోహంలో చిక్కుకోకండి.

-కంఠంనేని రాధాకృష్ణమూర్తి

కంఠంనేని రాధాకృష్ణమూర్తి

గేమ్ ఆఫ్ లైఫ్

వచ్చేవారమే ప్రారంభం

తోడొకరుండిన అదే స్వర్గము

మంత్రవాది మహేశ్వర్

రఘురామ్ వరండాలో వాలు కుర్చీలో కూలబడ్డాడు. ఒక చేతిలో కాఫీ కప్పు. మరో చేతిలో అప్పుడే పేపర్‌బాయ్ విసిరిన పేపరు. కళ్ళు పేపర్లోని అక్షరాల మీద పచార్లు చేస్తున్నాయే గానీ మనసు మనసులో లేదు. కాఫీ సిప్ చేస్తున్నాడే కానీ దానిని ఆస్వాదించడం లేదు. ఏదో యాంత్రికంగా జరిగిపోతోంది. మనసు లేకపోతే మనిషి యంత్రమే. అలవాటుచొప్పున, గ్రహపాటుచొప్పున పనులు జరిగిపోతుంటాయి. ఈ ప్రపంచంతో సంబంధమున్నవాడిలా లేదు ధోరణి. ప్రతిరోజూ ఒకేలా గడుస్తోంది. కాలాన్ని సంహరించడానికి బ్రతుకీడుస్తున్నట్లుగా ఉంది.

ఏదో పుస్తకాలు చదవడం, వంట, ఎవరైనా చుట్టుపక్కల పిల్లలు వస్తే వాళ్ళకర్థంకాని పాఠాలు చెప్పడం, ఆరోగ్యం దెబ్బతింటే కష్టం కనుక కాసేపు యోగా, సాయంకాలం తోచక వాకింగ్‌కి దగ్గర్లోని రైల్వేస్టేషన్‌కు వెళ్ళడం, ఆ స్టేషన్‌లో రిటైరైన తన లాంటి కొందరు మిత్రులతో కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేయడం...అదే కాస్త ఊరట జీవితంలో. అయితే అక్కడికొచ్చేవారికి కూడా ఎవరి సంసారాలు వాళ్ళకున్నాయి. అమెరికాలో ఉద్యోగాలు వెలగబెడుతున్న పిల్లలున్న వాళ్ళు, ఫోనులోనే యోగక్షేమాలు తెలుసుకుని సింపతీ వెలిబుచ్చే విషయాలు, దగ్గరే ఉండి తమ ఆస్తుల మీద కన్నేసిన విషయాలు.... వాళ్ళతో తనకు కొంత వరకు కాలక్షేపం.

రఘురామ్ భార్య హార్ట్‌ఎటాక్ వచ్చి నాలుగేళ్ళ క్రితం పోయింది.

"లలితా, నువ్వు లేని లోటును చాలా అనుభవిస్తున్నాను. ఇలా ఏకాకిగా తోడు కరువై...నన్నూ నీ దగ్గరకి పిలవ్వూ...రప్పించుకోవూ" అనుకుంటూ కళ్ళజోడు తీసి తుడుచుకున్నాడు. గోడ మీద లలిత ఫోటో, నుదుటి మీద చంద్రబింబంలా గుండ్రటి బొట్టుతో..

ఆమె తోడుగా ఉన్నంతకాలం జీవితం ఎంతో హాయిగా, ప్రశాంతంగా ఉండేది. బలంగా అనిపించేది. ఆమె తనకంటే ముందే వెళ్ళిపోతుందని ఏనాడూ అనుకోలేదు రఘురామ్. కొడుకులిద్దరూ అమెరికా డాలర్లు పంపిస్తున్నారు, ఎన్ని తరాలకు సరిపోవాలనో.

"ఇండియా ఎప్పుడు వస్తార్రా" లలిత బతికున్నన్నాళ్ళు తరచూ వేసిన ప్రశ్న. తన గుండెను మెలిపెట్టిన ఆలోచనలోంచి పుట్టినది.

"కొన్నాళ్ళు...కాస్త సంపాదించుకుని వచ్చేస్తాం."

ఆ జవాబు జవాబుగానే ఉండిపోయింది. ఎప్పుడూ వాళ్ళని తలుచుకుంటూనే ఉండేది లలిత. మనవలు, మనవరాళ్ళ ముద్దు మురిపాల కోసం తాపత్రయ పడేది. ఫోటోలు మాత్రం ఈ-మెయిల్‌లో సముద్రం దాటి వస్తుండేవి.

తల్లి పోయినప్పుడు వచ్చారు.

బాధలో ఉన్న రఘురామ్‌ను ఓదార్చారు. తమ మాటలతో, ఇంకా మరిచిపోని తెలుగులో.

"మీరు ధైర్యంగా ఉండండి. మేమూ వచ్చేస్తాం త్వరలో..." ఆశ కల్పించారు కొన్నాళ్ళు.

తరువాత వాళ్ళ వరుస మారింది.

"ఇండియాలో ఏముంది? పిల్లలు రామంటున్నారు నాన్న. ఇక్కడే బావుందట. కోడళ్ళకు కూడా

ఇక్కడే అలవాటైపోయిందట...” ఆ మాటలు రఘురామ్‌కు బాధ కలిగించలేదు, ఆశ పెట్టుకోలేదు కనుక. కానీ ఇండియాలో ఏముంది? అన్న మాటే శూలంలా గుచ్చుకుంది.

పుట్టిందీ పెరిగిందీ ఇండియాలో. ఐఐటిలో సీటు, స్కాలర్‌షిప్, ఓ మంచి ఉద్యోగం ఇండియా ఇచ్చింది. కన్నవాళ్ళు, కావల్సినవాళ్ళు, ప్రేమను పంచిన వాళ్ళు, గుండెకు హత్తుకున్న వాళ్ళు, కష్టమొస్తే కన్నీరు పెట్టుకున్న వాళ్ళు ఇండియాలో ఉన్నారు. డాలర్ల రుచి చూసేసి ఇక్కడేముందనడం నచ్చలేదు సరిగదా కోపం రప్పించింది.

“ఇష్టంలేకపోతే ఇష్టంలేనట్లే ఉండండి. అంత కంటే ఎక్కువ మాట్లాడొద్దు” అనేశాడు ఓసారి.

అప్పుడప్పుడు వచ్చే ఆ ఫోన్‌కాల్స్ పెద్దగా ధైర్యాన్ని గానీ, సంతోషాన్ని గానీ ఇవ్వలేదు సరిగదా ఒంటరితనాన్ని ఏమాత్రం పోగొట్టలేకపోయాయి.

పనిమనిషి వచ్చి తన పని తను చేసుకుపోతుంది. రఘురామ్ పేపర్ చదవడంలో ఉండగానే పనులు అయిపోతాయి. వెళ్ళిపోతూ “వస్తాను, తలుపేసుకోండి” అనే మాట మాత్రం అప్పుడప్పుడు చెవిన పడుతుంది.

ఆరోగ్యపరంగానూ, ఆర్థికపరంగానూ బావుండడం చేత జీవితం దుర్భరం కాలేదనిపిస్తుంది. అదే అదృష్టమేమో. ఒంటరితనానికి ఆ రెండిటి లోటు కూడా తోడై ఎంతమంది బాధపడట్లేదు. పిల్లల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన కర్మ పట్టించనందుకు ఆ దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు ఎన్నిసార్లో.

తనతో కలిసి మాట్లాడేందుకు, నవ్వేందుకు, చర్చించేందుకు, ఎదిరించేందుకు మాటా మాటా అనుకునేందుకు ఎవరూ లేరు. ఇవన్నీ చిన్న విషయాలా? ఈ చిన్న చిన్న విషయాలు జీవితంలో అతిపెద్ద లోటుగా అనిపిస్తాయా? అనిపిస్తాయేమో, అనుభవం నేర్పిన పాఠం. ఈ చిన్న విషయాలే జీవితంలో అవసరమైన సంతోషానికీ కారణమవుతాయని అర్థమైంది.

పేపరు తిరగేస్తున్నప్పుడు-

వార్తలపై నుంచి దృష్టి ‘క్లాసిఫైడ్స్’ మీద పడింది. ఎన్నో రకాల ప్రకటనలు. స్నేహాన్ని కాంక్షించే వారూ కనిపించారు. అలాంటి ప్రకటనలు ఇదివరకూ కనిపించాయి. కానీ ఈరోజున చూస్తున్నది మరో కోణంలో-

ఎక్కువ మంది ఇరవై ముప్పై ఏళ్ళలోపు వాళ్ళే. కానీ ఆరోజు ఓ ప్రకటన తనని ఆకర్షించింది. ఓ యాభై అయిదేళ్ళ ప్రభుత్వరంగ సంస్థ ఉద్యోగి ప్రకటన అది. తన మీద ఎందుకో తీవ్ర ప్రభావం చూపించింది. ఓ రెండు వారాల పాటు అటువంటి ప్రకటనలే చూశాడు. ‘తోడుకోసం’-తనదీ అదే పరిస్థితి. వెంటనే కాగితం కలం తీశాడు.

తనకు కలిగిన ఆలోచనను కాగితం మీద ప్రకటనగా రాశాడు.

ఆరుపదులు దాటి, రిటైరై ఒంటరిగా హైదరాబాదులో సొంత ఇంట్లో ఉంటూ ఏ బాదరబందీ లేని వ్యక్తికి పరిణతి చెందిన తోడుకోసం...సంప్రదించాల్సిన ఫోన్ నెం: 9441420962

రాసి, పైకి చూశాడు.

లలిత ఫోటో...

లలితకు ఇష్టముంటుందా? ఉంటుంది.

తన వయసు చూసినట్లయితే ఎవరూ ముందుకు రారు అనిపించింది. అయితే ఎవరైనా వచ్చి తనకున్న బ్యాంక్ బ్యాలన్స్, ఆస్తి మీద కన్ను వేస్తే... భయం వేసింది. కల పీడకలగా మారినట్లయింది.

ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకున్నాడు.

పేపర్లో ప్రకటన వచ్చింది. రోజూ కొన్ని కాల్స్ తనకి.

డెబ్భై ఏళ్ళుండి భర్త పోయిన ఆవిడ దగ్గర్నుంచి-

ముప్పై అయిదేళ్ళుండి భర్త నుండి విడాకులు తీసుకున్నావిడ-

భర్త పోయిన ఓ యాభై ఏళ్ళావిడ బిజినెస్ వ్యవహారాలు చూసుకునేందుకు...ఇలా...

ఈ వయస్సులో పిల్లల బాధ్యతలూ అవీ...నచ్చలేదు..

బిజినెస్ వ్యవహారాలు...ఇష్టం లేదు..

సమస్యలు తెచ్చిపెట్టుకున్నట్లవుతుందనిపించింది. ఆరోగ్యం చెడగొట్టుకున్నట్లు అవుతుందనిపించింది.

ఇంతకీ తనకేం కావాలి. తోడు...స్నేహహస్తం... ఒంటరితనం దూరం చేసుకునే ప్రయత్నం.

ఏదో ఖాళీ...వెలితి జీవితంలో.

తోడొక్కటే మార్గం!

కొందరు వయసులో ఉన్న ఆడవాళ్ళు శృంగారంలో ఆసక్తి ఉందో లేదో తెలుసుకున్నారు. మరి కొందరు నెలకు ఇంత అని ఇస్తే ‘కంపెనీ’ ఇస్తామని ధరల పట్టీ చదివారు. ఎక్కువ కాలం అయితే



పిల్లలు విదేశాల్లో ఉన్నారు. అన్నీ ఉన్నా ఆయన మనసును ఏదో బాధిస్తోంది. ఒంటరితనం! దాన్ని జయించేదెలా? ఒక రోజు పేపరు చదువుతుంటే ఐడియా వచ్చింది. వెంటనే ప్రకటన ఇచ్చాడు. ఎంతోమంది ఫోన్ చేశారు. ప్చ్....! వర్కవుట్ కాలేదు. చివరిగా ఒక చదువుకున్న యువతి ఫోన్ చేసింది! ఆయనకు సహచరిగా ఉండేందుకేనా? ఆమె ఎందుకంత సాహసం చేసింది?

డిస్కౌంట్ కూడా ఉందన్నారు. విని నవ్వుకున్నాడు. అపురూప బంధానికి వెల...రేటు...

పనికిరాని ఆలోచన బుర్రలో దూరి ఇబ్బంది పెట్టిందనుకున్నాడు. నిరాశ చెందాడు.

ఈ ప్రకటన ఇవ్వాలన్న ఆలోచన రాకముందే తను సుఖంగా, హాయిగా ఉన్నాడనిపించింది.

ఫోటోలో లలిత నవ్వుతూ దర్శనమిచ్చింది.

“నేనూ ఫోటోలో నీ పక్కనుండాల్సింది లలితా. ఇక్కడ ఏం సాధిస్తున్నాను. తోడులేక, ఒంటరితనంతో సతమతమవడం తప్ప. ఏకాంతంలో మనసు విప్పి మాట్లాడుకోవడానికి మనిషి అవసరం బాగా తెలుస్తోంది!

ఫోన్ రింగైంది.

మొదట్లో ఉన్న ఉత్సాహం, ఎదురు చూపులూ లేవు. పైగా విసుగు కూడా కలుగుతోంది.

“ఈ కాల్ మునుపటిలాంటిది కాకుండా ఉండాలి” అనుకుంటూ ‘హలో’ అన్నాడు.

‘హలో’ అవతల పక్కన అమ్మాయి మృదువైన కంఠస్వరం.

“నేను పేపర్లో మీరిచ్చిన ప్రకటన చూశాను.”

“అలాగా”

“నా పేరు స్రవంతి. నేను మిమ్మల్ని కలుసుకోవచ్చా?”

“క్షమించాలి. నేను వయసులో పెద్దవాళ్ళు, కాస్త పరిణతి చెందిన వాళ్ళ కోసం చూస్తున్నాను. నా వయసు తెలుసుగా..అదీ... మీరు చాలా చిన్నవారిలా అనిపిస్తున్నారు.”

“అవును. కానీ సార్, నేను మీతో మాట్లాడాలి. చాలా ముఖ్యం.”

“కుదరదమ్మా...విషయం నీకు చెప్పాను.”

“ప్లీజ్...ఒక్కసారి...మీరు నిరాశ చెందరు, నాతో మాట్లాడాక. నేను హామీ ఇస్తున్నాను. మనం కలిస్తే తప్పకుండా మంచే జరుగుతుంది. మీ జీవితమూ మారిపోతుంది. నాకు తెలుసు.”

ఆ మాట కదిలించింది రఘురామ్‌ను. అయినా-

“చూడమ్మా...నాకు ఆసక్తి పోయింది. ప్రస్తుతం ఆ ప్రకటన ఎందుకు ఇచ్చానా అని సంశయంలో పడ్డాను. అర్థంచేసుకో”

“ఉత్సవ్ రెస్టారెంట్‌లో రేపు ఆరుగంటలకు...ఉత్సవ్” అదే మాట మళ్ళీ చెప్పి ఫోను పెట్టేసింది, మరో మాట వినిపించుకోకుండా.

“ఏమిటీ అమ్మాయి తీరు! వయసులో ఉన్న అమ్మాయి అయితే జాగ్రత్తగానే ఉండాలి” మనసు హెచ్చరించింది.

మర్నాడు-

తెల్లవారింది...

కాఫీ, న్యూస్‌పేపర్ దినచర్య ప్రారంభమైంది. పేపర్లో బుర్ర పెట్టాడే కానీ ఆలోచన ముందు రోజు ఫోన్‌కాల్‌పైకే మళ్ళింది.

"...మంచే జరుగుతుంది..మీ జీవితమూ మారి పోతుంది..." స్రవంతి మాటలు గుర్తొచ్చాయి.

"ఎలా చెబుతుంది అలా.."

"చలాకీ అమ్మాయి..."

"పోనీ, ఏమిటో ఎందుకో...ఉత్సవ్‌కి వెళితే తెలిసి పోతుందిగా" అనిపించింది. "ఒంటరితనం పోతే కావాల్సిందేముంది" అనీ అనిపించింది.

డార్క్ బ్రౌన్ కలర్ ప్యాంటు, లైట్ బిస్కట్ కలర్ షర్ట్ చక్కగా ఇన్ చేశాడు. నొక్కి దువ్విన క్రాపు... గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళజోడు...అద్దంలో ఒకటికి రెండుసార్లు చూసుకున్నాడు.

తెల్లబడిన వెంట్రుకలను పట్టించుకోకుండా "డిగ్నిఫైడ్‌గానే ఉన్నాను. మర్యాదస్థుడి లానే కనిపి స్తున్నాను. వయసొస్తే ఏం...అందం ఉంది...అయినా ఏ వయసులో గ్లామర్ ఆ వయసుకుంటుంది" అను కున్నాడు.

'ఉత్సవ్..'

బయట పక్క ఓ మేగజైన్ షాపు. అక్కడ కొత్త మేగజైన్స్ చూస్తున్నాడు. మధ్యలో వాచీ చూసుకున్నాడు. మనసు వేగంగా పరిగెడుతున్నందువల్ల గడి యారం ముళ్ళల్లో అలసట కనిపించింది.

అనుకున్న సమయం దాటింది. ఏ అలికిడీ లేదు.

'ఉత్సవ్'లోకి వెళ్ళి ఓ కాఫీ ఆర్డర్ చేశాడు.

"తనని ఆట పట్టించే ప్రయత్నం కాదుగా...మోసం కాదుగా...దూరం నుంచి ఎవరైనా గమనిస్తున్నారా... మనమే ఫోన్ చేస్తే..ఎందుకు వద్దు..." అనుకుంటూ అటూ ఇటూ చూశాడు.

"ఎక్స్‌క్యూజ్‌మీ...మీరు స్రవంతి కోసం వెయిట్ చేస్తున్నారా??" అడిగిందో అమ్మాయి.

"అవును.."

"హలో సార్! గుర్తు పట్టారా? అయినా ఎలా పడతారు లెండి? నేనే స్రవంతి. మీకు ఫోన్ చేసింది నేనే" షేక్‌హ్యాండ్ ఇచ్చింది.

"అలాగా...కూర్చోమ్మా."

"నాకు తెలుసు మీరు డిజప్పాయింట్ చేయరని. చాలా సంతోషంగా ఉంది. మిమ్మల్ని వెయిట్ చేయించినందుకు ముందుగా సారీ. ఏం చేయమం టారు? ఆఫీసు నుంచి బయటపడేసరికి ఆలస్య మైంది."

"పరవాలేదు. కాఫీ తీసుకుంటారా" అంటూ ఆర్డర్ చేశాడు.

స్రవంతి ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనేస్తుందన్న విషయంతో పాటు కొన్ని మామూలు విషయాలూ మాట్లాడింది. విజయవాడ, విశాఖపట్నంతో కూడా పరిచయమున్నట్లు, ఆ విషయాలూ చెప్పింది. తన చదువు ఎలా సాగిందో చెప్పింది.

స్రవంతి గలగలా మాట్లాడేతీరు రఘురామ్‌కు ఎంతో నచ్చింది. అందంగా ఉందమ్మాయి. కట్టూబొట్టూ సంప్రదాయత ఉట్టిపడుతోంది. ముఖంలో ఓ కళ. పెదాలపై నవ్వు. కళ్ళల్లో చురుకుదనం. ప్రవర్తనలో

రాశి మంచి భార్య అట

'ఆలూ లేదు..చూలు లేదు...కొడుకు పేరు సోమలింగం' అన్నట్టు రాశికి ఇంకా పెళ్ళే కాలేదు. ఆమె మంచి భార్య అంటూ సాయి ధర్మతేజ్ కితాబిచ్చేశాడు. ఇదంతా చూస్తుంటే వీరిద్దరూ పెళ్ళి చేసుకున్నారా? అన్న అను మానం వస్తోందా? లేదు. నిజజీవితంలో కాదు రీల్ లైఫ్‌లో 'సుప్రీమ్' సినిమాలో రాశి, సాయి ధర్మతేజ్ కలిసి నటించారు. ఈ సినిమా మంచి వసూళ్ళు సాధించిన సంగతి తెలిసిందే! ఈ సందర్భంగా సాయిధర్మతేజ్ రాశిని ఓ రేంజ్‌లో పొగిడేశాడు. అప్పుడే రాశి మంచి భార్య అవుతుంది అంటూ కితాబు కూడా ఇచ్చేశాడు.

మర్యాద...స్రవంతిలో ఓ పద్ధతి, క్రమశిక్షణ కని పించాయి రఘురామ్‌కి.

జీవితంలో రఘురామ్‌కు ఎంత అనుభవం... ఎన్ని రకాల వాళ్ళను చూడలేదు..ఉద్యోగరీత్యా ఎన్ని ప్రాంతాలు తిరగలేదు..ఎన్ని మనస్తత్వాలు చదవలేదు?

స్రవంతితో మాట్లాడడం చాలా సంతోషా న్నిచ్చింది.

ఆమెలో ఒక ఆశావాహ దృక్పథం కనిపించింది.

మాట్లాడుతున్నాడే గానీ బుర్రలో ఓ పెద్ద ప్రశ్న ఉదయించింది. ఈ అమ్మాయికి అసలు ఏం కావాలి? తన నుంచి ఏం ఆశిస్తోంది. ఆమె కోరుకుంటే చాకు లాంటి కుర్రాళ్ళు దొరక్కపోవడముండదు. అమ్మా యిని చూస్తే ఎగిరి గంతేస్తారు కూడా.

మాటలు దొర్లుతున్నాయి కానీ అసలు విషయం మాత్రం బయటకు రావడం లేదు.

రఘురామ్‌లో అసహనం పెరిగింది. అడిగే శాడు.

"చెప్పండి మేడమ్. నాకెందుకు ఫోన్ చేశారు?"

"ముందుగా అలా పిలవకండి. నేను చిన్న దాన్ని. స్రవంతి అని పిలవండి చాలు."

"అలాగేనండీ స్రవంతిగారూ" అని చేతులు జోడించేసరికి ఇద్దరికీ నవ్వొచ్చింది. ఆ నవ్వు నిష్కల్మ షంగా ఉంది వారి మనస్సుల్లాగే.

"చెప్పు స్రవంతి."

"కొద్దిగా నాకు సమయం కావాలి. నేను చెప్ప డానికి...చెబుతాను..అయితే కాస్త ఓపికతో వినాలి మీరు" అంటూ వాచీ చూసుకుంది.

"నేను ఏడున్నరకల్లా వెళ్ళిపోవాలి. లేకపోతే మా అమ్మ కంగారుపడుతుంది" ...

"కానీ..."

"నేను రేపు కలుస్తాను. మీరు వెయిట్ చేస్తుం టారని హడావిడిగా వచ్చేశాను. ఏమనుకోకండి. రేపు కాస్త ముందే వచ్చి మాట్లాడతాను..ప్లీజ్ ఏమను కోరుకదూ..."

కలిసే సమయం కనుక్కోవడం కన్నా ఏం తెలుసుకోలేకపోయాడు.

ఆ రాత్రి రఘురామ్ మనసంతా స్రవంతి చుట్టే ఉంది. మాట్లాడుతుంటే చాలా బావుందనిపించింది. అందమైన నవ్వు...స్నేహపూరితమైన స్వభావం. కానీ తను...తన వయసేమిటి? అరవైనాలుగు...ఏం జరుగుతోంది?

ఆలోచనలు తెగలేదు.

'ఉత్సవ్' దగ్గర కలవాలనే నిర్ణయించు కున్నాడు.

మాట్లాడడంలో తప్పేముంది? మాట్లాడితే ఏదో కొత్త శక్తి...వెళ్ళాడు.

ఆఫీసు ప్రాజెక్టులు, సమస్యలు చెప్పింది. సల హాలు అడిగింది. ఆయన తన అనుభవంతో పరి ష్కారం సూచించాడు.

రఘురామ్ మరే విషయమూ ఎత్తలేదు. ఎత్తా లనిపించలేదు.

స్రవంతి కూడా మాట్లాడలేదు.

"ఏమైనా సున్నితమైన భావాలుండడం లేదు యువతలో. తల్లిదండ్రుల శ్రమకు, ప్రేమకు పిల్లలు విలువ కట్టరు. వారి మాటల ధోరణి కూడా పెడసరంగా ఉండి పెద్దవాళ్ళను కష్టపెడుతోంది" అన్నాడు రఘు రామ్ మాటల మధ్యలో.

"సమస్య మొత్తంగా చూడాలి. కొన్ని సంఘట నలతో నిర్ణయానికి వచ్చేయకూడదు. నేటి యువత పైన ఒత్తిడి, అభద్రత ఎక్కువగా ఉంటోంది.." అంది.

"అనుభవమనేది ఓ దువ్వెన లాంటిది. అది చేతికందేటప్పటికి దాని అవసరముండదు. ఎందు కంటే నెత్తి మీద వెంట్రుకలుండవు అప్పటికి" చమ త్కరించింది.

ఇద్దరూ నవ్వుకున్నారు.

మనస్ఫూర్తిగా ఆనందంగా అనిపించింది రఘురామ్‌కు.

మరోరోజు-

"మీ తరం వారికి కంప్యూటర్లంటే ఎలర్జీ. లేటెస్ట్ టెక్నాలజీ ఇష్టపడరు. అది ఈ తరం నుంచి మీరు నేర్చుకోవాలి. ఎంతో సౌలభ్యం ఉంది. చాలా తేలికే. కాస్త శ్రద్ధ అవసరం అంతే" అంది.

స్రవంతితో మాట్లాడాక ఎప్పుడో కొడుకు అమెరికా నుంచి తెచ్చిన ల్యాప్‌టాప్ బీరువాలోంచి బయటకు

తీశాడు. ఏదో నేర్చుకోవాలని స్రవంతి చెప్పినట్లుగా.

కొన్ని రోజులు గడిచాయి.

స్రవంతితో తన కుటుంబ విషయాలు చెప్పాడు. అలాగే ఆమె విషయాలు అడిగాడు.

"సమయం వచ్చినప్పుడు చెబుతాను" అంది.

'స్రవంతి తెలివైంది. చెప్పడానికి ఇది సమయం కాదా' అనుకుని ఊరుకున్నాడు.

రోజూ స్రవంతిని కలవడం, కలవడం కోసం ఎదురుచూడడం దినచర్యగా మారింది. కంప్యూటర్‌లో తను నేర్చుకున్నది చెప్పడం, అడగడం, ఆమె తోడు ఇష్టంగా మారింది. మిస్టరీగానూ ఉంది.

స్రవంతి చాలా విషయాలు మాట్లాడింది. తల్లి తనని ఎంతగా ప్రేమిస్తున్నదీ చెప్పింది.

స్రవంతి వయసు పాతిక అని, తన రెండవ కొడుకు కంటే కూడా అయిదేళ్ళు చిన్న అని అనుకున్నాడు.

ఓ సాయంకాలం ఎప్పుడూ కలిసే చోటే కలుసుకున్నారు. స్రవంతి ఓ కవరిచ్చింది...వివాహ పత్రిక.

రఘురామ్ తీసి చూశాడు.

స్రవంతి-ప్రశాంత్ పేర్లను చదివాడు.

"ఓc నీ పెళ్ళి పత్రికా" ఆశ్చర్యం.

"అవును ప్రశాంత్‌తో. అమెరికాలో ఉంటున్నాడు. మాకు తెలిసున్నబ్బాయే. ఒకప్పుడు స్కూల్లో నా క్లాస్‌మేట్ కూడా. మీరు తప్పకుండా రావాలి."

"రాకుండా ఉండగలనా?" అన్నాడు.

"పెళ్ళయిన వారానికే అమెరికా వెళ్ళిపోవాలి. ప్రశాంత్‌కు లీవు దొరకలేదు" అంది.

రఘురామ్‌కు బాధ కలిగింది. తన ఆలోచనలను పంచుకుంది. సాయంకాలాల కోసం ఎదురు చూసేలా చేసింది. తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది స్రవంతి. స్నేహాన్ని పంచింది. ఓ శూన్యాన్ని పోగొట్టింది.

పరధ్యానంలో పడ్డాడు రఘురామ్.

"ఏమిటీ డల్ అయిపోయారు?"

"ఆc ఏం లేదు.."

"నేను కనుక్కోగలను.."

"......."

"నేను అమెరికా వెళ్ళిపోతాననే కదా. నేను రెగ్యులర్‌గా టచ్‌లో ఉంటానుగా."

"అవును ఇన్ని రోజులుగా నేనెంతో సంతోషంగా గడిపాను. మళ్ళీ..ప్చ్..."

"మిమ్మల్ని నిరాశపరచడం నా ఉద్దేశం కాదు. మీరు పెళ్ళికొస్తారు. అక్కడ నేను మీరు ఎంతో ఇష్టపడేలాంటి వ్యక్తిని పరిచయం చేస్తాను" స్రవంతి నవ్వుతూ చెప్పింది.

రఘురామ్ ఆ మాటలకు అంత విలువివ్వలేదు.

పెళ్ళిరోజున-

స్రవంతి, రఘురామ్‌కు తన భర్తను పరిచయం చేసింది. అలాగే తన తల్లి కౌసల్యను కూడా. అయిదేళ్ళ క్రితం తండ్రిని పోగొట్టుకున్న విషయం చెప్పింది.

"నేను మా అమ్మకు ఒక్కర్తినే. ఆమెను ఒంటరిగా వదిలిపెట్టి వెళ్ళడం అస్సలు ఇష్టం లేదు. ఆమె సంతోషమే నా సంతోషం. నేను ముందు ఆమె తోడు కోసం వెతికాను. నాకు చాలా కాలం ఎవరూ కనిపించలేదు. తరువాత మీతో పరిచయం, నేను మీతో మాట్లాడిన విషయాలు అమ్మతో పంచుకునేదాన్ని. మీ ప్రవర్తన.. ఫీలింగ్స్..నచ్చాయి. ఒకరికొకరు చూసుకోవడం ఇదే అనుకుంటున్నారు కదూ.. కానీ మిమ్మల్ని మా అమ్మ ఎప్పుడో చూసింది. అదే నేను ఆరోజు సెల్‌లో మీ ఫోటో తీశానుగా...అది..అలా.." నవ్వింది.

స్రవంతి వాళ్ళమ్మ కౌసల్య నవ్వుతూ రఘురామ్‌కు నమస్కరించింది.

స్రవంతి అచ్చంగా తల్లి పోలికే అనుకున్నాడు. పాతికేళ్ళ తరువాతి స్రవంతిలా ఉంది.

ఇద్దరూ ఒకరికొకరు చూసుకున్నారు. నవ్వుకున్నారు. మాట్లాడుకున్నారు. స్వచ్ఛమైన, నిష్కల్మషమైన మనసులు ఒక చోట చేరినట్లయింది.

ఆ తరువాత నెల గడిచింది. స్రవంతి, ప్రశాంత్ అమెరికా వెళ్ళిపోయారు.

ఓ చల్లని సాయంకాలం..ఉత్సవ్ రెస్టారెంట్‌లో ఓ మూల టేబుల్..రఘురామ్, కౌసల్య...

స్పీకర్లోంచి సన్నగా భిస్మిల్లాఖాన్ షెహనాయి..

కబుర్లు చెప్పుకుంటూ కాఫీ సిప్ చేస్తున్నారు. అసలు విషయాన్ని ఇక దాచుకోలేక అతనే అడిగాడు. ఆమె ఆనందంగా ఒప్పుకుంది.

ఒకరికి ఒకరు తోడై ఒంటరితనాన్ని తమ జీవితాల్లోంచి తరిమేశారు.

సెల్: 9441420962

మనమీదేనర్రోయ్!

సరసి



ముదిమిలోనూ మజిల్స్ పెంచాల్సిందే!

వ్యాయామం కేవలం కుర్రాళ్ళకే అనడం ఇప్పుడు అవుట్‌డేటెడ్ టాపిక్. యాభై దాటి అరవైకి చేరుతున్నా సరే, వ్యాయామం చేసేందుకు వెనుకంజ వేయొద్దు, ముదిమి వయసులోనూ మజిల్స్ పెంచాల్సిందే అంటున్నారు పరిశోధకులు! కండలు పెంచే వయసా ఇది? బాడీ బిల్డింగ్‌లు చేసే వయసా? హాయిగా కృష్ణారామా అను కుంటే చాలదా? ఎందుకు మనకీ గోల? అనుకుంటున్నారా!

కానీ అలా అనుకోవడానికి వీలు లేదు! వయసు మీదపడిన సమయంలో కండలు పెంచాల్సిన అవసరం లేదుగానీ ఉన్న కండలు కాస్తా అరిగి పోకుండా, చేతుల్లో శక్తి తగ్గిపోకుండా ఉండాలంటే మాత్రం ముదిమి వయసులో వ్యాయామం అవసరమే!

అరవై దాటితే చాలు చాలా మంది మానసికంగా డీలాపడిపోతారు. కాళ్ళు జాపేస్తారు. ఎందుకంటే అనేక రకాల నొప్పులు మరి! కనీసం రాసుకోవడానికైనా వేళ్లు సహకరించవు. పనిచేయాలంటే చేతి బలం సరిపోదు. బరువులు ఎత్తితే ఎక్కడ ముందుకు పడిపోతామో, ఎముక విరుగుతుందో అన్న భయం..ఇలా దైనందిక కార్యక్రమాలు చేసుకోవడానికీ శక్తి చాలదు.

వ్యాయామమే పరిష్కారం

వీటన్నింటికీ విరుగుడు మాత్ర ఒకే ఒక్కటి! అదే వ్యాయామం! కత్తికి పదును పెట్టాలంటే దానికి రాపిడి పుట్టించాలి. అలాగే శరీరాన్ని పదునెక్కించాలన్నా కూడా వ్యాయామం చేయాల్సిందే! ఈ విషయమ్మై పాశ్చాత్య దేశాల్లో విస్తృతంగా అధ్యయనాలు చేస్తున్నారు. వృద్ధులకు ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి? వాటి నుంచి వారిని బయటపడేసే మార్గాలేమిటి? ఎలాంటి వ్యాయామాలు చేస్తే వారిలో శారీరక శక్తి వస్తుంది? ఇలాంటి వాటిపై వైద్యరంగం ఇప్పుడు సరికొత్త ఆలోచనలు చేసింది. అందులో భాగంగా, దానికి పరిష్కారమార్గంగా వ్యాయామం చేయమని సూచిస్తోంది. దీనివల్ల మధుమేహం, హై బీపీ, కొలెస్ట్రాల్ వంటి సమస్యలను సులభంగా అధిగమించవచ్చునని వృద్ధులకు సలహా ఇస్తున్నారు.

కేవలం యువతకేనా? కానేకాదు

వ్యాయామం అంటే యువతరం చేసే పని అనుకుంటారు. వ్యాయామం అంటే గుర్తొచ్చేది కండలు తిరిగిన యువకులే. కానీ వృద్ధాప్యంలోనూ ఇదెంతో అవసరమనే వాదన ఇప్పుడు వినిపిస్తోంది. దీన్ని అంగీకరిస్తున్న వారు కూడా చాలా మందే ఉన్నారు. మారుతున్న కాలంతో పాటు మనిషి జీవనశైలి మారింది. దాంతో అనేక వ్యాధులు వచ్చి మీదపడుతున్నాయి. ముఖ్యంగా వృద్ధాప్యంలో మరీనూ! దాంతోపాటూ వృద్ధుల సంఖ్య కూడా క్రమేణా పెరుగుతోంది. ఇప్పుడున్న చిన్న కుటుంబాలలో వృద్ధులకు వేళకు అనుకూలంగా

సర్వేలు ఏమంటున్నాయ్?

వ్యాయామంతో మలివయసులోనూ మంచి ఫలితాలు కనబడుతున్నట్లు అనేక అధ్యయనాలు, ఫలితాలు చెబుతున్నాయి. వృద్ధాప్యంలో వ్యాయామం వల్ల త్వరగా అలసిపోకుండా ఎక్కువ దూరం నడవడం, బరువు తేలికగా ఎత్తడంతో పాటే గుండె రక్తనాళాల పనితీరూ మెరుగుపడినట్టు స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం పరిశోధనలో తేలింది. అంతేకాదు వ్యాయామం వల్ల వృద్ధుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతున్నదట. నొప్పులు కూడా తగ్గుతున్నాయి. రోగనిరోధక శక్తి పెరగటంతో ఇన్‌ఫెక్షన్ల వల్ల వచ్చే ముప్పు కూడా వ్యాయామం వల్ల తగ్గుతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడించాయి. ఎక్కువ సేపు కదలకుండా కూచునే వృద్ధుల్లో తీవ్ర మతిమరుపు వల్ల వచ్చే డెమెన్షియా, అల్జీమర్స్‌కు గురయ్యే అవకాశం ఎక్కువ ఉన్నట్లు మరో పరిశోధనలో తేలింది. అందువల్ల కదలకుండా కూర్చునే కన్నా కదలికలు తెచ్చేలా వ్యాయామాలు చేయడం మంచిదని పరిశోధకులు చెబుతున్నారు.

సహకారం అందించేవారు, సమకూర్చేవారు లభ్యం కావడం లేదు. అందువల్ల ఎల్లవేళలా వారు ఆరోగ్యంగా ఉండటం, ముందు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడు కోవడం అనివార్యమైన కార్యక్రమంగా మారిపోయింది. ఎంత వయసు వచ్చినా వారంతట వారు చిన్న చిన్న పనులు చేసుకోవడానికి శారీరక సామర్థ్యం తప్పనిసరి. అందుకు వ్యాయామాన్ని మించిన ఆయుధం మరొకటి లేదు. దీనివల్ల కేవలం ఆరోగ్యం మాత్రమే కాదు, సాఫీగా జీవితాన్ని సాగించడానికి కావల్సిన ధైర్యం కూడా సొంతమవుతుంది. శరీరం కాయలాగా ఫిట్‌గా ఉన్నప్పుడు రకరకాల వ్యాధులు మనపై దాడి చేయలేవు. వ్యాయామం వల్ల గుండె బలం పుంజుకుంటుంది. గుండెజబ్బులు దరిచేరకుండా రక్షిస్తుంది. ఇప్పటికే వ్యాధులతో సతమతమవుతున్న వృద్ధులు నిస్సంకోచంగా ప్రతి రోజూ మెల్లిగా వ్యాయామం ప్రారంభించడం వల్ల కొద్ది రోజుల్లోనే తిరిగి కోలుకునే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

ఎలాంటి భయాలు వద్దు

ఎవరైనా శారీరక వ్యాయామం చేయాల్సిందే. ఎవరెంత వ్యాయామం చేస్తే వారికంత ఫలితం లభిస్తుంది. వ్యాయామం చేస్తే మరింత అలిసిపోతామనో లేక దెబ్బలు తాకుతాయనో, లేనిపోని నొప్పులు మొదలవుతాయనో చాలామంది వృద్ధులు మిన్నకుండిపోతారు. 'నా వల్ల కాని పని' అంటూ వ్యాయామం చేయడానికి భయపడుతుంటారు. కానీ మెల్లమెల్లగా వ్యాయామం ప్రారంభించి ఒక నెల రోజులకు క్రమంగా పెంచుకుంటూ పోతే ఎలాంటి కష్టనష్టాలూ ఉండవు. పైగా వ్యాయామం చేయడం వల్ల కలిగే ఇబ్బందుల కన్నా చేయకపోవడం వల్ల కలిగే నష్టాలే అధికం. కొన్ని రకాల వ్యాయామాలు సురక్షితమైనవే కాదు మలివయసులో వచ్చే వ్యాధులను దూరంగా ఉంచుతాయి. అవెలాంటివో తెలుసుకుని వైద్యుల పర్యవేక్షణలో, ఎవరిసహాయంతోనైనా చేస్తే మంచి ఫలితాలుంటాయి.

కండరాల క్షీణత అబద్ధం

వృద్ధాప్యంలో వయసు పెరుగుతున్న కొద్దీ కండరాలు సహజంగానే బలహీనపడతాయి, క్షీణిస్తాయని అనుకుంటారు. కానీ అది పూర్తిగా నిజం కాదు. కండను దెబ్బతీసే ఏదైనా జబ్బు సోకినా, పోషకాహార లోపం ఉన్నా ఇలా అవుతుందే తప్ప నిజానికి కండరాలు బలహీనపడవు. వృద్ధాప్యానికి కండర క్షీణతకు అసలు సంబంధమేమీ లేదు. కాకపోతే మలివయసులో కండరాల్లో కొంతమేర రక్తసరఫరా తగ్గొచ్చు. కానీ ఆక్సిజన్ వినియోగించుకునే సామర్థ్యంలో ఎలాంటి తేడా ఉండదు. వృద్ధాప్యంలో కీళ్లనొప్పులు, దీర్ఘకాలిక జబ్బు, స్థూలకాయం వంటివన్నీ మనిషిని కదలనీయకుండా ఇంటి దగ్గరే కట్టిపడేసేలా చేస్తాయి. దీంతో కండరాలకు పని తగ్గిపోయి క్రమంగా క్షీణతకు గురవుతుంటాయి. ముందునుంచే వ్యాయామం చేస్తుంటే వయసు మీద పడుతున్నా కండరాలను దృఢంగా ఉంచుకోవచ్చు. ఒకవేళ మలివయసులో వ్యాయామం మొదలుపెట్టినా మంచి ఫలితం ఉంటుందని అనేక అధ్యయనాలు రుజువు చేస్తున్నాయి.

ఎలాంటి వ్యాయామం?

వ్యాయామం పెద్ద ఖర్చుతో కూడుకున్నది కాదు. కొన్నిరకాల చిన్న చిన్న వ్యాయామాలకు ఎలాంటి పరికరాలతోనూ పనిలేదు. రోజులో ఒక్కసారి గానీ లేక విడతలు వారీగా గానీ వ్యాయామం చేసుకోవచ్చు. మనకున్న ఆసక్తి, మన ఆహార అలవాట్లను బట్టి వ్యాయామాలను ఎంచుకోవచ్చు, ఇంట్లో చిన్న చిన్న పనులు చేస్తున్నాం కదా అని వ్యాయామం నిర్లక్ష్యం చేస్తారు. కానీ ఈ పనులకు వ్యాయామానికి చాలా తేడా ఉంది. శరీర భాగాలను అనువైన పద్ధతిలో ఉంచడానికి వ్యాయామం సహాయపడుతుంది. దీంతో ఆయా శరీర భాగాలు బలం పుంజుకుంటాయి.

చాలామంది ఏదో ఒకరకం వ్యాయామం చేస్తే చాలనుకుంటారు కానీ మీరు చేసే వ్యాయామం వల్ల శరీర భాగాలు బలోపేతం అవ్వాలి. కనీసం 10 నుంచి 15 నిమిషాల పాటు వ్యాయామాలు చేయాలి. సామర్థ్యం, బ్యాలెన్సింగ్, ఫ్లెక్సిబిలిటీ లాంటి గుణాలు కలిగించే వ్యాయామాలు చేయడం ఎంతో అవసరం. అందుకోసం సైకిల్ తొక్కడం, ఈత, మెట్లు ఎక్కడం, వేగంగా నడవడం, జాగింగ్ లాంటివి పనులు చేస్తున్నప్పుడు త్వరగా అలిసిపోకుండా కాపాడతాయి. ఇంకా ఎక్కువ సేపు వ్యాయామం చేయడానికి తోడ్పడతాయి.

నిద్ర, ఆహారం ముఖ్యం

వయసు మీద పడుతున్న కొద్దీ కేలరీల అవసరం తగ్గిపోతుంది. కాబట్టి పిండి పదార్థాలు తగ్గించి పోషకాలు బాగా దొరికే పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలి. మాంసం, మసాలాలు, కొవ్వు అధికంగా ఉన్న పాల ఉత్పత్తులు తగ్గించాలి. అలాగే నీరు ఎక్కువ తాగాలి. ధూమపానం, మద్య పానం మానేయాలి. తప్పనిసరిగా తీసుకోవాల్సి వచ్చినప్పుడు పరిమితి మించకుండా జాగ్రత్త పడాలి. పజిల్స్ పూర్తి చేయడం, చెస్, క్యారమ్స్ లాంటి ఆటలు ఆడటం, వీలైతే కొత్త భాషలు నేర్చుకోవడం లాంటి మెదడుకు పని చెప్పే పనులూ కల్పించాలి. వృద్ధుల్లో చాలామంది తక్కువగా నిద్రపోతారు. ఈ వయసులో నిద్ర తక్కువే అనుకుంటారు. దీనిమీద ఇప్పటికే పలు రకాల పరిశోధనలు జరుగుతున్నాయి కూడా. కానీ అందరిలాగే వారికీ ఎనిమిది గంటలు నిద్ర అవసరం. నిద్రలేమి వ్యాధితో బాధపడుతున్నారేమో పరీక్షించుకోవడం చాలామంచిది.

- విజేత

జాగ్రత్తలు తప్పనిసరి!

వ్యాయామం ఎంత అవసరమో అది చేస్తున్నప్పుడు గాయాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడమూ అంతే ముఖ్యం. వ్యాయామం చేస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో కొన్నింటిని చదవండి

- ఒకేసారి కష్టమైన బరువైన వ్యాయామాలతో కాకుండా ముందు తేలికైన వాటితో ఆరంభించాలి. వ్యాయామానికి ముందు శరీరం సన్నద్ధం కావడానికి వీలుగా చేతులు, కాళ్లు ఆడించడం వంటి చిన్న చిన్న వాటిని తప్పకుండా చేయాలి. వ్యాయామం ముగించేటప్పుడు హఠాత్తుగా ఆపకుండా నెమ్మదిగా వేగం తగ్గించాలి. దాహం వేయకపోయినా వ్యాయామానికి ముందు మధ్యలో తర్వాత నీళ్లు తప్పకుండా తాగాలి.
- గుండెజబ్బు, మధుమేహం, మానని గాయాలు, నడుస్తున్నప్పుడు విడవకుండా నొప్పి రావటం, కంటి సమస్యలు వంటి వాటితో బాధపడుతుంటే ముందుగా డాక్టర్‌ని సంప్రదించి తగిన వ్యాయామాలను ఎంచుకోవడం మేలు. వ్యాయామం మొదలుపెట్టిన తర్వాత ఛాతిలో నొప్పి, గుండె వేగంగా గానీ క్రమంతప్పిగానీ కొట్టుకోవటం శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది చాలా త్వరగా బరువు తగ్గిపోతుండటం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.

ఛ్! తట్టుకోవడం కష్టం!!

“అది ఆత్మహత్యే. సందేహం లేదు. నాకే కాదు ఎవరికీ సందేహం ఉండదు. కానీ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో తెలియాలి. అందుకు మీ సహాయం కావాలి' కన్నీరు ఆపుకుంటూ డిటెక్టివ్ శరత్‌ను అడిగింది ఇంద్రాణి .

'తన చావుకు ఎవరూ కారణం కాదనీ, జీవించి వ్యర్థం అని భావించడం వల్ల తన జీవితాన్ని తానే అంతం చేసుకుంటున్నా'ననీ సూసైడ్ నోట్ రాశాడు. ఇక దాన్లో పరిశోధించేదేముంది?' అన్నాడు అసిస్టెంట్ రాము. రాము వైపు 'మౌనం' అన్నట్టు చూశాడు శరత్.

"నాకు సిద్దార్థ గురించి తెలుసు. తెలివైనవాడే కాదు చాలా ధైర్యం ఉన్నవాడు, జీవితం మీద బోలెడన్ని ఆశలూ ఉన్నవాడు. అంత సులభంగా నిరాశకు లోనవడు. అలా చేశాడంటే, ఎవరో భయపెట్టి ఉండాలి లేదా అతడి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసి ఉండాలి. వారెవరో తెలుసుకోవాలి' కచ్చితంగా చెప్పింది ఇంద్రాణి. 'నా అసిస్టెంట్‌కి వివరాలివ్వండి. నేను పరిశోధిస్తాను' అన్నాడు శరత్.

•••

సిద్దార్థ మంచి విద్యార్థి. చాలా తెలివైనవాడు. ప్రొఫెసర్లకూ తోటి విద్యార్థులకూ మంచి అభిప్రాయం ఉంది. ఎవరితోనూ వివాదాలు లేవు. అందరితో మంచిగా ఉంటూ అందర్నీ సంతోషపెట్టేవాడు. బాస్, ఇంద్రాణిగారు ఎందుకని అతడు ఆత్మహత్య చేసుకున్నాడో తెలుసుకోవాలనుకోవటం సబబే అనిపిస్తోంది' తన పరిశోధన రిపోర్టును శరత్‌కు అందిస్తూ అన్నాడు రాము. తల ఊపాడు శరత్.

'ఇంద్రాణి, భరత్‌లకు ఒకేఒక సంతానం సిద్దార్థ. డబ్బుకి లోటులేదు. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగస్థులే. సిద్దార్థకు కారు కూడా కొనిచ్చారు. తోటి విద్యార్థినీ విద్యార్థులతో సత్సంబంధాలున్నాయి. అందరూ పొగిడేవారే తప్ప 'చెడు' చెప్పేవారు లేరు' అన్నాడు రాము.

'ముందు ఫోను, ఫేస్‌బుక్, ట్విట్టర్.... వివరాలు సేకరించావా?' అడిగాడు శరత్.

'అన్నీ ఉన్నాయి బాస్. ఆత్మహత్య చేసుకోవటానికి గంట ముందు వరకూ ఫ్రెండ్స్‌తో తిరిగాడు. మర్నాడు రిసార్టుకు వెళ్లాలని నిశ్చయించుకున్నారు. వార్త తెలిసి ఫ్రెండ్స్ కూడా 'షాక్ అయ్యారు' తల ఊపాడు శరత్. రాము ఇచ్చిన రిపోర్టు చదివాడు.

•••

'వాడు అడిగింది ఇచ్చాను. ఎవరైనా అమ్మాయి నచ్చితే, అతడిష్టానుసారం పెళ్లి చేస్తానని కూడా చెప్పాను. వాడికి అంత బాధ ఏం కలిగిందో?' విషాదంగా అన్నాడు తండ్రి.

'అతని ప్రవర్తనలో ఏమైనా మార్పు గమనించారా?"

తల్లిదండ్రులిద్దరూ తలలు అడ్డంగా ఊపారు.

'అతడికి సన్నిహితులైన స్నేహితులెవరో చెప్పగలరా?' అడిగాడు శరత్.

'సురేశ్, జేమ్స్, లలిత, భాస్కర్... ముఖ్యంగా స్కూలు స్థాయి నుంచే భాస్కర్ మంచి స్నేహితుడు. వాళ్ల మా ఫ్యామిలీ ఫ్రెండ్స్ కూడా" చెప్పాడు భరత్.

'భాస్కర్ వాళ్ల అమ్మ, మా ఆయన కొలీగ్స్ కూడా' చెప్పింది ఇంద్రాణి.

•••

'యెస్... స్కూలు నుంచి మేం స్నేహితులం. సిద్దార్థ నాకు చాలా క్లోజ్. ఎందుకలా చేశాడో తెలియదు. వాడు సూసైడ్ చేసుకున్నరోజు నేను, వాడు లలిత్ సినిమాకెళ్లాం. డిన్నర్ చేశాం. నవ్వుతూనే ఉన్నాడు' చెప్పాడు భాస్కర్.

'హివజ్ ఎ నైస్ బాయ్' అన్నాడు భాస్కర్ తండ్రి శ్రీనాథ్.

'నాకు నా కొడుకు భాస్కర్‌లానే అనిపిస్తాడు. ఎందుకలా చేశాడో? అంది భాస్కర్ తల్లి లత.

'మా ఇంటికి రోజు విడిచి రోజు వచ్చేవాడు. రాత్రిళ్లు కూడా ఇక్కడే ఉండేవాడు' అన్నాడు శ్రీనాథ్.

'సరే. వస్తాను' అన్నాడు శరత్ లేస్తూ.

'హివజ్ ఫన్ టుబి విత్. గ్రేట్ గయ్' అన్నాడు జేమ్స్ శరత్‌తో.

'సిద్దార్థ ఆత్మహత్య చేసుకోవటానికి కారణం ఏమై ఉంటుంది?"

తల అడ్డంగా ఊపాడు జేమ్స్. సిద్దార్థకూ లలితకూ సాన్నిహిత్యం ఉండేది. లలితకు భాస్కర్‌కు కూడా దోస్తీ ఉండేది. బహుశా లలిత సిద్దార్థని కాదని ఉంటుందేమో! ఇది గెస్‌వర్కే. అది తప్ప నాకు వేరే కారణం తోచటం లేదు' అన్నాడు జేమ్స్.

•••

'లలిత, సిద్దార్థ క్లోజ్‌గా ఉండేవారు. కానీ ఎంత క్లోజో నాకు తెలియదు. లలిత్‌ను ప్రేమిస్తున్నట్టు ఎప్పుడూ చెప్పలేదు. అతడి దృష్టి నీరజపై ఉండేదని నా అనుమానం. నీరజ గురించి ఎక్కువ మాట్లాడేవాడు. ఏమైనా అతడి ఆత్మహత్యకు కారణం కనిపించడంలేదు' నిశ్చయంగా చెప్పాడు సురేశ్.

•••

'సిద్దార్థ నన్ను ప్రేమిస్తున్నానన్నాడు' చెప్పింది నీరజ తలవంచుకుని.

'మీరు ఇష్టపడలేదా?' సూటిగా అడిగాడు శరత్.

'లేదు. అతను మంచి ఫ్రెండ్ మాత్రమే. చదువు పూర్తవకుండా ప్రేమ గీమ అని సమయం వ్యర్థం చేయటం నాకిష్టం లేదు. అప్పుడే స్థిరపడిపోవాలనే ఆరాటం ఎందుకు? అని అడిగాను. ఉద్యోగాలు వచ్చాక కూడా ఇష్టపడితే అప్పుడే ఆలోచించవచ్చన్నాను. ఒప్పుకున్నాడు'.

'ఆత్మహత్యకు ఇదే కారణమై ఉంటుందా?' అడిగాడు శరత్.

నవ్వింది నీరజ. 'ఇది రెండేళ్లనాటి మాట. ఇప్పటి వరకు మామూలుగానే ఉండి ఇప్పుడు హఠాత్తుగా ఆ కారణంతో ఆత్మహత్య అంటే నమ్మశక్యంగా లేదు' అంది నీరజ.

•••

'నేను, భాస్కర్, సిద్దార్థ చిన్నప్పటి నుంచీ కలిసి చదివాం. మా ఫ్యామిలీస్ కూడా క్లోజ్. కానీ ఈ మధ్య మా అమ్మానాన్న, సిద్దార్థ వాళ్ల అమ్మనాన్నలతో మాట్లాడటం మానేశారు. కానీ అది మా స్నేహంపై ఎలాంటి ప్రభావం చూపలేదు.'

'నీరజ గురించి మాట్లాడేవాడా?'

'ఎప్పుడూ నీరజ గురించే. చదువయ్యాక, ఉద్యోగం రాగానే నీరజకు ప్రపోజ్ చేయటమే మొదటిపని అనేవాడు. చదువు మీద శ్రద్ధ పెరిగింది సిద్దార్థకి. పైగా నీరజ పెళ్లి గురించి తొందర పడవద్దని ఆమె తల్లిదండ్రుల్ని అభ్యర్థించాడు కూడా' చెప్పింది లలిత. అది విని నిటారయ్యాడు శరత్.

•••

'నీరజ ఇంకా చిన్నపిల్ల. అప్పుడే జీవితానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవటం మాకు ఇష్టం లేదు. ఆ విషయమే సిద్దార్థతో చెప్పా' నీరజ తండ్రి అన్నాడు.

ఇదంతా ఏడాది క్రితం మాట. దానికీ ఆత్మహత్యకూ సంబంధం లేదు' అంది నీరజ తల్లి.

'ఇందుకేనా మీరు సిద్దార్థ తల్లిదండ్రులతో మాట్లాడటం మానేశారు?' అడిగాడు శరత్.

'అది మా పర్సనల్ విషయం' అని నీరజ

సిద్దార్థ జీవితం వడ్డించిన విస్తరి. సంపద, స్నేహితులు...అందరూ, అన్నీ ఉన్నాయి. ఇంకా చదువు పూర్తి కాలేదు. కానీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ విషయం జీర్ణించుకోలేకపోయింది అతని తల్లి. మా అబ్బాయికి అలాంటి అవసరం లేదు. అసలు ఏం జరిగిందో, కారణం ఏమిటో తెలుసుకోండంటూ డిటెక్టివ్ శరత్‌ను ఆశ్రయించింది. అప్పుడు శరత్ ఏం చేశాడు? ఇంతకూ సిద్దార్థ ఆత్మహత్య వెనుక అసలు రహస్యం ఏమిటి?



తండ్రి భార్యవైపు కోపంగా చూసి లోపలకు వెళ్లి పోయాడు.

●●●

శరత్ ప్రశ్న విని భరత్, ఇంద్రాణి చాలాసేపు మాట్లాడలేదు.

'వాడు నీరజను ఇష్టపడినట్టు మీరిప్పుడు చెప్పాకే తెలిసింది. 'మాతో తెగతెంపులకు కారణం ఏంటో నీరజ తల్లిదండ్రులు మాకు ఏమీ చెప్ప లేదు' అంది ఇంద్రాణి కళ్ళల్లో నీళ్లు తిరుగుతుంటే.

భరత్ తల దించుకుని పుస్తకంలో పేజీలు తిరగేస్తున్నాడు.

●●●

'సిద్ధార్థ ఆత్మహత్య కేసు ఎటూ తేలటం లేదు. మన పరిశోధన సరైనదిశలో సాగటం లేదని పిస్తోంది' శరత్ ఆలోచిస్తూ రామూతో అన్నాడు.

'మరి మన దారేటు బాస్.' నవ్వుతూ అడి గాడు రాము.

'వృత్తంలో ఎంత తిరిగినా అంతే. కాబట్టి దిశ మార్చాలి. ఓ పని చెయ్యి రాము. మన పరిశోధ నను ఇకనుండి పెద్దల పైకి మళ్లిస్తే? ఆ కోణంలో పరిశీలించు'

'ఎలా బాస్?'

'సిద్ధార్థ, భాస్కర్, నీరజ, లలితల తల్లిదం డ్రుల వివరాలు సేకరించు' అన్నాడు శరత్.

●●●

"బాస్... సిద్ధార్థ తండ్రి, నీరజ తండ్రి ఇద్దరూ కాలేజీ నుంచి స్నేహితులు. ఒకే కంచం, ఒకే మంచం అన్నంత! పెళ్లి చేసుకునేవరకు నీరజ తల్లిదండ్రులతోనే భరత్ కలిసి తిరిగేవాడు భాస్కర్ తల్లి, భరత్ కొలీగ్. అంతా స్నేహితులూ, సన్నిహితులే బాస్' చెప్పాడు రాము.

రాము తెచ్చిచ్చిన వాళ్ల చిన్నప్పటి ఫోటోలు చూస్తూ, ఆ వివరాలు చదువుతూ ఉండి పోయాడు శరత్.

హఠాత్తుగా ఒక ఆలోచన రావడంతో లేచి నిలబడ్డాడు శరత్.

●●●

నీరజ తల్లి శరత్‌ని చూసి ఆశ్చర్యపోయింది.

'ఆఫీసుకి వచ్చారేమిటి?' అడిగింది.

'ఇంట్లో భర్తముందు మీరు స్వేచ్ఛగా నిజం చెప్పలేరేమోనని' అన్నాడు శరత్.

'నేను ఇక్కడ మాట్లాడను" అంది ఆమె.

'మీకూ సిద్ధార్థ తల్లిదండ్రులకూ మధ్య ఎందుకు మాటలు ఆగిపోయాయి?' సూటిగా అడి గాడు శరత్.

'మీకు అనవసరం' అంది ఆమె.

'సిద్ధార్థ ఆత్మహత్యకూ మీ మధ్య కలహానికీ సంబంధం ఉంది' అన్నాడు శరత్.

'మేం మాట్లాడటం మానేసి సంవత్సరం అయింది'.

'ఎందుకని?'

'నాకు తెలియదు. మా ఆయన మాట్లాడవద్ద న్నారు. వాళ్ళిద్దరూ స్నేహితులు అంది ఆమె.

●●●

'మీకు అనవసరం. మాకు మాకు బోలెడు వ్యవహారాలుంటాయి. అన్నీ అందరితో చర్చించం. నేను చాలా బిజీగా ఉన్నాను. నౌ గెటౌట్' అంటూ శరత్‌ని బైటకు నెట్టినంత పని చేశాడు నీరజ తండ్రి.

●●●

'నీరజ తండ్రి నాకు ఫోన్ చేశారు. స్నేహాన్ని తెగతెంపులు చేసుకుంటున్నట్టు చెప్పారంతే. నేను ఆయనకి ఆ విషయమే చెప్పాను. ఆయన ఏమీ మాట్లాడలేదు. దానికీ దీనికీ సంబంధం ఏమిటి?' అడిగింది ఇంద్రాణి.

శరత్ మౌనంగా లేచి వచ్చేశాడు.

●●●

'సిద్ధార్థను కలుసుకోవద్దని, అతన్ని ఎంకరేజ్ చేయొద్దనీ ఎందుకు మీ నాన్న నీకు చెప్పారు?' తల వంచుకుని కూర్చున్న నీరజను ప్రశ్నించాడు శరత్.

ఆమె మాట్లాడలేదు.

"ఎప్పుడూ నీ ఇష్టాల్ని సమర్థించే వాళ్ళు ఈ విషయంలో ఎందుకు అడ్డుకున్నారు?' రెట్టించాడు.

'నేను భాస్కర్‌కి చెప్పాను. సిద్ధార్థకి చెప్పమ న్నాను. కానీ అది విని సిద్ధార్థ ఇంతపని చేస్తా డనుకోలేదు' ఆమె ఏడుపు ఉధృతమైంది.

●●●

'సిద్ధార్థతో అంటీ ముట్టనట్టు ఉండమని వాళ్లమ్మ వాళ్ళు చెప్పారట. నీరజ గట్టిగా నిలదీసి కారణం అడిగితే, వాళ్ల నాన్న చెప్పారట అసలు విషయం. వాళ్ళమ్మ కూడా నిజమేనని తల ఊపిందట. నీరజ నాకు చెప్పిన విషయాన్ని ఆ రోజు సినిమా ఇంటర్వెల్‌లో సిద్ధార్థకి వివరించి చెప్పాను. వాడు నవ్వి ఊరుకున్నాడు. ఇంతపని చేస్తాడనుకోలేదు' కన్నీళ్లు కారుస్తూ చెప్పాడు భాస్కర్.

●●●

శరత్ చెప్పింది విని నిట్టూర్చింది ఇంద్రాణి.

'చేసిన పాపం చెడని పదార్థం అంటారు. పెళ్లికి ముందు ఆయనకు నీరజ తల్లితో సాన్నిహిత్యం ఉండేది. కానీ పెళ్లయిన తరువాత కూడా అది కొనసాగిందనీ, అదీ ఇంత స్థాయిలో సాగిందని నేను ఊహించలేదు. నిజమే కదా, తాను ఎంత గానో ప్రేమించి పెళ్లాడాలని కలలుగంటున్న యువతి తనకు సోదరి అవుతుందని తెలిస్తే తట్టుకోవటం కష్టం కదా!' అంటూ భోరుమంది ఇంద్రాణి.

-కస్తూరి మురళీకృష్ణ

సెల్: 98496 17392

నిండు నూరేళ్ళు 11

-సింహప్రసాద్ సెల్: 98490 61668

ప్రతీసారీ పంట వెయ్యడానికి పెట్టుబడి కోసం చంద్రయ్య నానా యాతనా పడాల్సివచ్చేది.

అప్పుకోసం బ్యాంకుల చుట్టూ తిరగటం, వాళ్ళిచ్చింది సరిపోక షావుకారు దగ్గర, షాపుల వారి దగ్గర అధిక వడ్డీకి అప్పుచేయడం, అవి సక్రమంగా చెల్లు వేయలేకపోవడం, చక్రవడ్డీలు త్రివిక్రమావతారం దాల్చడం...!

మధ్యలో అకాల వర్షాలు, సకాల వర్షలేమి, తెగుళ్ళు, పెరిగిన కూలిరేట్లు, తగ్గిన దిగుబడి ఇంట్లో రోగాలు, చదువుల ఖర్చు....!

అక్కడికీ పాడిపశువుల ఆలనా పాలనా శాంతమ్మా, పిల్లలూ చూసేవారు. ఐదో పదో కూడబెట్టే వారు. పాలు, నెయ్యి, పిడకలు సమస్తం అమ్మే వారు. అది కూరా నారా ఖర్చుకు సరిపోయేది.

'మట్టి పిసుక్కుంటే మీ నోట్లోకి మన్నేరా' అనే వారు అబ్బాయి విహాన్‌తో. అందుకే తన రెక్కలకు మించిన భారమైనా విహాన్‌ని చదివించారు. బట్టల్లేవు, పుస్తకాల్లేవు, కాళ్ళకు చెప్పుల్లేవు అని సణక్కుండా ఉన్నంతలో సర్దుకుపోయి బుద్ధిగా చదువుకున్నాడు.

విహాన్ డిగ్రీలో కొచ్చాడు. ఆ చదువు కాస్తా పూర్తైతే ఏదో ఉద్యోగం వస్తుందనీ, తెరిపిన పడిపోవచ్చనీ ఆశించారా దంపతులు.

కానీ ఆ సరికే అప్పుల ఊబిలో నిలువునా కూరుకుపోయిందా కుటుంబం.

కొత్తగా అప్పు పుట్టే పరిస్థితి లేదు. పాత

జరిగిన కథ

పెళ్ళి తర్వాత కూడా ప్రియుడు విహాన్ జ్ఞాపకాలను మరిచిపోలేకపోతుంది విజ్జీ. ఇంతలోనే ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు ఆమెకు మెసేజ్ ఇస్తాడతను. అతన్ని రక్షించేందుకు భర్తను కూడా లక్ష్యపెట్టకుండా అర్ధరాత్రి పూనే నుండి హైదరాబాద్ బయలుదేరుతుంది విజ్జీ. ఆమె ఆలోచనలు గతంలోకి జారుకుంటాయి. విహాన్ నటుడు, ఒక పబ్‌లో బౌన్సర్ కూడా. అతన్ని ప్రేమిస్తుంది. పెళ్ళికి మొదట అభ్యంతరం చెప్పినా తర్వాత ఒకే అంటాడామె తండ్రి. ఈ లోపు విహాన్ జైలు పాలు కావడంతో తండ్రి చెప్పిన సంబంధమే చేసుకుంటుంది విజ్జీ. ఇలా గతాన్ని గుర్తు చేసుకుంటూ విహాన్ స్వగ్రామం చేరుతుంది విజ్జీ. కానీ అతను అక్కడ లేడు. అక్కడే బస చేసి అతడి గతం తెలుసుకుంటుంది.

అప్పులు తీర్చమంటూ ఒత్తిళ్ళూ, ప్లీడరు నోటీసులూ బ్యాంకు వాళ్ళ బెదిరింపులూ వచ్చి పడుతున్నాయి.

వరుసగా మూడు పంటలు పోయేసరికి ఆయన నడుం విరిగినట్లయింది. అయినా లేని శక్తి కూడదీసుకున్నాడు. ఎంతో ఆశతో భూమి దున్నాడు. వ్యాపారి కాళ్ళూ గెడ్డం పట్టుకుని అరువు మీద విత్తనాలు తెచ్చి చల్లాడు.

అవి సరిగ్గా మొలకెత్తలేదు. నకిలీవి!

ఆయన గుండె పగిలింది. మరోసారి నాటుదామంటే అదను తప్పింది. అయినా ప్రయత్నించాడు గాని విఫలమయ్యాడు.

గోరుచుట్టు మీద రోకటిపోటులా బ్యాంకు వాళ్ళు వేలం నోటీసిచ్చారు.

నోటీసులందుకున్న చంద్రయ్య, ఇతర రైతులూ వెళ్ళి గడువు ఇవ్వమని బ్రతిమాలారు.

భూమిని నమ్ముకున్న రైతు భూమిని వదిలి పోడనీ, తనతో భూమిని తీసుకుపోలేడని చెప్పాడు. అర్థించాడు. వాళ్ళు వినలేదు. ఒత్తిడి పెంచారు.

కొంతకాలానికి భూమి అమ్మకానికి పెట్టారు. సరైన బేరాలు రాలేదు. సన్న చిన్నకారు రైతులు కొనే స్థితిలో లేరు. భూస్వాములే కొనగలరు. కొంటున్నారు. కొన్నారు. కాని అప్పుకి జమ వేసుకుని ఇంకా శేషం మిగిల్చారు!

తల బాదుకున్నాడు చంద్రయ్య.

బ్యాంకు వాళ్ళు మొండి బకాయిదార్లంటూ కొందరి ఫోటోలు బ్యాంకు నోటీసు బోర్డులో పెట్టారు. వాటిల్లో ఆయనదీ ఉంది.

అసలే ముందు నుయ్యి వెనుక గొయ్యి లాంటి పరిస్థితి. మింగలేక కక్కలేక పచ్చడి మెతుకులు తింటూ వీధినపడకుండా గుట్టుగా రోజులు నెట్టుకొస్తున్నాడు.

బ్యాంకు నోటీసు బోర్డులో ఫోటో పెట్టడంతో ఆయన పరువు బజార్న పడింది. మరిక తట్టుకోలేకపోయాడు.

పొలం అమ్మితే గాని అప్పులు తీరవు. అప్పులన్నీ తీర్చేస్తే భూమి మిగలదు. ఇంకప్పుడు తను రైతుకాదు. రైతుకూలీగా మారలేదు. ఆ దుస్థితిని ఊహించి తట్టుకోలేక పోయాడు.

ఒక రాత్రి వేళ ఇల్లూ ఊరూ నిద్రపోయాక తన పొలానికి వెళ్ళి పురుగుమందు త్రాగేశాడు.

మర్నాడు తోటి రైతులు చూసేసరికి శవమై పడి ఉన్నాడు! జరిగిన కథంతా నాకు చెప్పి కన్నీరు పెట్టుకుంది శాంతమ్మ.

"ఆయనకేం మారాజులా పోయారు. మాకొచ్చి పడింది చావు. నడుస్తా ఉంటేనే బతుకు. ఆగితే చావే. వ్యవసాయమూ అంతే. సాగు చేస్తుంటే సాగుతుంది. రొటేషన్ తిరుగుద్ది. ఆపేస్తే చతికిల బడతాం. ఆ సంగతి మనకన్నా అప్పులోళ్ళకి మా బాగాతెలుసు. అంతా వచ్చి పడ్డారు. దినం ఖర్చూ పోలీసోళ్ళ ఖర్చూ తడిసి మోపెడయ్యాయి. పెద్దలు కూర్చున్నారు. పొలం సొంతం అమ్మితేగాని అప్పుకి శ్రీరామ రాయలేమన్నారు. కనీసం ఎకరం పొలమైనా మిగిల్చేందుకు విహాన్ అడ్డుపడ్డాడు. మా అమ్మకి పసుపుకుంకాల కింద మా తాత ఇచ్చిన పొలాన్ని నా పెళ్ళిలో నాకిచ్చారు. ఎలాగైనా ఆ పొలాన్ని చెల్లెలికివ్వాలని వాడి తాపత్రయం. పెద్దలు వాడి గోడు విన్నారు. కొన్ని అప్పులూ ఆ పొలమూ మిగిల్చి మిగతావి చెల్లగొట్టారు!" కళ్ళొత్తుకుంది.

ఒకసారి తండ్రి సపోర్టు గురించి మాటలొచ్చినప్పుడు విహాన్ పొర్లిపొర్లి ఏడవడం వెనక ఉన్న కథ ఏమిటో ఇప్పుడు బోధ పడింది!

"ఆత్మహత్య చేసుకున్న రైతులకి ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తోందని పేపర్లలో చదివానే?"

"లక్ష రూపాయలిస్తామన్నారు. మా ఎమ్మెల్యే బాబొచ్చి చెప్పాడు. పేపర్లలోనూ వచ్చిందంట. కాగితాలు, వేలు ముద్రలు అయ్యాయి గాని రూపాయలు రాలేదు...!"

"ఆయన దుర్మరణం మిమ్మల్ని బాగా కృంగదీసి ఉంటుంది.."

"అది మామూలు దెబ్బ కాదు, చావుదెబ్బ. నేను ఆడదాన్ని. పశువుల గోల తప్ప పొలాల అదనూ పదనూ తెలీదు. అబ్బాయేమో చిన్నోడు. ఇంకా చదువుకుంటున్నాడు. అసలు మనిషంటూ ఉంటే పెద్దదిక్కులా నిలిచేవారు. అలా చెయ్యండి, ఇలా చేసుకోండి అని చెప్పేవారు. మా పాట్లేవో మేం పడుతూ బండిలాగే వాళ్ళం. ఆ మనిషికా గ్రహింపు లేక పోయింది. తన దోవ తను చూసుకున్నారు. పెళ్లి చేసుకుని పిల్లల్ని కన్నది అర్ధాంతరంగా కాడిపడేసి పోడానికేనా!" ఆక్రోశించింది శాంతమ్మ.

ఆమె విషాదాన్ని పంచుకుంటూ మౌనంగా వింటూండి పోయాను.

'నారు పోసినోడు నీరుపోయడూ? మొక్క నాల్రోజులు ఎండినా అయిదోనాడు చిగురించదూ! వ్యవసాయం కలిసి రాకపోతే ఇంకోటి చేసుకుంటాం. ఆకో అలమో తింటాం. కలో గంజో తాగుతాం. అంతేగాని అధైర్యపడిపోయి పురుగు మందు మింగెయ్యడవే! అంతా అది మింగలేక బతుకుతున్నారా. వెయ్యి చావులకన్నా ఒక బతుకు గొప్పది. పుట్టిన ప్రతీవాడూ బతుకు పండించుకోవాలి గాని బండలు చేసుకోకూడదు. భూమ్మీద పడగానే చంటిబిడ్డ ఏడుస్తుంది. ఎందుకో తెలుసా? బతకాలనే. ఆ ఇంగితం లేకపోయిందా మనిషికి!"

ఆమె దుఃఖం కట్టలు తెంచుకుంది. మొఖాన్ని పమిటతో కప్పుకుని పొగిలిపొగిలి ఏడ్చింది. కాసే పటికి గాని తేరుకోలేకపోయింది.

ఆమె కళ్ళల్లోని కన్నీటిని చీలుస్తూ మెరుపు మెరి సింది.

"నేనున్నానమ్మా అంటూ ముందుకొచ్చి నిలి చాడు ముక్కు పచ్చలారని నా బిడ్డ. నా కన్నీళ్ళు తుడిచాడు. ఒక పక్క చదువుకుంటూనే టౌన్లో ఎన్ని పనులు చేసేడనీ! హోటల్లో బల్లలు తుడిచాడు. సినిమా హాల్లో టిక్కెట్లు అమ్మాడు. రోడ్డు పక్కన బజ్జీలు వేశాడు. పాతపేపర్లు అమ్మేవాడు. కిరాణా కొట్లో పద్దులు రాశాడు. పదో పరకో కూడబెట్టి మాకు పంపేవాడు. ఇక చదువయింది. ఉద్యోగా నికి ప్రయత్నాలు చేస్తూనే పై చదువు చదివాడు. పిల్లలకి పాఠాలు చెప్పాడు. రైసు మిల్లులో లెక్కలు పనిచేశాడు. ఇంకెన్ని చేశాడో ఆ భగవంతుడికే తెలియాలి. ఇవాళ కనీసం ఇలా ఉన్నామంటే ఇదంతా వాడిచలవే. వాడి కష్టమే. హైదరాబాదులో ఉజ్జోగం వచ్చింది. మా కష్టాలు తీరిపోయాయనుకున్నాం. నాల్రోజులు గుండెల నిండా గాలి పీల్చుకున్నామో లేదో ఈ పోలీసు గొడవలు వచ్చి పడ్డాయి. డబ్బుకి కటకట లాడుతున్నాం. నా బిడ్డమీద ఎవడి పాపిష్టి కన్ను పడిందో ఏవో వాడు పురుగులు పడి చస్తాడు!

ఆ మాతృమూర్తి శాపం వృథా పోదు. విహాన్‌ని వెన్నుపోటు పొడిచిన వాడికి తగిలి తీరు తుంది. అంతకంతా అనుభవించి తీరుతాడు!

నాలో చెలరేగిన ఉద్వేగం నన్ను తిన్నగా ఉండనివ్వట్లేదు.

ఇంతదాకా తెలిసిన విహాన్ వేరు. ఇప్పుడు అవగతమైన విహాన్ వేరు!

కష్టాల కొలిమిలో కాలాడు. ఆకలి గాయాలతో బతికాడు.

అలాంటివాడు ఆత్మహత్య ఎలా చేసుకోగలడు? ఒకవేళ తండ్రి ప్రభావం పడి నిస్పృహతో... అసలు అలాంటి టెండెన్సీ ఎవరో అన్నట్టు ఆ కుటుంబ లోనే ఉందేమో!?

"మాట్లాడవేమ్మా. నా బిడ్డ కష్టాలు గట్టెక్కి పైకొస్తాడంటావా?"

"తప్పకుండా వస్తాడు. సమస్యల వ్యూహాన్ని ఛేదించుకుని మరీ వస్తాడు. అప్పుడు మీరిక కన్నీళ్ళు పెట్టుకోవాల్సిన అసవరం రాదుగాక రాదు...!"

"నా తపనా, మనేది ఈ ముసలిప్రాణం గురించి కాదమ్మా. నా విహాన్ బాగుండాలి. వాడి రెక్కలు చల్లగుండాలి. వాడి కష్టం వాడి నోటికందితే చాలు. వాడు బావుంటే చెల్లాయీ తమ్ముళ్ళూ బావుం టారు.. సంసారం ఒడ్డున పడుద్ది.." ఏదేదో గొణుగుతూ పలువరిస్తూ కలత నిద్ర పోయింది శాంతమ్మ.

నాకదీ కరువయింది.

ఎక్కడున్నాడో ఎలా ఉన్నాడో చెప్పకుండా దాక్కుని మమ్మల్ని ఏడిపిస్తున్న విహాన్ మీద పీకల దాకా కోపం వచ్చింది. కసిదీరా తిట్టాను. అప్పుడు గుర్తొచ్చింది. నేనెవర్ని నిందిస్తున్నాను? మనిషినా శవాన్నా?

ఏడ్చేడ్చి అలసిపోయాను. గుండెలూ అవిసి పోయాయి.

జీవితంలో ఇంత శోకం, వేదన ఉంటాయనే తెలియని నేను ఒక్క రోజులో అవన్నీ చూశాను. అనుభవించాను.

విధి ఎంత చిత్రమైంది!

•••

తెల్లగా తెల్లవారింది.

మరో రోజు గడిచిపోయింది. విహాన్ గురించి ఒక ముక్కా తెలీలేదు.

తయారవుతోంటే ఇంట్లో ల్యాండ్‌లైన్ ఫోన్ కర్ణ కఠోరంగా మోగింది.

ఒక్క అంగలో వెళ్ళి అందుకున్నాను. "హలో... ఎవరూ..." నా గుండె చప్పుడు నాకే విన్పిస్తోంటే అన్నాను.

"మగాళ్ళ నెవర్నైనా పిలవండి" ఒకామె చెప్పింది.

"ఫరవాలేదు నాకు చెప్పండి.

'ఈ నెంబరు విహాన్ ఇచ్చాడు. మీరు అర్జం టుగా మా ఇంటికి రండి.." అంటూ పేరూ, ఊరూ, కొండగుర్తు చెప్పి పెట్టేసింది.

ఎందుకు రమ్మన్నట్టు? అసలు విహాన్ ఎలా ఉన్నాడు? వివరాలేమీ చెప్పకుండా ఎవరో తరుము కొస్తున్నట్టు మాట్లాడిందేవిటి?

తిరిగి ఫోన్ చేద్దామని చూశాను. ఇన్ కమింగ్ నెంబర్ డిస్‌ప్లే సిస్టం లేదు. పెదవి కొరుక్కు న్నాను.

'అబ్బాయేనా!" చేస్తున్న పని వదిలి ఆదుర్దాగా వచ్చింది శాంతమ్మ. విహాన్ చెల్లెలూ తమ్ముళ్ళూ కూడా వచ్చి నా వంక భయం భయంగా చూశారు.

"కాదు. రాంగ్ నెంబర్. ఎవరో వెంకటరత్నం కావాలన్నారు.." అబద్ధమాడాను.

హతాశులయ్యారు.



నేరుగా అతని ఇంటికే వెళ్ళింది ఆమె. స్నేహితురాలుగా పరిచయం చేసుకుంది. అతను ఎక్కడికెళ్ళాడో ఇంట్లో వాళ్ళకీ తెలీదు. చెప్పినట్టుగానే ఆత్మహత్య చేసుకున్నాడేమో? సందేహం పీడిస్తోంది. కన్నీళ్ళాగడం లేదు. ఇక ఏమీ పాలుపోక ఆ రాత్రి అక్కడే గడిపింది. మర్నాడు ఉదయం ల్యాండ్‌లైన్‌కి ఫోన్ చేశారెవరో. అడ్రస్ చెప్పి వెంటనే రమ్మన్నారు. బెంబేలు పడిందామె. ఆ ఫోన్ చేసిందెవరు? ఎక్కడికి రమ్మన్నారు?

త్వరత్వరగా రెడీ అయ్యాను. సాధ్యమైనంత త్వరగా ఆవిడ చెప్పిన ఊరు వెళ్ళాలి. విషయం తెలుసుకోవాలి!

"మమ్మల్ని చూడాలనొస్తే మా గోడు వెళ్ళ బోసుకుని నీ మనసు పాడుజేశాం. ఏమనుకో కమ్మా.." నొచ్చుకుందావిడ.

"చేదు నిజాలు నిష్ఠూరసత్యాలు తెలిశాయి".

విహాన్ చెల్లెలి చేత నాకు బొట్టు పెట్టించి చేతిలో రెండు జామపళ్ళు పెట్టించి అంది. "ఈ సారొచ్చిన ప్పుడు రవికెల గుడ్డ పెడతాను.."

"ఇది అంతకంటే ఎక్కువ. చక్కని పండ్లు ఇచ్చారు"

"పండంటి బిడ్డని కంటావమ్మా".

తుళ్ళిపడ్డాను. ఆశ్చర్యంగా చూశాను. అభి మానంగా చూశాను. అడక్కుండానే ఆశీస్సులందిం చిన ఆ అమ్మకి పాదాభివందనం చేశాను.

నన్ను లేవదీసి నా నుదుట ముద్దుపెట్టు కుంది.

"కుందనపు బొమ్మలా ఉన్నావు. నిన్ను కట్టు కున్నవాడు అదృష్టవంతుడు.."

చటుక్కున కనుకొలకుల్లో తడి పొర కదల బోతోంటే తల తిప్పేసుకున్నాను.

"నువ్విలా వచ్చి వెళ్ళావని తెలిస్తే చాలు మా అబ్బాయి ఎక్కడున్నా వచ్చి నిన్ను కలుస్తాడు. వాణ్ణి ఒకసారి ఇంటికొచ్చి వెళ్ళమని చెప్పమ్మా. మా అమ్మాయికి అయినవాళ్ళ సంబంధం వచ్చింది. కట్నకానుకలు ఆశించడం లేదు. వాడు దగ్గరుండి నాలుగు అక్షింతలు వేస్తే చాలు మా గుండెల మీది బరువు దిగిపోద్ది.."

"తప్పకుండా వస్తాడు. చెల్లిపెళ్ళి ఘనంగా చేస్తాడు." అమ్మాయి బుగ్గ గిల్లి వెళ్ళబోతూ ఆగాను.

ఓ స్లిప్ మీద నా సెల్ నెంబరు రాసిచ్చి, "ఈలోగా విహాన్ గురించేమైనా తెలిస్తే నాకు ఫోన్ చెయ్యండి. నేనూ చేస్తూంటాను. మీ నెంబరు నోట్ చేసుకున్నాను.."

వీధిలోకొచ్చి వీడ్కోలిచ్చాను. ఇరుగూ పొరుగూ సైతం బయటికొచ్చి నిలబడ్డారు.

కారు కదిలింది.

•••

కారు తిన్నగా ఒకే గమ్యానికి పరుగెడుతోంది.

నా ఆలోచనలు మాత్రం పరిపరి విధాల పోతు న్నాయి.

వాటికి కేంద్రం, సూత్రం విహానే!

అటు హైదరాబాద్‌లో ఉండకుండా, ఇటు ఇంటికి రాకుండా, మూడో చోట అజ్ఞాతంగా ఎందు కున్నట్లు? ఆత్మహత్య చేసుకోడానికి అనువుగా

ఉంటుందని ఆ ప్రదేశం ఎన్నుకున్నాడా?

ఒకవేళ అదే అతడి ఉద్దేశమైతే ఆ తర్వాత జరిగే శవ పంచనామా, శవయాత్ర, పోలీసుకేసు వగైరాలు ముసలి తల్లిని ఎంత హైరానా పడేట్టు చేస్తాయో ఆలోచించొద్దూ?

నిన్నట్నుంచి నేనే ఎంతో టెన్షన్ పడుతూ తిరుగుతున్నాను. విషయం తెలిస్తే శాంతమ్మ తట్టుకోగలదా? భర్తతో బాటు పెద్దకొడుకు గుండెల మీద తన్నేసి పోయాడని కుప్పకూలిపోదూ!

సెల్ మోగింది. అమ్మ. తటపటాయిస్తూనే కాల్ రిసీవ్ చేసుకున్నాను.

"నిన్ననగా సిటీకొచ్చి ముఖమైనా చూపించకుండా ఎక్కడ తిరుగుతున్నావు విజ్జీ. అసలేం రాచకార్యం చక్కబెట్టడాని కొచ్చావ్? రాత్రి వస్తావని అందరం ఎదురు చూశాం తెలుసా?"

"సారీ మమ్మీ. ఒక అత్యవసర పని మీద తిరుగు తున్నాను".

"నీకంత ఖర్మేంటే. మీ డాడీకి చెబితే కావాల్సిన ఏర్పాట్లన్నీ చేద్దురు గదా!'

'నా ఫ్రెండు. నేనే తిరగాలి.."

"అయితే మాత్రం మరీ ఇల్లూ వాకిలీ పట్టకుండా తిరిగితే ఎలాగే. అల్లుడు గారు ఏదేదో అనుకోరూ! నీ తిరుగుళ్ళాపి ఇంటికొచ్చెయ్. నిన్నట్నుంచి ఫోన్ కూడా చెయ్యలేదని మీ డాడీ కోపంగా ఉన్నారు.."

"ఇప్పుడే ఫోన్ చేస్తాను.."

నా రాక గురించి ఏమనుకుంటున్నారో, నాన్న ఏమంటారో అని సంశయిస్తూనే ఆయనకి కాల్ చేశాను.

"ఎందుకంత సడన్‌గా వచ్చావ్? మీరిద్దరూ ఏమైనా గొడవ పడ్డారా?

"అహహ, అలాటిదేం లేదు డాడీ. రాజేశ్వర్‌కి అన్నీ చెప్పే వచ్చాను. మా ఫ్రెండ్ పరిస్థితి విషమంగా ఉందని తెలిసి అప్పటికప్పుడు బయల్దేరి వచ్చేశాను.." రాజేశ్వర్ నా రాకకు కారణం చెప్పి ఉంటాడేమోనని జాగ్రత్తగా మాట్లాడాను.

"అంత క్లోజ్ ఫ్రెండెవరు? ఆడా? మగా?"

రాజేశ్వర్ విహాన్ పేరు చెప్పలేదని అర్థమైపోయింది. రిలీఫ్‌గా ఫీలవుతూ "ప్రాంజలి" అబద్ధమాడేశాను.

నిజం చెబితే, విహాన్ మళ్ళీ నా జీవితంలోకి తొంగి చూశాడని తెలిస్తే నాన్న కథాకళి కాదు శివ తాండవమాడేస్తారు!

"ఇప్పుడెలా ఉంది?"

"రికవరింగ్..."

"వాళ్ళవాళ్ళూ, డాక్టర్లూ నర్సులూ ఉంటారు. వాళ్ళు చూసుకుంటార్లే. అవసరమైతే డబ్బు సాయం చేసి వచ్చెయ్".

"ఓకే డాడ్"

హమ్మయ్య! గండం గడిచింది. నేనెందుకు ఎవరికోసం వచ్చానో రాజేశ్వర్‌కి తెలుసు. అయినా చెప్పకపోవడం అతడి సంస్కారం!

ఐ లవ్యూ రాజేశ్వర్! నా ఈ ప్రయాణం నిన్నేమైనా బాధపెడుతూంటే క్షమించు!

"రాత్రికి హైదరాబాద్ వెళ్ళిపోతామా మేడమ్?" డ్రైవర్ అడిగాడు. ఈ తిరుగుళ్ళు అతడికీ విసుగు అసహనం కలిగిస్తున్నాయేమో!

"కచ్చితంగా చెప్పలేను. ఏం ఎందుకడిగావు?"

పరిణీతికి భారీగానే ముట్టజెబుతున్నారు

పరిణీతి చోప్రా....బాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్నే! కాకపోతే అక్క ప్రియాంకా చోప్రా అంత ఫేమస్ కాదు. ఈ విషయాన్ని టాలీవుడ్ దర్శకనిర్మాతలు గుర్తించినట్టు లేదు అంటున్నారు సినీజనాలు. మహేష్‌బాబుకు జంటగా తెలుగు సినిమాలో నటించేందుకు పరిణీతి ఏకంగా మూడున్నర కోట్ల రూపాయలు అడిగితే ఆ సినిమా దర్శకనిర్మాతలు మారు మాట్లాడకుండా ఓకే చెప్పేశారట! ఎంత బాలీవుడ్ నుంచి దిగుమతి చేసుకుంటూంటే మాత్రం అంత రెమ్యునరేషన్ అవసరమా? అన్నది కొందరి అనుమానం. అంతకన్నా ఎక్కువ టాలెంటు ఉన్న తెలుగమ్మాయిలు ఉండగా, ఉత్తరాది భామను దింపవలసిన అవసరం ఏమిటి? అన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

"నేను తిరిగెళ్ళాలి మేడమ్. రెండ్రోజులు పట్టొచ్చని ఇంట్లో చెప్పలేదు. గిరాకీ మీద వెళ్తున్నానని చెప్పేనంతే. ఇవాళ వెళ్ళిపోవాలి. కావలిస్తే నా దోస్తు బండి పెడతాను".

"అక్కడి పరిస్థితిని బట్టి చూద్దాంలే.." గోళ్ళు కొరుక్కుంటూ అన్నాను.

మరి నాలుగ్గంటలకి చిన్న టౌన్లో ప్రవేశించాం. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది.

తల దాచుకోడానికి విహాన్ ఈ ఊరినే ఎందుకు సెలక్ట్ చేసుకున్నాడో!

ఇక్కడెవరైనా ఫ్రెండ్.. టీవీలో పరిచయమైన అమ్మాయి.. లేక ప్రేయసి ఉంటోందా?

ఏదైనా సాధ్యమే. డాడీ చెప్పినట్టు అతడి 'అదర్ సైడ్' నాకు తెలీదు. కొత్త కథ ప్రారంభించాడేమో అంతకన్నా తెలీదు!

నిర్వికారంగా చూస్తూ కూర్చున్నాను. ఫోన్లో ఆవిడ చెప్పిన కొండగుర్తు దగ్గరికెళ్ళి ఆగాం. కారులోంచి దిగి చుట్టూ పరిశీలనగా చూశాను. డాబాలూ మేడలూ.. ఎందులోనూ ఎలాంటి 'హడావిడీ' కన్పించలేదు.

నిట్టూర్చాను. విహాన్‌కేమీ అయ్యుండదు! థాంక్‌గాడ్!

ఓ మేడ మీద ఒకావిడ బట్టలు ఆరవేస్తున్నదల్లా నన్ను చూసింది. గబగబా క్రిందికి దిగి వచ్చింది.

"విహాన్ ఇంటినుంచొచ్చారా?"

తలాడించాను

"మీరతడి భార్యా? తనకి పెళ్ళి కాలేదని చెప్పాడే?'

అనుమానపు చూపులు సూదుల్లా గుచ్చుకున్నాయి. ఆ విషయాలు మాట్లాడి సమయం వృధా చెయ్యదలుచు కోలేదు.

"విహాన్ ఎక్కడున్నాడు? అతడికోసం నిన్నట్నుంచి వెతుకు తున్నాం" ఆమె రియాక్షన్ కోసం చూస్తూ అన్నాను. దానిని బట్టి పరిస్థితి తెలుసుకోవచ్చని నా ఆరాటం!

"లోపలికి రండి చెబుతా.."

ఆమెని అనుసరిస్తూ ఇంట్లో కెళ్లాను. ఈవిడ అతడికెలా తెలుసో!

"ఫోన్ విహాన్ చెయ్యకుండా మీరెందుకు చేశారు?" ఉత్కంఠ భరితనై అడిగాను.

"కూర్చోండి..." సోఫా చూపించింది.

కూర్చుని ఆమె ముఖంలోకి చిన్నగా కంపిస్తూ చూశాను. ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని నా చెవులు శరీరం వణుకుతున్నాయి.

"ఎక్కడికెళ్ళాడో మాకూ తెలీదు!"

డీలాపడ్డాను. "ఎప్పుడెళ్ళాడు ఎక్కడికెళ్ళాడు ఎందు కెళ్ళాడు?"

నా వంక చిత్రంగా చూసింది. "మొన్న పొద్దుట వెళ్ళాడు. ఇంకేవీ తెలీదు.."

"తాళం ఇచ్చి పంపెయ్యక ఆ సోది ఎందుకే" ఆవిడ భర్త కాబోలు లోపల్నుంచి అరిచాడు. బహుశా భోం చేస్తున్నాడేమో!

ఆమె కంగారుగా లోపలికెళ్ళి 'కీ' తెచ్చి నా చేతిలో పెట్టింది.

"పైన పెంట్‌హౌస్‌లో ఉండేవాడు. ఇది దాని తాళం. మూడ్రోజుల్లో తిరిగి రాకపోతే వాళ్ళింటికి ఫోన్‌చేసి సామాను తీసుకెళ్ళమని చెప్పమన్నాడు"

"మూడ్రోజులు పూర్తికాలేదుగా?"

"అతడెక్కడి కెళ్ళాడో, ఏం చేసుకుంటాడో ఏమో.. ఆ పీడ మనకెందుకు ఫోన్ చేయమని మా వారు కోప్పడితే పొద్దున ఫోన్ చేశాం.."

"విహాన్ ఎక్కడికెళ్ళాడో ఏమిటో మీకు బొత్తిగా తెలీదా?" కళ్ళు అశ్రుపూరితాలవుతోంటే అడిగాను.

"తెలీదు. మీరు పైకెళ్ళండి. మీ వెనక వస్తాను".

"ఎప్పట్నుంచి ఉన్నాడిక్కడ?"

"ఆరేడు నెలలవుతోంది. కట్టుబట్టల్తో వచ్చాడు. మా ఇంటి ముందు సొమ్మసిల్లి పడిపోతే పోనీలే పాపం అని చేరదీసి ఆసరా ఇచ్చాం.."

జైలు నుంచి విడుదలయ్యాక గమ్యరహితంగా ప్రయాణిస్తూ ఇక్కడికొచ్చి పడి ఉంటాడు! బహుశా నా పెళ్ళి వార్త తెలిసుండదు!

మనసంతా ఏదోలా అయిపోయింది. పెదవి కొరుక్కుంటూ ఉండిపోయాను.

"నీ కబుర్లింకా తెమల్లేదా? త్వరగా సామాను తీసుకుని వెళ్ళిపొమ్మను" లోపల్నుంచి మళ్ళీ అరిచాడు.

"ముందు మీరు పైకెళ్ళి సామాను మూట గట్టుకోండి..." అనేసి లోపలికెళ్ళిపోయింది.

మరో మలుపు! మరో షాక్!

మేడ మెట్లెక్కుతోంటే తేనెటీగల్లా ముసిరాయి కొత్త ఆలోచనలు.

విహాన్ మూడ్రోజులెందుకు చూడమన్నాడు? సెకండ్ థాట్ రావొచ్చనా?

కేవలం సామాను గురించే ఇంటికి ఫోన్ చెయ్యమన్నాడా లేక దానిద్వారా ఇంకేదైనా సమాచారం తెలియబరచాలనుకున్నాడా?

తను లేక తన శవం ఎక్కడ ఉండవచ్చునో చెప్పే ఆధారమేదైనా రూంలో వదిలాడా?

ఇక్కడి నుంచి వెళ్ళిపోయిన రోజు రాత్రే వాళ్ళమ్మతో మాట్లాడాడు. నాకు మెస్సేజ్ ఇచ్చాడు. సూసైడ్ ఎక్కడ ఎలా చేసుకోబోయినట్టు? ఎవరికీ అంతు చిక్కకుండా శవం కూడా లభ్యం కాకుండా కొండల్లోనో కోనల్లోనో నదిలోనో మరే నిర్జన ప్రదేశంలోనో...!

చివరి క్షణాల్లో నాకెందుకు సమాచారమిచ్చినట్టు? నన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తూనే ఉన్నానని చెప్పడానికా లేక నేను వేరేవారిని పెళ్లి చేసుకున్నందున అనుక్షణం కుళ్ళి పోవాలనే కసితోనా?

ఆలోచనలు తెగటం లేదు. తాళం తీసిన దాన్నల్లా లోపలికి చూసి ఘ్రాన్పడిపోయాను.

ఒక చాప, నీటి కుండ, కొన్ని పుస్తకాలు, టవలూ లుంగీ టీ షర్టులూ అంతే. ఇంత నిరాడంబరంగా ఎలా బ్రతికాడో!

చాప పరచి గోడకానుకుని కూర్చున్నాను.

పుస్తకాలు తిరగేశాను. అన్నీ ఆధ్యాత్మిక గ్రంథాలే. భగవద్గీత చేతుల్లోకి తీసుకున్నాను. అందులో సూసైడ్ నోట్‌గాని మరేదైనా క్లూ పెట్టాడేమోనని తిరగేస్తోంటే ఇంటావిడ వచ్చింది.

"విహాన్ ఎప్పుడూ మీరు కూర్చున్న చోటే కూర్చునేవాడు. ఎప్పుడూ భగవద్గీత చదువుతూ ధ్యానం చేస్తూనో ఉండేవాడు. అలాగని ఎన్నడూ ఏ దేవుడి ఫొటో పెట్టుకోలేదు. పూజలూ చెయ్యలేదు.."

ఆశ్చర్యపోతూ అలాగా అన్నట్టు తలాడించాను

"అతనితో నువ్వెలా వేగావోగానీ అదోరకం మనిషి. ఎవరితోనూ కలిసేవాడు కాదు. మాటలే లేవు. పొద్దస్తమానూ మేడమీదే ఉండేవాడు. తిండి యావా లేదు. నేనే జాలిపడి మా పిల్లలకి ట్యూషన్ చెబితే ఓ పూట అన్నం పెడతానన్నా. మా పిల్లలతో పాటు ఇరుగు పొరుగు పిల్లలకీ చెప్పేవాడు. ఎవర్నీ రూపాయి అడిగేవాడు కాదు. చీకటి పడ్డాక వెళ్ళి గుడిలో భైరాయించేవాడు. గుడి మూసేదాకా అక్కడే ఉండేవాడు. గుడి ప్రసాదమే రాత్రి భోజనం...!"

ఎందుకంతగా తనని తాను హింసించుకున్నాడో! ఆ కోపం కసి ఎవరి మీదో!

"మొదట్లో మాకు తెలీలేదు గాని తర్వాత్తర్వాత బాగా గెడ్డం పెంచి స్వామీజీలా అయిపోయాడు. పూర్వజన్మలో ఏ ఋషో మహాత్ముడో అయ్యుంటాడు. బహుశా సర్వసంగ పరిత్యాగిలా ఏ హిమాలయాలకో వెళ్ళిపోయుంటాడు. మా వారు నవ్వేస్తారు గాని సన్యాసి గానో స్వామీజీ గానో మారి ఉంటాడని నా అనుమానం.."

కళ్ళు పెద్దవి చేసి పరమాశ్చర్యంగా చూశాను.

"నిజం... ఈ చుట్టుపక్కల వాళ్ళు ఏ కష్టం వచ్చినా పూలో పండో తెచ్చి అతడి ముందుపెట్టి తమ బాధలు చెప్పుకునే వారు. ఉద్యోగం రాలేదనో, పెళ్ళి కాలేదనో, మంచి ర్యాంక్ రాలేదనో, అప్పుల వాళ్ళు వేధిస్తున్నారనో, రోగాలు వదల్టం లేదనో మొర బెట్టుకునేవారు. అందరి సమస్యలూ విశ్లేషించి ఎంతచక్కగా సమాధానం ఇచ్చేవాడనీ! మహానుభావులు తప్ప ఇంకెవరూ అలా చెప్పలేరు. ఇంకో సంగతేవిటంటే ఎప్పుడూ ఎవర్నీ ఏదీ అడగలేదు. యాచించలేదు. తామరాకు మీద నీటి బొట్టులా అంటారే అలా ఉండేవాడు. నీకో రహస్యం చెప్పనా? ఎవరికీ చెప్పకూడదు మరి..."

నా మీదకి ఒరిగి చెవిలో చెప్పింది. "మొన్న రాత్రి విహాన్ పద్మాసనం వేసుకుని కూర్చుని ఆకాశంలో వెళ్ళిపోతూ మా పక్కింటి బామ్మగారికి కలలో కనిపించాడు!"

అవాక్కయ్యాను. "ఎప్పుడు? మొన్నరాత్రి?"

"అవును అప్పుడే. మా వారికి చెబితే హేళన చేశారు. నాకు మాత్రం నమ్మకం ఉంది. అతడు బొంది తోనే స్వర్గానికెళ్ళుంటాడు." చెంపలేసుకుని దణ్ణం పెట్టుకుంది.

నిర్విణ్ణురాలినయ్యాను.

"సామాను తక్కువే. కారులో తీసుకుపోవచ్చు. సర్ది పెట్టనా?"

తల అడ్డంగా ఊపాను. "కాసేపిక్కడ కూర్చుని తీసుకెళ్తాను" అన్నా.

నా వంక సానుభూతిగా చూసింది. "ఇంత చిన్న వయస్సులో రాకూడని కష్టమే. కొన్నాళ్ళైనా అలాంటి మహానుభావుడితో కాపురం చేయడం నీ అదృష్టం. నీకేమైనా అవసరమైతే కిందికొచ్చి పిలు.."

నన్ను విహాన్ భార్యగా జమకట్టి మాట్లాడుతోంటే నాకేమీ ఇబ్బంది అన్పించలేదు.

ఆమె వెళ్ళాక గీతని మరోసారి తిరగేశాను. ఎలాంటి సూచికలు లేవు.

మిగతా పుస్తకాలు తిరగేస్తోంటే ఒక నోటు బుక్కు కన్పించింది. చేతుల్లోకి తీసుకున్నాను.

అట్ట తిప్పగానే, "దయచేసి ఈ పుస్తకం విజిత కంట బడనీయవద్దు" అని రాసి కింద విహాన్ సంతకంచేశాడు.

అదిరి పడ్డాను.

అలా ఎందుకు షరతు విధించాడు? ఇందులో నాకు తెలియని తెలుసుకోకూడని రహస్యాలు న్నాయా? చనిపోబోయే ముందు తన నిజస్వరూపం ఇందులో ఆవిష్కరించుకున్నాడా?

గబగబా తిరగేశాను.

డైరీలా కాదు గానీ, తండ్రి ఆత్మహత్య చేసుకున్నప్పటి నుండి జరిగిన ఘటనలన్నీ రాసుకొచ్చాడు.

ఎన్ని కష్టాలు పడ్డాడో, ఎంత ఏడ్చాడో అన్నీ ఒక క్రమంలో గాకపోయినా ముందు వెనకలుగా రాసుకొచ్చాడు. జ్ఞాపకాలని గుది గుచ్చినట్టు తన తపన, ఆవేదన అక్షరబద్ధం చేశాడు.

తండ్రి ఆత్మహత్య వార్త తెలియడం, తల్లి వేదన, చెల్లెలు తమ్ముళ్ళ కన్నీళ్ళు, చేయూతనిచ్చిన ఊరివాళ్ళు, అప్పుల వాళ్ళ గొడవ, ఆస్తి అమ్మడం, నాన్నకోరిక నెరవేర్చాలన్న పట్టుదలతో చదువు కొనసాగించడం, రకరకాల పార్ట్ టైమ్ జాబ్స్ చెయ్యడం, ప్లేట్‌మీల్స్ తింటూ పైసాపైసా కూడబెట్టి ఇంటికి డబ్బు పంపడం, ఏకాకినయ్యానన్న ఫీలింగ్, బాధలు, కన్నీళ్ళు, ఒంటినొప్పులు, ఈసడింపులు - అన్నీ రాసుకొచ్చాడు విహాన్.

మిమిక్రీ ప్రదర్శన చూసి స్ఫూర్తి పొందటం, రకరకాల ధ్వనుల్నీ వ్యక్తుల్నీ అనుకరిస్తూ సాధన చెయ్యటం, ఆడటం, పాడటం, ఆ తర్వాత కెరీర్ కోసం ప్రాకులాడటం, స్థిర సంపాదన కోసం ఉద్యోగ ప్రయత్నాలు వివరించాడు.

పబ్‌లో బౌన్సర్‌గా చేరటం జీవితంలో ఓ పెద్ద మలుపు. కుదుపు అని రాసుకున్నాడు.

నా గురించి ఏం రాసుకున్నాడోనని ఆసక్తిగా చదివాను.

'విజిత - పేరేకాదు ఆమె కూడా బావుంది. ఆమె నవ్వు ఎంత బాగుందో చెప్పలేను. దాని ముందు మోనాలిసా చిరునగవు బలాదూరే. ఆ నవ్వు చూస్తూ అన్నపానీయాలు వదలి బతికేయొచ్చు. చిరునవ్వుల వరమిస్తే చితినుంచి లేచొస్తా- అన్న సినీ కవి పంక్తులు అక్షరాలా నిజమనిపిస్తాయి. ఆమె పరిచయం. ఆ పైన స్నేహం నా జీవితాన్ని పునీతం చేశాయి..'

మా ప్రాక్టికల్ అప్రోచ్ గురించీ రాశాడు. నా ప్రోత్సాహంతో ఆర్జే అవడం, ప్రశంసలు కురియడం, ఇంట్లో వెల్లివిరిసిన ఆనందం, అగ్నిపరీక్ష సీరియల్లో నటించడం, మా స్నేహం ప్రణయంగా పరిణామం చెందటం - ఎంతో వివరంగా మనసుపెట్టి రాశాడు.

(ఇంకా వుంది)



సర్వ్ నీడీ

లక్షల్లో జీతం, సరదాలు, షికార్లు, వీకెండ్ పార్టీలు...నేటి యువత ప్రాధాన్యం వీటికే! కానీ గౌతమ్ మాత్రం వాటి గురించి అస్సలు ఆలోచించే వాడు కాదు. ఫ్రెండ్స్ అందరూ వీకెండ్ అంటూ ఎంజాయ్ చేస్తుంటే అతడు మాత్రం అనాథల కోసం వెతికేవాడు. వారికి ఏదో ఒకటి చేయా లని తపించేవాడు. ఆ తపనతోనే 'సర్వ్ నీడీ' పేరిట స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేశాడు.

హైదరాబాద్‌కి చెందిన గౌతమ్ నాన్న సైన్యంలో పనిచేసేవారు. దాంతో గౌతమ్‌కి ఎన్నో ప్రాంతాలు తిరిగే అవకాశం లభించింది. ఎంతో మందిని చూశాడు. తనకు ఉన్నదాంట్లోనే సాయం చేయాలని చిన్నవాళ్ళ నుంచే నేర్చు కున్నాడు. చదువు, తరువాత ఉద్యోగం, ఉద్యోగంలో ఎదగటానికి కష్టపడాలి. మరి ఆ తరువాత ఏమిటి? అనే ఆలోచన అతడిలో మొద లైంది. సమాజానికి ఏరకంగా తనవంతుగా సాయపడుతున్నాననే ఆలో చన అతన్ని నిలువనీయ లేదు. ఉద్యోగం వదిలేశాడు. ముందు ఓ స్వచ్ఛంద సంస్థలో చేరి, దాని పనితీరు విషయా లన్నీ క్షుణ్ణంగా తెలుసుకున్నాడు. ఎన్నో సంస్థల్లో స్వచ్ఛందంగా పనిచేశాడు. స్నేహితులు మిలింద్, సౌందర్య, జగన్నాధరావు, శ్వేత, అన్వేష్, రామకృష్ణలు గౌతమ్‌తో చేతులు కలి పేందుకు ముందుకు వచ్చారు. తాను సంపా దించిన అనుభవంతో మిత్రులతో కలిసి 'సర్వ్ నీడీ'ని 2013లో ప్రారంభించాడు. రోజుకు వెయ్యి మందికి పైగా అనాథలు, వృద్ధులకు ఆహారాన్ని ఈ సంస్థ సమకూరుస్తోంది. దాతల నుండి దుస్తులు, మందులు సేకరించి అవసరమైన వారికి అందిస్తారు. రోగులకు మందులు, ఆహారం అందిస్తారు. అంతేకాదు అనాథ శవాలకు అంత్య క్రియలు కూడా నిర్వహిస్తారు. రోడ్లపై ఇబ్బంది కరంగా మారిన గోతులు కూడా పూడుస్తారు.

ఆకలి బాధితులు లేని సమాజం నెల కొల్పడమే నా లక్ష్యం అంటున్న అతగాడి సేవ లకు ఈ మధ్యే గుర్తింపు దక్కింది. 'హైరేంజ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' సంస్థ సర్వ్ నీడీని ఉత్తమ సేవాసంస్థగా గుర్తించింది. సాహస క్రీడలకు పట్టం కట్టే ఈ హైరేంజ్ సంస్థ ఒక సామాజిక సేవా సంస్థకు అవార్డు ఇవ్వటం ఇదే మొదటి సారి. ఆకలితో అలమటించేవారికి నేనున్నా నంటూ భరోసానిస్తూ సేవలందిస్తున్న గౌతమ్‌కి హ్యాట్సాఫ్ చెబుదామా!

పుస్తక సమీక్ష

ఉపనిషద్దర్శనం

108 ఉపనిషత్తులు
సంస్కృత మూలం - తెలుగు భావం
మూలానువాదం: పూర్వ పండితులు
సరళీకరణ: డాక్టర్ జయంతి చక్రవర్తి
ధర: 1116 రూపాయలు,
పేజీలు: 1306
ప్రతులకు: నవరత్న బుక్‌హౌస్, రెహమాన్ వీధి, అరండల్ పేట, విజయవాడ-2 సెల్ 9848082432

ఉపనిషత్తులు అంటే ఏమిటో తెలుసు కోవాలని ఎంతో మందికి కుతూహలంగా ఉంటుంది. కానీ అవన్నీ మనకు అర్థం కాని భాషలో ఉన్నా యని భావిస్తాం. పైగా ఉపనిషత్తులంటే సామాన్య ప్రజలకు సంబంధించిన విషయాలు కావనే అభిప్రాయం చాలామందిలో నెలకొంది. ఈ సందే హాలను పటాపంచలు చేసేందుకే డాక్టర్ జయంతి చక్రవర్తి జిల్లెళ్ళమూడి అమ్మవారి అనుగ్రహంతో, పామరులకు కూడా అర్థమయ్యేలా ఉపనిషత్తు లను సాధారణ తెలుగులోకి అనువదించారు. పెద్దల ఆశయాలకు అనుగుణంగా వాటి మూలార్థం చెడకుండా జాగ్రత్త పడ్డారు రచయిత.

వేదాలలో ఒక భాగం వర్ణాశ్రమ ధర్మాలతో కూడిన కర్మకాండలైతే, మరో భాగం వర్ణాశ్ర మాలకు అతీతమైన బ్రహ్మవిద్యను బోధించిన జ్ఞానకాండ. ఈ జ్ఞానకాండే ఉపనిషత్తులు. నాలుగు వేదాలలోనూ ప్రాచీన ఆర్వాచీన ఉపనిషత్తులు 1200 ఉన్నాయి. వీటిల్లో అతి ప్రాచీనమైనవి పది. ఆధ్యాత్మిక వాఙ్మయ ప్రపంచంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయీ దశోపనిషత్తులు. వీటితో సహా క్రీస్తుపూర్వం 2,500 - 1800 కాలం నాటి ఋగ్వేదంలోని ఉపనిషత్తులు 10, శుక్ల యజుర్వేద ఉపనిషత్తులు 19, కృష్ణ యజు ర్వేద ఉపనిషత్తులు 32, సామవేద ఉప నిషత్తులు 16, అధర్వవేద ఉపనిషత్తులు 31 వెరసి నాలుగు వేదాలలోని అతి ముఖ్యమైన 108 ఉపనిషత్తులను ప్రస్తుత సమాజానికి అనుకూలమైన, పఠనీయమైన భాషలో అందిం చారు చక్రవర్తి. ప్రతి తెలుగువాడూ తప్పక చదువుకోవాల్సిన గ్రంథమిది.

ఆధునిక మహాభారతం

గుంటూరు శేషేంద్ర శర్మ
ధర: 400 రూపాయలు,
పేజీలు: 400
ప్రతులకు: నవ తెలంగాణ, విశాలాంధ్ర, మన తెలంగాణ, ప్రజాశక్తి, బ్రాంచీలు. నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్

ఆధునిక కవితా చక్రవర్తి శేషేంద్ర శర్మ. "కలమెత్తితే నాకు ఒక దేశపు జెండాకున్నంత పొగరు ఉంది" అంటూ జాతికిచ్చిన ఆయన అక్షర శక్తి నేటికీ యువతను ఉత్తేజితం చేస్తోంది. నాలుగున్నర దశాబ్దాలనాటి ఈ 'ఆధునిక మహాభారతం' వచన కవితా సంకలనాల (1970-1986) సమాహారం. ఆధునిక భారత దేశంలో భూమికోసం ప్రజలు చేసిన యుద్ధమే ఈ పుస్తకం. ఎనిమిది సర్గలున్న ఈ కావ్యేతిహాసంలో కవి హృదయం వర్గ చైతన్యాన్ని రగిలింపజేయడమే.



స్వీకారాలు

శుక మహర్షి

ఏదుల పాపయ్య
ధర: 50 రూపాయలు, పేజీలు: 56
ప్రతులకు: రచయిత, బండార్ నగర్, మహబూబ్‌నగర్‌జిల్లా వనపర్తి,
సెల్ 08545231075

సొరాబు

శేషేంద్ర
ధర: 80 రూపాయలు, పేజీలు: 70
ప్రతులకు: నవచేతన, నవ తెలంగాణ, విశాలాంధ్ర, ప్రజాశక్తి బుక్‌హౌస్ బ్రాంచీలు మరియు నవోదయ, నవయుగ బుక్‌హౌస్‌లు, హైదరాబాద్

సత్యం వైపు పయనం

మునిమడుగుల రాజారావు
ధర: 60 రూపాయలు, పేజీలు: 96
ప్రతులకు: పాలపిట్ట బుక్స్, మలక్‌పేట, హైదరాబాద్-36

సాహిత్యానుభూతి

కోడూరి శ్రీరామమూర్తి
ధర: 150 రూపాయలు
పేజీలు: 190
ప్రతులకు: కోడూరి భారతి, అఖిల్ అపార్ట్‌మెంట్స్, దానవాయిపేట, రాజమండ్రి-3
సెల్ 9346968969

-లలితాత్రిపురసుందరి

పిలుపు

నోబెల్ కథలు

-కునూట్ హామ్‌సూన్

ఆ వీధిపేరు వెస్టర్ ఓల్ట్. అది కోపెన్‌హాగన్‌లోని ఇన్నర్ హార్బర్ కింద ఉంది. కొత్తగా ఏర్పడ్డ వీధి. ఇళ్ళు అక్కడొకటీ అక్కడొకటీ విసిరేసినట్టుగా ఉంటాయి. దాంతో ఆ వీధిలో పెద్దగా జనసంచారం ఉండదు. నిర్మానుష్యంగా ఉంటుంది.

గడిచిన సాయంత్రం ఈ వీధిలో నాకు ఒక ఆశ్చర్యకరమైన అనుభవం ఎదురైంది. నేను సాయంత్రం షికారు కోసం వెళ్ళి వీధిలో అటూఇటూ తిరుగుతున్నప్పుడు నాకు ఎదురుగా ఒక స్త్రీ వస్తూ కనిపించింది. ఆమె తప్ప వీధిలో ఇంకెవ్వరూ లేరు. వీధిలో లైట్లు వెలుగుతున్నప్పటికీ ఇంకా కనుచీకటిగానే ఉంది. దానితో నాకు ఆమె ముఖం సరిగా కనిపించలేదు. రాత్రి పూట వ్యాపారం చేసే తాలూకు మనిషి అయ్యుండొచ్చు అనుకుని నేను ఆమెను దాటుకుంటూ వెళ్ళిపోయాను.

కునూట్ హామ్‌సూన్ 4 ఆగస్ట్ 1859న నార్వేలో జన్మించారు. 1920లో సాహిత్యంలో నోబెల్ బహుమతి అందుకున్నారు. 92 ఏళ్ళ వయసులో 19 ఫిబ్రవరి 1952న మరణించారు.

వీధి చివరి వరకూ వెళ్ళి నేను మళ్ళీ వెనుదిరిగాను. ఆమె కూడా వెనుదిరిగి రావడంతో నేను మళ్ళీ ఆమెను కలవక తప్పలేదు. ఆమె ఎవరికోసమో ఎదురు చూస్తోందని నాకు అనిపించింది. ఆమె ఎవరికోసం ఎదురు చూస్తోందో తెలుసుకోవాలనిపించింది. కుతూహలంగా అనిపించింది. నేను మళ్ళీ ఆమెను దాటుకుని ముందుకు పోయాను. ఆమె మూడోసారి ఎదురైనప్పుడు నేను టోపీతీసి ఆమెను పలకరించాను.

‘గుడీవినింగ్? మీరు ఎవరి కోసమైనా ఎదురు చూస్తున్నారా?”

ఆమె ఆశ్చర్యపోయినట్టు చూసింది.

“లేదు... అవును” ఆమె ఎవరికోసమో ఎదురు చూస్తోంది.

ఆమె ఎవరికోసం ఎదురుచూస్తోందో వాళ్ళు వచ్చేవరకూ నేను ఆమెకు తోడుగా ఉండొచ్చా అని అడిగాను. తనకేమీ అభ్యంతరం లేదని అంటూనే ఆమె దానికి కృతజ్ఞతలు కూడా తెలిపింది. నిజానికి తను ఎవరికోసమూ ఎదురు చూడటం లేదని, ఇంట్లో గాలి ఆడక ఉక్కిరిబిక్కిరిగా ఉంటే కొంచెం గాలి పీల్చుకుందామని బైటకు వచ్చానని చెప్పింది.

మేం ఇద్దరం పక్కపక్కగా నడుస్తూ అనేక విషయాల గురించి మాట్లాడుకున్నాం. నేను ఆమెకు నా చేయి అందివ్వబోయాను.

“ఆహా, వద్దు” అంటూ ఆమె తల అడ్డంగా ఊపింది.

ఆ రోడ్డులో ఇద్దరం కలిసి అటూఇటూ నడుస్తున్నాం. అయినా నాకెందుకో అందులో ఆనందం ఏమీ కనిపించలేదు. చీకట్లో నాకు ఆమె మొహం కూడా కనిపించడం లేదు. టైమెంతో చూడడం కోసం అగ్గిపుల్ల గీశాను. అగ్గిపుల్లను పైకెత్తి ఆమె వంక కూడా చూశాను.

“తొమ్మిదిన్నర అయింది” అన్నాను.

ఆమె చలికి గడ్డకట్టి పోతున్నట్టుగా వణుకుతూ నిల్చుంది. నేను ఆ అవకాశాన్ని ఉపయోగించుకున్నాను.

“మీకు చలేస్తున్నట్టు ఉంది. మనం ఇక్కడెక్కడన్నా ఒకచోట కూర్చుని కాస్త వేడివేడిగా ఏదన్నా తాగొచ్చుకదా? టివోలీకి గానీ, నేషనల్ హోటల్‌కి గానీ వెళదామా?”

“మీరు నన్ను సరిగా చూడలేదా? నేను ఇప్పుడు ఎక్కడికీ రాలేను” ఆమె అంది.

అప్పుడు నేను మొదటిసారిగా ఆమెను పరిశీలనగా చూశాను. ఆమె సంతాపాన్ని సూచించే నల్లటి దుస్తులు ధరించి ఉంది. నేను ఆమెకు క్షమాపణలు తెలిపాను. చీకటి కారణంగా ఆ విషయం గుర్తించలేకపోయానని చెప్పాను.

“నా చేయి పట్టుకోవచ్చు కదా? మీకు కొంచెం వెచ్చదనం కలుగుతుంది” నేను మళ్ళీ చేయి జాపాను.

ఆమె నా చేయి పట్టుకుంది. మేం అక్కడక్కడే కొంత దూరం నడిచాం. ఆమె మళ్ళీ నన్ను టైమెంతయిందని అడిగింది.

“పదయింది. మీరు ఉండేది ఎక్కడ?” ఆమెను అడిగాను.

“గామ్లే కాంగీవ్‌లో” అంటూ బయలుదేరింది.

నేను ఆమెను ఆపాను. “నన్ను మీ ఇంటి వరకూ తోడు రమ్మంటారా?” అని అడిగాను.

“అది అంత బాగుండదేమో? ఊహూ! వద్దులెండి. మీరు ఉండేది బ్రెడ్‌గాడ్‌లో కదూ”

“మీకెలా తెలుసు?” నేను ఆశ్చర్యపోతూ అడిగాను.

“మీరు ఎవరో నాకు తెలుసు” ఆమె సమాధానమిచ్చింది.

కాసేపు మౌనంగా ఉండిపోయాను. తర్వాత మేమిద్దరం చేయిచేయి పట్టుకుని వీధిలైట్ల కిందుగా నడుచుకుంటూ వెళ్ళాం. ఆమె చాలా వేగంగా నడిచింది. ఆ వేగానికి ఆమె వేసుకున్న నల్లటి బురఖా వెనుక జీరాడసాగింది.

“మనం తొందరగా వెళదాం” ఆమె అంది.

గామ్లే కాంగీవ్ వీధిలోని ఆమె ఇంటికి చేరగానే తోడు వచ్చినందుకు కృతజ్ఞతలు తెలపడానికన్నట్లు ఆమె వెనక్కి తిరిగి నా వైపు చూసింది. నేను ఆమెకోసం తలుపులు తెరిచి పట్టుకోగానే ఆమె లోపలికి వెళ్ళింది. నేను కూడా ఆమె వెంటే లోపలికి వెళ్ళాను. లోపలికి వెళ్ళగానే ఆమె నా చేయి పట్టుకుంది. ఇద్దరిలో ఎవరం మాట్లాడలేదు. మేం రెండు అంతస్తులు ఎక్కి మూడో అంతస్తులో ఆగాం. ఆమె తన అపార్ట్‌మెంట్ తాళం తెరిచి రెండో గుమ్మం ముందు ఆగింది. నా చేయి పట్టుకుని డ్రాయింగు రూమ్‌లోకి తీసుకెళ్ళింది. అంతా నిశ్శబ్దంగా ఉంది. గోడ గడియారం చప్పుడు మాత్రమే వినిపిస్తోంది. లోపలికి అడుగుపెట్టగానే ఆమె ఒక్క నిమిషం ఆగి నన్ను అకస్మాత్తుగా కౌగలించుకుంది. వణుకుతున్న పెదాలతో గాఢంగా నా పెదాలపై ముద్దుపెట్టింది.

“మీరు కాసేపు ఇక్కడ సోఫాలో కూర్చుంటారా? నేను దీపం వెలిగిస్తాను” ఆమె అంది.

తర్వాత ఆమె దీపం వెలిగించింది. నేను నా చుట్టుపక్కల పరిసరాలను ఆశ్చర్యంగా గమనించాను. అది చాలా చక్కగా అలంకరించి ఉన్న డ్రాయింగ్ రూం. లోపల ఇంకా చాలాగదులు ఉన్నాయి. నేను వెంటపడి వచ్చిన ఆమె ఎవరై ఉండొచ్చనే ఊహ మనసులో మెదిలింది.

“గది చాలా చక్కగా ఉంది. మీరు ఇక్కడే ఉంటారా?”

“అవును. ఇది మా ఇల్లే”

“మీ ఇల్లా? అంటే మీరు మీ అమ్మానాన్నలతో ఉంటారా?”

“లేదు” అంటూ ఆమె నవ్వింది. “నేను అంత చిన్న అమ్మాయినేం కాదు. మీరు చూస్తున్నారుగా” అంటూ ఆమె కప్పుకున్న ముసుగును తీసివేసింది.

“ఇప్పుడు చూడండి. నేను మీకు చెప్పింది నిజమో కాదో తెలుస్తుంది” అంటూ ఆమె ఉద్రే

కంగా చేతులు అటూ ఇటూ ఊపుతూ అంది.

"ఆమె వయసు ఇరవై మూడు ఉండొచ్చు. ఆమె కుడిచేతి వేలికి ఉంగరం ఉంది. అంటే ఆమె వివాహిత. అందం విషయానికి వస్తే అంత అందగత్తె ఏం కాదు. సన్నగా ఉంది. కనుబొమలు దాదాపు లేనట్టుగా ఉన్నాయి. అయితే ఆమె ముఖంలో చక్కటి కళ, ఇదీ అని చెప్పలేని ఆకర్షణ ఉంది. ఆమె నవ్వినప్పుడు చాలా అందంగా ఉంది. ఆమె ఎవరు? ఆమె భర్త ఎక్కడ ఉంటాడు? నేను ఇప్పుడున్న ఇల్లు ఎవరిది? - ఈ ప్రశ్నలన్నీ అడుగుదామని నోరు తెరవబోతుండగా ఆమె నన్ను అల్లుకుపోయి నోరు తెరవనివ్వకుండా చేసేసింది.

"నా పేరు ఎల్లెన్. మీకు తాగడానికి ఏమన్నా కావాలా? దానికి ఎలాంటి ఆటంకం ఉండదు. ఇక్కడికి వచ్చి ఈ పడక గదిలో కూర్చోండి" ఆమె పిలిచింది.

నేను పడక గదిలోకి వెళ్ళాను. డ్రాయింగ్ రూమ్‌లోంచి వస్తున్న వెలుతురు గదిలోకి పలుచగా పడుతోంది. గదిలో రెండు మంచాలు ఉన్నాయి. ఎల్లెన్ బెల్‌మోగించి వైన్ తీసుకు రమ్మని చెప్పింది. పనిమనిషి వైన్ తీసుకువచ్చి ఇచ్చి మళ్ళీ బైటకు వెళ్ళిపోయింది. కొద్దిసేపటి తర్వాత ఎల్లెన్ గదిలోకి వచ్చి కాసేపు తలుపు దగ్గర నిలబడింది. నేను ఆమె వైపు అడుగేశాను. ఆమె చిన్నగా ఒక కేక పెట్టి నా వైపు వచ్చింది. నిన్న సాయంత్రం జరిగింది ఇదీ. తర్వాత ఏం జరిగిందో కూడా చెబుతాను.

ఈరోజు ఉదయం నేను లేచేటప్పటికీ పొద్దెక్కింది. కిటికీ తెరలచాటు నుంచీ సూర్యకిరణాలు గదిలోకి తొంగి చూస్తున్నాయి. ఎల్లెన్ కూడా నిద్ర లేచి నా వంక చూసి నవ్వింది. ఆమె చేతులు తెల్లగా దూదుల్లా ఉన్నాయి. నేను ఆమె చెవిలో గుసగుసలాడాను. ఆమె తన నోటితో నా నోటిని మూసేసింది. తర్వాత మరింత పొద్దెక్కింది.

రెండు గంటల తర్వాత పడకపై నుంచి లేచాను. ఎల్లెన్ కూడా లేచి దుస్తులు వేసుకోనారంభించింది. తర్వాత చెప్పులు కూడా వేసుకుంది. నాకు ఒక్క నిమిషం పాటు ఇదంతా నిజమా కలా అనిపించింది. నేను వాష్‌బేసిన్ దగ్గరికి వెళ్ళాను. పక్కనే ఉన్న గదిలోకి ఎవరినన్నా పంపడం కోసమో ఏమో ఎల్లెన్ గది తలుపులు తెరిచింది. నేను అటు తిరిగి చూశాను. తెరచిఉన్న కిటికీలోంచి ఒక్కసారిగా శీతల వాయువు నన్ను కమ్మేసినట్టు అనిపించింది. ఆ గది మధ్యలో ఉన్న బల్లపై ఒక శవం పడుకో బెట్టబడి ఉంది. తెల్లటి బట్టల్లో నెరసిన గడ్డంతో ఉన్న ఒక మనిషి శవం బల్లపై ఉన్న శవాల పెట్టెలో భద్రపరచబడి కనిపించింది. అతని శరీరం అస్థిపంజరంలా బక్కచిక్కి ఉంది. చేతుల ఎముకలు పొడుచుకు వచ్చి ఉన్నాయి. అతని మొహం పాలిపోయి చూడడానికే భయంకరంగా ఉంది. పగటి వెలుతుర్లో అంతా స్పష్టంగా కనిపిస్తోంది. నేను పక్కకి తిరిగి ఏం మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాను.

ఎల్లెన్ వచ్చేటప్పటికి నేను బట్టలు వేసుకుని బైటకు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాను. ఆమె నన్ను కౌగిలించుకుంది. అయితే దానికి ప్రతిస్పందించే స్థితిలో నేను లేను. ఆమె అదనంగా ఇంకొన్ని దుస్తులు ధరించి నన్ను వీధి తలుపు వరకూ సాగనంపడానికి వచ్చింది. ఆమె నా వెంట వచ్చేటప్పుడు కూడా నేను ఏం మాట్లాడలేదు. తలుపు దగ్గర ఆమె ఎవరికీ కనబడకుండా గోడకంటా నక్కి నిలబడింది.

"ఇంక సెలవు. ఉంటాను" ఆమె గుసగుసగా అంది.

"రేపటి వరకూనా" కావాలనే ఆమెను పరీక్షించడానికి అన్నాను.

"ఊహూ! రేపు వద్దు."

"ఎందుకు వద్దు?"

"అన్ని ప్రశ్నలు అడక్కు. రేపు నేను ఒక అంత్యక్రియల కార్యక్రమానికి హాజరు అవ్వాలి. నా బంధువు ఒకరు చనిపోయారు. అక్కడ నువ్వు చూశావుగా" ఆమె అంది.

"అయితే ఎల్లుండి కలుద్దామా?"

"సరే, ఎల్లుండి కలుద్దాం. ఇక్కడికే వచ్చెయ్యి. సరేనా".

నేను బైట పడ్డాను. ఆమె ఎవరు? ఆ శవం ఎవరిది? పిడికిళ్ళు బిగుసుకుని మూతి వంకర పోయి ఎంత భయంకరంగా ఉంది. ఇదంతా ఎంతో హాస్యాస్పదంగా ఉంది. ఎల్లుండి కలుద్దామని ఆమె అంది. నేను ఆమె దగ్గరికి మళ్ళీ వెళ్ళాలా?

నేను సరాసరి బెర్నీనా కేఫ్ దగ్గరికి వెళ్ళి టెలిఫోన్ డైరెక్టరీ అడిగి తీసుకున్నాను. నేను నెంబర్లు వెతుకుతూ వెతుకుతూ గామ్లే కాంగీవ్ దగ్గరికి వచ్చాను. అక్కడ నాక్కావలసిన పేరు దొరికింది. దినపత్రికలు వచ్చేవరకూ ఇంకాసేపు వేచి చూశాను. పత్రిక రాగానే సంస్మరణలకు సంబంధించిన ప్రకటనల వైపు చూశాను. అక్కడ ఆమెకు సంబంధించిన ప్రకటన కూడా చూశాను. జాబితాలో ముందు ఆమె ప్రకటనే పెద్దపెద్ద అక్షరాలతో ఉంది.

"నా భర్త (53 సంవత్సరాలు) దీర్ఘకాలపు అనారోగ్యం కారణంగా ఈరోజు చనిపోయారు" ప్రకటన వద్ద అంతకుముందు రోజు తేదీ వేసి ఉంది.

నేను చాలాసేపు ఏం చేయాలో దిక్కుతోచనట్టు కూర్చుండిపోయాను.

ఒక వ్యక్తి వివాహం చేసుకున్నాడు. అతని భార్య అతని కన్నా ముప్ఫయేళ్ళు చిన్నది. అతనికి దీర్ఘకాలిక అనారోగ్యం పట్టుకుంది. చివరికి ఒక రోజు అతను చనిపోయాడు.

ఆ విధవ యువతి ఊపిరి పీల్చుకుని తేలిగ్గా నిట్టూర్చింది.

అనువాదం: జి.లక్ష్మి e-mail: guttalakshmi62@gmail.com

రామాయణం

92

యుద్ధాన్ని ప్రారంభించడానికి ముందు రాయబారం నెరపడం అందరికీ క్షేమం అనుకున్నాడు రాముడు. అంగదుణ్ణి రాయబారిగా రావణుని దగ్గరకు పంపించాడు. సగౌరవంగా సీతను అప్పగించి, తనని శరణు వేడుకోమన్నాడతను. లేదంటే రావణుణ్ణి యుద్ధానికి రమ్మన్నాడు. రాముని మాటలు యథాతథంగా వినిపించాడు అంగదుడు. ఆ మాటల్ని విని తట్టుకోలేకపోయాడు రావణుడు. అంగదుణ్ణి కొరకొర చూసి అన్నాడిలా.

రామ రావణ యుద్ధం ప్రారంభం

"ఈ కోతి బాగా వదరుతోంది. పట్టుకుని తిట్టండి. కొట్టండి."

రాజాజ్ఞ వెలువడడం ఆలస్యం. నలుగురు బలిష్టులైన రాక్షసులు అంగదుణ్ణి సమీపించారు. వారు తనకు మరింత దగ్గరగా వచ్చేందుకు అంగదుడు భయపడి వణకుతున్నట్టుగా నటించాడు. చేతులు ముడుచుకుని కూర్చున్నాడు. తమను చూసి అంగదుడు బెదిరిపోతున్నాడని భావించారు రాక్షసులు. తేలిగ్గా తీసుకున్నారతన్ని. నవ్వుతూ అంగదుని చెంతకు చేరారు. రాక్షసులు దగ్గరగా రాగానే చేతులు జాచి, ఒక్కసారిగా లేచి నిల్చున్నాడు అంగదుడు. చెరో చేత్తో ఇద్దరిద్దరు రాక్షసుల్ని పట్టుకున్నాడు. ఒక్క ఉదుటున పైకెగిరాడు. అక్కడ ఆ రాక్షసులను గిరగిరా తిప్పి కిందికి విసిరేశాడు. ఆకాశంలోంచి జారిపడ్డట్టుగా ఆ నలుగురూ రావణుని పాదాల ముందు పడి, నెత్తురు కక్కుకుని మరణించారు. చూసి నిశ్చేష్టుడయ్యాడు రావణుడు.

అంగదుడు మరి కొంచెం పైకెగిరి, పర్వతశిఖరంలా ఉన్న రావణుని సౌధశిఖరానికి చేరుకున్నాడు. ఆ శిఖరాన్ని బలంగా కాలితో తన్నాడు. ఇంద్రుని వజ్రాయుధానికి హిమశిఖరం ముక్కలై నేల రాలినట్టుగా రావణుని సౌధశిఖరం పెల్లలుగా రాలిపడింది. పెల్లలు పైన పడుతోంటే, ప్రాణాలు దక్కించుకునేందుకు మందిరంలోని మంత్రి సామంతులు పరుగులు దీశారు. వెళ్ళి, రక్షిత స్థలాల్లో నిలుచున్నారు. వారిని చూసి నవ్వాడు అంగదుడు. తర్వాత రావణునితో అన్నాడిలా.

"రావణా! నా శౌర్యప్రతాపాలనే తట్టుకోలేని వాడివి, నా స్వామి రాముణ్ణి నువ్వెలా ఎదుర్కొంటావు? నీకు రోజులు దగ్గర పడ్డాయి. నీ చావు నువ్వే రాసుకున్నావు."

తేరుకున్నాడప్పటికి రావణుడు. 'అంగదా' అని గట్టిగా అరిచాడు. అయినా అతన్ని లెక్క చెయ్యలేదు అంగదుడు. సింహనాదం చేస్తూ ఆకాశానికి ఎగిరాడు. నిష్క్రమించాడక్కణ్ణుంచి.

విరిగిపడిన శిఖర పెల్లల్నీ, చాటుగా దాగిన మంత్రి సామంతుల్నీ చూసి రావణుడు ఖిన్నుడయ్యాడు. యుద్ధప్రారంభానికి ముందు అలా జరగడం అశుభసూచికం అనుకున్నాడు. విశాల సభాప్రాంగణంలో ఒంటరిగా నిలిచాడు.

రాముణ్ణి చేరుకున్నాడు అంగదుడు. చేతులు కట్టుకుని వినయంగా నిలిచాడు అతని ముందు. రావణ సభామందిరంలో జరిగిందంతా వివరించాడతనికి. నలుగురు రాక్షసుల్ని ఊపిరాడనీయక, తిప్పి తిప్పి చంపిన సంఘటన చెప్పి, సభాసౌధాన్ని కూల్చిన సంగతి కూడా వివరించాడు అంగదుడు. అతని పౌరుష ప్రతాపాలకు జేజేలు పలికారు వానరవీరులు. కరతాళధ్వనులు చేశారు. రాముడు కూడా అంగదుణ్ణి మెచ్చుకోలుగా చూశాడు. అభినందనగా అతని భుజాన్ని చరిచాడు.

ప్రాకార ద్వారం దగ్గర నిలుచున్నాడు రాముడు. శత్రువుల యుద్ధయత్నాలు పరికించాడు. నగరం అంతటా పతాకాలు ఎత్తబడి ఉన్నాయి. ఆయుధాలు ధరించి యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు రాక్షససైనికులు. ఈ నికృష్టుల గడ్డ మీదే కదా సీత బందీగా ఉన్నదని తలచుకుని బాధపడ్డాడు రాముడు.

అంగద రాయబార విఫలంతో యుద్ధం ప్రకటించాడు రాముడు. రామాజ్ఞతో వానరవీరులు లంకపై దాడి చేశారు. మొదటిసారిగా గెలుపుపై నమ్మకాన్ని కోల్పోయాడు రావణుడు. రామలక్ష్మణుల బాణాలకు రాక్షసులు లక్షల్లో మరణించడంతో ఆగ్రహించి యుద్ధరంగంలోకి ప్రవేశించాడు ఇంద్రజిత్తు. బ్రహ్మదేవుని వరశక్తితో ఇంద్రజిత్తు రాత్రియుద్ధంలో అజేయంగా నిలుస్తున్నాడు. అప్పుడు రాముడు ఏం చేశాడు?

కోపం ఉవ్వెత్తున లేచింది. కేకేశాడిలా.

"వెళ్ళండి! శత్రుమూకలను చీల్చి చెండాడండి."

రామాజ్ఞ వెలువడిందో లేదో వానరవీరులు లంకపై దాడికి పరుగులుదీశారు. భుజాలపై చెట్లు పెట్టుకున్నారు కొందరు. మరి కొందరు పెద్దపెద్ద కొండల్నే పట్టుకున్నారు. శ్రీరామునికీ జై! లక్ష్మణ సుగ్రీవులకూ జై అంటూ నినాదాలు చేశారు. ప్రాకారాలను అధిరోహించారు. అక్కడి బురుజులనూ, ద్వారాలనూ పగలగొట్టారు. ఎదుర్కొన్న రాక్షససైనికుల్ని పరిమారుస్తూ, గడ్డితోనూ, చేతిలో ఉన్న కొండలతోనూ అగడ్తలను పూడ్చిపెట్టి, ముట్టడి ప్రారంభించారు.

రామదండు ముట్టడి ప్రారంభించిందని తెలిసిన మరుక్షణం ఆ దండుని ఎదుర్కోవాల్సిందిగా తన సైన్యానికి పిలుపునిచ్చాడు రావణుడు. సైన్యాన్ని గుంపులు గుంపులుగా ద్వారాల దగ్గరకు తరలించాడు.

శత్రుసైన్యం ఎంతమంది ఉన్నారు? ఎలా ఉన్నారు? చూడాలనుకున్నాడు రావణుడు. సౌధానికి చేరుకున్నాడు. కనుచూపు మేర చూశాడక్కణ్ణుంచి. అడవుల్నీ, కొండల్నీ ఆక్రమించి కనిపించాయి శత్రుసైన్యాలు. తన ప్రాకారం వెనుక మరో ప్రాకారంలా నిలిచాయి. అటు ఇటు అంతటా సైన్యమే! భూమి కనిపించడం లేదసలు. ఇంతమందిని జయించగలనా? తనపై తనకు గల నమ్మకాన్ని మొట్టమొదటిసారిగా కోల్పోయాడు రావణుడు.

రాక్షససైనికులు అరుపులూ, పెడబొబ్బలతో పరుగులు దీశారు. శంఖాలు పూరించారు. నగారాలు, భేరీలు మోగించారు. కత్తులు, శూలాలు, గుదియలు, రోకళ్ళు ధరించి వానరసైన్యాన్ని ఎదుర్కొన్నారు.

యుద్ధం ప్రారంభమైంది.

జయజయధ్వానాలు చేస్తూ వానరులు ప్రాకారాలపైకి పాకసాగారు. అక్కడ ఉన్న రాక్షసుల్ని గోళ్ళతో రక్కి, చెట్లు, రాళ్ళతో మోది చంపసాగారు. రాక్షసులు కూడా వానరుల్ని అనేక ఆయుధాలు ప్రయోగించి చంపుతూ, వారిని కిందకు తోసి వేయసాగారు.

ఉభయపక్షాల్లోనూ వేలమంది చనిపోయారు. వారి రక్త మాంసాలతో భూమి అంతా బురదమయం అయింది. రక్తం కాలువలు కట్టి ప్రవహించసాగింది. అసరికి సూర్యాస్తమయం అయింది.

రాత్రివేళ యుద్ధం తమకు అనుకూలం కాబట్టి ఆ అవకాశాన్ని వదలుకోలేదు రాక్షసులు. బంగారు కవచాలు మెరుస్తుండగా చీకటిలో వానరులను చుట్టుముట్టారు. దొరికిన వారిని దొరికినట్టుగా మింగివేయసాగారు. వానరులు కూడా కళ్ళు చించుకుని రాక్షసుల్నీ, గుర్రాలనీ, ఏనుగులనీ గోళ్ళతో గుచ్చి పట్టుకుని, కోరలతో పీకిపెట్టి, రక్తమాంసాలు ఉమిసివేయసాగారు. రాముణ్ణి హతమార్చేందుకు కొందరు రాక్షసులు కుట్ర పన్నారు. ఆకాశం పగిలేట్టుగా

గట్టిగా అరిచి, రాముని చుట్టూ చేరారు. శరవర్షాన్ని అతనిపై కురిపించసాగారు.

వస్తున్న బాణాలను నేల కూల్చసాగాడు రాముడు. విల్లుని వలయాకారంగా తిప్పుతూ, చెవులు పగిలేట్టుగా అల్లెతాటి ధ్వని చేస్తూ రాక్షసులను ముచ్చెమటలు పట్టించసాగాడు. బాణానికి ముగ్గురు, నలుగురు, ఆరుగురు చొప్పున చంపసాగాడు. అగ్నిశిఖల్లాంటి బాణాలు, 'రాముడు' అని పేరు చెక్కిన బంగారు పింజ బాణాలను ప్రయోగించి యమశత్రు, దుర్ధర్ష, మహోదర, మహాపార్శ్వాదులను గాయపరిచాడతను. ఆ గాయాలకు బెదరి వారంతా తలో దిక్కునకూ పరుగులు దీశారు. రాముడు ప్రయోగించిన బాణాలు ఆ చీకటిలో మిణుగురుల్లా మెరుస్తూ అనేక మంది రాక్షసుల్ని నేల కూల్చాయి.

ఒక వ్యక్తిని చంపేందుకు ఒక బాణాన్నే ఉపయోగించేవాడు రాముడు, శత్రువు గుండెకేగాని, వెనుక గురిపెట్టేవాడు కాదు. అతను ప్రయోగించిన బాణం గురి తప్పేది కాదు, అలాగే వ్యర్థమయ్యేదీ కాదు. లక్ష్మణుడు కూడా అన్నకు తీసి పోకుండా యుద్ధంలో పాల్గొన్నాడు.

రామలక్ష్మణుల బాణాలకు రాక్షసులు లక్షల్లో మరణించారని తెలిసి, ఇంద్రజిత్తు ఆగ్రహోదగ్రుడయ్యాడు. రథాన్ని తీసుకుని యుద్ధభూమిలోకి ప్రవేశించాడు. వానరసమూహాల మధ్య నిలిచాడు. అంగదుడు అతన్ని ఎదిరించాడప్పుడు. నేర్పుగా అతని సారథినీ, గుర్రాలనూ హతమార్చాడు. ఎప్పుడైతే రథమూ, సారథీ లేకుండాపోయాయో అప్పుడు తిరస్కరణీ విద్య ప్రభావంతో ఇంద్రజిత్తు ఆకాశంలో కెగసి, అక్కణ్ణుంచి వర్షంగా బాణాలను ప్రయోగించసాగాడు. ఆ బాణాలతో వానరవీరులనే కాదు, రామలక్ష్మణులను కూడా బాధించసాగాడతను. గాయాల పాలయి, చీకట్లో తడుముకుని పోతున్న వానర వీరులను చూసి రాముడు అన్నాడిలా.

"వీరులారా! బ్రహ్మదేవుని వరశక్తితో ఇంద్రజిత్తు రాత్రియుద్ధంలో అజేయంగా నిలుస్తున్నాడు. మహాస్త్రాలు ప్రయోగించి నేను ఆ వరశక్తిని అడ్డుకోగలను. కాని, అడ్డుకోకూడదు. బ్రహ్మను అవమానించడం నాకు తగదు. అందుకని మీరేం చేస్తారంటే..."

"చెప్పండి ప్రభూ"

"మీరంతా గుంపుగా వెళ్ళి సుగ్రీవుణ్ణి అంటిపెట్టుకుని ఉండండి."

సరేనని వానరవీరులు అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు. సుగ్రీవుణ్ణి చేరారు. కొందరికి రాముడు చెప్పింది వినరాలేదు. దాంతో వారు ఇంద్రజిత్తు శరాలకు బలైపోయారు. కాళ్ళూ, చేతులూ పోగొట్టుకున్నారు. ఒంటరిగా రామలక్ష్మణులు కనిపించడంతో ఇంద్రజిత్తు మాయాయుద్ధానికి పూనుకున్నాడు. వారిపై నాగాస్త్రాన్ని ప్రయోగించాడు. సర్పాకారం కలిగిన పదునైన బాణాలు రామలక్ష్మణులను బాధించసాగాయి. ఇద్దరూ తీవ్రగాయాలపాలయ్యారు. బాణం తీసి, ఎక్కుపెట్టే అవకాశం లేకుండా శరపరంపర కురిపించసాగాడు ఇంద్రజిత్తు. దేహం మీద అంగుళం మేర కూడా ఖాళీ లేకుండా పోయింది. రామలక్ష్మణుల శరీరాలు బాణాలతో నిండిపోయాయి. రక్తం ధారలు కట్టి ప్రవహించసాగింది. మర్మస్థానాలకు గురిపెట్టి నాగపాశాలను ప్రయోగించాడు ఇంద్రజిత్తు. ఆ దెబ్బలకు రామలక్ష్మణులకు స్పృహ కోల్పోతున్నట్టనిపించింది. అయినా ఎక్కడలేని ధైర్యాన్ని కూడగట్టుకుని వారు యుద్ధం చేసేందుకు ప్రయత్నిస్తోంటే ఆశ్చర్యపోయాడు ఇంద్రజిత్తు. సింహం కోరల్లాంటి నిశిత శరాలు ప్రయోగించాడు. ఆ శరాలకు రాముడి చేతిలోని విల్లు జారి కింద పడిపోయింది. అలాగే రాముడు కూడా నేల వాలిపోయాడు. అన్న నేలనంటి పడి ఉండడాన్ని చూసి, లక్ష్మణుడు కూడా కింద పడిపోయాడు. జీవితాశను కోల్పోయాడు. రామలక్ష్మణులు నేల మీది పడి, రక్త పంకంలో దొర్లుతూ కాంతిహీనులవ్వడాన్ని చూసి, విభీషణ సుగ్రీవాదులు కన్నీరు మున్నీరయ్యారు.

ఏడుస్తున్న వానరవీరుల్ని చూసి పగలబడి నవ్వాడు ఇంద్రజిత్తు. ఆనందపారవశ్యంతో గెంతులు వేశాడు. రాక్షసవీరులను ఉద్దేశించి అన్నాడిలా.

"ఏ మహావీరులు విరాధ, ఖర, దూషణుల్ని కూల్చారో, ఏ మహావీరులు సాగరంపై వంతెన నిర్మించి, గొప్పవారనిపించుకున్నారో, ఏ మహావీరుల గురించి భయపడి, నా తండ్రి నిద్ర కోల్పోయాడో ఆ మహా వీరులిప్పుడు నేలకూలారు. నేలను కరచుకుని పడున్నారు. నాగపాశాలు వారిని బంధించాయి. సకల దేవ, యక్ష, కిన్నర, గంధర్వగణాలు ఏకమై వచ్చినా రామలక్ష్మణులను బంధవిముక్తుల్ని చేయడం కష్టం."

ఆ మాటలకు చేతిలోని ఆయుధాలు పైకెత్తి, ఇంద్రజిత్తును చూస్తూ రాక్షసవీరులు జయజయ ధ్వానాలు చేశారు. ఆ ధ్వానాలకు మరింతగా మురిసిపోయి మళ్ళీ యుద్ధం ప్రారంభించాడు ఇంద్రజిత్తు. ఈసారి బాణాలను అంగద, నీల, మైంద, ద్వివిధ, హనుమంతాదుల మీద ప్రయోగించాడు. ఆ బాణాలకు వారి శరీరాలు చిల్లులు పడ్డాయి. చీలిపోయాయి. నిస్సహాయంగా నిల్చున్నారంతా. వారిని గేలి చేస్తున్నట్టుగా చేతులూపి నవ్వాడు ఇంద్రజిత్తు. ఈనాటికి ఈ యుద్ధం చాలనుకున్నాడు. తన విజయ పరంపర తండ్రి రావణునికి తెలిపేందుకు లంక వైపు సాగిపోయాడతను.

రామలక్ష్మణుల దగ్గరగా కూర్చుని విలపిస్తున్న సుగ్రీవుణ్ణి చూశాడు విభీషణుడు.

"మిత్రమా" అని పిలిచాడు. జవాబుగా తలెత్తి చూశాడు సుగ్రీవుడు.

"నువ్విలా దుఃఖించడం తగదు. జయాపజయాలు దైవాధీనాలు. అయినా అప్పుడే మనం ఓడిపోయినట్టు కాదు. ధైర్యం తెచ్చుకో" అన్నాడు విభీషణుడు.

రామలక్ష్మణులను పరిశీలనగా చూసి అంతలోనే మళ్ళీ అన్నాడిలా.

"సత్య ధర్మపరాయణులకు అకాలమృత్యువు రాదు. సరిగ్గా గమనించి చూడు! రామలక్ష్మణులు మరణించలేదు. అందుకు ఒకటే ఋజువు. వారి ముఖాల్లో తేజస్సు అంతరించలేదు. కాపాడగలిగితే ఈ మహావీరులిద్దరూ మేల్కొంటారు. ఇది నిజం."

విభీషణుణ్ణి అంతా ఆశగా చూశారు.

"ఈ వీరులను కాపాడగలిగితే విజయం మనదే" అన్నాడు విభీషణుడు.

ఆ మాట చాలు! ఎందుకైనా ఎంతకైనా తెగిస్తాం అనుకున్నారు వానరవీరులు. రామలక్ష్మణులకు రక్షణగా ఏర్పడ్డారు. హనుమ, నీల, గవాక్షాది వీరులు వేయికళ్ళతో రామలక్ష్మణులను కనిపెట్టుకుని ఉంటే మిగిలిన వానరవీరులు వృక్షాలూ, కొండలూ ధరించి, ఎలాంటి ప్రమాదాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా నిలిచారు.

-అరణి

సౌభాగ్య చక్రం

జూన్ 22 నుంచి
జూన్ 28 వరకు

శ్రీ బిజుమళ్ళ బిందుమాధవశర్మ

మేషం (మార్చి 21 - ఏప్రిల్ 20 మధ్య పుట్టినవారు)

కుటుంబ విషయాలు, బదిలీలు, మార్పులు, గృహరుణాలు, విద్యా విషయాలకు ఈ వారం అనుకూలం. బుధవారం వృత్తి, వ్యాపారాల్లో మార్పులకు అనుకూలం. ఉన్నత పదవులు అందుకుంటారు. 23,24 తేదీల్లో బంధుమిత్రులతో ఆనందంగా గడుపుతారు. కుటుంబ సభ్యుల కోసం ఖర్చులు అధికం. 25,26,27 తేదీల్లో వారసత్వ విషయాలకు అనుకూలం. గృహారంభ ప్రవేశాలకు అనుకూలం. కుటుంబ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. 28న రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది. బదిలీలు అసౌకర్యం కలిగిస్తాయి.

వృషభం (ఏప్రిల్ 21 - మే 21 మధ్య పుట్టినవారు)

పెట్టుబడులు, విద్యా సంస్థలతో పనులు, వేడుకలు, ఇంటర్వ్యూలు, సమావేశాలకు ఈ వారం ప్రాధాన్యత ఇస్తారు. బుధవారం విద్యార్థులకు శుభప్రదం. శుభవార్త అందుకుంటారు. 23,24 తేదీల్లో ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. పెద్దలతో సమావేశాలు ఫలిస్తాయి. 25,26,27 తేదీల్లో బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. సన్నిహితుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. 28న రవాణా, బోధన, రాజకీయ, సినీరంగాల వారు కొంత నిరుత్సాహకరమైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులు శ్రద్ధాలోపం వల్ల నష్టపోతారు.

మిథునం (మే 22 - జూన్ 21 మధ్య పుట్టినవారు)

అదనపు ఆదాయం, పొదుపు పథకాలు, ఫీజుల చెల్లింపులు, షాపింగ్‌పై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం పెట్టుబడులు లాభిస్తాయి. 23,24 తేదీల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. సంకల్పం నెరవేరుతుంది. 25,26,27 తేదీల్లో వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. పెద్దల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. సంకల్పం ఫలిస్తుంది. 28న పెట్టుబడుల్లో ఆచితూచి వ్యవహరించాలి. ప్రియతముల కోసం ఖర్చులు అంచనాలు మించుతాయి.



కర్కాటకం (జూన్ 22 - జులై 22 మధ్య పుట్టినవారు)

వేడుకలు, సమావేశాలు, వృత్తి, వ్యాపారాలు, ఆర్థిక నిర్ణయాలపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం జనసంబంధాలు విస్తరిస్తాయి. భాగస్వామి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. 23,24 తేదీల్లో పెట్టుబడులపై దృష్టి సారిస్తారు. షాపింగ్, క్రయవిక్రయాలకు అనుకూలం. 25,26,27 తేదీల్లో సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు. ఒక సమాచారం ఉల్లాసం కలిగిస్తుంది. సంకల్పం ఫలిస్తుంది. 28న పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో కొత్త ప్రయోగాలకు తగిన సమయం కాదు. గౌరవ, మర్యాదలు అందుకుంటారు.

సింహం (జులై 23 - ఆగస్టు 23 మధ్య పుట్టినవారు)

పెట్టుబడులు, ఉన్నత విద్య, గృహనిర్మాణ పనులు, వేడుకలపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం గత అనుభవంతో లక్ష్యాలు సాధిస్తారు. ఆరోగ్యం మెరుగవుతుంది. 23,24 తేదీల్లో వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. శ్రీవారు, శ్రీమతి అంతరంగం తెలుసుకుని మసలుకుంటారు. 25,26,27 తేదీల్లో ఉత్సవాలు, సంస్మరణల్లో పాల్గొంటారు. రుణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం 28న సమావేశాల్లో మాట పడాల్సి వస్తుంది. సినీ, రాజకీయ రంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. దూరంలో ఉన్న బంధుమిత్రులను కలుసుకుంటారు.



కన్య (ఆగస్టు 24 - సెప్టెంబర్ 22 మధ్య పుట్టినవారు)

సమావేశాలు, పెట్టుబడులు, షాపింగ్, వేడుకలు, విద్యా సంస్థలతో పనులపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం విద్యాసంస్థల్లో ప్రవేశం లభిస్తుంది. ప్రేమానుబంధాలు బలపడతాయి. 23,24 తేదీల్లో వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. విందు, వినోదాల్లో పాల్గొంటారు. 25,26,27 తేదీల్లో శ్రీవారు, శ్రీమతి విషయంలో శుభపరిణామాలు సంభవం. వేడుకల్లో పాల్గొంటారు. స్పెక్యులేషన్లు లాభిస్తాయి. 28న ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలి. డబ్బు విషయంలో సన్నిహితులు మొహమాట పెట్టే అవకాశం ఉంది.

తుల (సెప్టెంబర్ 23 - అక్టోబర్ 23 మధ్య పుట్టినవారు)

ప్రముఖులతో సమావేశాలు, కొత్త ప్రాజెక్టులు, అదనపు ఆదాయం కోసం ప్రయత్నాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. కీలక సమాచారం లభిస్తుంది. 23,24 తేదీల్లో సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతములు, చిన్నారుల వైఖరి ఆవేదన కలిగిస్తుంది. 25,26,27 తేదీల్లో వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సాహకరం. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. 28న శ్రీవారు, శ్రీమతి వైఖరి ఆవేదన కలిగిస్తుంది.

వృశ్చికం (అక్టోబర్ 24 - నవంబర్ 22 మధ్య పుట్టినవారు)

సమావేశాలు, దూరప్రయాణాలు, ఇంటర్వ్యూలు, వృత్తి, వ్యాపారాలకు సంబంధించిన అంశాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. సమావేశాలు ఫలిస్తాయి. 23,24 తేదీల్లో బంధుమిత్రుల కలయికతో ఇల్లు సందడిగా ఉంటుంది. బదిలీలు, మార్పుల కోసం చేసే ప్రయత్నాలు ఫలించకపోవచ్చు. 25,26,27 తేదీల్లో విద్యార్థులకు శుభప్రదం. ప్రేమానుబంధాలు బలపడతాయి. ప్రియతముల నుంచి కీలక సమాచారం అందుకుంటారు. 28న వృత్తి, వ్యాపారాల్లో అంచనాలు ఫలించకపోవచ్చు. సమావేశాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది.

ధనుస్సు (నవంబర్ 23 - డిసెంబర్ 21 మధ్య పుట్టినవారు)

పెట్టుబడులు, సంస్కరణలు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు, షాపింగ్, బోనస్‌లపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం రుణప్రయత్నాలు ఫలిస్తాయి. పెట్టుబడులు లాభిస్తాయి. 23,24 తేదీల్లో ఆర్థికపరమైన చర్చలు, ప్రయాణాలు ఫలిస్తాయి. సన్నిహితుల ఆరోగ్యం కలవరపెడుతుంది. 25,26,27 తేదీల్లో గృహరుణాలు మంజూరవుతాయి. ఇంటికోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక విషయాలను సమీక్షించుకుంటారు. 28న ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలి. చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యం కలవరపెడుతుంది.

మకరం (డిసెంబర్ 22 - జనవరి 20 మధ్య పుట్టినవారు)

వేడుకలు, జనసంబంధాలు, సమావేశాలు, ఆర్థిక వ్యవహారాలపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం జనసంబంధాలు విస్తరిస్తాయి. 23,24 తేదీల్లో ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. స్పెక్యులేషన్లలో దూకుడు తగదు. 25,26,27 తేదీల్లో బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. కీలక సమాచారం అందుకుంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు ఫలిస్తాయి. 28న కుటుంబ సభ్యుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వేడుకల్లో అసౌకర్యం కలిగే అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారు ఆచితూచి వ్యవహరించాలి.

కుంభం (జనవరి 21 - ఫిబ్రవరి 18 మధ్య పుట్టినవారు)

ఆరోగ్యం, బీమా, వృత్తిపరమైన సమావేశాలు, ప్రముఖుల కలయిక. ఉద్యోగ వ్యవహారాలపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం సినీ, రాజకీయ రంగాల వారికి శుభప్రదం. 23,24 తేదీల్లో వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సాహకరం. విందుల్లో పరిమితి పాటించాలి. 25,26,27 తేదీల్లో ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. వృత్తి, వ్యాపారాల్లో అదనపు ఆదాయం లభిస్తుంది. హోటల్, వైద్యం, రిటైల్ రంగాల వారికి శుభప్రదం. 28న స్టేషనరీ, ఏజెన్సీలు, రవాణా, మార్కెటింగ్ రంగాల వారికి వృత్తి, వ్యాపారాల్లో నిరుత్సాహకరం.

మీనం (ఫిబ్రవరి 19 - మార్చి 20 మధ్య పుట్టినవారు)

వేడుకలు, ప్రేమానుబంధాలు, పెట్టుబడులు, వృత్తిపరమైన సమావేశాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. 23,24 తేదీల్లో దూరంలో ఉన్న ప్రియతముల కలయిక ఆనందం కలిగిస్తుంది. చిన్నారుల వైఖరి ఆవేదన మిగులుస్తుంది. 25,26,27 తేదీల్లో విద్యార్థులకు శుభప్రదం. ప్రేమానుబంధాలు బలపడతాయి. పొదుపు పథకాలు లాభిస్తాయి. 28న పెట్టుబడుల్లో నిదానం అవసరం. ప్రియతముల కోసం ఖర్చులు అంచనాలు మించుతాయి. బ్యాంకులు, ఫైనాన్స్ రంగాల వారికి శుభప్రదం.

నవ్య సినిమా



ఒక నిర్ణయం జీవితాన్నే మార్చేసింది

ఒక ఐడియా జీవితాన్ని మార్చేస్తుందో లేదో తెలియదు కానీ జగపతి బాబు తీసుకున్న నిర్ణయం ఆయన సినీ జీవితాన్ని మలుపు తిప్పేసింది. ఫ్యామిలీ హీరో నుంచి క్రూరమైన విలన్‌గా జగపతి బాబు మారినప్పుడు ఈయనకి పిచ్చి పట్టిందా? అనుకున్నారు అందరూ. కానీ ఇప్పుడు అదే అందరూ జగపతి బాబును ఓ రేంజ్‌లో పొగిడేస్తున్నారు. జగపతిబాబు నిర్ణయం అడుగంటిపోతున్న కెరీర్‌ను ఒక్కసారిగా పీక్ స్టేజ్‌కి తీసుకువెళ్ళింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో జగపతి బాబు ఎంత బిజీ అయ్యాడంటే తాజాగా తెలుగులో మూడు భారీ సినిమాలు వదులుకోవలసి వచ్చింది. పాత్ర నచ్చకో, కథ నచ్చకో కాదు. డేట్లు అడ్జస్ట్ కాక! దక్షిణాదిన దాదాపు అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తూ యమ బిజీగా ఉన్న జగపతిబాబును కొందరు సీనియర్ హీరోలు ఆదర్శంగా తీసుకోవాలనుకున్నా వారికి వర్కవుట్ కాలేదు.

బిచ్చమెత్తుతామంటున్న ఫైట్‌మాస్టర్స్



ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్‌ల గురించి టాలీవుడ్ ప్రేక్షకులకు కొత్తగా చెప్పాల్సింది ఏమీ లేదు. సినిమాలలో వాళ్ళకున్న డిమాండ్ అందరికీ తెలిసిందే! సినిమాల పరంగా బాగా ఆదాయం ఉన్న ఈ బ్రదర్స్‌కు భిక్షాటన చేయవలసిన అవసరం ఏమిటా? అన్న అనుమానం వస్తోందా? వీళ్ళు భిక్షాటన చేస్తామంటోంది వాళ్ళ కోసం కాదు. అనంతపురం జిల్లాలోని కొంత మంది పేదలకు సహాయం చేయడానికట! తమ రెమ్యునరేషన్‌లో కొంత భాగం కేటాయిస్తున్నా అది సరిపోక పోవడంతో భిక్షాటన చేయాలని నిర్ణయించుకున్నారట! పేదలందరినీ దత్తత తీసుకోవడానికి తామేమీ పేరున్న హీరోలం కాదు కాబట్టి ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఆ సోదరులు చెబుతున్నారు.

రమ్యకృష్ణని అమ్మా అనకూడదట!

రియల్ లైఫ్‌లో కాదు రీల్ లైఫ్‌లో! సెకండ్ ఇన్నింగ్స్‌లో అమ్మ పాత్రలు, అత్త పాత్రలు వేయడం మొదలెట్టిన తరువాత రమ్యకృష్ణ బిజీ ఆర్టిస్టు అయిపోయింది. సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభంలో చేసిన అమ్మ పాత్రలలో తనను కుర్ర హీరోయిన్లు 'అమ్మా' అని పిలిచినా పట్టించు కోలేదుకానీ, ఇప్పుడు మాత్రం అలా పిలవద్దంటూ కండీషన్ పెడుతోందట! మొన్నటికి మొన్న 'సోగ్గాడే చిన్ని నాయన'లో నాగార్జునకి తల్లిగా చేసినా ఎప్పుడూ 'అమ్మా' అనిపిలిపించుకోలేదు. 'సత్యా' అంటూ పిలిస్తేనే చేస్తానని కండీషన్ పెట్టిందట! ఆ సినిమాలో అలా మేనేజ్ చేయగలిగారు. 'బాహుబలి'లో కూడా రాజమాతగా పిలిపించుకుందే తప్ప రానా, ప్రభాస్‌తో 'అమ్మా' అన్న దాఖలాలు లేవు. ఇప్పుడు కమల్ సరసన ఆయన భార్యగా చేస్తోంది. ఇందులో శ్రుతి నటిస్తోంది. ఈ సినిమాలో కూడా 'అమ్మా' అని పిలవకూడదని కండీషన్ పెట్టినట్లు తెలుస్తోంది.

రజనీ పెద్ద మనసు

ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో సూపర్ స్టార్ రజనీకాంత్‌కి బాగా తెలుసు అంటున్నారు ఆయన అభిమానులు. సాధారణంగా రజనీకాంత్ రెమ్యునరేషన్ కోట్లలో ఉంటుంది. కానీ 'రోబో 2'లో మాత్రం ఆయన రెమ్యునరేషన్ కన్నా విలన్ రెమ్యునరేషన్ ఎక్కువట! ఎంత ఎక్కువ అన్నది కచ్చితంగా బయటకి రాకపోయినా, ఈ విషయంలో రజనీ ఎలాంటి గొడవ పెట్టుకోకుండా మౌనంగా ఉండిపోయాడట! కారణం ఈ సినిమా హిందీలో కూడా విడుదల చేస్తున్నారు. ఇందులో విలన్‌గా నటిస్తున్న అక్షయ్ కుమార్‌కు బాలీవుడ్‌లో మంచి మార్కెట్ ఉంది. అందుకే ఆయన తన రెమ్యునరేషన్‌ను సినిమా బిజినెస్‌ను దృష్టిలో పెట్టుకుని ఇవ్వమన్నాడు. దాంతో రజనీ రెమ్యునరేషన్ కన్నా అక్షయ్‌కుమార్ రెమ్యునరేషన్ ఎక్కువ అయిందట! ఇది తెలిసి కూడా రజనీ కామ్‌గా ఉండడమే పెద్ద విశేషం.

ప్రేమ కథలు చాలా ఉన్నాయి

-అనుపమ పరమేశ్వరన్

సాధారణంగా అందమైన అమ్మాయిని చూస్తే కత్తిలాగా ఉంది అంటుంటారు. ఈ కత్తి అనే పదానికి సరిగ్గా సరిపోతుంది అనుపమా పరమేశ్వరన్. తెలుగులో 'మజ్ను' సినిమాతో అనుపమ పేరు టాలీవుడ్ ప్రేక్షకులకి పరిచయమైంది. చెంపకు చారడేసి కళ్ళు, ఆకట్టుకునే నవ్వుతో, గిరజాల జుత్తుతో చూడగానే అమ్మాయి అందంగా ఉంది అనిపించే ఆకృతి అనుపమా పరమేశ్వరన్‌ది. ఈ అందాన్ని మరింత అందంగా చూపించాడు మాటల మాంత్రికుడు. 'ఆ ఆ' సినిమాలో సమంత గ్లామర్ కన్నా కూడా అనుపమ అందానికే ఎక్కువ మార్కులు పడ్డాయి. తెలుగులో తొలి సినిమాతోనే ప్రేక్షకుల మనసును దోచిన అనుపమ మనసును స్కూల్ డేస్‌లోనే చాలామంది దోచుకున్నారట! ఆ ముచ్చట్లు ఆమె మాటల్లోనే...

తెలుగులో తొలి సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నందుకు కంగ్రాట్స్

థాంక్స్...

'అ ఆ' సినిమాకి మీరే డబ్బింగ్ చెప్పినట్టున్నారు. తెలుగు బాగా వచ్చిందా?

అంత బాగా రాలేదు. ఎదుటి వారు చెప్పేది అర్థం చేసుకోగలను. చిన్న చిన్న పదాలను మలయాళీ యాసతో మాట్లాడగలను. నా మాటలు వినే త్రివిక్రమ్ సార్ నాతో డబ్బింగ్ చెప్పించారు. చెప్పగలనా? అని భయపడ్డాను. చిన్న చిన్న పదాలే కనుక చెప్పగలవు అంటూ సార్ ధైర్యం చేసి చెప్పించారు. దీని కోసం ప్రత్యేకంగా తెలుగు ట్యూటర్‌ని పెట్టుకోలేదు. కానీ ఇప్పుడు పెట్టుకోవాలనుకుంటున్నాను. తెలుగు బాగా నేర్చుకుని పూర్తి స్థాయిలో డబ్బింగ్ చెప్పాలని డిసైడ్ అయిపోయాను.

ఈ సినిమా తరువాత భారీ ఆఫర్లు వస్తున్నట్టున్నాయి?

ఆఫర్లు ఎప్పుడూ వస్తూనే ఉన్నాయి. ఈ సినిమా తరువాత మరింత ఎక్కువయ్యాయి. కాక పోతే అన్ని సినిమాలనూ ఒప్పుకోవడం లేదు. నాకు తగ్గవి, నేను చేయగలను అనుకున్నవి మాత్రమే చేస్తాను. ఇప్పటి వరకూ చాలా కథలు విన్నాను. కానీ వేటికీ ఓకే చెప్పలేదు.

తెలుగు వాతావరణానికి అలవాటు పడినట్టేనా?

పూర్తిగా అలవాటు పడలేదు. ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నాను. ఈ వాతావరణం బాగా నచ్చింది. ఇంట్లో ఉన్నట్టే అనిపిస్తోంది.

మీ గిరజాల జుత్తు మాయం అయినట్టుంది?

అవును తెలుగు సినిమాల కోసం త్యాగం చేయాల్సి వచ్చింది. నా అందం అంతా నా గిరజాల జుత్తే అని అందరూ అంటూంటారు. కానీ తప్పలేదు. మళ్ళీ అలాంటి గిరజాల జుత్తు వస్తుందో లేదో! అదే కొద్దిగా బాధగా ఉంది.

'మజ్ను'లో మీ పాత్ర గురించి...

మలయాళం 'ప్రేమమ్'లో ఏ క్యారెక్టర్ చేశానో, తెలుగు 'మజ్ను'లో కూడా అదే క్యారెక్టర్ చేస్తున్నాను. దాంతో ఈ సినిమా నాకు కొత్తగా అనిపించడం లేదు. ఈ సినిమాతో మరో హిట్ అందుకోవడం ఖాయం అనిపిస్తోంది. నాగచైతన్య, శ్రుతి ఇద్దరూ చాలా కో - ఆపరేట్ చేశారు.

చదువు మధ్యలో ఆగిపోయినట్టుంది?

అవును మలయాళంలో తొలి అవకాశం రావడంతో చదువుకి తాత్కాలికంగా బ్రేకప్ చెప్పాను తప్ప పూర్తిగా మానేయలేదు. సినిమాల్లో చేస్తుండడం వలన రెగ్యులర్‌గా క్లాసులకి అటెండ్ అవలేనని, కాలేజీ వాళ్ళు అటెండెన్స్ ఇస్తామన్నారు కానీ, చదవడానికి నాకే టైమ్ ఉండడం లేదు. చదువుకుంటూ సినిమాలు చేసేంత పరిణతి ఇంకా నాకు రాలేదు. ఖాళీ దొరికితే చదవాలని అనుకుంటున్నాను. స్టూడెంట్ లైఫ్‌కీ, సినీ జీవితానికీ చాలా తేడా ఉంది. స్టూడెంట్ లైఫ్ నుంచి ఇప్పుడిప్పుడే బయటపడి సినీ జీవితానికి అలవాటుపడుతున్నాను. ప్రారంభంలో సినీ రంగంలో ఇమడలేనేమోనని భయం వేసింది. ఇప్పుడు భయం పోయి ధైర్యం వచ్చింది.

చదువు ఆపినందుకు పేరెంట్స్ ఏమీ అనలేదా?

మొదట్లో కొద్దిగా బాధపడిన మాట వాస్తవమే. కానీ సినిమాల ద్వారా వస్తున్న పేరు చూసి వాళ్ళు చాలా సంతోషిస్తున్నారు. వారి ప్రోత్సాహం లేకపోతే సినిమాలు చేయగలిగేదాన్నే కాదు. ఫుల్ కో ఆపరేట్ చేస్తున్నారు.

వ్యక్తిగత ప్రేమ గురించి....

ఆ ప్రేమ కథలు చాలా ఉన్నాయి. అదంతా తెలిసీ తెలియని వయస్సులో జరిగిన సంగతులు. ఇప్పుడు వాటిని తలుచుకుంటే భలే నవ్వు వస్తుంది.

మీ హాబీలు...

అమ్మ చేతి వంట అంటే చాలా ఇష్టం. ఖాళీ దొరికితే రకరకాల వంటకాలు చేయించుకుని తింటాను. లావెక్కుతాను, బరువు పెరుగుతాను అన్న భయాలు నాకు లేవు. ఇష్టమైనవి తినెయ్యడమే!

సినిమాల్లో గ్లామర్ గురించి...

ఒక్కొక్కరిది ఒక్కో అభిప్రాయం. కొందరు మోడ్రన్ డ్రస్సులు వేసుకుని అదే గ్లామర్ అనుకుంటారు. మరికొందరు స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లే గ్లామరు అనుకుంటారు. నా మటుకు నాకు మన శరీరాకృతికి సరిపోయే డ్రస్సులు వేసుకోవడమే అసలైన గ్లామర్ అనుకుంటాను.

ఎక్స్‌పోజింగ్ చేస్తారా?

లేదు, దానికి నేను దూరంగా ఉంటాను. అందంగా కనిపించడమంటే ఓకే కానీ, శరీరం కనిపించే విధంగా దుస్తులతో ఎక్స్‌పోజింగ్ నా వల్ల కాదు. అలాంటి ఎక్స్‌పోజింగ్‌కు నా శరీరాకృతి సరిపోదు కూడా! అసభ్యంగా కనిపించనంత వరకూ మోడ్రన్ డ్రస్సులు వేసుకోవడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. కాదూ కూడదు... అలాంటివే వేసుకోవాలంటే సినిమాలు మానేస్తాను.

ఇలాంటి పరిస్థితి ఎప్పుడైనా ఎదురైందా?

కోలీవుడ్‌లో ఇలాంటి పరిస్థితి ఎదురైంది. మొదట నాకు చెప్పిన కథ, అందులో నా పాత్ర ఒక విధంగా ఉంది. కానీ షూటింగ్ సమయంలో నా డ్రస్సుల విషయంలో తేడా వచ్చింది. నా పాత్ర కూడా కొంత అభ్యంతరకరంగా అనిపించింది. వెంటనే సినిమాను చేయనని వచ్చేశాను. ఆ తరువాత కథ మార్చాం, కాస్ట్యూమ్స్ మార్చాం అన్నారు కానీ వెళ్ళలేదు. తెలుగులో ఇలాంటి అనుభవం ఇప్పటి వరకూ ఎదురుకాలేదు.

తెలుగులో బాగా ఇష్టపడే హీరోలు?

పవన్ కల్యాణ్ గారిని ఫస్ట్ టైం 'అ ఆ' షూటింగ్ సందర్భంగా చూశాను. అంత పెద్ద హీరో అయినా చాలా బాగా మాట్లాడారు. మహేష్ బాబు గారి గురించి వ్యక్తిగతంగా తెలియదు కానీ, తెలుగు సినిమాలు ఒప్పుకున్న తరువాత వరుస పెట్టి సినిమాలు చూశాను. వాటిల్లో ఎక్కువగా మహేష్‌బాబుగారివే ఉన్నాయి. ఆయన డైలాగ్ డెలివరీ బాగా నచ్చింది. అవకాశం వస్తే ఈ ఇద్దరితో నటించాలని ఉంది.

డ్యాన్సుల పరంగా ఎవరిని ఇష్టపడతారు?

ఎవరి ప్రత్యేకత వారిదే! అందరూ బాగా చేస్తారు. అందరి డ్యాన్స్‌లను బాగా ఎంజాయ్ చేస్తాను.

సినిమాల్లోకి వచ్చిన తరువాత బాగా ఆనందపడిన సందర్భం?

'ప్రేమమ్' సినిమా తరువాత నన్ను ఎక్కడ చూసినా అభిమానులు చుట్టుముట్టి 'మేరీ' అంటూ పలకరించి నాతో సెల్ఫీలూ, ఆటోగ్రాఫ్‌లూ తీసుకుంటున్నారు. అభిమానుల కారణంగా వ్యక్తిగతంగా కొంత ప్రైవసీని కోల్పోయినా, వారి అభిమానం ముందు అది పెద్ద బాధ అనిపించలేదు. ఇప్పుడు తెలుగు అభిమానులు కూడా అంతగా ఆదరిస్తున్నారు. ఈ అభిమానాన్ని చాలా చాలా ఎంజాయ్ చేస్తున్నాను.

-చిన్ని

తండ్రితో చేస్తున్నా తగ్గదట!

శ్రుతిహాసన్ ఎక్స్‌పోజింగ్ విషయంలో ఎంత ఉదారంగా ఉంటుందో అందరికీ తెలిసిందే! ఎక్స్‌పోజింగ్ అనేసరికి కొన్ని సందర్భాలలో రెచ్చిపోయి చేస్తుంది కూడా! తాజాగా తండ్రితో కలిసి 'శభాష్ నాయుడు'లో నటిస్తోంది. ఈ సినిమాలో కూడా ఎక్స్‌పోజింగ్ చేస్తోందట! సినిమా చేస్తోంది తన కోసమో, తన కుటుంబం కోసమో కాదన్నది శ్రుతి అభిప్రాయమట! సాధారణంగా తను నటించే సినిమాల్లో ఏ స్థాయిలో అందాల ఆరబోత ఉంటుందో, ఈ సినిమాలోనూ అదే స్థాయిలో ఉంటుంది అని అంటోంది. బయట మాత్రమే మేం ఇద్దరం తండ్రీ కూతుళ్ళం. ఒక్కసారి సెట్‌లోకి వెడితే ఇద్దరం ఆ విషయం మరిచిపోతాం అని గొప్పగా చెప్పుకుంటోంది. కమల్ హాసన్‌తో కలిసి తొలిసారిగా చేస్తున్న సినిమాలో శ్రుతి హాసన్ ఎలా ఉంటుందో? అన్న అనుమానాన్ని తన మాటలతో తీర్చేసింది అంటున్నారు సినీ జనాలు.

ఇంటర్వ్యూ

తిరిగెళ్ళిపోడానికి డబ్బు రెడీగా ఉంచుకునేవాణ్ణి

-కృష్ణభగవాన్

ముక్కు సూటిగా నిర్మొహమాటంగా మాట్లాడే విలక్షణ హాస్య నటుడు కృష్ణ భగవాన్. మూడు దశాబ్దాలుగా 300 చిత్రాల్లో నటించడమే కాదు, వంద చిత్రాల్లో పూర్తి స్థాయి హాస్యం పండించి ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తుతున్న నటుడు. ఒకప్పుడు చిత్ర పరిశ్రమలో అందరూ బ్రెయిన్‌తో పనిచేసేవారనీ, ఇప్పుడు బ్రెయిన్‌నే టెక్నాలజీతో పెట్టేశారనీ అంటున్న కృష్ణ భగవాన్ ఇంటర్వ్యూ......

మాది వ్యవసాయ కుటుంబం. సొంతూరు తూర్పు గోదావరి జిల్లా కాకినాడ తాలూకా కైకవోలు. నేను పుట్టింది అక్కడే. మా నాన్నగారి పేరు ఎం.వీ ర్రాజు. అమ్మ లక్ష్మీకాంతం. అలనాటి క్యారెక్టర్ నటి సూర్యకాంతం గారు మా ఊరు కోడలే. మ ఇంటిపక్క ఇల్లే. మేం ముగ్గురు అన్నదమ్ములం. ఒక అక్కయ్య.

చదువు

మా ఊరికి కూతవేటు దూరంలో ఉన్న పెద పూడిలోని గాంధీ మెమోరియల్ పాఠశాలలో ఏడవ తరగతి వరకు చదువుకున్నాను. నటుడు సుధాకర్ కూడా అదే పాఠశాలలో చదువుకున్నాడు. ఇంటర్మీడియట్ తర్వాత 1978లో హైదరాబాద్ చేరుకుని బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కాలేజీలో బీకాం పూర్తి చేశాను.

ఉద్యోగం ఆలోచన రాలేదు

1981లో డిగ్రీ చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం చేయాలనే ఆలోచనే నాకు రాలేదు. అందువల్ల ఎలాంటి ఉద్యోగ ప్రయత్నాలు చేయలేదు. ఒక స్నేహితుడి బలవంతం మీద ఐటిసికి దరఖాస్తు చేశాను. కానీ ఆ ఉద్యోగం రాలేదు.

అన్నయ్యే నాకు ప్రేరణ

